
గురువారం 28-3-2024

సత్యమేవ జయతే
సాక్షి
WWW.SAKSHI.COM
పేజీలు: 16 వెల: ₹ 5.50
సంపుటి: 17 సంచిక: 5



'స్వచ్ఛమైన రక్షిత జలాలను అందిస్తేనే గోండు, చెంచు, ఆదివాసి గిరిజనులు ఆరోగ్యంగా ఉంటారు.'



సన్‌రైజర్స్ 'రన్'రంగం

ముంబై ఇండియన్స్‌తో బుధవారం జరిగిన ఐపీఎల్ మ్యాచ్‌లో సన్‌రైజర్స్ హైదరాబాద్ జట్టు పరుగుల 'రన్'రంగం సృష్టించింది. ఐపీఎల్ చరిత్రలోనే అత్యధిక పరుగులు చేసిన జట్టుగా హైదరాబాద్(277/3) రికార్డు నెలకొల్పింది. అనంతరం ముంబై 20 ఓవర్లలో 5 వికెట్లకు 246 పరుగులు సాధించి ఓడిపోయింది.

14 లో

SIMULTANEOUSLY PRINTED AT VIJAYAWADA | CHENNAI | DELHI | BANGALORE | HYDERABAD | MUMBAI | ANANTAPUR | GUNTUR | KADAPA | KHAMMAM | KARIMNAGAR | KURNOOL | MAHABOOBNAGAR | MANGALAGIRI | NALGONDA | NELLORE | NIZAMABAD | ONGOLE | RAJAMAHENDRAVARAM | SRIKAKULAM | TADEPALLI GUDEM | TIRUPATHI | VISAKHAPATNAM | WARANGAL



వైఎస్సార్ జిల్లా ప్రొద్దుటూరులో జరిగిన మేమంతా సిద్ధం సభకు హాజరైన అశేష జనసందోహంలో ఓ భాగం



వైఎస్సార్‌సీపీ ఎన్నికల గుర్తు 'ఫ్యాన్'ను ప్రజలకు చూపిస్తున్న సీఎం వైఎస్ జగన్

మోసాలు, నేరాలే వారి చరిత్ర

ప్రొద్దుటూరు బహిరంగ సభలో నిప్పులు చెరిగిన ముఖ్యమంత్రి వైఎస్ జగన్

- చిన్నాన్న వివేకాను ఎవరు చంపారు.. ఎందుకు చంపించారో అందరికీ తెలుసు
- చంపినోణ్ణి చంద్రబాబు, ఎల్లో మీడియా నెత్తిన పెట్టుకుంది
- విశాఖ డ్రగ్స్ కేసులో ఉన్నది చంద్రబాబు, పురందేశ్వరి బంధువులే
- నేరం వాళ్లు చేసి.. నెపం వైఎస్సార్‌సీపీపైకి తోస్తున్నారు
- బతికున్నప్పుడు ఎన్టీఆర్‌కు వెన్నుపోటు.. చనిపోయాక వీళ్లే విగ్రహాలు పెట్టిస్తారు
- అబద్ధాలు చెప్పేవాళ్లు, మోసాలు చేసే వాళ్లే మనకు ప్రత్యర్థులు
- వీరంతా కలిసి నన్ను దెబ్బతీసేందుకు కుట్రలు, కుతంత్రాలు
- ఈసారి నా ఇద్దరు చెల్లెళ్లు కూడా కుట్రలో భాగస్వాములయ్యారు
- ప్రజల అజెండానే వైఎస్సార్‌సీపీ జెండా
- మీ కోసం 130 సార్లు బటన్ నొక్కి రూ.2.70 లక్షల కోట్లు జమ చేశాను
- మీరు నా కోసం మే 13న ఎమ్మెల్యే, ఎంపీ ఎన్నికకు 2 సార్లు బటన్ నొక్కండి
- చంద్రబాబుకు ఓటేస్తే మోసకారికి వేసినట్టే.. పేదల సంక్షేమానికి వ్యతిరేకంగా ఓటేసినట్టే
- ఇప్పుడున్న సంక్షేమ పథకాల రద్దుకు అంగీకరించినట్లేనని ప్రతి ఇంటా చెప్పండి

11 లో

జైత్రయాత్ర ఆరంభం

ఇడుపులపాయ నుంచి బస్సుయాత్రతో సీఎం జగన్ ఎన్నికల ప్రచార భేరి

వైఎస్సార్ ఘాట్ వద్ద తల్లి విజయమ్మతో కలిసి నివాళులు

సర్వమత ప్రార్థనల అనంతరం బస్సు యాత్రకు శ్రీకారం

భారీగా కదలివచ్చిన నేతలు, కార్యకర్తలు, అభిమానుల హర్షధ్వానాల మధ్య యాత్ర ప్రారంభం

ప్రొద్దుటూరు వరకూ రహదారిపై కిలో మీటర్ల కొద్దీ బారులు తీరిన జనం

అడుగడుగునా అపూర్వ ఆదరణతో ఆలస్యంగా సాగిన బస్సు యాత్ర

10 లో

ఫ్యాక్ట్‌చెక్

అది ప్యాంట్రీ కార్.. బేకార్' రాతలేల
రామోజీ

- బస్సుయాత్ర కోసం వంట సామాన్లను తీసుకెళ్లిన ప్యాంట్రీ వాహనం
- సీఎం క్యాంప్ కార్యాలయానికి కంటైనర్ ఎందుకొచ్చిందంటూ ఈనాడు తప్పుడు రాతలు
- నిషేధిత ప్రాంతంలో ఫొటోలు.. వీడియోలు తీసి అడ్డగోలు కూతలు
- అనుమతి లేకుండా చిత్రీకరించడమే కాకుండా వక్రరాతలు రాసిన ఈనాడు, ఈటీవీపై చట్టపరమైన చర్యలకు అధికారులు సిద్ధం
- వేంపల్లెలో డీజిల్ కొట్టించుకుని ఆళ్లగడ్డకు చేరుకున్న ఏపీ 16 జెడ్ 0363 వాహనం.. సీఎం జగన్ బస చేసే ప్రాంతంలోనే పార్కింగ్

12 లో

తెరచాటు వ్యవహారాలు మీ బాబుకే చెల్లు

- జనం మధ్యే పథకాల అమలు కనిపించడం లేదా రామోజీ?
- ప్రతి పథకం అమలులో ప్రజలతో మమేకం
- ఏ జిల్లాకు వెళ్లినా నిస్సహాయులకు తక్షణ భరోసా
- 24 గంటలు తిరగకముందే కలెక్టర్ల ద్వారా ఆర్థిక సాయం
- జిల్లాల పర్యటనలో 699 మంది ఆర్తులకు సాంత్వన
- సీఎం జగన్ ఏ జిల్లాకు వెళ్లినా ప్రజా స్వాగతం
- చంద్రబాబులా గిమ్మిక్కులు తెలియవు.. నాడు ప్రత్యేక విమానాలకు బాబు ఖర్చు రూ.100 కోట్లు

3 లో

హైకోర్టు సాక్షిగా తేలిపోయిన 'ఈనాడు' అసత్య ఆరోపణలు

ఏపీ ప్రభుత్వం అధికార దుర్వినియోగం చేస్తోందన్న ఈనాడు



ఏబీసీ నుంచి గణాంకాలు తెప్పించిన ఢిల్లీ హైకోర్టు

వెనక్కి తగ్గిన ఈనాడు... అనుబంధ పిటిషన్ ఉపసంహరణ

'సాక్షి' సర్క్యులేషన్ గణాంకాల ప్రచురణకు ధర్మాసనం అనుమతి

- వివరాలు 5లో

వలస నేతలే దిక్కు



అభ్యర్థులు లేక చంద్రబాబు అవస్థలు

కనీసం పార్టీలో చేరకుండానే తెలంగాణ బీజేపీ నేతకు బాపట్ల ఎంపీ సీటు

12 లో

కేజ్రీవాల్ నిజాలన్నీ బయట పెడతారు



మద్యం కుంభకోణం కేసులో నిజాలను, ఆ డబ్బు ఎక్కడుందనే విషయాలను ఢిల్లీ సీఎం అరవింద్ కేజ్రీవాల్ గురువారం కోర్టులో బయట పెడతారని ఆయన సతీమణి సునీత కేజ్రీవాల్ చెప్పారు. రాజకీయ కక్ష సాధింపులో భాగంగానే తన భర్తను ఈడీ అధికారులు అరెస్టు చేశారని ఆరోపించారు. డయాబెటిస్‌తో బాధపడుతున్న కేజ్రీవాల్ ఆరోగ్యం కోసం ప్రార్థించాలని ప్రజలను సునీత కేజ్రీవాల్ కోరారు.

- వివరాలు 6లో

ఓటర్లు డబ్బుకు అమ్ముడుపోతారనడం
బాధాకరం



- పిఠాపురంలో ఓటరు రూ.లక్షకు అమ్ముడుపోయారనేలా పవన్ చిత్రించడం బాధగా ఉంది
- మీలాగే ఓటర్లు అమ్ముడుపోతారనడం సరికాదు
- కాకినాడ ఎంపీగా సునీల్‌ను, పిఠాపురం ఎమ్మెల్యేగా వంగా గీతను గెలిపించాలి.. జగన్‌ను మళ్లీ సీఎం చేయాలి
- పిఠాపురంలో పరిశ్రమలు ఏర్పాటు చేసి.. స్థానిక యువతకు ఉద్యోగావకాశాలు కల్పించాలి
- కాపు ఉద్యమ నేత ముద్రగడ పద్మనాభం
- కిర్లంపూడిలో ముద్రగడను కలిసిన సునీల్, వంగా గీత

3 లో

ఇవిగో నవరత్నాల వెలుగులు

ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి రాష్ట్రంలో నిర్విఘ్నంగా అమలు చేస్తున్న నవరత్న పథకాల ద్వారా కోట్లాది మంది జీవితాల్లో వెలుగు నిండింది. ఈ పథకాల వల్లే తాము ఆనందంగా జీవిస్తున్నామని ఊరూరా ప్రజలు సంతోషంగా చెబుతున్నారు. వారంతా ఏ విధంగా అభివృద్ధిపథం వైపు పయనిస్తున్నారో వారి మాటల్లోనే 'సాక్షి' మీ ముందుకు తెస్తోంది.

సర్కారు సాయంతో హాయిగా జీవనం



సుమారు ఐదేళ్ల క్రితం ఆకస్మికంగా భర్త చనిపోవడంతో ఉండటానికి ఇల్లు కూడా లేకుండా.. ఇద్దరు పిల్లలతో బతుకు అగమ్య గోచరంగా తయారైంది. సరిగ్గా అలాంటి సమయంలో జగనన్న ప్రభుత్వం ఎంతగానో ఆదుకుంది. మాది విశాఖపట్నం జిల్లా ఆనందపురం మండలం కోలవానిపాలెం. నా భర్త చిన్నంనాయుడు కూలి పని చేసి కుటుంబాన్ని పోషించేవారు. ఆయన బతికి ఉన్నంతకాలం మాది ఉమ్మడి కుటుంబం. భర్త చనిపోయిన తర్వాత నాకు, నా పిల్లలకు ఇంటి సమస్య తలెత్తింది. ఐదేళ్ల నుంచి అద్దె ఇంట్లోనే జీవించాం. పెద్దబ్బాయి ఇంటర్ రెండో సంవత్సరం, రెండోవాడు పదో తరగతి చదువుతున్నారు. నేను రోజు కూలి పని చేస్తూ పిల్లలను చదివిస్తూ, ఇంటికి అద్దె కట్టుకోవడం చాలా ఇబ్బందిగా ఉండేది. ఈ సమయంలో జగనన్న కాలనీలో స్థలం మంజూరు కావడంతో వెంటనే ఇంటి పనులు ప్రారంభించాం. నిర్మాణం పూర్తయింది. ఇప్పుడు సొంతింట్లో నివసిస్తున్నాం. ఈ ప్రభుత్వం వచ్చిన వెంటనే వితంతు పింఛన్ మంజూరు కావడం పెద్ద ఆసరాగా నిలిచింది. ఏటా అమ్మఒడి వస్తోంది. డ్వాక్రా రుణ మాఫీ నాలుగు విడతలుగా రూ.24 వేలు వచ్చింది. మేము ఆనందంగా జీవించడానికి కారణమైన ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌కు ఎప్పటికీ రుణపడి ఉంటాం.

– ఇరోతు అనిత, కోలవానిపాలెం
(మహంతి శివాజీ, విలేకరి ఆనందపురం)

ఆర్థికంగా నిలదొక్కుకున్నాం



మాది రజక కుటుంబం. పశ్చిమగోదావరి జిల్లా పాలకొల్లులోని లక్ష్మీనగర్‌లో కుల వృత్తితో జీవనం సాగిస్తున్నా. గత ప్రభుత్వాల నుంచి ఎలాంటి సాయం నాకు అందలేదు. అరకొర ఆదాయంతో కుటుంబాన్ని నెట్టుకు రావడం చాలా కష్టంగా ఉండేది. సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అధికారంలోకి వచ్చాక నవరత్నాల పథకాలతో మా కుటుంబం ఆర్థికంగా నిలదొక్కుకుంది. తోపుడు బండి మీద రోజూ బట్టలు ఇస్త్రీ చేసుకుని జీవనం సాగిస్తుంటా. చేదోడు పథకంలో ఏటా రూ.10 వేలు ఆర్థిక సహాయం అందుతోంది. నాకు ఇద్దరు కుమార్తెలు. పెద్దమ్మాయి భవానికి పెళ్లయింది. రెండో కుమార్తె కల్యాణి ప్రస్తుతం డిగ్రీ చదువుతోంది. విద్యా దీవెన, వసతి దీవెన పథకాల ద్వారా సాయం అందింది. నా భార్య లక్ష్మికి వైఎస్సార్ ఆసరా పథకం ద్వారా ఏటా రూ.15 వేలు, సున్నా వడ్డీ కింద ఏటా రూ.3 వేల చొప్పున వచ్చాయి. ఇప్పుడు మేం ఆర్థికంగా నిలదొక్కుకున్నాం. పేదల బతుకుల్లో మార్పు రావాలంటే వైఎస్ జగన్ మళ్లీ సీఎం కావాలి.

– వేల్పూరి నరసింహులు, పాలకొల్లు
(కె.శాంతారావు, విలేకరి, పాలకొల్లు అర్బన్)

మా కుటుంబానికి ఆధారంగా నిలిచారు



మాది పేద కుటుంబం. గుంటూరు జిల్లా మంగళగిరి పట్టణం భగత్ సింగ్ నగర్‌లో అద్దె ఇంట్లో ఉంటూ మా ఆయన కూలి పనులు చేసి కుటుంబాన్ని పోషించేవారు. నేను ఇంట్లో టైలరింగ్ చేస్తూ ఆయనకు చేదోడు వాదోడుగా నిలిచేదాన్ని. వచ్చిన అరకొర ఆదాయంతోనే ఒక కుమారుడు, కుమార్తెను పోషించి వారిద్దరికీ పెళ్లిళ్లు చేశాం. నాలుగేళ్ల క్రితం మా ఆయన కన్నుమూశారు. నా కుమారుడు, కోడలు నాతోనే ఉంటున్నారు. కుటుంబ పోషణ కోసం టైలరింగ్ కొనసాగిస్తున్నా. ఏళ్ల తరబడి అద్దె ఇంటిలో నానా అవస్థలు పడుతూ జీవిస్తున్న మాకు వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం సొంతింటి కలను నిజం చేసింది. వైఎస్సార్ చేయూత కింద ఏటా రూ.18,750 వంతున, జగనన్న చేదోడు కింద ఏడాదికి రూ.పది వేలు వంతున రావడంతో ఆర్థిక ఇబ్బందులు తొలిగాయి. జగనన్న కాలనీలో ఇంటి స్థలం కూడా మంజూరైంది. నిర్మాణం త్వరలో పూర్తి కానుంది. మా చిరకాల వాంఛ నెరవేరనుంది. మా ఇంట్లో ఆనందపు కాంతులు నింపిన జగనన్న మేలు ఎప్పటికీ మరవలేము.

– నేరెళ్ల నాగ ఉషారాణి, మంగళగిరి
(ఐవీ రెడ్డి, విలేకరి, మంగళగిరి)

3 నుంచి పింఛన్ల పంపిణీ

ఆర్థిక సంవత్సరం ముగింపు, బ్యాంకులకు వరుస సెలవులే కారణం

- అన్ని జిల్లాల అధికారులకు వెల్లడించిన సెర్ప్
- ఎన్నికల కోడ్‌తో పింఛన్ల పంపిణీకి కొత్త మార్గదర్శకాలు జారీ

సాక్షి, అమరావతి: ప్రతి నెలా ఒకటినే మొదలవుతున్న పింఛన్ల పంపిణీ ఈసారి ఏప్రిల్ 3 నుంచి కొనసాగనుంది. ఆర్థిక సంవత్సరం ముగింపుతో పాటు బ్యాంకులకు వరుస సెలవులు రావడమే ఇందుకు కారణం. ఈ మేరకు ఇప్పటికే గ్రామీణ పేదరిక నిర్మూలన సంస్థ (సెర్ప్) అధికారులు అన్ని జిల్లాల డీఆర్‌డీఏ పీడీలకు సమాచారం ఇచ్చినట్టు తెలుస్తోంది. మార్చి 31న ఆదివారం, ఏప్రిల్ 1న ఆర్థిక సంవత్సరం ముగింపు సందర్భంగా దేశవ్యాప్తంగా బ్యాంకులకు సెలవులు వచ్చాయి. దీంతో పింఛను నగదును ఏప్రిల్ 2న డ్రా చేసుకోవడానికి సచివాలయాల సిబ్బందికి ప్రభుత్వం వెసులుబాటు కల్పించింది. మూడో తేదీ నుంచి పంపిణీ చేయడానికి అన్ని ఏర్పాట్లు చేసుకోవాలని ఇప్పటికే అధికారులకు సమాచారమిచ్చింది. గతేడాది కూడా ఏప్రిల్ 3 నుంచే పింఛన్ల పంపిణీ కొనసాగినట్టు అధికారులు గుర్తు చేశారు. కాగా, ఎన్నికల నేపథ్యంలో కోడ్ అమల్లో ఉన్నప్పటికీ యథావిధిగా వలంటీర్ల ద్వారా లబ్ధిదారుల ఇళ్ల వద్దే పింఛన్ అందిస్తామని తెలిపారు.

ఎన్నికల కోడ్‌తో ప్రత్యేక మార్గదర్శకాలు..

ఎన్నికల కోడ్ అమల్లో ఉండటంతో పింఛన్ల పంపిణీకి సెర్ప్ ప్రత్యేక మార్గదర్శకాలను విడుదల చేసింది. ఈ మేరకు బుధవారం అన్ని జిల్లాల పీడీలు, ఎంపీడీవోలు, మున్సిపల్ కమిషనర్లకు ఆదేశాలు ఇచ్చింది. ఎన్నికల కోడ్‌తో నిర్దేశిత పరిమితికి మించి వ్యక్తులు నగదు తీసుకువెళ్లకూడదని ఆంక్షలు ఉన్నాయి. ఈ నేపథ్యంలో పింఛన్ల పంపిణీలో పాల్గొనే సచివాలయాల సిబ్బంది, వలంటీర్లు బ్యాంకుల నుంచి డ్రా చేసిన నగదుకు సంబంధించిన రశీదులను తప్పనిసరిగా తమ వద్దే ఉంచుకోవాలని సెర్ప్ అధికారులు సూచించారు. పంపిణీ కార్యక్రమంలో పాల్గొనే వారి వివరాలను ఎంపీడీవోలు/మున్సిపల్ కమిషనర్లు సంబంధిత నియోజకవర్గ రిటర్నింగ్ అధికారులు (ఆర్వో)లకు ముందుగానే సమాచారం ఇవ్వాలని ఆదేశించారు. సచివాలయాల పేర్లు, నగదు వివరాలతో కూడిన ధ్రువీకరణ పత్రాలు కూడా సంబంధిత సిబ్బంది కలిగి ఉండాలన్నారు. ఈ మేరకు ఆయా ధ్రువీకరణ పత్రాలను నిర్దేశిత ఫార్మాట్‌లో ఎంపీడీవోలు/మున్సిపల్ కమిషనర్ల లాగిన్‌లో అందుబాటులో ఉంచుతామన్నారు. పింఛన్లు పంపిణీ సమయంలో ప్రచారం చేయడానికి, ఫొటోలు, వీడియోలు తీయడానికి అనుమతి లేదన్నారు.

4 నుంచి 'సదరం' బుకింగ్స్

గ్రామ, వార్డు సచివాలయాల్లో దరఖాస్తుకు అవకాశం

సాక్షి, అమరావతి: ఏప్రిల్, మే, జూన్ నెలలకు సంబంధించి సదరం స్లాట్‌లను ప్రభుత్వం విడుదల చేసింది. వీటికి ఏప్రిల్ 4 నుంచి గ్రామ, వార్డు సచివాలయాల్లో దరఖాస్తు చేసుకోవచ్చు. స్లాట్‌లు బుక్ చేసుకున్న వారికి ఏప్రిల్ 8 నుంచి ఆస్పత్రుల్లో స్క్రీనింగ్ నిర్వహిస్తారు. రాష్ట్రవ్యాప్తంగా వైద్య శాఖ ఆధ్వర్యంలో 173 ప్రభుత్వాస్పత్రుల్లో ఆర్థోపెడిక్, మానసిక, కంటి, ఈఎన్‌టీ వైద్యులు పరీక్షలు నిర్వహించి అర్హులైన వారికి ధ్రువీకరణ పత్రాలిస్తారు. టీడీపీ హయాంలో 56 ఆస్పత్రుల్లోనే ఈ క్యాంపులు నిర్వహించేవారు. అప్పట్లో ఏడాదికి 25 వేల నుంచి 30 వేల స్క్రీనింగ్‌లు నిర్వహించే వారు. దీంతో పలు సంక్షేమ పథకాల అర్హత సాధించడానికి, ప్రభుత్వ ఉద్యోగాల్లో రిజర్వేషన్‌లు పొందడానికి, సర్టిఫికెట్‌లు పొందడానికి దివ్యాంగులు అగచాట్లు పడాల్సివచ్చేది. జన్మభూమి కమిటీల్లోని టీడీపీ నేతలు సదరం సర్టిఫికెట్‌లు మంజూరు చేయిస్తామని మోసాలకు పాల్పడేవారు. ఈ పరిస్థితులను గమనించిన సీఎం జగన్ ప్రభుత్వం సదరం సర్టిఫికెట్‌ల జారీని సరళతరం చేసి వీలైనంత ఎక్కువ మందిని స్క్రీనింగ్ చేయడానికి వీలుగా ఆస్పత్రుల సంఖ్యను 173కు పెంచింది. గతంతో పోలిస్తే ఏడాదికి 3 రెట్లు అధికంగా స్క్రీనింగ్ చేపడుతున్నారు.

బాబు హయాంలో తుస్...

జగన్ పాలనలో భేష్!

వైద్యరంగాన్ని విశ్వవ్యాప్తం చేసిన ఘనత జగన్‌మోహన్‌రెడ్డిదే

- 53 వేలకుపైగా పోస్టులు భర్తీ చేసి కొరతకు చెక్ పెట్టిందీ ఈ ప్రభుత్వంలోనే
- ఎప్పటికప్పుడు భర్తీ చేసేందుకు వీలుగా 'జీరో వేకెన్సీ' విధానం
- కొత్తగా 17 వైద్యకళాశాలలు ఏర్పాటు.. ఐదు ప్రారంభం
- విలేజ్ క్లినిక్, ఫ్యామిలీ డాక్టర్, జగనన్న ఆరోగ్యసురక్షతో విప్లవాత్మక చర్యలు
- గ్రామీణ ప్రాంత ప్రజలకు చేరువైన ఖరీదైన వైద్యం
- ఆరోగ్యశ్రీ ద్వారా వైద్య పరిమితి రూ. 25లక్షలకు పెంచి పకడ్బందీగా అమలు
- బోధనాస్పత్రుల్లో వైద్యులు, సిబ్బంది కొరతంటూ 'ఈనాడు'లో రోత రాతలు
- చంద్రబాబు హయాంలో ఈ రంగం నిర్వీర్యమైపోయినా పట్టించుకోని రామోజీ

ఎన్నికలు సమీపిస్తున్న కొద్దీ రామోజీ పైత్యం పరాకాష్టకు చేరుతోంది. నవ్విపోదురుగాక నాకేటి సిగ్గంటూ ఈనాడులో 'పచ్చ' రోతలు పెచ్చుమీరుతున్నాయి. బాబు హయాంలో వ్యవస్థ మొత్తం భ్రష్టుపట్టినా వేలెత్తి చూపేందుకు మనసురాని పచ్చ పత్రికలకు జగన్ హయాంలో జరిగే మంచి కూడా పాపంలా కనిపిస్తోంది. ఏపీలో వైద్యరంగాన్ని విశ్వవ్యాప్తం చేస్తున్న ఆయన సంస్కరణలు వారికి ఘోరంలా గోచరిస్తున్నాయి. కొత్తగా 17 వైద్య కళాశాలలు రాష్ట్రంలో ఏర్పాటు చేసి అందులో ఐదింటిని ప్రారంభించినా ప్రశంసించలేక... పగబడుతున్నాయి. ఐదేళ్లలో వైద్య రంగం స్వరూపాన్ని పూర్తిగా మార్చేస్తే... అది తమ వారు చేయలేకపోయారన్న దుగ్ధతో క్షుద్ర రాతలకు తెగబడుతున్నాయి. 'తెలంగాణలో భేష్.. ఏపీలో తుస్' అంటూ ఇక్కడి బోధన ఆస్పత్రులపై నికృష్ట కథనాన్ని అచ్చేశాయి.



సాక్షి, అమరావతి: సార్వత్రిక ఎన్నికలు సమీపిస్తున్నాయి. వీలైనంత పెద్ద సంఖ్యలో అబద్ధాలను అచ్చేయాలి. ఎలాగైనా ప్రభుత్వంపై ప్రజల్లో వ్యతిరేకత పెంచాలి. తద్వారా తమకు అనుకూలురైన పచ్చనేతలకు పట్టంగట్టాలి. ఇదే లక్ష్యంతో ఎలాంటి దారుణానికైనా వెనుకాడకూడదని రామోజీ సారథ్యంలో నడుస్తున్న ఈనాడు నిర్ణయించుకున్నట్టుంది. ఇందుకోసం రోజురోజుకూ అత్యధిక సంఖ్యలో తప్పుడు కథనాలు ప్రచురిస్తున్నాయి. 2014–19 మధ్య రాష్ట్రంలో ప్రభుత్వ వైద్య రంగం పడకేసిన సందర్భంలోనూ సీఎంగా తన మనిషి ఉండటంతో ఆహా ఓహో ఏపీ వైద్య రంగం అంటూ రామోజీ రావు బాకాలు ఊదారు. గడచిన ఐదేళ్లలో వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆధ్వర్యంలో వైద్య, ఆరోగ్యశాఖలో 53 వేలకు పైగా పోస్టులను భర్తీ చేయడంతో పాటు, వైఎస్సార్ ఆరోగ్యశ్రీ పథకాన్ని బలోపేతం చేసి ప్రజలకు ఆరోగ్య భరోసా కల్పించారు. 17 వైద్య కళాశాలల ఏర్పాటుకు చర్యలు చేపట్టి ఐదు కళాశాలలను ఇప్పటికే ప్రారంభించడంతో పాటు, మరో ఐదు త్వరలో ప్రారంభించనున్నారు. వైఎస్సార్ విలేజ్ క్లినిక్‌లు, ఫ్యామిలీ డాక్టర్ విధానం, జగనన్న ఆరోగ్య సురక్ష వంటి విప్లవాత్మక సంస్కరణలు చేపట్టి ప్రజల గుమ్మం వద్దకే వైద్య సేవలను చేరువ చేశారు. కేవలం ఐదేళ్లలో వైద్య రంగం ఇంతగా పురోగమిస్తే బాబుకు రాజకీయ భవిష్యత్ ఉండదనే ఉద్దేశంతో నిస్సిగ్గుగా ఈనాడులో దిగజారుడు రాతలు రాస్తున్నారు.

ఇప్పుడు తెలంగాణ కంటే మనమే మెరుగు

ప్రజలకు వైద్యపరంగా అండగా నిలవడంలో పక్కనున్న తెలంగాణాతో పాటు, దేశంలోనే అగ్రస్థానంలో ఏపీ ఉంటోంది. మధ్యతరగతి వర్గాలకు సైతం ఆరోగ్యశ్రీ కింద ఉచిత వైద్య సేవలు అందిస్తున్న రాష్ట్రంగా ఏపీని నీతి ఆయోగ్ సైతం కీర్తించింది. రూ.5 లక్షలలోపు వార్షికాదాయం గల కుటుంబాలన్నీ నేడు ఆరోగ్యశ్రీ పరిధిలో ఉన్నాయి. రూ.25 లక్షల వరకూ వైద్య సేవలను ఉచితంగా పొందుతున్నారు. తెలంగాణ రాష్ట్రం కన్నా మిన్నగా ఆరోగ్యశ్రీ పథకాన్ని సీఎం జగన్ ప్రభుత్వం అమలు చేస్తోంది. రక్తహీనత నివారణ, డిజిటల్ వైద్య సేవల కల్పన, జాతీయ ప్రమాణాలు కలిగిన ఆస్పత్రుల సంఖ్య పరంగా, ఇలా వివిధ అంశాల్లో తెలంగాణా ఏపీ కంటే వెనుకే ఉంది.

వైద్య విద్యకు పట్టం

అధికారంలోకి వచ్చాక ప్రతి పార్లమెంట్ నియోజకవర్గానికి ఒక వైద్య కళాశాలను ఏర్పాటు చేస్తామని 2019 ఎన్నికలకు ముందు వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి హామీ ఇచ్చారు. ఆ మేరకు 17 కొత్త వైద్య కళాశాలల ఏర్పాటుకు శ్రీకారం చుట్టారు. జాతీయ మెడికల్ కౌన్సిల్ (ఎన్ఎంసీ) నిబంధనలకు అనుగుణంగా ప్రణాళికబద్ధంగా అడుగులు వేశారు. తొలుత ఐదు జిల్లా ఆస్పత్రులను బోధనాస్పత్రులుగా అభివృద్ధి చేయడం ద్వారా రాజమహేంద్రవరం, ఏలూరు, విజయనగరం, నంద్యాల, మచిలీపట్నం వైద్య కళాశాలలకు అనుమతులను రాబట్టారు. తద్వారా ఈ ఏడాది 750 ఎంబీబీఎస్ సీట్లు అదనంగా అందుబాటులోకి వస్తున్నాయి. వచ్చే విద్యా సంవత్సరం పాడేరు, పులివెందుల, ఆదోని, మార్కాపురం, మదనపల్లె మెడికల్ కాలేజీలను ప్రారంభించనున్నారు. మిగిలిన 7 వైద్య కళాశాలలను అందుబాటులోకి తెచ్చేలా సన్నద్ధమయ్యారు. మూడేళ్లలో 17 కొత్త మెడికల్ కాలేజీలు మన రాష్ట్రంలోనూ ఏర్పాటు కానున్నాయి. కరోనా గడ్డు పరిస్థితులను ఎదుర్కొంటూనే వైద్య రంగంలో సంస్కరణలన్నింటినీ ప్రస్తుత ప్రభుత్వం చేపట్టింది. రాష్ట్రంలో చిన్న పిల్లలకు మెరుగైన వైద్య సదుపాయాల అవసరాలను గుర్తించి టీటీడీ ఆధ్వర్యంలో శ్రీపద్మావతి చిన్న పిల్లల హృదయాలన్ని ప్రారంభించారు. చిన్న పిల్లలకు సంబంధించిన అన్ని రకాల వైద్య సేవలను అందుబాటులోకి తెస్తూ రూ. 450 కోట్లతో సూపర్ స్పెషాలిటీ ఆస్పత్రి ఏర్పాటుకు శ్రీకారం చుట్టారు. దాని నిర్మాణం దాదాపు పూర్తయింది. కానీ చిన్న పిల్లల ఆస్పత్రులకు ప్రభుత్వం ఎలాంటి చొరవ చూపలేదని ఈనాడు తప్పుడు రాతలతో జనాన్ని నమ్మించేందుకు యత్నిస్తోంది.

బాబు పాలనలోనే నీరుగార్చారు

గత తెలుగుదేశం పాలనలో రాష్ట్రంలో వైద్యరంగం పూర్తిగా కుదేలైంది. ఆరోగ్యశ్రీ మూలకు చేరింది. వైద్య కళాశాలల ఊసే లేదు. అదే సమయంలో పక్కనున్న తెలంగాణ ప్రభుత్వం నాలుగు కొత్త వైద్య కళాశాలలను ఏర్పాటు చేయడంతోపాటు, భవిష్యత్తులో మరిన్ని కళాశాలల ఏర్పాటుకు వీలుగా 25 సీహెచ్‌సీ, ఏరియా ఆస్పత్రులను జిల్లా ఆస్పత్రులుగా అప్‌గ్రేడ్ చేస్తూ పడకల సంఖ్యను పెంచింది. 2018లోగా ఈ మొత్తం ప్రక్రియను పూర్తి చేసింది. అప్పట్లో తీసుకున్న చర్యలు 17 కొత్త వైద్య కళాశాలలకు అనుమతులు వచ్చేందుకు దోహదపడ్డాయి. పక్క రాష్ట్రంలో కళాశాలల ఏర్పాటుకు ముందు చూపుతో అడుగులు వేస్తున్నా.. బాబు మాత్రం నిమ్మకు నీరెత్తినట్టు వ్యవహరించారు. ఓ వైపు కేంద్ర ప్రభుత్వంలో భాగస్వామిగా కొనసాగి కూడా రాష్ట్ర ప్రయోజనాలను నీరుగార్చారు. ఉమ్మడి రాష్ట్రంలో తొమ్మిదేళ్లు సీఎంగా ఉన్నప్పుడు కూడా ప్రభుత్వ వైద్య రంగాన్ని పట్టించుకోకుండా ప్రైవేట్ వైద్య కళాశాలలను ప్రోత్సహిస్తూ వైద్య విద్యను వ్యాపారంగా మార్చేశారు. అయినా అవేవీ ఈనాడుకు... దానిని నడిపిస్తున్న రామోజీరావుకు 'కమ్మ'గానే కనిపించాయి.

వైఎస్సార్‌సీపీ హయాంలో పురోగతి



వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక ప్రభుత్వాస్పత్రుల్లో ఒక్క పోస్టు ఖాళీగా ఉండటానికి వీల్లేకుండా 'జీరో వేకెన్సీ' విధానాన్ని ప్రవేశపెట్టారు. ఈ క్రమంలో రాష్ట్ర వైద్య శాఖ చరిత్రలో కనీవినీ ఎరుగని విధంగా ఏకంగా 53 వేలకుపైగా పోస్టులను ఐదేళ్లలో భర్తీ చేశారు. అంతేకాకుండా వైద్య శాఖలో నియామకాల కోసమే ప్రత్యేకంగా రిక్రూట్‌మెంట్ బోర్డు ఏర్పాటుతో పాటు, ఎప్పటి ఖాళీలను అప్పుడే భర్తీ చేపట్టేలా అత్యవసర ఉత్తర్వులు ఇచ్చారు. స్పెషలిస్ట్ వైద్యులు 4500 మేర, మెడికల్ ఆఫీసర్‌లు 2500కు పైగా, 6700కు పైగా నర్సుల పోస్టులను భర్తీ చేశారు. ఇంతలా చర్యలు తీసుకుంటే బోధనాస్పత్రుల్లో వైద్యులు, సిబ్బంది కొరత ఉంటోందని రామోజీరావు రోత రాతలు రాసుకొచ్చారు.

పచ్చ దళం.. ధిక్కార 'గళం'

టీడీపీలో ఆరని ఆగ్రహ జ్వాలలు

- అవనిగడ్డలో బుద్ధప్రసాద్‌కు మద్దతుగా రాజీనామాలకు సిద్ధమైన నేతలు, సర్పంచ్‌లు
- చీరాలలో కొండయ్యకు చేనేత నాయకుల నుంచి వ్యతిరేకత
- తంబళ్లపల్లెలో నిరసన సెగలు
- ఆదోనిలో మీనాక్షినాయుడు నిర్వేదం.. ఇండిపెండెంట్‌గా బరిలోకి!



చీరాలలో టీడీపీ అభ్యర్థి కొండయ్యకు ఓటెయ్యొద్దంటూ ప్రచారం చేస్తున్న చేనేత నాయకురాలు హేమలత



కృష్ణా జిల్లా అవనిగడ్డలో రాజీనామాలు చేస్తామంటూ హెచ్చరిస్తున్న టీడీపీ నేతలు, సర్పంచ్‌లు

అవనిగడ్డ/చీరాల/బి.కొత్తకోట/సాక్షి అమలాపురం: ప్రజాగళం అంటూ ప్రజలను మభ్యపెట్టేందుకు బయలుదేరిన తెలుగుదేశం పార్టీ అధినేత చంద్రబాబు నాయుడికి సొంత పార్టీలోనే ధిక్కార గళం వినిపిస్తోంది. పార్టీలో చెలరేగిన టికెట్ల రగడ ఇంకా చల్లారలేదు. రాష్ట్రవ్యాప్తంగా తెలుగు తమ్ముళ్లు నిరసన కార్యక్రమాలు చేపడుతున్నారు. అధినేతకు ముచ్చెమటలు పట్టిస్తున్నారు. కృష్ణాజిల్లా అవనిగడ్డ నియోజకవర్గంలో మాజీ ఉపసభాపతి మండలి బుద్ధప్రసాద్‌కు సీటివ్వకుంటే పార్టీ సభ్యత్వాలకు, సర్పంచ్ పదవులకు రాజీనామా చేస్తామని పలువురు టీడీపీ నేతలు అధిష్టానానికి అల్టిమేటం జారీ చేశారు. స్థానిక టీడీపీ కార్యాలయంలో బుధవారం టీడీపీ మద్దతుదారులైన సర్పంచ్‌లు సమావేశమయ్యారు. బుద్ధప్రసాద్‌కు అన్యాయం చేస్తే ఊరుకోబోమని స్పష్టం చేశారు. రాజీనామాలు చేస్తామని హెచ్చరించారు.

■ చీరాల టీడీపీ అభ్యర్థి మద్దులూరి మాలకొండయ్య అభ్యర్థిత్వాన్ని సొంత పార్టీలోని చేనేత నాయకులు తీవ్రంగా వ్యతిరేకిస్తున్నారు. ఆయనకు ఓటెయ్యొద్దని ఇంటింటికీ తిరిగి ప్రచారమూ చేస్తున్నారు. ప్రకాశం జిల్లాలో పొన్నలూరు ప్రాంతానికి చెందిన కొండయ్య చీరాలకు వచ్చి చేనేత నాయకులను బహిరంగంగా దూషించి అవమానించడమే దీనికి కారణమని చేనేత నాయకులు ఆరోపిస్తున్నారు. పొన్నూరు మాజీ మున్సిపల్ చైర్మన్ డాక్టర్ సజ్జా హేమలత, టీడీపీ నేత చాట్‌రాసి రాజేష్ వేర్వేరుగా కొండయ్యకు ఓటెయ్యొద్దంటూ ప్రచారం చేస్తున్నారు. స్థానికేతరుడికి టికెట్ ఇవ్వడం ఏమిటని ప్రశ్నిస్తున్నారు. ఇప్పటికైనా అభ్యర్థిని మార్చాలని డిమాండ్ చేస్తున్నారు. చేనేతలకు ఎక్కడా సీటు ఇవ్వకుండా చంద్రబాబు తమను మోసం చేశారని చేనేత ఐక్యవేదిక రాష్ట్ర నాయకుడు అన్నగుండ ఆదినారాయణ మరి కొందరు రాష్ట్ర నాయకులు ఆరోపిస్తున్నారు. రాష్ట్రవ్యాప్తంగా చేనేతల ఓట్లు 40 లక్షలు ఉన్నాయని, తమ సత్తా టీడీపీకి చూపిస్తామని హెచ్చరిస్తున్నారు.

■ తంబళ్లపల్లె టీడీపీ టికెట్ వ్యవహారం మళ్లీ మొదటికొచ్చింది. గతనెల 24న టీడీపీ అభ్యర్థిగా జయచంద్రారెడ్డి పేరును చంద్రబాబు ప్రకటించినా రాజకీయాలకు సంబంధం లేని ఆయనను అభ్యర్థిగా ఎలా పెడతారంటూ మాజీ ఎమ్మెల్యే శంకర్‌యాదవ్, పార్టీ నేతలు కొండా నరేంద్ర తదితరుల నుంచి వ్యతిరేకత వ్యక్తమవుతుండడంతో రాజకీయ సమీకరణాలు మారాయి. దీంతో పెద్దిరెడ్డి ద్వారకనాథరెడ్డి, శంకరయాదవ్, మధుసూదన్‌రెడ్డి తదితరుల పేర్లతో ఐవీఆర్ఎస్ సర్వే నిర్వహిస్తున్నారు. ఫలితంగా క్యాడర్‌లో గందరగోళం నెలకొంది. ఇదిలా ఉంటే బీజేపీ కొత్తగా రాజంపేట, తంబళ్లపల్లెలో ఒకదానిని బీజేపీకి ఇవ్వాలని డిమాండ్ చేస్తున్న దృష్ట్యా తంబళ్లపల్లెను ఆ పార్టీకి ఇచ్చేస్తారన్న ప్రచారం జరుగుతోంది.

■ అమలాపురం అసెంబ్లీ స్థానంలో టీడీపీ మాజీ ఎమ్మెల్యే అయితాబత్తుల ఆనందరావు గెలుపు సాధ్యం కాదనే వాదన సొంత పార్టీలోనే వ్యక్తమవుతోంది. గత ఎన్నికలతోపాటు స్థానిక సంస్థల ఎన్నికల్లో ఆ పార్టీకి వచ్చిన ఓట్లు క్యాడర్‌ను ఆందోళనకు గురిచేస్తున్నాయి.



విశాఖ నగర టీడీపీ కార్యాలయంలో జనసేన పార్టీ చేరికల కార్యక్రమం నిర్వహిస్తున్న దక్షిణ అభ్యర్థి వంశీకృష్ణ

టీడీపీ ఆఫీసులో జనసేన చేరికలు

సాక్షి, విశాఖపట్నం: విశాఖ దక్షిణం నియోజకవర్గంలో బుధవారం ఓ విచిత్రం చోటు చేసుకుంది. ఇక్కడ జనసేనకు సొంత కార్యాలయం లేకపోవడంతో చేరికల కార్యక్రమాన్ని నగర టీడీపీ కార్యాలయంలో జనసేన అభ్యర్థి చేపట్టారు. ఈ సీటును జనసేన నుంచి ఇద్దరు కార్పొరేటర్లు, మరో నాయకుడు ఆశించారు. అయితే వారిని కాదని వైఎస్సార్‌సీపీ నుంచి పార్టీ ఫిరాయించిన వంశీకృష్ణ శ్రీనివాస్‌కు పవన్ సీటు ఇచ్చారు. దీంతో జనసేన నేతలు రోడ్డెక్కి ఆందోళనలు చేశారు. ఈ గందరగోళంలో పార్టీ కార్యాలయ ఏర్పాటును నేతలు పట్టించుకోలేదు. ఈ నేపథ్యంలో బుధవారం జనసేనలో ఓ నలుగురు చేరడానికి రావడంతో అభ్యర్థి వంశీకృష్ణ నగరంలోని టీడీపీ కార్యాలయంలో చేరికల కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ పరిణామానికి విస్తుపోయిన టీడీపీ శ్రేణులు తమ కార్యాలయం నుంచి బయటకు వెళ్లిపోయారు.

పార్టీల శాశ్వత కార్యాలయాల్లో హోర్డింగులు తొలగించొద్దు

- స్థానిక చట్టాల మేరకు పార్టీ కార్యాలయాల్లో హోర్డింగ్‌లకు అనుమతి
- రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి ముఖేష్‌కుమార్ మీనా



సాక్షి, అమరావతి: రాష్ట్ర, జిల్లా స్థాయిల్లో శాశ్వత ప్రాతిపదికన ఉన్న రాజకీయ పార్టీల కార్యాలయాల్లో హోర్డింగులను కొనసాగించవచ్చని రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి ముఖేష్‌కుమార్ మీనా స్పష్టంచేశారు. స్థానిక చట్టాలు, అనుమతుల మేరకు ప్రస్తుతం ఉన్న రాజకీయ ప్రకటనల హోర్డింగులను కొనసాగించాలని జిల్లా ఎన్నికల అధికారులను ఆయన ఆదేశించారు. రాష్ట్ర సచివాలయం నుంచి బుధవారం ఆయన అన్ని జిల్లాల ఎన్నికల అధికారులతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ముఖేష్‌కుమార్ మీనా మాట్లాడుతూ మంగళవారం అన్ని రాజకీయ పార్టీల ప్రతినిధులతో సమావేశం సందర్భంగా పార్టీల శాశ్వత కార్యాలయాల్లో హోర్డింగులను తొలగించడంతోపాటు పలు సమస్యలను తమ దృష్టికి తీసుకువచ్చాయని తెలిపారు. సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో తాత్కాలిక ప్రాతిపదికన ఏర్పాటు చేసిన పార్టీ కార్యాలయాల్లో 4X8 అడుగుల బ్యానర్, ఒక జెండాను అనుమతించాలని అధికారులకు చెప్పారు. రాజకీయ పార్టీల కార్యక్రమాలకు ముందస్తు అనుమతి తప్పనిసరని, అయితే ఇందుకు 48 గంటల ముందుగా సువిధా పోర్టల్లో దరఖాస్తు చేసుకోవాల్సి ఉందన్నారు. అత్యవసర పరిస్థితిల్లో రాజకీయ పార్టీల నుంచి ఆఫ్‌లైన్ ద్వారా కూడా దరఖాస్తులను స్వీకరించి, ఆ వివరాలను ఎన్కోర్ పోర్టల్లో నమోదుచేసి సకాలంలో తగిన అనుమతులను జారీచేయాలని సూచించారు.

ఇంటింటి ప్రచారంపై త్వరలో నిర్ణయం

ముందుగా అనుమతి పొందిన తర్వాతే అభ్యర్థులు ఇంటింటి ప్రచారానికి వెళ్లాలనే నిబంధన సరికాదని, దానిని పునఃసమీక్షించాలని అన్ని రాజకీయ పార్టీల ప్రతినిధులు కోరారని ముఖేష్‌కుమార్ మీనా తెలిపారు. ఈ నిబంధన అమలు విషయంలో భారత ఎన్నికల సంఘం దృష్టికి తీసుకువెళ్లామని చెప్పారు. ఈ అంశంపై త్వరలోనే సరైన నిర్ణయం తీసుకుంటామన్నారు. అదేవిధంగా రాజకీయ పార్టీల ప్రకటనలకు సంబంధించి భారత ఎన్నికల సంఘం మార్గదర్శకాలతోపాటు ఆంధ్రప్రదేశ్ పురపాలక చట్టం, స్థానిక సంస్థల చట్టం, జీవీఎంసీ చట్టాలను పరిగణనలోకి తీసుకుని అనుమతులు మంజూరు చేయాలని జిల్లా ఎన్నికల అధికారులకు సూచించారు. నిబంధనల మేరకు ప్రభుత్వ, ప్రభుత్వ రంగ సంస్థలకు చెందిన వాణిజ్య స్థలాలతోపాటు కార్యాలయాల్లో కూడా ఎటువంటి రాజకీయ ప్రకటనలు, హోర్డింగులు, పోస్టర్లు, బ్యానర్లను అనుమతించవద్దని స్పష్టంచేశారు. ప్రస్తుతం జాతీయ, ప్రధాన రహదారుల పక్కన ఉన్న హోర్డింగులను అన్ని రాజకీయ పార్టీలకు సమాన ప్రాతిపదికన కేటాయించాలని, నూతన హోర్డింగులకు అనుమతి ఇవ్వొద్దని చెప్పారు. ప్రైవేటు భవనాలపై వాల్ పెయింట్లకు అనుమతిలేదని, ఇప్పటికే ఉన్నవాటిని వెంటనే చెరిపించేయాలన్నారు. సమావేశంలో అన్ని జిల్లాల ఎన్నికల అధికారులు, అదనపు సీఈవోలు పి.కోటేశ్వరరావు, ఎంఎన్ హరీంధరప్రసాద్, జాయింట్ సీఈవో ఎ.వెంకటేశ్వరరావు, డిప్యూటీ సీఈవోలు కె.విశ్వేశ్వరరావు, ఎస్.మల్లిబాబు తదితరులు పాల్గొన్నారు.

ఇదండీ సంగతి



సార్ ఢిల్లీ వెళ్లలేదయ్యా!
ఢిల్లీనే సార్ దగ్గరకొచ్చింది!!

క్లుప్తంగా...

చంద్రబాబు.. ఏ గడ్డి అయినా తింటాడు

గుడివాడ ఎమ్మెల్యే కొడాలి నాని



గుడివాడ టౌన్: అధికారం కోసం ఏ గడ్డి అయినా తింటూ.. అందితే జుట్టు లేకపోతే కాళ్లు పట్టుకోవడమే చంద్రబాబు నైజమని ఎమ్మెల్యే కొడాలి శ్రీవెంకటేశ్వరరావు (నాని) ధ్వజమెత్తారు. పొత్తులు పెట్టుకోవడం, వారినే తిట్టడం, తిరిగి వారితో జట్టుకట్టడం, నల్ల చొక్కాలు ధరించడం, దారుణంగా విమర్శించడం, నమ్మిన పార్టీలను నిలువునా ముంచడం తదితర అసాంఘిక చర్యలకు బాబే ప్రతిరూపమని విమర్శించారు. బుధవారం కృష్ణా జిల్లా గుడివాడలో ఇంటింటికీ తిరిగి ఎన్నికల ప్రచారం నిర్వహిస్తున్న ఆయన విలేకరులతో మాట్లాడారు. వైఎస్సార్‌సీపీతో ఒంటరి పోరాటానికి వెళితే గెలవలేనని నిర్ధారణకు వచ్చిన చంద్రబాబు పవన్‌కళ్యాణ్ కాళ్లు పట్టుకున్నాడని, 20 సీట్లిచ్చి అతని గొంతు కోశాడని మండిపడ్డారు. 'గతంలో బీజేపీతో కలిసి పోటీచేసి అది మతతత్వ పార్టీ అన్నాడు. ముస్లింలకు ద్రోహం చేస్తుందన్నారు. ఆ పార్టీతో పొత్తు పెట్టుకుని తప్పు చేశానన్నాడు. మళ్లీ ఢిల్లీ వెళ్లి మూడు రోజులు పడిగాపులు పడి మళ్లీ పొత్తు పెట్టుకున్నాడు' అని ఎద్దేవా చేశారు. బాబు వన్నీ సొల్లు కబుర్లని రాష్ట్రంలోని హిందువులకు, ముస్లింలకు, క్రైస్తవులకు తెలుసన్నారు. వలంటీర్లను చూసి బాబు భయపడుతున్నారని చెప్పారు. వలంటీర్ల పేరు చెపితే చంద్రబాబు, పవన్ కూటమికి తడిచి పోతుందని చెప్పారు. ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి ఎన్నికల ప్రచారాన్ని ప్రారంభించారని, 175 స్థానాల్లో విజయం సాధించి తీరతామని కొడాలి నాని ధీమా వ్యక్తం చేశారు.

చంద్రబాబు, పవన్‌ల అడ్రస్‌లు గల్లంతే

నెడ్‌క్యాప్ చైర్మన్ వేల్పుల రవికుమార్



తాడేపల్లిరూరల్: సీఎం వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి చేపట్టిన బస్సు యాత్రలో ప్రతి చోటా జన సునామీ కనిపించిందని, ఇక చంద్రబాబు, పవన్‌కళ్యాణ్‌ల అడ్రస్‌లు గల్లంతేనని నెడ్‌క్యాప్ చైర్మన్ వేల్పుల రవికుమార్ అన్నారు. గుంటూరు జిల్లా తాడేపల్లిలోని తన కార్యాలయంలో రవికుమార్ బుధవారం విలేకరులతో మాట్లాడుతూ సీఎం వైఎస్ జగన్ ప్రజలను నేరుగా కలిసి తన పరిపాలనలో చేసిన మేలును, అభివృద్ధిని వివరించేందుకు బస్సుయాత్ర ప్రారంభించారని, మొదటిరోజే లక్షలాదిగా జనం తరలివచ్చి ఆయనకు మద్దతు ప్రకటించారని చెప్పారు. సీఎం వైఎస్ జగన్ ఐదేళ్ల పాలనలో విప్లవాత్మక మార్పులకు శ్రీకారం చుట్టారని, ప్రజా సంక్షేమానికి, ప్రజారోగ్యానికి, సామాజికన్యాయానికి, మహిళా సాధికారతకు పెద్దపీట వేశారని వివరించారు. వ్యవసాయ రంగంలో విప్లవాత్మక మార్పులు తీసుకువచ్చారని, అన్ని వర్గాల ప్రజలు ఏకమై వైఎస్ జగన్‌మోహన్ రెడ్డిని మరోసారి ముఖ్యమంత్రిగా గెలిపించుకుంటారని ఆయన ధీమా వ్యక్తంచేశారు.

ఎమ్మెల్సీ రఘురాజుపై అనర్హత వేటు వేయాలి

శాసనమండలి సెక్రటరీ జనరల్‌కు ఫిర్యాదు చేసిన మండలి విప్ విక్రాంత్

సాక్షి,అమరావతి: విజయనగరం జిల్లా స్థానిక సంస్థల ఎమ్మెల్సీ ఇందుకూరి రఘురాజు పై అనర్హత వేటు వేయాలని శాసనమండలి విప్ పాలవలస విక్రాంత్ కోరారు. బుధవారం శాసనమండలి సెక్రటరీ జనరల్ పీపీకే రామాచార్యులకు విక్రాంత్ ఫిర్యాదు చేశారు. ప్రజాప్రాతినిధ్య చట్టం 1951 ప్రకారం ఒక పార్టీ నుంచి చట్టసభల్లో అడుగుపెట్టిన వ్యక్తి పార్టీ వ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడితే ఫిరాయింపుల నిరోధక చట్టం కింద, 1985 ప్రకారం అనర్హత వేటు వేయవచ్చని వివరించారు.

తెరచాటు వ్యవహారాలు మీ బాబుకే చెల్లు

జనం మధ్యే పథకాల అమలు కనిపించడం లేదా రామోజీ?



ఫ్యాక్ట్ చెక్

ప్రతీ నెలా ఒకటో తేదీ సుప్రభాత వేళ.. పేదింటి అవ్వాతాతలు, వితంతువులు, దివ్యాంగులకు అందే పింఛన్ సంతోషంలో జగన్ కనిపిస్తారు.. రైతుభరోసా సాయంలో రైతులకు ఆయన నవ్వు మోమే కనిపిస్తుంది.. ఆరోగ్యశ్రీ పథకం ద్వారా లక్షలాది రూపాయల ఖరీదైన చికిత్స ఉచితంగా పొందే పేదల ఆరోగ్యంలో జగన్ రూపమే కనిపిస్తుంది.. ఇలా ప్రతీ పథకం లబ్ధిలోనూ రాష్ట్రమంతటికీ సీఎం జగన్ సంక్షేమాశయమే వేర్వేరు రూపాల్లో ప్రత్యక్షమవుతోంది ఒక్క రామోజీకి తప్ప. కనిపించకూడదని కళ్లు మూసుకుంటాడాయన. నిత్యం జనంతో మమేకమై వారి సమస్యలే తన విగా తపించే నేత సీఎం జగన్.. జనానికి చిన్నపాటి అసౌకర్యమూ కలగరాదని ఆరాటపడే నాయకుడాయన. ఏ జిల్లా పర్యటనకు వెళ్లినా అక్కడ తక్షణ సాయం అందాల్సిన పేదలను దగ్గరకు తీసుకుని, ఆత్మీయ పరిష్వంగంతో తక్షణ భరోసా ఇస్తారాయన. ఆ భరోసాకు తగ్గట్టుగా 24 గంటలు తిరగక ముందే ఆర్థిక సాయాన్ని కలెక్టర్లే అందించేలా చూస్తున్న మానవతావాది. ఇవన్నీ అందరికీ తెలుసు. అయినా ఎన్నికల వేళ జగన్‌కు రాష్ట్ర ప్రజల నుంచి లభిస్తున్న అఖండ స్వాగతాన్ని జీర్ణించుకోలేక తత్తరపాటు, బిత్తరపాటుతో రామోజీ తొట్రుపాటు రాతలు రాస్తున్నారు.

సాక్షి, అమరావతి: సీఎం వైఎస్ జగన్ ఇన్ని రోజులూ పరదాల చాటున ఉన్నట్లు.. ఎన్నికలున్నందున ఇప్పుడే ప్రజల దగ్గరకు వెళ్తున్నట్లు అజ్ఞానంతో ఈనాడు రామోజీ సీఎం జగన్‌పై విషం కక్కారు. జగన్ అంటే జనం..జనం అంటే జగన్ అనే విషయం రాష్ట్రంలో ఎవరినడిగినా చెబుతారు. ఈనాడు రామోజీకీ ఆ విషయం తెలుసు...అయినా నిలువునా జగన్ వ్యతిరేకతతో అక్షర కుట్రలు, కుహకాలతో ఆయనకు ప్రతీ రోజూ తెల్లారుతోంది. పథకాల అమలు సందర్భంగా సాయం అందించే క్రమంలో ఏ జిల్లాకు జగన్ వెళ్లినా నిస్సహాయులైన పేదలను స్వయంగా కలిసి, వారికి ఒక అన్నలా..తమ్ముడిలా...కొడుకులా..వారి వేదనను నివేదనను ఎంతో శ్రద్ధాసక్తులతో ఆలకిస్తారు. వారి కష్టాలను 24 గంటల్లోనే పరిష్కరిస్తారు. ఇదంతా రామోజీ ఈనాడులో రాస్తూనే ఉంటారు. జనానికి జగన్ చేస్తున్న మేలేమిటో తెలిసినా, తెలియనట్లే నటిస్తూ... ఎన్నికలు కనుక జగన్ జనంలోకి వెళ్తున్నారంటూ తప్పుడు ప్రచారానికి తెరతీశారు. జగన్ తొలి నుంచీ జనంతో ఉండటానికే ఇష్టపడతారు తప్ప చంద్రబాబు మాదిరిగా బడా వ్యాపార వేత్తలు, పలుకుబడి గల వారితో అంటకాగడానికి ఇష్టపడరనే విషయం జగమెరిగిన సత్యం. ముఖ్యమంత్రి జగన్ జిల్లాల పర్యటనకు వెళ్లినప్పుడల్లా రహదారులకు ఇరు వైపులా జనం పూలతో స్వాగతించడం, ఆయన నవ్వులు చిందిస్తూ, ఆత్మీయంగా జనానికి అభివాదం చేస్తూ ముందుకు సాగడం రాష్ట్ర ప్రజలందరికీ కనిపిస్తోంది. ఒక్క ఈనాడు రామోజీకి మాత్రం ఈ ముచ్చటైన దృశ్యాన్ని చూడడానికి అబద్ధాల పరదాలు అడ్డొస్తున్నాయి. వాస్తవానికి పరదాలు, తెరచాటు వ్యవహారాలు మీ చంద్రబాబు నాయుడికే చెల్లుతుంది రామోజీ. ముఖ్యమంత్రి జగన్ పథకాల అమలుకు జిల్లాలకు వెళ్లిన సందర్భంగా లబ్ధిదారులతో కలిసి ఫొటోలు దిగుతున్నారు. ఆయా ప్రాంతాల్లో నిస్సహాయులై అనారోగ్యంతో బాధపడే పేదలను, లేదా ఇతర ఆర్థిక సమస్యల్లో సతమతమవుతున్న పేదలను కలిసి వారి సమస్యలను శ్రద్ధగా వినడమే కాకుండా కొంత మందికి 24 గంటలు తిరగకుండానే జిల్లా కలెక్టర్ల చేత ఆర్థిక సాయాన్ని పంపిణీ చేయిస్తున్నారు. కాలేయ మార్పిడితో పాటు గుండె, కేన్సర్ వంటి పెద్ద ఆరోగ్య సమస్యలతో బాధపడుతున్న వారికి సీఎంఆర్ఎఫ్ నుంచి భారీ ఆర్థిక సాయాన్నీ ముఖ్యమంత్రి మంజూరు చేస్తున్నారు. జిల్లాల పర్యటనలో జగన్‌ను కలిసిన ఆర్తుల సమస్యలను వెంటనే పరిష్కరించేందుకు సీఎంఓ కార్యాలయంలో ఒక బృందమే పనిచేస్తోంది. జిల్లాల పర్యటనల సందర్భంగా ఇప్పటివరకు 699 మంది పేదలను స్వయంగా కలిసి వారి సమస్యలను పరిష్కరించడంతోపాటు వైద్యానికి, ఇతర అవసరాలకు ఆర్థిక సాయం అందేలా జగన్ చర్యలు తీసుకున్నారు. జనం అంటే ఈ 699 మంది పేదలు కాదా ఈనాడు రామోజీ..జనంలోకి వెళ్లడం అంటే నీ అర్థం ఏంటో మరి!

ఊరికో సచివాలయం.. సమస్యల పరిష్కారాలయం..

గ్రామ, పట్టణ ప్రాంతాల్లోని ప్రజా సమస్యలను అక్కడికక్కడే పరిష్కరించేలా, వారికి ప్రభుత్వ సేవలు అక్కడే అందేలా గ్రామ, వార్డు సచివాలయాల వ్యవస్థను ఈ సీఎం ఏర్పాటు చేశారు. గ్రామ, వార్డు సచివాలయాల స్థాయి నుంచి జిల్లా కలెక్టర్లు, రాష్ట్ర స్థాయి వరకు స్పందన కార్యక్రమాన్ని నిర్వహించడం ద్వారా నిత్యం ప్రజల మధ్యే సీఎం జగన్ పాలన కొనసాగింది. మీ చంద్రబాబులా ప్రచార యావ కోసం జిమ్మిక్కులు చేయడం జగన్‌కు ఇష్టం ఉండదనే విషయం రాష్ట్ర ప్రజలందరికీ తెలుసు. ప్రజాధనాన్ని దుర్వినియోగం చేసి, విదేశాలకు ప్రత్యేక విమానాల్లో వెళ్లిన ఘనత మీ బాబుకే దక్కుతుంది. చంద్రబాబు 13 దేశాలకు 23 సార్లు ప్రత్యేక విమానాల్లో వెళ్లారు. నిత్యం హెలికాప్టర్లు, ప్రత్యేక విమానాలతో చంద్రబాబు విహరించినప్పుడు మీకు తప్పనిపించలేదా రామోజీ?. రాష్ట్ర ఖజానా నుంచి చంద్రబాబు ప్రత్యేక విమానాలకు రూ.100 కోట్లకు పైగా వ్యయం చేశారు. ఎన్నికల ముందు ఏ రాజకీయ పార్టీ నాయకుడైనా ప్రజల్లోకి వెళ్లకుండా ఇంట్లో కూర్చుంటారా?. ఎన్నికల వేళ జనంలోకి అంటూ ఈనాడు తన అజ్ఞానాన్ని బయటపెట్టుకుంది. ఎన్నికల షెడ్యూల్ ప్రకటించకుండానే ప్రాంతాల వారీగా నాలుగు సిద్ధం సభలను నిర్వహించారు. ప్రజలకిచ్చిన హామీల అమలు గురించిన ఆలోచనతో జగన్ పాలన సాగించారు. గత ఎన్నికల్లో ఇచ్చిన హామీల్లో 99 శాతం అమలు చేసి 'గడప గడపకు మన ప్రభుత్వం' పేరుతో ఎన్నుకున్న ప్రజల దగ్గరకే ప్రజాప్రతినిధులను ధైర్యంగా పంపించింది దేశంలో ఒకే ఒక్క ముఖ్యమంత్రి వైఎస్.జగన్. చేసిన మేలును ప్రజలకు వివరిస్తూ మళ్లీ వైఎస్సార్‌సీపీని గెలిపించాల్సిన ఆవశ్యకతను తెలియజెప్పడానికి ధైర్యంగా ఆయన జనంలోకి వెళ్తుంటే దాన్నీ తప్పుపట్టే స్థాయికి రామోజీ దిగజారారు. ప్రజలకు ఏ కష్టం, ఆపద వచ్చినా నేనున్నానంటూ ఆదుకోవడమే లక్ష్యంగా జగన్ ఐదేళ్ల పాలన కొనసాగింది. బాబు తరహాలో ఎన్నికల్లో ఇచ్చిన హామీలను గాలికి వదిలేసి. ఏదైనా ఆపద వస్తే దాన్ని ప్రచారానికి వినియోగించుకోవడం ఆయన నైజం కాదు.

కూటమికి ఓటేస్తే స్టీల్ ప్లాంట్ అమ్మకానికి అనుమతిచ్చినట్టే



మాట్లాడుతున్న బొత్స. పక్కన బొత్స ఝాన్సీ, వైవీ సుబ్బారెడ్డి

గాజువాక: 'విశాఖ స్టీల్‌ప్లాంట్‌ను అమ్మేస్తామని కంకణం కట్టుకున్న బీజేపీతో టీడీపీ, జనసేన పార్టీలు పొత్తు పెట్టుకున్నాయి. టీడీపీ, బీజేపీ, జనసేన కూటమికి ఓటు వేస్తే విశాఖ స్టీల్ ప్లాంట్‌ను అమ్మకోవడానికి అనుమతి ఇచ్చినట్టే అవుతుంది. స్టీల్‌ప్లాంట్‌ను ఏ విధంగానూ రక్షించలేము' అని మంత్రి బొత్స సత్యనారాయణ అన్నారు. బుధవారం విశాఖపట్నంలోని గాజువాకలో వైఎస్సార్‌సీపీ ముఖ్య కార్యకర్తలతో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. 'దివంగత సీఎం వైఎస్ రాజశేఖరరెడ్డి విశాఖ అభివృద్ధికి ఎంతో కృషి చేశారు. స్టీల్‌ప్లాంట్ పరిరక్షణతో పాటు ఇక్కడి పరిశ్రమలను ఆయన కాపాడారు. కొత్త పరిశ్రమల ఏర్పాటు ద్వారా నిరుద్యోగులకు ఉపాధి కల్పించారు. అందులో భాగంగానే ఫార్మా సిటీ, అచ్యుతాపురం సెజ్ తదితరాలు ఏర్పాటయ్యాయి. సీఎం జగన్ కూడా అదే విధంగా విశాఖ అభివృద్ధి కోసం ఎంతో కృషి చేస్తున్నారు. అధికారంలోకి వచ్చిన తొలిరోజుల్లో సంక్షేమ పథకాల అమలు కోసం జరుగుతున్న చర్చలతో భయం వేసేది. కానీ ఆ తర్వాత సంక్షేమ పథకాల అమలు చూసి చాలా గర్వపడుతున్నా. సీఎం జగన్ పాలనలో ప్రతి పేదవాడికీ న్యాయం జరిగింది. పార్టీని నమ్ముకున్న కార్యకర్తలను సీఎం జగన్ ఎట్టి పరిస్థితుల్లోనూ వదులుకోరు. నాయకులు, కార్యకర్తలు కలిసి పనిచేసి విశాఖ ఎంపీగా బొత్స ఝాన్సీలక్ష్మి, గాజువాక ఎమ్మెల్యేగా గుడివాడ అమర్‌నాథ్‌ను గొప్ప మెజారిటీతో గెలిపించండి. మరోసారి వైఎస్ జగన్‌ను ముఖ్యమంత్రిని చేసుకుందాం' అని మంత్రి బొత్స సత్యనారాయణ అన్నారు. రాజ్యసభ సభ్యుడు, వైఎస్సార్‌సీపీ రీజనల్ కో ఆర్డినేటర్ వైవీ సుబ్బారెడ్డి మాట్లాడుతూ.. సీఎం జగన్ పాలనలో రాష్ట్రంలోని ప్రతి ఇంటికీ సంక్షేమం అందిందన్నారు. సీనియర్ నేత, ఎమ్మెల్యే తిప్పల నాగిరెడ్డి ఆధ్వర్యంలో గాజువాకలో ఘన విజయం సాధిస్తామని ధీమా వ్యక్తం చేశారు. ఎంపీ అభ్యర్థి బొత్స ఝాన్సీ మాట్లాడుతూ.. దేశంలోని ఎక్కడా లేనన్ని సంక్షేమ పథకాలను సీఎం జగన్ మన రాష్ట్రంలో ప్రవేశపెట్టి అమలు చేస్తున్నారని చెప్పారు. విశాఖపై సీఎం జగన్ ప్రత్యేక దృష్టి సారించారని.. విశాఖను మరింతగా అభివృద్ధి చేయడం కోసం వైఎస్సార్‌సీపీ అభ్యర్థులను గెలిపించాలని కోరారు. గాజువాక ఎమ్మెల్యే అభ్యర్థి, మంత్రి గుడివాడ అమర్‌నాథ్, ఎమ్మెల్యే తిప్పల నాగిరెడ్డి, మాజీ ఎమ్మెల్యే తిప్పల గురుమూర్తిరెడ్డి, మేయర్ గొలగాని హరివెంకటకుమారి, పార్టీ జిల్లా అధ్యక్షుడు కోలా గురువులు పాల్గొన్నారు.

పెమ్మసానిపై క్రిమినల్ కేసు నమోదు చేయాలి

తాడికొండ ఆర్వోకు ముస్లిం హక్కుల పరిరక్షణ సమితి ఫిర్యాదు

తాడికొండ: ముస్లింలను కించపరుస్తూ మాట్లాడిన టీడీపీ గుంటూరు ఎంపీ అభ్యర్థి పెమ్మసాని చంద్రశేఖర్‌పై చట్టపరమైన చర్యలు తీసుకుని క్రిమినల్ కేసు నమోదు చేయాలని ముస్లిం హక్కుల పరిరక్షణ సమితి రాష్ట్ర అధ్యక్షుడు షేక్ నాగుల్‌మీరా డిమాండ్ చేశారు. ఈ మేరకు ఆయన తాడికొండ ఎన్నికల రిటర్నింగ్ అధికారికి ఆన్‌లైన్‌లో ఫిర్యాదు చేశారు. ఈ విషయాన్ని రిటర్నింగ్ అధికారి బుధవారం వెల్లడించారు. ప్రపంచంలోని ముస్లింలు అంతా హీరోగా భావించే ఇరాక్ దేశ మాజీ అధ్యక్షుడు షాహీద్ సద్దాం హుస్సేన్ ఓ బంకర్‌లో దాక్కుని ఉంటే కుక్కను కొట్టినట్లు కొట్టి చంపారని పెమ్మసాని చంద్రశేఖర్ అవాస్తవాలను ప్రచారం చేయడమే కాకుండా, ఓ వర్గం ఓట్లను చీల్చడానికి ఉద్దేశపూర్వకంగా ఎన్నికల నియమావళికి విరుద్ధంగా మాట్లాడారని నాగుల్‌మీరా తన ఫిర్యాదులో పేర్కొన్నారు. ఎన్నికల నియమావళి ఉల్లంఘించి ముస్లిం జాతి మనోభావాలను కించపరిచిన పెమ్మసాని చంద్రశేఖర్‌పై చట్టపరమైన చర్యలు తీసుకుని క్రిమినల్ కేసునమోదు చేయడంతోపాటు ఇకపై ఆయన ఏ మతస్తుల మనోభావాలను కించపరిచే విధంగా ఉండకుండా చూడాలని కోరారు.

మీనాక్షినాయుడు చెవిలో 'పువ్వు'!

- ఆదోని బీజేపీ అభ్యర్థిగా పార్థసారథి
- నిర్వేదంలో మీనాక్షినాయుడు.. ఇండిపెండెంట్‌గా పోటీ చేసే యోచన!



పార్థసారథి



మీనాక్షినాయుడు


సాక్షి ప్రతినిధి కర్నూలు: ఆదోని అసెంబ్లీ సీటుపై టీడీపీ, బీజేపీ బేరసారాలు ఫలించలేదు. రూ.3 కోట్లు ఇస్తే ఆదోని సీటు వదులుకుంటామని బీజేపీ చేసిన ప్రతిపాదనకు టీడీపీ నేతలు అంగీకరించకపోవడంతో తప్పని పరిస్థితుల్లో ఆదోని నుంచి బీజేపీనే పోటీ చేయాల్సిన అనివార్య పరిస్థితి తలెత్తింది. దీంతో ఆ పార్టీ పార్థసారథిని అభ్యర్థిగా ప్రకటించింది. వాస్తవానికి 15 రోజుల ముందే ఆదోని స్థానం బీజేపీ ఖాతాలోకి చేరిందనే విషయం మీనాక్షినాయుడుకు తెలుసు. దీంతో ఆయన అనుచరులు టీడీపీ ఫ్లెక్సీలు తొలగించారు. ఈ క్రమంలో బీజేపీకి అభ్యర్థి దొరకకపోవడంతో ఆ పార్టీ నేతలు మీనాక్షి నాయుడు మేనల్లుడు మారుతి నాయుడుకు ఫోన్ చేసి రూ.3 కోట్లు ఇస్తే ఆదోని సీటు వదులుకుని, ఆలూరు కావాలనే ప్రతిపాదనను పార్టీ అధిష్టానం ముందు ఉంచుతామని ఆఫర్ ఇచ్చారు. అయితే అంత డబ్బులు ఇవ్వలేమని మీనాక్షి నాయుడు చెప్పడంతో బీజేపీ అభ్యర్థిని ప్రకటించింది.

మీనాక్షినాయుడు రాజకీయ భవితవ్యం ఎటు?

కర్నూలు జిల్లా రాజకీయాల్లో మీనాక్షినాయుడు సీనియర్ నాయకుడు. టీడీపీ ఆవిర్భావం నుంచి ఆ పార్టీలో కొనసాగుతున్నారు. ఆదోని నుంచి మూడు దఫాలు ఎమ్మెల్యేగా గెలుపొందారు. 1994, 1999, 2009లో వైఎస్సార్ ప్రభంజనంలోనూ ఆదోనిలో ఆయన విజయం సాధించారు. 1999లో కోట్ల సూర్య ప్రకాశ్‌రెడ్డిపైనా గెలుపొందారు. టీడీపీ మినహా ఇతర పార్టీల్లోకి వెళ్లాలనే ఆలోచన కూడా చేయలేదు. టీడీపీని అంటిపెట్టుకుని ఆదోనిలో పార్టీ ఉన్నతికి తోడ్పడ్డారు. చివరిసారిగా ఈ ఎన్నికల్లో పోటీ చేయాలని లేదా తన తనయుడిని బరిలో నిలపాలని ఆయన అభిలషించారు. అలాంటి వ్యక్తిని కాదని పోటీ చేసేందుకు శక్తి లేక రూ.3 కోట్లకు సీటు వదులుకునేందుకు సిద్ధమైన పార్టీకి టీడీపీ అసెంబ్లీ సీటు ఇవ్వడాన్ని మీనాక్షినాయుడు జీర్ణించుకోలేకపోతున్నారని కార్యకర్తలు చర్చించుకుంటున్నారు. ఆయనకు టీడీపీ గౌరవం ఇవ్వలేనప్పుడు ఆయన పార్టీలో ఎందుకు కొనసాగాలనే చర్చ కూడా నడుస్తోంది.

ఓటర్లు డబ్బుకు అమ్ముడుపోతారనడం బాధాకరం

మీడియా సమావేశంలో కాపు ఉద్యమనేత ముద్రగడ పద్మనాభం




కిర్లంపూడిలో ముద్రగడను కలిసిన పిఠాపురం నియోజకవర్గం ప్రజలు. చిత్రంలో కాకినాడ ఎంపీ అభ్యర్థి చలమలశెట్టి సునీల్, పిఠాపురం ఎమ్మెల్యే అభ్యర్థి గీత

కిర్లంపూడి: ఓటర్లు డబ్బులకు అమ్ముడుపోతారనేలా జనసేన అధినేత పవన్‌కళ్యాణ్ వ్యాఖ్యానించడం బాధాకరంగా ఉందని కాపు ఉద్యమ నేత, వైఎస్సార్‌సీపీ నాయకుడు ముద్రగడ పద్మనాభం అన్నారు. పిఠాపురం నియోజకవర్గం నుంచి ఎస్టీ, ఎస్సీ, బీసీ, ఓసీ, మైనార్టీలకు చెందిన నాయకులు, కార్యకర్తలు బుధవారం పెద్దఎత్తున కాకినాడ జిల్లా కిర్లంపూడిలోని ముద్రగడ స్వగృహానికి తరలివచ్చి ఆయనను, యువ నాయకుడు ముద్రగడ గిరిబాబును మర్యాదపూర్వకంగా కలిశారు. కాకినాడ వైఎస్సార్‌సీపీ ఎంపీ అభ్యర్థి చలమలశెట్టి సునీల్, పిఠాపురం నియోజకవర్గం ఎమ్మెల్యే అభ్యర్థి వంగా గీత ముద్రగడను కలిశారు. రానున్న ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీ విజయానికి తీసుకోవలసిన జాగ్రత్తలపై ఆయన వారికి దిశానిర్దేశం చేశారు. ఈ సందర్భంగా ముద్రగడ మీడియాతో మాట్లాడుతూ.. పిఠాపురం నియోజకవర్గంలోని ఒక్కో ఓటరుకు సీఎం జగన్ లక్ష ఇస్తున్నారంటూ ప్రజలను అవమానించేలా మాట్లాడడం పవన్‌కు తగదన్నారు. పవన్‌కు డబ్బు తీసుకునే జబ్బు ఉందని, ఆ జబ్బు అందరికీ ఉంటుందనుకోవడం బాధాకరమన్నారు. నియోజకవర్గ ఓటర్లు డబ్బు తీసుకునేవారా? అమ్ముడుపోయేవారమా? అని ముద్రగడ ప్రశ్నించారు. పిఠాపురం ప్రజలంతా డబ్బుకు అమ్ముడుపోతారనుకోవడం సరికాదన్నారు.

రెట్టించిన ఉత్సాహంతో పనిచేయాలి..

ఇక రాష్ట్రంలో అమలవుతున్న అనేక సంక్షేమ కార్యక్రమాలతోపాటు రాష్ట్రాభివృద్ధి సీఎం జగన్‌తోనే సాధ్యమన్నారు. రానున్న ఎన్నికల్లో సీఎం జగన్‌మోహన్‌రెడ్డిని అత్యధిక మెజార్టీతో అధికారంలోకి తీసుకురావడానికి రెట్టించిన ఉత్సాహంతో పనిచేయాలని పార్టీ శ్రేణులు, అభిమానులకు ముద్రగడ విజ్ఞప్తి చేశారు. ఆరు నెలలకోసారి వచ్చి రాజకీయాలుచేసే పవన్ కన్నా నిత్యం నియోజకవర్గం ప్రజలకు అందుబాటులో ఉండే కాకినాడ ఎంపీ అభ్యర్థి చలమలశెట్టి సునీల్‌ను, పిఠాపురం నియోజకవర్గం ఎమ్మెల్యే అభ్యర్థి వంగా గీతను అఖండ మెజార్టీతో గెలిపించాలని కోరారు. పార్టీ విజయానికి శ్రమించిన ప్రతి కార్యకర్తను గుర్తుపెట్టుకోవాలని సునీల్, గీతకు సూచించారు. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత నియోజకవర్గంలో పరిశ్రమలు నెలకొల్పి ప్రజలంతా ఆర్థికంగా బలపడేలా కృషిచేయాలని ముద్రగడ చెప్పారు. తద్వారా స్థానిక యువతకు ఉద్యోగావకాశాలు కల్పించాలన్నారు. ప్రత్తిపాడు నియోజకవర్గంలోని బీసీలు, ఎస్సీ, ఎస్టీలు, కొద్దిమంది కాపులవల్లే గతంలో తాను అధికారంలోకి వచ్చానన్నారు. నాకు రాజకీయ భిక్ష పెట్టిన ప్రత్తిపాడు నియోజకవర్గం ప్రజలను ఎప్పుడూ మరచిపోనన్నారు.



నేను ఎవరికీ ఏమీ బోధించలేను.
నేను వాళ్లను ఆలోచించేలా చేయగలనంతే.
– సోక్రటీస్

సాక్షి
గురువారం, 28 మార్చి 2024

పాలస్తీనాపై అమెరికా 'ప్రేమ'!

మన కళ్లను మనమే నమ్మలేని అరుదైన అసాధారణమైన ఉదంతాలు చరిత్రలో అప్పుడప్పుడు చోటు చేసుకుంటాయి. సోమవారం భద్రతామండలిలో జరిగిందదే. గాజాలో ఇజ్రాయెల్ దాష్టీకాన్ని నిలిపేయాలని, తక్షణం బేషరతు కాల్పుల విరమణ పాటించాలని కోరే తీర్మానంపై జరిగిన వోటింగ్‌కు అమెరికా గైర్హాజరైంది. నిరుడు అక్టోబర్‌లో హమాస్ మిలిటెంట్లు హఠాత్తుగా దాడిచేసి 1,200 మంది ఇజ్రాయెల్ పౌరులను హతమార్చి 250 మందిని బందీలుగా తీసుకుపోయారు. ఆ ఘటనలో అనేకమంది గాయాలపాలయ్యారు. ఆ సంస్థ చెరలో ఇంకా 134 మంది వరకూ వున్నారని అంచనా. ఆనాటినుంచీ ఇజ్రాయెల్ పగబట్టి గాజాలోని జనావాస ప్రాంతాలే లక్ష్యంగా క్షిపణుల వర్షం కురిపిస్తోంది. బాంబుల మోత మోగిస్తోంది. ఎడతెగని ఈ దాడుల్లో ఇంతవరకూ 32,000 మంది పాలస్తీనా పౌరులు మరణించారు. లక్షలమంది తీవ్రంగా గాయపడ్డారు. ఆకలితో అలమటిస్తున్న వారు ఆహారం తీసుకొచ్చిన వాహనాలపైకి ఎగబడినప్పుడు వారిని అదుపు చేసే పేరిట అమానుషంగా ప్రవర్తించటంతోపాటు కాల్చిచంపుతున్న ఉదంతాలకు కొదవలేదు. మంచినీరు, ఆహారం, మందుల కొరతతో పాలస్తీనా పౌరులు పడుతున్న అగచాట్లు అన్నీ ఇన్నీ కాదు. ఇజ్రాయెల్ సాగిస్తున్న నరమేధం, విధ్వంసం ఆధునిక చరిత్రలో కనీవినీ ఎరుగనివి. ఇజ్రాయెల్‌ను సమర్థించటానికి అలవాటుపడిన అమెరికా, పాశ్చాత్య దేశాలు దీన్నంతటినీ నిర్వికారంగా చూశాయి. అదేమంత విషయం కాదన్నట్టు మొదట్లో వ్యాఖ్యానించాయి. భద్రతామండలిలో ఇజ్రాయెల్‌ను అభిశంసిస్తూ ఇంతవరకూ వచ్చిన మూడు తీర్మానాలను వీటో చేశాయి. అమెరికా అధ్యక్షుడు జో బైడెన్ 'యుద్ధం సాగుతున్నప్పుడు పౌరుల మరణాలు సంభవించటం రివాజే' అని వ్యాఖ్యానిస్తే ప్రపంచవ్యాప్తంగా నిరసన వ్యక్తమైంది. ఒకపక్క ఇజ్రాయెల్‌కు ఆయుధాలు, ఇతర యుద్ధ సామగ్రి అందజేస్తూ, అంతర్జాతీయ వేదికలపై దాని దురాగతాలను సమర్థిస్తూ... మరోపక్క పౌర ప్రాంతాల విషయంలో జాగ్రత్తలు పాటించాలని ఆ దేశానికి సుద్దులు చెబుతూ అమెరికా కాలక్షేపం చేసింది. హమాస్ అంతమొందేవరకూ ఇజ్రాయెల్ దాడులు ఆగరాదనీ, అలా ఆపితే అది ఆ మిలిటెంటు సంస్థకు బలం చేకూరుస్తుందనీ వాదించింది.

అంతర్జాతీయంగానూ, స్వదేశంలోనూ వస్తున్న ఒత్తిళ్ల కారణంగా దాదాపు ఆర్నెల్లయ్యాక ఇన్నాళ్లకు ఇజ్రాయెల్‌ను వ్యతిరేకించే తీర్మానంపై వోటింగ్‌లో గైర్హాజరైంది. నిజానికి ఇది కంటి తుడుపు చర్య. ఆ తీర్మానాన్ని సమర్థించి, ప్రతీకారానికి కూడా హద్దులుంటాయని చెప్తే వేరుగా వుండేది. ఇకపై ఇజ్రాయెల్‌కు అన్ని రకాల సాయం నిలిపేస్తామని ప్రకటించివుంటే హుందాగా వుండేది. వాటన్నిటి బదులూ వోటింగ్‌కు గైర్హాజరు కావటంవల్ల పెద్దగా ఒరిగేది వుండదు. హమాస్ ఉగ్ర దాడిని ఎవరూ సమర్థించటం లేదు. దాని దుందుడుకు చేష్టలు స్వతంత్ర పాలస్తీనా లక్ష్యానికి విఘాతం కలిగిస్తాయని, రాజ్యాల అమానుష కృత్యాలకు సాధారణ పౌరులపై కక్ష తీర్చుకోవటం పరిష్కారం కాదని ప్రపంచవ్యాప్తంగా అనేక సంస్థలు దుయ్యబట్టాయి. అయితే గత ఏడు దశాబ్దాలుగా ఇజ్రాయెల్ సాగిస్తున్న దురాగతాలు తక్కువేమీ కాదు. నిజానికి పాలస్తీనా సమస్య సాకుగా ఇజ్రాయెల్‌లో జాతీయవాదాన్ని రెచ్చగొట్టి ఎన్నికల్లో పబ్బం గడుపుకోవాలన్న మితవాద పక్షాల వైఖరివల్లే పరిష్కారం జటిలంగా మారింది. పాలస్తీనా పౌరుల నిరాశానిస్పృహలే మిలిటెంటు సంస్థలకు ఊపిరులూదాయి. పాలస్తీనా మనోభావాలను బేఖాతరు చేసి ఇజ్రాయెల్ ఆవిర్భావానికి కారణమై, దాని దురాక్రమణలకు వంతపాడుతూ వచ్చిన అమెరికా, పాశ్చాత్య దేశాల వైఖరి సైతం మిలిటెంట్లకు బలం చేకూర్చింది.

భద్రతామండలి తీర్మానాన్ని అమెరికా వీటో చేయకుండా గైర్హాజరు కావటం సహజంగానే ఇజ్రాయెల్‌కు మింగుడుపడటం లేదు. ఆ దేశ ప్రధాని నెతన్యాహూ అలకబూనారు. జో బైడెన్‌తో చర్చల కోసం వాషింగ్టన్ వెళ్లబోతున్న ఉన్నత స్థాయి ప్రతినిధి బృందం పర్యటనను చివరి నిమిషంలో రద్దుచేశారు. చరిత్ర తిరగేస్తే ప్రతి మలుపులోనూ ఇజ్రాయెల్‌కు అమెరికా అండగా నిలబడిన సంగతి కనబడుతుంది. దాని అకృత్యాలను తక్కువచేసి చూపడం లేదా మూర్ఖంగా సమర్థించటం కళ్లకు కడుతుంది. అదే సమయంలో ప్రతి సందర్భంలోనూ అమెరికా హితవచనాలను ఇజ్రాయెల్ బేఖాతరు చేయటం కూడా తేటతెల్లమవుతుంది. ఈ యేడాది అమెరికా అధ్యక్ష ఎన్నికలుండటం, ఇజ్రాయెల్ సేనలు నిరాటంకంగా ఊచకోతను కొనసాగించటం బైడెన్‌కు ఇబ్బందిగా మారింది. ఒకపక్క ఇజ్రాయెల్‌కు అన్నివిధాలా సాయపడుతూ కూడా దాన్ని కించిత్తు కూడా ప్రభావితం చేయలేని బైడెన్ తీరు ఆయన బలహీనతను ప్రస్ఫుటం చేసింది. ఇదంతా చివరకు తన విజయావకాశాలను దెబ్బతీసేలా వున్నదని ఆయన గ్రహించారు. పర్యవసానంగా భద్రతామండలిలో భిన్నమైన వైఖరి తీసుకున్నారు. ఇది తమ విధానానికి అనుగుణంగానే వున్నదని అమెరికా చెబుతున్నా ఇజ్రాయెల్ స్పందననుబట్టే నిజానిజాలేమిటో గ్రహించవచ్చు. ఏదేమైనా భద్రతామండలి తీర్మానం ఆశించిన విధంగా గాజాలో తక్షణం కాల్పుల విరమణ అమల్లోకి రావాలి. రంజాన్ మాసం పూర్తయ్యే వరకూ ఇది అమల్లోవుండాలని తీర్మానం కాంక్షిస్తున్నా ఈ కాలంలో ఉద్రిక్తతలు ఉపశమిస్తే... బందీల విడుదల జరిగితే అది శాంతికి దోహదపడుతుంది. ఆ పరిణామం సమస్య శాశ్వత పరిష్కారానికి దారితీస్తే అంతకన్నా కావలసిందేముంది? ఇజ్రాయెల్ మంకుపట్టు విడనాడాలి. గాజాలో హంతక దాడులకు స్వస్తి చెప్పాలి. తన సైన్యం చేసిన దురాగతాలపై విచారణకు అంగీకరించాలి.

గ్రహం అనుగ్రహం

శ్రీ శోభకృత్ నామ సంవత్సరం, ఉత్తరాయణం, శిశిర ఋతువు ఫాల్గుణ మాసం, **తిథి:** బ.తదియ సా.4.29 వరకు, తదుపరి చవితి, **నక్షత్రం:** స్వాతి సా.4.31 వరకు, తదుపరి విశాఖ, **వర్జ్యం:** రా.10.28 నుండి 12.08 వరకు, **దుర్ముహూర్తం:** ఉ.10.03 నుండి 10.51 వరకు తదుపరి ప.2.57 నుండి 3.45 వరకు, **అమృతఘడియలు:** ఉ.7.02 నుండి 8.43 వరకు.

సూర్యోదయం : 6.01
సూర్యాస్తమయం: 6.08
రాహుకాలం : ప.1.30 నుండి 3.00 వరకు
యమగండం : ఉ.6.00 నుండి 7.30 వరకు

సాటి లేని సామాజిక న్యాయం

అభిప్రాయం



ఆర్. కృష్ణయ్య

తాజాగా వైఎస్సార్‌సీపీ ప్రకటించిన లోక్‌సభ స్థానాల్లో 11 బీసీలకు కేటాయించారు; అలాగే 59 ఎమ్మెల్యే స్థానాలను కేటాయించారు. ఎస్సీ, ఎస్టీ, బీసీలకు కలిపి 100 ఎమ్మెల్యే సీట్లను ఇచ్చారు. బీసీ, ఎస్సీ, ఎస్టీలు ముఖ్యమంత్రిగా ఉన్న రాష్ట్రాలలో కూడా ఇంతటి ప్రాతినిధ్యం వారికి లభించలేదు. బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనారిటీ వర్గాలకు అధికారంలో, బడ్జెటులో, సంపదలో, గౌరవంలో, విద్యా, ఉద్యోగాలలో జనాభా కంటే ఎక్కువ వాటా యిచ్చి సామాజిక న్యాయం కల్పించిన చరిత్ర పురుషుడు జగన్. అంతేగాకుండా, వివిధ విద్యా పథకాల ద్వారా ప్రజలను విద్యావంతులను చేస్తూ, వారు శాశ్వతంగా అభివృద్ధి చెందేలా చూస్తున్నారు. ఇది జగన్‌కు జనం పట్ల ఉన్న నిబద్ధత, అంకితభావాన్ని చాటుతుంది.

ఆంధ్రప్రదేశ్‌లో గత 71 సంవత్సరాల కాలంలో ఏ ముఖ్యమంత్రి కూడా బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనారిటీల అభివృద్ధికి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డిలాగా ఇంత పెద్ద ఎత్తున చర్యలు తీసుకోలేదు. ఆ కులాల అభివృద్ధిలో జగన్ దేశంలోనే నంబర్ వన్ స్థానంలో ఉన్నారంటే అతిశయోక్తి కాదు.

పార్లమెంటులో బీసీ బిల్లు పెట్టి, చట్టసభలలో బీసీలకు 50 శాతం రిజర్వేషన్లు కల్పించాలని పార్లమెంటు చరిత్రను తిరగరాశారు. వైసీపీ రెండేళ్ల క్రితమే రాజ్యసభలో బీసీలకు చట్టసభల్లో 50 శాతం రిజర్వేషన్లు కల్పించాలని బీసీ బిల్లు పెట్టి, దీనికి 14 రాజకీయ పార్టీల మద్దతు కూడగట్టింది. అధికార బీజేపీ వ్యతిరేకించడంతో బిల్లు పెండింగ్‌లో పడింది. విశేషం ఏమిటంటే, గత 75 సంవత్సరాల భారత దేశ చరిత్రలో ఏ రాజకీయ పార్టీ కూడా పార్లమెంటులో ఈ బిల్లు పెట్టలేదు. చివరకు బీసీ పార్టీలుగా చలామణి అవుతున్న డీఎంకే, అన్నా డీఎంకే, పీఎంకే, ఆర్జేడీ, సమాజ్‌వాదీ, అప్నా దళ్, జనతాదళ్ కూడా ఈ బిల్లు పెట్ట లేదు.

చారిత్రక ఘట్టం

ఇటీవల 18 ఎమ్మెల్సీ పదవులు ఇస్తే, అందులో 11 సీట్లు బీసీలకు కేటాయిస్తే దేశంలోని బీసీలందరూ ఆశ్చర్య పోయారు. గత ఏప్రిల్ 11న చేపట్టిన మంత్రివర్గ పునర్ వ్యవస్థీకరణలో 25 మందితో కూడిన మంత్రివర్గంలో ఏకంగా 17 పదవులను (70 శాతం)... ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీ వర్గాలకే అవకాశం కల్పించడం ద్వారా సరికొత్త సామాజిక మహావిప్లవాన్ని జగన్ ఆవిష్కరించారు. అందులో బీసీ, మైనారిటీలకు 11 పదవులు ఇచ్చారు. ఐదుగురికి డిప్యూటీ సీఎం పదవులు ఇస్తే... నాలుగు (80 శాతం) ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీలకే ఇచ్చారు. దేశ చరిత్రలో ఒక రాష్ట్ర హోంమంత్రిగా ఎస్సీ మహిళను నియమించడం ఇదే ప్రథమం. నామినేటెడ్ పోస్టులలో 50 శాతం స్థానాలను వెనుకబడిన వర్గాలకు కల్పిస్తూ, అలాగే కాంట్రాక్టు పనులలో 50 శాతం కోటా ఇస్తూ అసెంబ్లీలో చట్టం చేసి దేశంలోని ఎస్సీ, ఎస్టీ, బీసీ ముఖ్యమంత్రులకు సవాల్ విసిరారు.

56 బీసీ కులాల కోసం ఏర్పాటుచేసిన కార్పొరేషన్లకు 56 చైర్మన్లు, 672 డైరెక్టర్‌లలో మొత్తం 100 శాతం పోస్టులు బీసీలకు కేటాయించారు. 193 కార్పొరేషన్లలో బీసీలకు 109 కార్పొరేషన్ చైర్మన్ పదవులు దక్కడం చూసి ప్రతిపక్ష రాజకీయ పార్టీలకు దిమ్మతిరిగింది. నామినేటెడ్ పదవులలో 50 శాతానికి చట్టం చేయడమే కాదు; అమలులో 70 శాతం పదవులు ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీలకు ఇచ్చి ఈ వర్గాలలో అచంచల విశ్వాసం చూరగొన్నారు. దీని మూలంగా ఈ కులాలలో ఆత్మవిశ్వాసం, ధైర్యం పెరిగాయి. తరతరాలుగా పేరుకుపోయిన భావదాస్యం పోయి, నాయకత్వ లక్షణాలు పెరిగాయి. వేష భాషలు, నడవడి, సంస్కృతి మూలంగా సమగ్రంగా మారి ఆధునీకరణ చెందుతారు.



సామాజిక న్యాయంలో మేటి: ఏపీ సీఎం వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి

రాజ్యసభలో మొత్తం 9 మంది వైసీపీ సభ్యులుంటే... అందులో నలుగురు బీసీలు, ఒకరు ఎస్సీ. శాసనసభ స్పీకర్‌గా బీసీ వర్గానికి చెందిన తమ్మినేని సీతారాం ఎన్నికయ్యేలా చొరవ తీసుకున్నారు. మండలి చైర్మన్‌గా ఎస్సీ వర్గానికి చెందిన కొయ్యే మోషేన్ రాజుకూ, మండలి డిప్యూటీ చైర్‌పర్సన్‌గా మైనారిటీ మహిళ జకియా ఖానంకు అవకాశం కల్పించారు. స్థానిక సంస్థలలో బీసీ రిజర్వేషన్లను 34 నుంచి 24 శాతానికి సుప్రీంకోర్టు తగ్గిస్తే, పార్టీ పరంగా అదనంగా 20 శాతం కలిపి, మొత్తం 44 శాతం స్థానాలకు పైగా బీసీలకు ఇచ్చి తన చిత్తశుద్ధి నిరూపించుకున్నారు జగన్. జిల్లా పరిషత్ ఎన్నికల్లో మొత్తం 13 జిల్లా పరిషత్‌లను వైసీపీ గెలవగా, అందులో తొమ్మిది పదవులను (70 శాతం) ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీలకే కేటాయించారు. మండల పరిషత్ ఎన్నికల్లో, వైసీపీ 635 మండల పరిషత్ అధ్యక్ష పదవులను గెలిస్తే, అందులో ఈ వర్గాలకు 442 స్థానాలు కేటాయించారు(67 శాతం). 13 మున్సిపల్ కార్పొరేషన్లలో, 92 శాతం మేయర్ పదవులు ఈ వర్గాల వారికే ఇచ్చారు. 196 వ్యవసాయ మార్కెటింగ్ కమిటీ (ఏఎంసీ) చైర్మన్ పదవుల్లో 60 శాతం వీరికే కేటాయించారు. గ్రామ – వార్డు సచివాలయాల్లో ఇచ్చిన శాశ్వత ఉద్యోగాలు దాదాపు 1.30 లక్షలు. వీటిలో 83 శాతం ఈ వర్గాలవారే. ఈ 57 నెలల్లోనే మరో 2.70 లక్షల వలంటీర్ ఉద్యోగాలు, మిగిలిన ఉద్యోగాలు కలుపుకొని 6.03 లక్షల ఉద్యోగాలు కొత్తగా వచ్చాయి. ఇందులోనూ 75 శాతం వాటా ఈ వర్గాలదే.

దీర్ఘ దృష్టి

విద్య ద్వారానే బలహీన వర్గాలు అభివృద్ధి చెందుతాయనీ, వారికి గౌరవం పెరుగుతుందనీ దానికి అత్యంత ప్రాధాన్యత ఇస్తు న్నారు జగన్. అన్ని పాఠశాలల్లో ఇంగ్లిష్ మీడియం ప్రవేశపెట్టారు. అమ్మఒడి పథకం కింద ఒకటి నుంచి పదవ తరగతి వరకు 15,000 రూపాయలు ఇస్తున్నారు. దీని వలన ప్రతి ఒక్కరు చదువుకుంటు న్నారు. కాలేజీ కోర్సులు చదివే విద్యార్థులకు ప్రతి సంవత్సరం 20 వేల రూపాయల స్కాలర్‌షిప్ ఇస్తున్నారు. ఇంజినీరింగ్, మెడిసిన్, ఫార్మసీ తదితర ఉన్నత చదువులు చదివే ఎస్సీ, ఎస్టీ, బీసీ విద్యార్థులకు పూర్తి ఫీజులను ఇచ్చేటట్లు జీవోలు జారీ చేశారు.

పాలకులు ఓట్లు వస్తాయనే ఆశతో జనాకర్షక పథకాలు పెడతారు. దీర్ఘకాలంలో సమాజ శ్రేయస్సు ఎలా సాధ్యమవుతుందని ఆలోచించరు. కానీ జగన్ వివిధ విద్యా పథకాల ద్వారా ప్రజలను విద్యావంతులను చేస్తూ, వారు శాశ్వతంగా అభివృద్ధి చెందేలా చూస్తున్నారు. తమ కాళ్లపై తాము నిలబడే విధంగా ముందు చూపుతో, విజన్‌తో ఈ పథకాలను ప్రవేశపెట్టడం చారిత్రాత్మకం. ఇది జగన్‌కు ప్రజల పట్ల ఉన్న నిబద్ధత, అంకితభావాన్ని చాటుతుంది. ఉన్నత విద్య వలన జ్ఞాన సమాజం ఏర్పడుతుంది. సమాజంలో ప్రతి పౌరుడు సభ్యతతో, సంస్కారంతో, ఉన్నత జీవన ప్రమాణాలతో జీవిస్తాడు. దీని మూలంగా వైద్యం, ఆరోగ్యంపై పెట్టే బడ్జెట్ తగ్గుతుంది. శాంతిభద్రతలు కూడా చక్కగా ఉండటంతో పోలీసు శాఖపై పెట్టే ఖర్చు తగ్గుతుంది. ఇలా ఒకదానితో ఒకటి ముడిపడి, ప్రత్యక్షంగా, పరోక్షంగా సమాజంలో విప్లవాత్మకమైన మార్పులు వస్తాయి.

ఒక తరపు పెట్టుబడి

ఇంజినీరింగ్, ఇతర పీజీ కోర్సులు, మెడిసిన్ చదివేవారు విదేశాలకు వెళ్లి, ముఖ్యంగా అమెరికా, ఇంగ్లాండ్, కెనడా, ఆస్ట్రేలియా, జర్మనీ, ఆఫ్రికా, యూరోపియన్, గల్ఫ్ దేశాల్లో ఉద్యోగం లేదా ఉపాధి పొందుతున్నారు. దీని మూలంగా దేశానికి, రాష్ట్రానికి విదేశ మారక ద్రవ్యం లభిస్తుంది. ఇది రాష్ట్ర అభివృద్ధికి చేయూతనిస్తుంది. చదువు ద్వారా పొందిన జ్ఞానంతో ఆధునిక వ్యవసాయం చేస్తే అధిక ఉత్పత్తి సాధించడానికి వీలు కలుగుతుంది. దీనిమూలంగా ఆ యా కుటుంబాలు అభివృద్ధి చెందుతాయి. సమాజ కోణంలో చూస్తే, ఒకసారి ఒక కుటుంబం ఉన్నత చదువులు చదివితే, సమాజంలో సామాజిక, ఆర్థిక అసమానతలు తొలగిపోతాయి. ఆ కుటుంబం ప్రభుత్వ రాయితీల కోసం ఎదురుచూసే పరిస్థితి ఉండదు. ఆదాయం పెరగడం మూలంగా ప్రభుత్వ సంక్షేమ పథకాలు, ముఖ్యంగా సబ్సిడీ బియ్యం, వృద్ధాప్య పింఛన్లు, గృహ నిర్మాణ పథకాలపై ప్రభుత్వానికి భారం తగ్గుతుంది. పదేళ్లలో 40 శాతం, మరో పదేళ్లలో మరో 50 శాతం, మొత్తంగా 20 ఏళ్లలో 90 శాతం మంది సబ్సిడీ పథకాలు వద్దనే స్థాయికి చేరిపోతారు. వీటిపై ప్రభుత్వం ఖర్చు చేస్తున్న బడ్జెట్‌లో 90 శాతం తగ్గిపోతుంది. ఒక తరంపై ఖర్చుపెడితే రెండవ తరానికి ఈ విద్యా పథకం స్కీముల అవసరం ఉండదు. పేదరికం ఉండదు. రాష్ట్రం సర్వతోముఖాభివృద్ధి సాధిస్తుంది.

వ్యాసకర్త పార్లమెంటు సభ్యులు (రాజ్యసభ); జాతీయ బీసీ సంక్షేమ సంఘం అధ్యక్షులు । 90000 09164

సోషల్ నెట్ వర్కింగ్ వెబ్‌సైట్లు ఫేస్‌బుక్, ట్విట్టర్‌లలో సెలబ్రిటీల 'మనసులోని మాట'లు తాజాగా ఇలా...!

సోషల్ మీడియా

ఎందుకీ ఆసక్తి?



అవినీతి ఆరోపణల మీద విచారణను ఎదుర్కొన్న మొదటి ముఖ్యమంత్రి అరవింద్ కేజ్రీవాల్ ఏమీకారు. అలాంటప్పుడు ఈ ఒక్క కేసు విషయంలో ఉన్నట్టుండి యునైటెడ్ స్టేట్స్, జర్మనీ ఎందుకు అంత ఆసక్తి చూపుతున్నాయి?

– సునంద వశిష్ఠ్, కాలమిస్ట్

జవాబు ఉందా?



పాకిస్తాన్‌లోని నా సోర్సులు నిజమే అయితే, పాకిస్తాన్‌కు చైనా గట్టి కోటింగ్ ఇవ్వనుంది. ఐదుగురు(కొందరు 6 అంటున్నారు) చైనీస్ ఇంజనీర్లు చనిపోయారు; కానీ 'ప్రపంచంలోనే నంబర్ వన్ ఆర్మీ', 'ప్రపంచంలోనే నంబర్ వన్ గూఢచర్య సంస్థ'లకు ఇసుమంత ఆచూకీ లేదు. చైనా వాళ్లు ఆచరణాత్మక జీవులు. 'యూదులు, హిందువుల కుట్ర' అని దులిపేసుకుంటే నమ్మరు. వాళ్లకు నిజమైన జవాబులు కావాలి.

– గౌరవ్ ఆర్యా, ఆర్మీ మేజర్ (రిటైర్డ్)

అడగకూడదా?



గాజాలో జరుగుతున్నది భయానకమైనది. యుద్ధాన్ని ఆపాలని ఇజ్రాయెల్ మీద అంతర్జాతీయ ఒత్తిడి ఉన్నది. రోజురోజుకూ అది పెరుగుతోంది కూడా. కానీ బందీలుగా పట్టుకున్నవారిని విడుదల చేయాలని హమాస్ మీద అలాంటి ఒత్తిడి ఎందుకు పెద్దగా లేదు?

– తవ్లీన్ సింగ్, కాలమిస్ట్

అసలు శక్తి



నా కడుపు(గట్) బాగయ్యాక, నా ఆందోళన తగ్గింది. నా కడుపు బాగయ్యాక మంచి నిద్ర పడుతోంది. నా కడుపు బాగయ్యాక నా చర్మం మెరుగైంది. కడుపు అనేది జీవశక్తికి అతి కీలకం. ఇందులో నాకు సందేహమే లేదు.

– జాన్ కాన్‌స్టాస్, మెడికల్ యాక్టివిస్ట్

సాహస బాలుడు



మాస్కో తీవ్రవాద దాడి సమయంలో ఒక పదిహేనేళ్ల ముస్లిం బాలుడు (కిర్గిజ్‌స్తానీ అయిన ఇస్లామ్ ఖలీలోవ్) సుమారు 100 మంది ప్రాణాలు కాపాడి, రియల్ హీరో అవార్డు పొందాడు. తీవ్రవాదానికీ, హింసకూ మతంతో సంబంధం లేదని నమ్మడానికి మరో కారణం ఇది.

– అభిషేక్ గోయల్, వ్యాఖ్యాత

చక్కెర రూపాలు



బెల్లం చక్కెర. మిశ్రీ (పటిక బెల్లం) చక్కెర. తేనె చక్కెర. చక్కెర చక్కెర. తేడాలు ఏమీ లేవు. టీలో బెల్లం వేసుకున్నా, ఓట్‌మీల్‌లో తేనె కలుపుకున్నా... మీరు చక్కెరకు దూరంగా లేనట్టే. మీరు అదే స్థాయి చక్కెరను, అదేస్థాయి క్యాలరీలను తీసుకుంటున్నారు. అసలు సమస్య వీటిని తినడంలో కన్నా, వీటిని తింటూ చక్కెరకు దూరంగా ఉంటున్నామని అనుకోవడంలో ఉంది.

– చిరాగ్ బడ్‌జాత్యా, ఫిట్‌నెస్ నిపుణుడు

ఇదా ప్రజాస్వామ్యం?



నేను ఆమ్ ఆద్మీ పార్టీ మద్దతుదారుణ్ని కాను. కానీ ఒక భారత పౌరుడిగా అడుగుతున్నా: ప్రజాస్వామ్య బద్ధంగా ఎన్నికైన ఢిల్లీ ఉపముఖ్యమంత్రి మనీశ్ సిసోడియా విచారణ లేకుండా, దోషిగా తేలకుండా ఏడాదిగా ఎందుకు అరెస్టయి ఉన్నారు? లోక్‌సభ ఎన్నికల ప్రకటన వెలువడ్డాక ఇప్పుడు ముఖ్యమంత్రి కేజ్రీవాల్ అరెస్టయ్యారు. ఎందుకు?

– సుధీంద్ర కులకర్ణి, పొలిటికల్ యాక్టివిస్ట్

వైజ్ఞానిక వేగుచుక్కలు

మహిళారోగ్యానికి ఆధునిక వైద్య పునాది

ఆధునిక భారతదేశ వైద్య విజ్ఞాన ప్రస్థానంలో ఒక కీలకమైన మలుపు వంటి సంఘటన 1885 ఆగస్టులో సంభవించింది. అదేమిటంటే 'డఫ్రిన్ ఫండ్' ఏర్పాటు. దీని పూర్తి పేరు 'నేషనల్ అసోసియేషన్ ఫర్ సప్లైఆఫ్ ఫిమేల్ మెడికల్ ఎయిడ్స్ టు ఉమెన్ ఆఫ్ ఇండియా'. ఇది ఏర్పడటంతో భారతీయ మహిళలు కూడా డాక్టర్స్, హాస్పిటల్ అసిస్టెంట్స్, నర్సులు, మిడ్‌వైఫ్స్‌గా విద్య పొంది, శిక్షణ గడించడానికి ఉపకార వేతనాలు లభించాయి. అంతేకాకుండా ఈ సేవలను మరింత విస్తృత పరుస్తూ హాస్పిటల్స్‌లో స్త్రీలకు సంబంధించిన విభాగాలను అదనంగా నిర్మించడం కూడా మొదలైంది. అయితే ఇది సాకారం కావడానికి పన్నా సంస్థానపు రాజ దంపతులు, క్రైస్తవ మిషనరీ ఎలిజబెత్ బెయిల్బే, ఇంగ్లాండు విక్టోరియా రాణి కారకులుగా చెప్పుకోవాలి.

ఇప్పటి మధ్యప్రదేశ్‌లోని పన్నా జిల్లాయే 'పన్నా సంస్థానం'గా ఉండేది. 1870లో మహారాజా రుద్ర ప్రతాప్ సింగ్ పన్నా సంస్థానపు అధినాయకుడయ్యారు. తన మహారాణికి అనారోగ్యం కలగడంతో లాహోర్‌లో ఉన్న ఎలిజబెత్ బెయిల్బేకు చికిత్స చేయాలని కబురు పంపారు. ఆమె పన్నా వచ్చి మహారాణి ఆరోగ్యాన్ని బాగుచేసింది. రాజ దంపతులు సంతసించి శిక్షణ కోసం లండన్ వెళుతున్న ఎలిజబెత్‌కు విక్టోరియా మహారాణికి స్వయంగా అందజేయమని లాకెట్‌లో పెట్టిన ఓ వినతి పత్రాన్ని ఇచ్చారు. లండన్‌లో మేరీ స్కార్లిబ్‌తో సహా శిక్షణ పూర్తి అయ్యాక, మళ్లీ ఇండియా రాబోయే ముందు క్వీన్ విక్టోరియాను కలిసి పన్నా రాజదంపతుల వినతిపత్రాన్ని అందించింది ఆమె.

భారతదేశంలో స్త్రీలు అనారోగ్యం కలిగినప్పుడు ఎటువంటి స్థాయిలో ఇబ్బందులు పడుతున్నారో చెబుతూ దానికి తరుణోపాయం గురించి ఆలోచించవలసిందిగా విక్టోరియా రాణిని ఆ వినతిపత్రంలో రాజదంపతులు కోరారు. దాంతో విక్టోరియా రాణి, భారత మహిళల పట్ల తనకు ఎంతో సానుభూతి ఉందనీ, వారి అనారోగ్యానికి వీలైనంత త్వరగా పరిష్కారం చూడాలని అప్పటి వైస్రాయ్ లార్డ్ డఫ్రిన్ భార్య లేడీ హేరియట్ డఫ్రిన్‌కు సూచన చేశారు. ఆ సూచన ఫలితమే 1885 ఆగస్టులో 'డఫ్రిన్ ఫండ్' ఏర్పాటు. దీంతో బ్రిటన్, ఆస్ట్రేలియా, కెనడా, అమెరికా దేశాల నుంచి బాగా విద్యావంతులైన మిషనరీ డాక్టర్లు భారతదేశానికి వైద్యం చేయడానికి రావడం మొదలైంది. ఇక్కడ ఉండే ఆసుపత్రుల్లో ఉన్నత స్థానాలతో పాటు సమాజంలో విశేష గౌరవాన్ని కూడా పొందారు వారు. అంతేకాకుండా వైద్య వృత్తిలో స్థానిక మహిళలను తీర్చిదిద్దే అవకాశం కూడా భారత్‌లో ఈ మహిళా మణులకు దొరికింది.

– డా॥ నాగసూరి వేణుగోపాల్, ఆకాశవాణి మాజీ ఉన్నతాధికారి । 94407 32392

ఎప్పుడో తేవాల్సిన చట్టం

అభిప్రాయం



ఉల్లి బాల రంగయ్య

భారతీయ జనతా పార్టీ దేశ భద్రతను దృష్టిలో ఉంచుకొని ఎలాంటి చట్టం చేసినా, మోదీ వ్యతిరేకులూ, ప్రతిపక్షాల వాళ్లు నానా యాగీ చేయడం పరిపాటి అయింది. భారత ఉపఖండంలో భాగాలుగా ఉండి, భారతీయ సంస్కృతి గొడుగు కింద వందల సంవత్సరాలు కొన సాగిన అఫ్గానిస్తాన్, పాకిస్తాన్, బంగ్లాదేశ్‌లు స్వతంత్ర ఇస్లామిక్ దేశాలుగా రూపాంతరం చెందడంతో ఆ ప్రాంతాలలో మైనారిటీలైన హిందువులు, క్రైస్తవులు, సిక్కులు, బౌద్ధులు, జైనులు, పారసీకులు అనేక అఘాయిత్యాలకు గురికావడం అనేది చరిత్ర చెబుతున్న సాక్ష్యం. ఆ యా దేశాలలో బాధలు భరించలేక శరణార్థులుగా పారిపోయి వచ్చిన వారికి పౌరసత్వం ఇవ్వడానికి మోదీ ప్రభుత్వం ఉదాత్తమైన ఆలోచనతో పౌరసత్వ సవరణ చట్టం (సీఏఏ) రూపొందించిందని ఈ దేశంలోని విజ్ఞులందరి అభిప్రాయం.

అయితే ఈ చట్టం ముస్లింల విషయంలో మత వివక్ష చూపుతోందనీ, రాజ్యాంగంలోని 14వ నిబంధనకు ఇది వ్యతిరేకమనీ ప్రతిపక్షాల వారి ఆరోపణ. వాస్తవంగా భారత రాజ్యాంగం ఈ దేశ పౌరుల పట్ల ఎటువంటి వివక్ష చూపలేదు. పర్షియా(నేడు అది ఇరాన్) నుండి పారిపోయి వచ్చిన పారసీకులను, ఇజ్రాయిల్ నుండి పారిపోయి వచ్చిన యూదులను ఈ సమాజం ఆదరించింది. అక్రమంగా చొరబడిన వారికి రాజ్యాంగంలోని 14వ నిబంధన వర్తిస్తుందా? మయన్మార్, బంగ్లాదేశ్, పాకిస్తాన్ దేశాల నుండి అక్రమంగా చొరబడిన ముస్లింలకు సైతం ఈ దేశ పౌరసత్వం ఇవ్వాలని ప్రతిపక్షాల వారి ఆకాంక్ష.

ముస్లిం ఓటు బ్యాంకు రాజకీయాలు నడిపే కమ్యూనిస్టులు, కాంగ్రెస్ వాళ్లు అక్రమ చొరబాటుదారులకు చాలా చోట్ల రేషన్ కార్డులు, ఆధార కార్డులు, ఓటర్ కార్డులు ఇప్పించి ఘనకార్యాన్ని సాధించి పెట్టారు. 32 సంవత్సరాలు పశ్చిమ బెంగాల్లో కమ్యూనిస్టులు అధికారం వెలగ పెట్టడం వెనుక దాగి ఉన్న రహస్యం ఇదే! కాంగ్రెస్ పార్టీలో పుట్టి పెరిగి, ప్రత్యేక పార్టీని పెట్టి కమ్యూనిస్టులను మట్టి కరిపించి, అధికారం చేపట్టిన మమతా బెనర్జీకి అక్రమ చొరబాటుదారుల ఓట్లే గెలుపుకు ప్రధాన సాధనంగా మారినాయి. పౌరసత్వ సవరణ చట్టం అంటేనే చిర్రెత్తిపోయేది అందుకే మరి!

అక్రమ చొరబాటుదారులకు ప్రపంచంలో ఏ దేశం కూడా పౌరసత్వం ఇవ్వదు. ఇక శరణార్థుల విషయంలో ఐక్యరాజ్యసమితి ఏర్పాటుచేసిన ఒప్పందంపై సంతకం చేసిన విషయంలో మాత్రమే ఆ యా దేశాలు కొంత సానుకూలతతో ఉంటాయి. మన దేశం ఆ ఒప్పందం పరిధిలోకి రాదు. దేశభద్రత, సమగ్రత, సమైక్యతల విషయంలో తేడాలు వస్తే – శరణార్థులకు పౌరసత్వం ఇవ్వడం కాదు నిర్దాక్షిణ్యంగా వెళ్లగొట్టేందుకు కూడా ఆ యా దేశాల ప్రభుత్వాలకు హక్కు ఉంటుంది. అఫ్గాన్ శరణార్థుల పట్ల పాక్, పాలస్తీనా శరణార్థుల పట్ల ఈజిప్టు ఎలా నిర్దాక్షిణ్యంగా వ్యవహరించాయో ఇటీవలి ఉదాహరణలే.

భారత ఉపఖండం నుంచి విడిపోయి, ఇస్లామిక్ మత రాజ్యాలుగా మారిన దేశాల్లోని ముస్లిమేతరులకు భారతదేశం ఎప్పుడో ఆశ్రయం కల్పించి ఉండవలసింది. ఈ మహత్కార్యాన్ని కాంగ్రెస్ ప్రభుత్వం చేసి ఉండవలసింది. కానీ ఆ ప్రభుత్వం ఆ పని చేయలేదు. కారణం ఈ దేశ ముస్లింల గంప గుత్త ఓట్లు. మోదీ ప్రభుత్వం ఈ పనిని చేసి, హిందువుల మనసుల్లో శాశ్వతమైన ముద్రను సంపాదించుకుంది. ఈ చట్టాన్ని ఎవరు అడ్డుకోవాలని ప్రయత్నించినా – వారి ఉనికి భవిష్యత్తులో ప్రశ్నార్థకమే అవుతుంది.


వ్యాసకర్త సామాజిక విశ్లేషకులు

ఆత్మజ్ఞానాన్ని బోధించువాడే గురువు

ఆత్మజ్ఞానమును బోధించునట్టి సద్గురువు కృపవలననే భక్తుడు ఆత్మానుభవమును పొందగలడు. అజ్ఞానమును తొలగించి ఆత్మజ్ఞానాన్ని బోధించువాడే గురువు. మనకు ఆత్మ జ్ఞానం లేకపోవుట వలనే బాధలు, అవస్థలు, కష్టాలు కలుగుచున్నవి. ఎవరైతే తన గురించి తాను తెలుసుకుంటారో అట్టి వారికి గురువు అజ్ఞానాన్ని దూరం చేయగలరు.

ఆధ్యాత్మిక మార్గమునందు ప్రగతిని సాధించుటకు సద్గురు సాంగత్యం చాలా ముఖ్యమైనది. ఇట్టి సాంగత్యమునే 'సత్సంగము' అని అంటారు. సద్గురువు అనగా కేవలము భౌతిక శరీరము కాదు, కాని ఆయన సమస్త జీవమునకు మూలాధారమైన నిరాకార తత్త్వం.

దత్తబోధ



గణపతి సచ్చిదానందస్వామి

దేశ, కాలాల బంధములు సద్గురువుకు ఉండవు. సద్గురువు వీటన్నిటికీ అతీతుడు. సద్గురువుతో సాంగత్యము అనగా ఎల్లప్పుడు ఆయనను అంటిపెట్టుకొని ఉండుటని అర్థము కాదు. ప్రతి భక్తుడు తన స్వభావమునకు సరిపోవు మార్గాన్ని అనుసరించ వలయును.

ఉదాహరణకు ఒక ప్రత్యేకమైన చిత్రపటమును దగ్గరలో ఉంచుకొనుటవలన కానీ, ఆయన (గురువు) రచనలు కానీ, లేక జీవిత చరిత్ర, బోధనల గ్రంథములను చదువుటవలన కానీ, లేక ఆయనతోగల గత అనుభవమును జ్ఞప్తికి తెచ్చుకొనుట వలన కానీ సద్గురువుతో సంబంధమును స్థిరపరచుకొనవచ్చు. ఇవి కొన్ని ఉపయోగకరమైన పద్ధతులు. ఎల్లప్పుడూ సద్గురువు సాంగత్యముతోనే మనలోని 'అహం' సులభంగా తొలగుతుంది. చివరిగా ఆత్మానందమును కూడా అనుభవించగలం.

సద్గురువు ఒక అద్దము లాంటివాడు. సామాన్యముగా మామూలు అద్దమునందు నీవు నీ ముఖమును చూచుకొనవచ్చును. అలాగే నీ ఇష్టము వచ్చినట్లు అలంకరించుకొనవచ్చును. ఇట్టి అద్దము నీ శారీరక అవసరములను తీర్చుకొనుటకు ఉపయోగపడును. సద్గురువనే అద్దము నీ యొక్క ఆంతరంగిక వ్యక్తిత్వమును ప్రతిబింబింపజేయును. అందువలన నీలో దాగియున్న ప్రకృతి బహిర్గతం చేయబడును. దాని ఫలితముగా నిన్ను నీవు తెలిసుకొనగలవు. నిత్య జీవితమునందు నీ వేషం, అలంకరణను చూచుకొనుటకు మామూలు అద్దమును ఉపయోగించినట్లు, సద్గురువు అనెడి అద్దమును ఉపయోగించి మనం మనలో దాగియున్న ఆంతరంగిక ప్రకృతిని కనుగొనవలెను. ఆత్మ సంబంధమైన విషయమందు ఈ పద్ధతి మనకు సద్గురువుతో ఆధ్యాత్మిక సంబంధము ఏర్పరచుకొనుటకు చక్కగా తోడ్పడుతుంది.

క్లుప్తంగా...

హైకోర్టు సాక్షిగా తేలిపోయిన ఈనాడు అసత్య ఆరోపణలు

సాక్షి, అమరావతి: 'సాక్షి' దినపత్రిక తన సర్క్యులేషన్ పెంచుకునేందుకు అధికార దుర్వినియోగానికి పాల్పడుతోందంటూ 'ఈనాడు' అడ్డగోలుగా చేస్తూ వచ్చిన ఆరోపణలు అసత్యమని ఢిల్లీ హైకోర్టు సాక్షిగా తేలిపోయాయి. వలంటీర్లు విస్తృత సర్క్యులేషన్ కలిగిన ఏ దినపత్రికనైనా కొనుగోలు చేయవచ్చంటూ ప్రభుత్వం జీవో జారీ చేయగా దీనివల్ల సాక్షి సర్క్యులేషన్ అమాంతం పెరిగిపోయిందంటూ ఈనాడు ప్రమాణపూర్వకంగా చెప్పిన మాటలు, శుద్ధ అబద్ధమని ఆడిట్ బ్యూరో ఆఫ్ సర్క్యులేషన్ (ఏబీసీ) ఢిల్లీ హైకోర్టుకు సమర్పించిన గణాంకాలు వెల్లడించాయి. ప్రభుత్వ జీవో వల్ల సాక్షి నిజంగానే లబ్ధి పొంది ఉంటే ఆ పత్రిక సర్క్యులేషన్ మిమ్మల్ని దాటిపోయి ఉండాలి కదా? మరి ఏబీసీ గణాంకాలు మరో రకంగా ఉన్నాయి కదా? అంటూ హైకోర్టు ధర్మాసనం సూటిగా సంధించిన ప్రశ్నలకు ఈనాడు వద్ద సమాధానమే లేకుండా పోయింది. సాక్షి సర్క్యులేషన్ విషయంలో తన ఆరోపణల్లో నిజం లేదని తేలడంతో చేసేదేమీ లేక ఈనాడు వెనక్కి తగ్గింది. హైకోర్టు సైతం సాక్షి సర్క్యులేషన్ గణాంకాలను ప్రచురించేందుకు అనుమతినిచ్చింది. దీంతో చేసేదేమీ లేక సాక్షి సర్క్యులేషన్ గణాంకాలను ప్రచురించకుండా ఏబీసీని నిరోధించాలంటూ దాఖలు చేసిన అనుబంధ వ్యాజ్యాన్ని ఈనాడు ఉపసంహరించుకుంది. విస్తృత సర్క్యులేషన్ ఉన్న ఏ దినపత్రికనైనా కొనుక్కునేందుకు వలంటీర్లకు అనుమతినిస్తూ ప్రభుత్వం జారీ చేసిన జీవోను సవాలు చేస్తూ ఈనాడు దాఖలు చేసిన ప్రధాన వ్యాజ్యంలో తదుపరి విచారణను ఏప్రిల్ 25కి వాయిదా వేసింది. ఈ మేరకు ఢిల్లీ హైకోర్టు తాత్కాలిక ప్రధాన న్యాయమూర్తి (ఏసీజే) జస్టిస్ మన్మోహన్, న్యాయమూర్తి జస్టిస్ మన్మీత్ ప్రీతమ్ సింగ్ ఆరోరా ధర్మాసనం బుధవారం ఉత్తర్వులు జారీ చేసింది.

ఆంధ్రజ్యోతిపై పరువు నష్టం కేసు మే 1కి వాయిదా

- కేసు వాదించడానికి హాజరైన సుబ్రహ్మణ్యస్వామి




తిరుపతి లీగల్: ఆంధ్ర జ్యోతి పత్రికపై టీటీడీ దాఖలు చేసిన రూ.100 కోట్ల పరువు నష్టం దావా కేసును మే 1కి వాయిదా వేసినట్లు రాజ్యసభ మాజీ సభ్యుడు సుబ్రహ్మణ్యస్వామి తెలిపారు. బుధవారం ఈ కేసు వాయిదా ఉండడంతో ఆయన తిరుపతి పదవ అదనపు జిల్లా జడ్జి కోర్టుకు వచ్చి టీటీడీ తరఫున వాదనలు వినిపించారు. టీటీడీ తరఫున జేఈవో సాక్ష్యం ఇవ్వడానికి అనుమతించాలని ఇదివరకు దాఖలు చేసిన పత్రాలను కోర్టు స్వీకరించాలని వాదించారు. ఆంధ్రజ్యోతి తరఫు న్యాయవాది టీటీడీ తరఫున జేఈవో సాక్ష్యం ఇవ్వడానికి వీలు లేదంటూ వాదనలు వినిపించారు. తిరిగి పిటిషన్లపై వాదనలు వినిపించడానికి న్యాయవాదులు వాయిదా కోరడంతో కేసును మే 1కి జడ్జి వాయిదా వేశారు. సుబ్రహ్మణ్యస్వామి కోర్టు వెలుపల మీడియాతో మాట్లాడుతూ.. కేసు విచారణ 6 నెలల్లో పూర్తయ్యే అవకాశాలు ఉన్నాయన్నారు. శ్రీవారి భక్తుల మనోభావాలు దెబ్బతినేలా టీటీడీ పరువుకు భంగం వాటిల్లేలా ఆంధ్రజ్యోతి పత్రిక 2019 డిసెంబర్ 1న ప్రచురించిన కథనంపై టీటీడీ కేసు దాఖలు చేసిన విషయం తెలిసిందే.

బర్డ్ ఆస్పత్రికి కృత్రిమ అవయవాల తయారీ యంత్రాలు



తిరుపతి తుడా: తిరుపతిలోని బర్డ్ ఆస్పత్రికి రూ.కోటి విలువైన అత్యాధునిక కృత్రిమ అవయవాల తయారీ యంత్రాలను సేలంకు చెందిన దాత బాల సుబ్రహ్మణ్యం బుధవారం విరాళంగా ఇచ్చారు. ఆస్పత్రిలో పూజలు నిర్వహించి ప్రత్యేకాధికారి డాక్టర్ రాచపల్లి రెడ్డప్పరెడ్డితో కలిసి దాత బాల సుబ్రహ్మణ్యం ఈ యంత్రాల కేంద్రాన్ని ప్రారంభించారు. రోగులకు మెరుగైన సేవలు అందించడానికి ఇవి దోహదం చేస్తాయని బర్డ్ ప్రత్యేకాధికారి తెలిపారు.

220 మంది ఏపీఎస్పీఎఫ్ సిబ్బందికి కంటి పరీక్షలు



సాక్షి, అమరావతి: రాష్ట్ర సచివాలయంలోని 220 మందికిపైగా ఏపీఎస్పీఎఫ్ అధికారులు, సిబ్బందికి విజయవాడకు చెందిన అగర్వాల్ ఐ హాస్పిటల్ వైద్య బృందం బుధవారం ఉచితంగా కంటి పరీక్షలు నిర్వహించింది. దృష్టిలోపం ఉన్న వారికి మెరుగైన చికిత్సకు సిఫార్సు చేసింది. ఏపీఎస్పీఎఫ్ డీజీ డాక్టర్ త్రివిక్రమ వర్మ ఆదేశాల మేరకు ఈ శిబిరం నిర్వహించినట్లు ఐజీ బీవీ రామిరెడ్డి తెలిపారు. ఈ కార్యక్రమంలో ఏపీఎస్పీఎఫ్ కమాండెంట్ ఎం.శంకర్రావు, ఏపీ సెక్రటేరియట్ చీఫ్ సెక్యూరిటీ ఆఫీసర్ కె.కృష్ణమూర్తి తదితరులు పాల్గొన్నారు.

తాళపత్రాల్లోని విజ్ఞానం భావితరాలకు అందాలి

- పురాతన న్యాయశాస్త్ర గ్రంథాల్లో విలువైన సమాచారం
- తాళపత్రాల డిజిటలైజేషన్, పరిశోధనలు అభినందనీయం
- వేదిక్ వర్సిటీలో సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ డీవై చంద్రచూడ్



తాళపత్ర గ్రంథాలను పరిశీలిస్తున్న సీజేఐ జస్టిస్ డీవై చంద్రచూడ్ దంపతులు

తిరుపతి సిటీ/తిరుమల: తాళపత్ర గ్రంథాల్లోని విజ్ఞానాన్ని భావితరాలకు అందించాల్సిన అవసరం ఉందని సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ డీవై చంద్రచూడ్ అభిప్రాయపడ్డారు. తిరుపతిలో టీటీడీ ఆధ్వర్యంలో నడుస్తున్న ఎస్వీ వేదిక్ యూనివర్సిటీని బుధవారం ఆయన సందర్శించి తాళపత్ర గ్రంథాలను పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ వేల సంవత్సరాల పూర్వం మహర్షులు, రుషులు, మేధావులు అపారమైన విజ్ఞానాన్ని, శాస్త్ర సాంకేతిక అంశాలను తాళపత్రాల్లో లిఖించారన్నారు. అటువంటి విజ్ఞానాన్ని సంరక్షించి, పరిశోధనలు చేసి భావితరాలకు అందించాల్సిన బాధ్యత మనందరిపై ఉందన్నారు. వేదిక్ వర్సిటీలో తాళపత్ర గ్రంథాల సంరక్షణ, డిజిటలైజేషన్ చేయడం ప్రశంసనీయమన్నారు. పురాతన న్యాయ శాస్త్ర గ్రంథాల్లో చాలా విలువైన సమాచారం ఉందని జస్టిస్ చంద్రచూడ్ పేర్కొన్నారు. పురాతన నాగరికతలో న్యాయశాస్త్ర విద్యాభ్యాసం, న్యాయవ్యవస్థల సమాచారం తాళపత్రాల్లో ఉండటం విశేషమన్నారు. దేశవ్యాప్తంగా ఉన్న తాళపత్ర గ్రంథాలను సంరక్షించి, పరిశోధనలు, ప్రచురణలు చేయాల్సిన అవసరం ఉందన్నారు. టీటీడీ ఆధ్వర్యంలో వేదిక్ వర్సిటీ నడవడం, తాళపత్ర గ్రంథాల పరిరక్షణకు పెద్దపీట వేయడం శుభపరిణామమన్నారు. అనంతరం ఏపీ హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ ధీరజ్ సింగ్ ఠాకూర్‌తో కలసి ఆయన వర్సిటీలోని వేద, వేదాంగ, ఆగమ, పురాణ, ఇతిహాస, న్యాయ శాస్త్ర తాళపత్రగ్రంథాల సంరక్షణ, డిజిటలైజేషన్ ప్రక్రియను, ప్రచురణను పరిశీలించారు. అనంతరం వర్సిటీ, టీటీడీ అధికారులు సీజే దంపతులను, హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి దంపతులను ఘనంగా సన్మానించారు.



తిరుమల ఆలయంలో ధ్వజస్తంభానికి మొక్కుతున్న సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ డీవై చంద్రచూడ్



పెద్ద శేష వాహనం వద్ద సుప్రీంకోర్టు సీజేఐ జస్టిస్ డీవై చంద్రచూడ్ దంపతులతో ఏపీ హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి ధీరజ్ సింగ్ ఠాకూర్ దంపతులు

శ్రీవారి సేవలో సుప్రీం కోర్టు ప్రధాన న్యాయమూర్తి

సుప్రీం కోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ డీవై చంద్రచూడ్, ఏపీ హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ ధీరజ్‌సింగ్ ఠాకూర్ బుధవారం తిరుమల శ్రీవారిని దర్శించుకున్నారు. ఉదయం ఆలయం వద్దకు చేరుకున్న సుప్రీం కోర్ట్, హైకోర్ట్ ప్రధాన న్యాయమూర్తులకు టీటీడీ ఆలయ అర్చకులు సాంప్రదాయబద్ధంగా స్వాగతం పలికారు. దర్శనానంతరం రంగనాయకుల మండపంలో వేద పండితులు వేదాశీర్వచనం చేశారు. అధికారులు శ్రీవారి చిత్రపటం, తీర్థప్రసాదాలు, డైరీ, క్యాలెండర్ అందజేశారు.

సీజేఐని కలిసిన టీటీడీ చైర్మన్

సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ డీవై చంద్రచూడ్‌ను, ఏపీ హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ ధీరజ్ సింగ్ ఠాకూర్‌ను టీటీడీ చైర్మన్ భూమన కరుణాకర రెడ్డి మర్యాదపూర్వకంగా కలిశారు. అనంతరం తిరుమల పుష్పగిరి మఠంలో జరిగిన మధ్యప్రదేశ్ హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ దుప్పల వెంకటరమణ కుమారుడు భాను ప్రకాష్ వివాహానికి టీటీడీ చైర్మన్ హాజరై నూతన దంపతులను ఆశీర్వదించారు.

ముక్కంటి సేవలో రాష్ట్ర హైకోర్టు సీజే ఠాకూర్



గురుదక్షిణామూర్తి సన్నిధిలో హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి ధీరజ్ సింగ్ ఠాకూర్ దంపతులు

శ్రీకాళహస్తి(తిరుపతి జిల్లా): శ్రీజ్ఞానప్రసూనాంబ సమేత శ్రీకాళహస్తీశ్వరస్వామిని రాష్ట్ర హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ ధీరజ్ సింగ్ ఠాకూర్ కుటుంబ సమేతంగా బుధవారం దర్శించుకున్నారు. దక్షిణ గోపురం వద్ద ఆయనకు ఆలయ ఈవో ఎస్వీ నాగేశ్వరరావు సాంప్రదాయబద్ధంగా స్వాగతం పలికారు. ప్రత్యేక దర్శన ఏర్పాట్లు చేశారు. దర్శనానంతరం గురుదక్షిణామూర్తి సన్నిధిలో వేద పండితులు వేద ఆశీర్వచనం పలుకగా, అధికారులు స్వామివార్ల జ్ఞాపిక, ప్రసాదాలు అందజేశారు.

శ్రీవారి సేవలో అలహాబాద్ హైకోర్టు న్యాయమూర్తి

సినీ నటుడు రామ్‌చరణ్ దంపతులు కూడా..

తిరుమల: తిరుమల శ్రీవారిని తెలంగాణ గవర్నర్ సీపీ రాధాకృష్ణన్, అలహాబాద్ హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ డి.రమేష్, సినీ నటుడు రామ్‌చరణ్ దంపతులు దర్శించుకున్నారు. వీరికి ఆలయ అధికారులు ప్రత్యేక దర్శనం ఏర్పాట్లు చేశారు. శ్రీవారి దర్శనం అనంతరం ఆలయ రంగనాయకుల మండపంలో పండితులు వేద ఆశీర్వచనాలు అందించగా.. టీటీడీ అధికారులు లడ్డూ ప్రసాదాలతో ఘనంగా సత్కరించారు. శ్రీవారిని దర్శించుకున్నవారిలో బాలీవుడ్ నిర్మాత ఏక్తా కపూర్, సినీ నటి హసానంద్ వసుంధర (అనిత), జార్ఖండ్ మాజీ సీఎం బాబూలాల్ మారండి, టీటీడీ మాజీ ఈవో సాంబశివరావు తదితరులు ఉన్నారు.



తిరుమల ఆలయం వెలుపల అలహాబాద్ హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ డి.రమేష్



తిరుమల ఆలయం వద్ద సినీ నటుడు రామ్‌చరణ్ దంపతులు

సింహగిరిపై శ్రీసుదర్శన నారసింహ మహాయజ్ఞం ప్రారంభం

- ఏప్రిల్ 1న మహా పూర్ణాహుతితో పరిసమాప్తం
- హాజరైన శ్రీశారదాపీఠాధిపతి స్వరూపానందేంద్ర సరస్వతి



పూర్ణాహుతి కార్యక్రమంలో స్వరూపానందేంద్ర సరస్వతి, స్వాత్మానందేంద్ర సరస్వతి

సింహాచలం: సింహగిరిపై శ్రీసుదర్శన నారసింహ మహాయజ్ఞం బుధవారం ఘనంగా ప్రారంభమైంది. ఉదయం సుప్రభాత సేవ, యాగశాల మూర్తి ఆరాధన, శాంతిపాఠం, గోపూజ, అగ్నిమథనం, అగ్నిప్రతిష్ఠాపనం, కుంభా వాహనం, మండలా వాహనం, ధ్వజావరోహణం నిర్వహించారు. అనంతరం యజ్ఞాన్ని ప్రారంభించారు. మధ్యాహ్నం 12 గంటల సమయంలో పూర్ణాహుతి నిర్వహించారు. విశాఖ శ్రీశారదాపీఠాధిపతులు స్వరూపానందేంద్ర సరస్వతి, స్వాత్మానందేంద్ర సరస్వతి పూర్ణాహుతి కార్యక్రమంలో పాల్గొన్నారు. యాగశాలలో వేంజేసిన స్వామివారి ఉత్సవమూర్తులు గోవిందరాజస్వామి, శ్రీదేవి,భూదేవిల చెంతన... సుదర్శన పెరుమాళ్ల చెంతన రామాయణం, భాగవతం, విష్ణు పురాణం, నృసింహ సహస్రనామం, దివ్యప్రబంధ పారాయణం, క్షేత్ర మహత్యం, సుదర్శన శతకం పారాయణాలను వైదికులు పఠించారు. సుమారు వందమంది ఉభయదాతలు తొలిరోజు యజ్ఞం కార్యక్రమంలో పాల్గొన్నారు. ఏప్రిల్ 1వ తేదీన జరిగే మహా పూర్ణాహుతితో యజ్ఞం పరిసమాప్తమవుతుంది. దేవస్థానం స్థానాచార్యులు టి.పి.రాజగోపాల్, ప్రధానార్చకులు గొడవర్తి శ్రీనివాసాచార్యులు, పురోహిత్ అలంకారి కరి సీతారామాచార్యులు యజ్ఞాన్ని నిర్వహించారు. సింహాచలం దేవస్థానం ఈవో ఎస్.శ్రీనివాసమూర్తి ఆధ్వర్యంలో ఏర్పాట్లు చేశారు. సింహాచలం క్షేత్రంలో సుదర్శన నారసింహ మహాయజ్ఞం నిర్వహించడం చాలా గొప్ప కార్యక్రమమని ఈ సందర్భంగా స్వరూపానందేంద్ర సరస్వతి అనుగ్రహ భాషణం చేశారు.

నిరంతర విద్యుత్ సరఫరా

- ఎక్కడా అంతరాయం కలగకూడదు
- విద్యుత్ సరఫరాపై ఫిర్యాదుల కోసం టోల్ ఫ్రీ నంబర్ 1912
- వీటిపై సకాలంలో స్పందించి చర్యలు తీసుకోండి
- అధికారులకు ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కెఎస్ జవహర్‌రెడ్డి ఆదేశం

సాక్షి, అమరావతి: వేసవితో పాటు విద్యార్థులకు పరీక్షల సమయం దృష్ట్యా రాష్ట్రంలో ఎక్కడా విద్యుత్ సరఫరాలో అంతరాయం కలగకుండా అవసరమైన చర్యలు తీసుకోవాలని ఇంధన శాఖ అధికారులను ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి(సీఎస్) డా.కెఎస్.జవహర్‌రెడ్డి ఆదేశించారు. బుధవారం రాష్ట్ర సచివాలయంలో ఇంధన శాఖ అధికారులతో ఆయన సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా సీఎస్ మాట్లాడుతూ.. 'గ్రామీణ, పట్టణ ప్రాంతాల్లో ఎక్కడా గృహ విద్యుత్ సరఫరాలో అంతరాయం కలగకూడదు. నిరంతర విద్యుత్ సరఫరా అందించాలి. ముఖ్యంగా విద్యుత్ వల్ల మంచినీటి సరఫరా పథకాలకు ఇబ్బంది కలగకూడదు. వ్యవసాయానికి 9 గంటలు ఉచిత విద్యుత్ సరఫరాలో ఎలాంటి ఆటంకం లేకుండా చూడాలి. విద్యుత్ పంపిణీ సంస్థలు లోడ్ మానిటరింగ్ సెల్‌ల ద్వారా ఎప్పటికప్పుడు పరిస్థితిని పర్యవేక్షించాలి. విద్యుత్ సరఫరాలో అంతరాయంతో పాటు ఇతర ఫిర్యాదుల కోసం ఏర్పాటు చేసిన టోల్ ఫ్రీ నంబరు 1912ను ప్రజలు వినియోగించుకునేలా అవగాహన కల్పించాలి. వినియోగదారుల ఫిర్యాదులపై అధికారులు సకాలంలో స్పందించి చర్యలు తీసుకోవాలి. విద్యుత్ సంబంధిత ప్రమాదాల నివారణకు ప్రజలకు పెద్దఎత్తున అవగాహన కల్పించాలి' అని సీఎస్ ఆదేశించారు. అనంతరం విద్యుత్ పంపిణీ సంస్థల వారీగా వివిధ అంశాలపై సీఎస్ సమీక్షించారు. విద్యుత్ సరఫరాకు సంబంధించి మీడియాలో వచ్చే నెగిటివ్ కథనాలపై తీసుకుంటున్న చర్యలపై నివేదిక సమర్పించాలని రాష్ట్ర ఇంధనశాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి కె.విజయానంద్‌ను సీఎస్ ఆదేశించారు. అనంతరం రాష్ట్రంలోని విద్యుత్ సరఫరా పరిస్థితులు, పర్యవేక్షణ గురించి సీఎస్‌కు విజయానంద్ వివరించారు. ఎక్కడైనా సరఫరాలో సమస్య తలెత్తితే వెంటనే పరిష్కరిస్తున్నట్లు చెప్పారు. సమావేశంలో ఉన్నతాధికారులు భాస్కర్‌రెడ్డి, సంతోష్‌రావు, పృథ్వీ తేజ్, సౌరవ్ గౌర్, కేవీవీ సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

విజయవాడ రైల్వే డివిజన్ సరికొత్త రికార్డు

సాక్షి, అమరావతి: 2023–24 ఆర్థిక సంవత్సరంలో సరుకు రవాణా ద్వారా రికార్డుస్థాయిలో రూ.3,975కోట్ల రాబడి సాధించి విజయవాడ రైల్వే డివిజన్ సరికొత్త రికార్డు సృష్టించింది. ఏకంగా 36.2 మిలియన్ టన్నుల సరుకు రవాణా చేయగలిగింది. ఇప్పటివరకు 2018–19లో సాధించిన రూ.3,875 కోట్లే విజయవాడ రైల్వే డివిజన్‌లో సాధించిన అత్యధిక ఆదాయంగా ఉంది. అంతకంటే ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో ఎనిమిది శాతం అధికంగా రాబడి సాధించింది. 2023–24లో నెలకు సగటున రూ.331కోట్ల రాబడి సాధించింది. విజయవాడ రైల్వే డివిజన్ సరుకు రవాణాలో కృష్ణపట్నం, కాకినాడ పోర్టులు మొదటి రెండు స్థానాల్లో నిలిచాయి. ఇక రవాణా చేసిన సరుకుల్లో బొగ్గుదే సింహభాగం. ప్రస్తుత ఆర్థికసంవత్సరంలో 19.36 మిలియన్ టన్నుల బొగ్గు, 6.68 మిలియన్ టన్నుల ఎరువులు రవాణా చేసింది. త్వరలోనే విజయవాడ రైల్వే డివిజన్ వార్షిక ఆదాయం రూ.4వేల కోట్ల మైలురాయిని దాటే సూచనలున్నాయి. సరుకు రవాణాకు కొత్తగా 15 అధునాతన గూడ్స్ షెడ్లు నిర్మించాలని నిర్ణయించింది. అందుకోసం రూ.153 కోట్లతో ప్రతిపాదనలను ఆమోదించింది.

ప్యాకేజింగ్‌లోనే డ్రగ్స్ కలిశాయా?

- బ్రెజిల్ నుంచి ట్రావెలింగ్ మ్యాప్‌పై ఆరా తీస్తున్న సీబీఐ
- రెండు రోజులు ఆలస్యంగా ఎందుకొచ్చింది?
- కొలంబో మార్గంలో ఏమైనా సీల్ టాంపరింగ్ జరిగిందా?
- సంధ్య ఆక్వా ప్రతినిధుల కాల్ డేటా క్షుణ్ణంగా పరిశీలన
- సంస్థ దిగుమతి చేసుకున్న ఫీడ్ ఫైల్స్ వివరాల సేకరణ



సాక్షి, విశాఖపట్నం: విశాఖ డ్రగ్స్ రాకెట్ చిక్కుముడిని విప్పేందుకు కేంద్ర దర్యాప్తు సంస్థ సీబీఐ విచారణను వేగవంతం చేసింది. బ్రెజిల్ శాంటోస్ పోర్టు నుంచి బయలుదేరిన నౌక ట్రావెలింగ్ మ్యాప్ వివరాలను పిన్ టు పిన్ సేకరించే పనిలో సీబీఐ నిమగ్నమైంది. రావాల్సిన సమయం కంటే రెండు రోజులు ఆలస్యంగా ఎందుకు వచ్చిందనే కోణంలోనూ దర్యాప్తు చేస్తున్నారు. సంధ్య ఆక్వా సంస్థ గతంలో చేసుకున్న దిగుమతుల వివరాలను కూడా నిశితంగా పరిశీలిస్తోంది. బ్రెజిల్ నుంచి డ్రైఈస్ట్ కొనుగోలు చేసినట్లు చెబుతుండటంతో అక్కడి నుంచే పరిశోధించేందుకు దర్యాప్తు బృందాలు వెళ్లినట్లు తెలుస్తోంది.

పది రోజుల ప్రయాణం..

అసలు ప్యాకేజింగ్‌లోనే డ్రగ్స్ కలిశాయా? లేదా మార్గమధ్యంలో చేరాయా? అనే కోణంలోనూ దర్యాప్తు మొదలైంది. బ్రెజిల్ నుంచి బయలుదేరిన నౌక విశాఖకు రెండు రోజులు ఆలస్యంగా వచ్చిందని సంధ్య ఆక్వా సంస్థ ప్రతినిధులు చెబుతున్నారు. సాధారణంగా బ్రెజిల్ నుంచి విశాఖ పోర్టుకు కంటైనర్ షిప్ వచ్చేందుకు 7 నుంచి 8 రోజుల సమయం పడుతుంది. కానీ ఈ షిప్ 10 రోజులకు విశాఖ చేరుకుంది. అందుకు గల కారణాలేమిటనే అంశాలను అన్వేషిస్తున్నారు.

ఆ రెండు పోర్టులకు ఎందుకు వెళ్లలేదు?

ఓషన్ నెట్‌వర్క్ ఎక్స్‌ప్రెస్ ఆధ్వర్యంలో డ్రైఈస్ట్‌తో కూడిన కంటైనర్ కార్గో జిన్ లియాన్ యంగ్ గ్యాంగ్ కార్గో షిప్ హెచ్‌హెచ్ఎల్ఏ కంటైనర్ టెర్మినల్ నుంచి మార్చి 6వ తేదీ మధ్యాహ్నం 12.10 గంటలకు బయలుదేరింది. అక్కడి నుంచి షెడ్యూలింగ్ ప్రకారం ఈజిప్టులోని డామిట్టా కంటైనర్ టెర్మినల్‌కు, ఆ తర్వాత సూయజ్ కెనాల్‌లో బెర్తింగ్ కావాల్సి ఉంది. అయితే ఆ రెండు పోర్టులకు వెళ్లకుండా 'స్కిప్ కాలింగ్' చేశారు. నౌక నేరుగా మార్చి 9వతేదీ సాయంత్రం 4 గంటలకు బెల్జియంలోని ఆంట్‌వెర్ప్ గేట్‌వేకు చేరుకోగా అర్ధరాత్రి 1.03 గంటలకు బెర్తింగ్ ఇచ్చారు. 10వతేదీ రాత్రి 9.43 గంటలకు నౌక తిరిగి అక్కడి నుంచి బయల్దేరింది. డాట్లాంటిక్‌లోని సీఎస్ఎం టెర్మినల్‌కు 11వ తేదీ వేకువ జామున 4 గంటలకు చేరుకుని 12వ తేదీ సాయంత్రం 4.35 గంటలకు బయల్దేరింది. అక్కడి నుంచి కొలంబో పోర్టుకు 13వ తేదీ మధ్యాహ్నం 3.30 గంటలకు చేరుకోగా రాత్రి 10.27 గంటలకు తిరిగి బయల్దేరింది. విశాఖ కంటైనర్ టెర్మినల్‌లోని టెర్మినల్–2కి 16వతేదీ సాయంత్రం 5.30 గంటలకు వచ్చింది. అదే రోజు రాత్రి 8.55 గంటలకు నౌకకు బెర్తింగ్ ఇచ్చారు.

కొలంబో నుంచి నిర్ణీత సమయంలోనే..

కొలంబో నుంచి విశాఖ వచ్చేందుకు నౌకలకు 3 రోజుల సమయం పడుతుంది. అంటే ఆ నౌక నిర్ణీత సమయంలోనే చేరుకుంది. మరి బ్రెజిల్ నుంచి కొలంబో వచ్చే మార్గంలో సీల్ టాంపరింగ్ ఏమైనా జరిగిందా? అనే కోణంలోనూ సీబీఐ దర్యాప్తు చేస్తోంది. రెండు పోర్టులకు వెళ్లకుండా నౌకను ఎందుకు దారి మళ్లించారనే విషయంపైనా ఆరా తీస్తున్నారు. రెండు పోర్టులకు వెళ్లకుండా నేరుగా వచ్చినప్పుడు రెండు రోజులు ఎందుకు ఆలస్యమైందనే అంశంపై సమాచారాన్ని సేకరిస్తున్నారు.

బ్రెజిల్‌కు బృందాలు..

సంధ్యా ఆక్వా సంస్థ ప్రతినిధుల కాల్‌డేటాని విశ్లేషిస్తున్న సీబీఐ బృందం ఎవరెవరికి కాల్స్ వెళ్లాయి? ఏ ప్రాంతాలకు వెళ్లాయి? అనే సమాచారాన్ని ఇప్పటికే సేకరించి ఫోన్ నంబర్ల ఆధారంగా వివరాలు సేకరించేందుకు రెండు బృందాలను ఏర్పాటు చేసింది. బ్రెజిల్‌లో డ్రైఈస్ట్ ఆర్డర్ చేసిన సంస్థ దగ్గర నుంచి శాంటోస్, బెల్జియం, డాట్లాంటిక్, కొలంబో పోర్టులకు వెళ్లి షిప్ బెర్తింగ్ సమయంలో నిక్షిప్తమైన సీసీ టీవీ ఫుటేజీని సేకరించాలని భావిస్తున్నారు. ఇందుకోసం మరో బృందాన్ని పంపనున్నట్లు సమాచారం. గతంలో సంధ్య ఆక్వా సంస్థ దిగుమతి చేసుకున్న కార్గో వివరాలు, సరుకు ఆర్డర్లు తదితర రికార్డులను స్వాధీనం చేసుకుని విశ్లేషిస్తున్నారు. ఇదిలా ఉండగా డ్రగ్స్ అవశేషాలతో వచ్చిన కంటైనర్‌ని విశాఖ కంటైనర్ టెర్మినల్‌లోనే భద్రపరిచారు.

హత్య చేసింది 'తమ్ముడే'

- నల్లమాడ హత్య కేసు ఛేదించిన పోలీసులు
- హత్యలో రాజకీయ కోణం లేదని స్పష్టీకరణ
- వివాహేతర సంబంధమే హత్యకు కారణం
- ఏ1 ముద్దాయిగా టీడీపీ కార్యకర్త శ్రీనివాసరెడ్డి
- మీడియాకు వివరాలు వెల్లడించిన ఎస్పీ మాధవరెడ్డి



ముద్దాయి దుద్దుకుంట శ్రీనివాసరెడ్డి (ఫైల్)

సాక్షి, పుట్టపర్తి: ఎన్నికల వేళ తెలుగుదేశం పార్టీ నేతలు శవ రాజకీయాలు చేయాలని చూస్తున్నారు. వ్యక్తిగత కక్షలతో హత్య జరిగినా.. రాజకీయ రంగు పూసి సానుభూతి కోసం వెంపర్లాడుతున్నారు. టీడీపీ కార్యకర్తలే హత్య చేసినా.. బురద మాత్రం అధికారపార్టీపై వేసి లేనిపోని రాద్ధాంతం చేస్తున్నారు. చివరకు అసలు విషయం తెలియడంతో ప్రజల్లో అభాసుపాలు అవుతున్నారు. శ్రీ సత్యసాయి జిల్లా పుట్టపర్తి నియోజకవర్గం నల్లమాడ మండలం కుటాలపల్లిలో జరిగిన హత్య విషయంలోనూ టీడీపీ నేతల దుష్ప్రచారం బట్టబయలైంది. కుటాలపల్లిలో ఈ నెల 24వ తేదీ రాత్రి 11 గంటల సమయంలో దుద్దుకుంట అమరనాథ్‌రెడ్డి (40) అనే వ్యక్తి హత్యకు గురయ్యాడు. వ్యక్తిగత కక్షలతోనే హత్య జరిగినట్లు అదే రోజున పోలీసులు ప్రాథమికంగా నిర్ధారించారు. అదేమీ పట్టించుకోకుండా మాజీ మంత్రి పల్లె రఘునాథరెడ్డి శవ రాజకీయానికి తెర లేపారు. దానిని రాజకీయ హత్యగా చిత్రీకరించే ప్రయత్నం చేశారు. పల్లె రఘునాథరెడ్డితో పాటు చంద్రబాబు, అచ్చెన్నాయుడు సైతం అసత్య ప్రచారం చేశారు. ఈ హత్య ఘటనపై శ్రీసత్యసాయి జిల్లా ఎస్పీ మాధవరెడ్డి ఆధ్వర్యంలో ప్రత్యేక పోలీసు బృందాలు రంగంలోకి దిగి.. నిందితులను అరెస్టు చేశాయి. వివాహేతర సంబంధం కారణంగానే దుద్దుకుంట అమరనాథ్‌రెడ్డి హత్య జరిగిందని, ఇందులో ఎలాంటి రాజకీయమూ లేదని ఎస్పీ మాధవరెడ్డి బుధవారం మీడియాకు వెల్లడించారు. అమరనాథ్‌రెడ్డి సమీప బంధువైన దుద్దుకుంట శ్రీనివాసరెడ్డి ఈ హత్య చేశారని వెల్లడించారు. అతనితో పాటు నిందితులుగా ఉన్న గుండ్రా వీరారెడ్డి, మల్లెల వినోద్‌కుమార్, రమావత్ తిప్పేబాయిలను అరెస్టు చేసి రిమాండ్‌కు పంపించామని తెలిపారు.

నిందితుడు టీడీపీ కార్యకర్త

దుద్దుకుంట అమరనాథ్‌రెడ్డి హత్య కేసులో ప్రధాన నిందితుడు అయిన దుద్దుకుంట శ్రీనివాసరెడ్డి కొన్నేళ్లుగా టీడీపీలో కొనసాగుతున్నాడు. పార్టీ కార్యక్రమాల్లో చురుగ్గా పాల్గొనేవాడు. గతంలో కూడా కుటాలపల్లిలో చిన్న చిన్న ఘర్షణల్లో అతడు నిందితుడిగా ఉన్నాడు. ఇవన్నీ తెలిసినా కూడా పల్లె రఘునాథరెడ్డి అధికార పార్టీ వైపు కేసును తోసే ప్రయత్నం చేశారు. అయితే పోలీసులు రంగంలోకి దిగడంతో వాస్తవాలు వెలుగు చూశాయి. ఎన్నికల సమయంలో రాజకీయ లబ్ధి పొందాలని టీడీపీ పెద్దలు చేసిన కుట్రలను చూసి స్థానికులు మండిపడుతున్నారు.

హత్యకు కారణాలివీ..

కుటాలపల్లికి చెందిన తిప్పేబాయితో కొన్నేళ్లుగా దుద్దుకుంట శ్రీనివాసరెడ్డి వివాహేతర సంబంధం కొనసాగిస్తున్నాడు. అయితే ఇటీవలి కాలంలో అమరనాథ్‌రెడ్డితో ఆమె సన్నిహితంగా ఉండటాన్ని జీర్ణించుకోలేని శ్రీనివాసరెడ్డి ఆమెను ప్రశ్నించాడు. తనకు ఆర్థిక సాయం చేశాడు కాబట్టి అతన్ని వదలలేనని తేల్చి చెప్పింది. దీంతో అమరనాథ్‌రెడ్డిని చంపేయడానికి శ్రీనివాసరెడ్డి పథకం రచించాడు. తనకు సన్నిహితంగా ఉండే వీరారెడ్డితో పాటు చైన్ స్నాచింగ్ కేసుల్లో జైలు జీవితం అనుభవించి బయటకు వచ్చిన మల్లెల వినోద్‌కుమార్ సాయం కోరాడు. గత ఆదివారం రాత్రి అమరనాథ్‌రెడ్డి పొలం వద్దకు వెళ్లగా.. మల్బరీ ఆకులు కోసే కత్తితో మెడ, ముఖం, తలపై నరికి చంపేశారు. మరుసటి రోజు ఉదయమే పోలీసులు నిందితులను అదుపులోకి తీసుకుని విచారణ చేపట్టగా.. వివాహేతర సంబంధం కారణంగానే హత్య చేసినట్లు ప్రాథమికంగా తేలింది.

విశాఖ ఎయిర్‌పోర్ట్ నుంచి కొత్త సర్వీసులు

సాక్షి, విశాఖపట్నం: విశాఖపట్నం అంతర్జాతీయ విమానాశ్రయం నుంచి కొత్తగా నాలుగు విమాన సర్వీసులు ప్రారంభం కానున్నాయి. వీటిలో రెండు అంతర్జాతీయ, రెండు దేశీయ విమాన సర్వీసులు ఉన్నాయి. వేసవి షెడ్యూల్‌లో భాగంగా అక్టోబర్ 26 వరకు ఈ సర్వీసులు నడపనున్నారు. దేశీయ (డొమెస్టిక్) సర్వీసుల్లో ఈ నెల 31 నుంచి విశాఖ–ఢిల్లీ మధ్య ఎయిరిండియా, విశాఖ– హైదరాబాద్ మధ్య ఇండిగో విమానాలు అందుబాటులోకి రానున్నాయి. వీటిలో ఢిల్లీ విమానం ప్రతి రోజూ రాత్రి 8.10 గంటలకు విశాఖ చేరుకుని 8.55 గంటలకు ఢిల్లీ బయల్దేరుతుంది. హైదరాబాద్ సర్వీసు ప్రతి రోజూ రాత్రి 10.55కి వచ్చి 11.35 గంటలకు టేకాఫ్ అవుతుంది.అంతర్జాతీయ సర్వీసుల్లో విశాఖ–బ్యాంకాక్ (థాయ్‌లాండ్) విమానం ఏప్రిల్ 9 నుంచి నడుస్తుంది. ఇది రాత్రి 11.20 గంటలకు విశాఖ వచ్చి, 11.50 గంటలకు బ్యాంకాక్‌కు బయల్దేరుతుంది. అలాగే విశాఖ–కౌలాలంపూర్ (మలేసియా) విమానం ఏప్రిల్ 26 నుంచి మొదలవుతుంది. ఈ విమానం రాత్రి 9.30 గంటలకు విశాఖ చేరుకుని 10 గంటలకు టేకాఫ్ తీసుకుంటుందని విశాఖపట్నం అంతర్జాతీయ విమానాశ్రయం డైరెక్టర్ ఎస్.రాజారెడ్డి తెలిపారు.

శ్రుతి మించుతోంది

మహిళా అభ్యర్థులపై నీచమైన కామెంట్లు | సోషల్ మీడియాలో కించపరిచే పోస్టులు

ప్రచారంలో పేట్రేగుతున్న పెడ ధోరణి • అన్ని పార్టీలూ ఆ తాను ముక్కలే


కంగనా


సుప్రియ


మమత

ఒకప్పుడు ఎన్నికలొస్తే ప్రత్యర్థుల భావజాలం, అవినీతి, ప్రభుత్వ విధానాల వంటివాటిపై పార్టీల మధ్య విమర్శలు, ప్రతి విమర్శలు సాగేవి. కానీ ఇప్పుడు నేతల నోళ్లు అదుపు తప్పుతున్నాయి. మాటలు హద్దులు దాటుతున్నాయి. ఎన్నికల బరిలో దిగుతున్న మహిళలపై అభ్యంతరకర వ్యాఖ్యలు చేసే పెడ ధోరణి పెరిగిపోతోంది. వారిని కించపరచడం, లింగవివక్షతో కూడిన వెకిలి కామెంట్లు చేయడం పరిపాటిగా మారుతోంది. చివరికి మహిళా నేతలు ప్రత్యర్థి పార్టీల్లోని సాటి మహిళలపై నోరు పారేసుకోవడానికి వెనకాడటం లేదు! బీజేపీ లోక్‌సభ అభ్యర్థి, సినీ నటి కంగనాపై కాంగ్రెస్ నాయకురాలు సుప్రియా శ్రీనేత్ వ్యాఖ్యలు అందుకు నిదర్శనమే. నారీ శక్తి అంటూ పార్టీలు ఇస్తున్న నినాదాలు మాటలకే పరిమితమవుతున్న వైనం ఆందోళన కలిగిస్తోంది...

'మండీలో ఇప్పుడు ఏ రేటు పలుకుతోందో!' – ఇది కంగనాపై కాంగ్రెస్ ఐటీ విభాగం చీఫ్ సుప్రియ మూడు రోజుల కింద ఇన్‌స్టాగ్రాంలో పెట్టిన పోస్టు. కంగనా హిమాచల్‌ప్రదేశ్‌లోని తన స్వస్థలమైన మండి నుంచి లోక్‌సభకు పోటీ చేస్తున్నారు. మండి అంటే బజారు అన్న అర్థాన్ని సాకుగా తీసుకుని, కంగనా ఫొటో పెట్టి మరీ చేసిన ఈ నీచమైన వ్యాఖ్యలపై దుమారం రేగింది. బీజేపీ వెంటనే దీన్ని అందిపుచ్చుకుంటూ కాంగ్రెస్ అంటేనే సంస్కారరాహిత్యానికి మారుపేరంటూ మండిపడింది. ఆ పార్టీ అగ్ర నేత రాహుల్‌గాంధీ మొదలుకుని పలువురు నేతలు చేసిన ఇలాంటి కామెంట్లన్నింటినీ ప్రస్తావిస్తూ దుమ్మెత్తిపోసింది. దాంతో ఆ పోస్టుతో తనకు సంబంధం లేదని, ఎవరో తన ఇన్‌స్టా అకౌంట్‌ను హాక్ చేసి ఈ పని చేశారని సుప్రియ వివరణ ఇచ్చుకున్నా కాంగ్రెస్‌కు జరగాల్సిన నష్టం జరిగిపోయింది. ''ఓ యువకునికి టికెట్ దక్కితే అతని భావజాలంపై దాడి! అదే ఒక యువతి ఎన్నికల బరిలో దిగితే లింగవివక్షతో కూడిన ఇలాంటి వ్యాఖ్యలు! ఈ నీచమైన పోకడకు ఇకనైనా తెర పడాలి. సెక్స్ వర్కర్ల జీవితాలు ఎంతో దుర్భరం. వాటినిలా మహిళలపై బురద జల్లేందుకు సరుకుగా వాడుకోవడం సరికాదు'' అంటూ కంగనా హుందాగా ఇచ్చిన రిప్లై అందరి మనసులూ గెలుచుకుంది. భారత్‌లో ఎన్నికల వేళ మహిళా నేతలపై ఇలాంటి దిగజారుడు వ్యాఖ్యలు కొత్తేమీ కాదు. కానీ ఈసారి మాత్రం ఎన్నికల వేడి మొదలవుతూనే ఈ తరహా దూషణ పర్వం ఊపందుకోవడం ఆందోళన కలిగిస్తోంది. రాహుల్ కూడా అయోధ్య రామాలయంలో విగ్రహ ప్రాణప్రతిష్ఠ కార్యక్రమానికి మోదీ సర్కారు కేవలం వీఐపీలనే పిలిచిందంటూ తప్పుబట్టే క్రమంలో నటి ఐశ్వర్యారాయ్‌పై అభ్యంతరకర వ్యాఖ్యలు చేశారు. ''ఆ కార్యక్రమాన్ని మీరంతా చూశారు కూడా! ఐశ్వర్య, అమితాబ్, మోదీ... ఇలాంటివాళ్లే ఉన్నారు. కార్యక్రమంలో ఐశ్వర్య డ్యాన్సులు చేసింది. కానీ అక్కడ ఓబీసీలు, ఇతర సామాన్యులు ఒక్కరన్నా కన్పించారా?'' అన్న రాహుల్ కామెంట్లపై తీవ్ర విమర్శలే వచ్చాయి. వాటిపై నెటిజన్లు కూడా దుమ్మెత్తిపోశారు. కేంద్ర మంత్రి స్మృతీ ఇరానీ కూడా ఇలాంటి వ్యాఖ్యల బాధితురాలే. అమేథీ నియోజకవర్గానికి ఆమె కేవలం అప్పుడప్పుడూ వచ్చి తన హావభావాలతో జనాన్ని ఆకర్షించి వెళ్లిపోతారంటూ కాంగ్రెస్ నేత అజయ్‌రాయ్ ఇటీవల నోరుపారేసుకున్నారు.

బీజేపీ నేతలు కూడా...

మహిళా నేతలపై అభ్యంతరకర వ్యాఖ్యల విషయంలో అధికార బీజేపీ నాయకులూ ఏమీ తక్కువ తినలేదు. తాజాగా తృణమూల్ కాంగ్రెస్ అధినేత్రి, పశ్చిమబెంగాల్ సీఎం మమతా బెనర్జీపై రాష్ట్ర బీజేపీ నేత దిలీప్ ఘోష్ చేసిన వ్యాఖ్యలు కూడా మంటలు రేపాయి. ''మమత గోవాకు వెళ్తే తాను గోవా కూతురినంటారు. త్రిపురకు వెళ్తే త్రిపుర బిడ్డనని చెప్పుకుంటారు. ముందుగా మమత తన తండ్రెవరో గుర్తించాలి'' అంటూ తీవ్ర అభ్యంతకరకర వ్యాఖ్యలు చేశారాయన. సుప్రియా, ఘోష్ ఇద్దరికీ కేంద్ర ఎన్నికల సంఘం తాజాగా తలంటింది. వారి వ్యాఖ్యలకు వివరణ కోరుతూ తాఖీదులిచ్చింది. ఘోష్‌కు బీజేపీ అధినాయకత్వం కూడా షోకాజ్ నోటీసిచ్చింది. అడ్డగోలు వ్యాఖ్యలు చేయడం ఆయనకు కొత్తేమీ కాదు. 2021 పశ్చిమబెంగాల్ అసెంబ్లీ ఎన్నికల వేళ మమత కాలికి గాయమైంది. దాంతో కొంతకాలం వీల్‌చైర్‌లోనే ప్రచారం చేశారు. ఆ ఎన్నికల్లో తృణమూల్‌తో హోరాహోరీ తలపడ్డ బీజేపీ ఇదంతా సానుభూతి స్టంటేనంటూ ఎద్దేవా చేసింది. ఆ క్రమంలో, 'బెర్ముడాలు (నిక్కర్లు) వేసుకుంటే సౌలభ్యంగా ఉంటుంది' అంటూ అప్పట్లో మమతపై ఘోష్ అభ్యంతరకర వ్యాఖ్యలు చేశారు. ఇక కేరళలో బీజేపీ నేత, సినీ నటుడు సురేశ్ గోపీ ప్రెస్‌మీట్ సందర్భంగా ఓ మహిళా జర్నలిస్టును పదేపదే అభ్యంతరకరంగా తాకడమూ వివాదం రేపింది. ఆమె ఒకటికి రెండుసార్లు ఆయన చేయిని అడ్డుకుంటూ నెట్టేసినా అలాగే వ్యవహరించారు. దీనిపై గొడవ పెద్దదవడంతో తప్పనిసరైన క్షమాపణలు చెప్పినా, పితృవాత్సల్యంతో అలా చేశానంటూ సమర్థించుకున్నారు. చిర్రెత్తుకొచ్చిన సదరు జర్నలిస్టు ఆయనపై కేసు పెట్టేదాకా వెళ్లింది. మధ్యప్రదేశ్ అసెంబ్లీ ఎన్నికల వేళ బీజేపీ అగ్ర నేత కైలాశ్ విజయవర్గీయ కూడా ఇలాగే నోరు పారేసుకున్నారు. అభ్యంతరకర దుస్తులు ధరించే మహిళలు శూర్పణఖల్లా కనిపిస్తారంటూ వివాదాస్పద వ్యాఖ్యలు చేశారు. అంతటితో ఆగకుండా, ''దేవుడు మీకు అందమైన శరీరమిచ్చాడు. మంచి బట్టలేసుకోవచ్చుగా'' అన్నారు. వీటిని సుప్రియా శ్రీనేత్ అప్పట్లో తీవ్రంగా తప్పుబట్టడం, మహిళలంటే బీజేపీకి గౌరవం లేదంటూ దుయ్యబట్టడం విశేషం! రాజకీయాలు అర్థం కాకుంటే ఇంటికెళ్లి వంట చేసుకొమ్మంటూ ఎన్సీపీ నేత సుప్రియా సులేను ఉద్దేశించి మహారాష్ట్ర బీజేపీ చీఫ్ చంద్రకాంత్ పాటిల్ వ్యాఖ్యలు కూడా అప్పట్లో మంటలు రేపాయి.

ఆందోళనకరమే..

మన దేశంలో ఎన్నికల వేళ మహిళా నేతలపై అభ్యంతరకర వ్యాఖ్యలు పెరిగిపోతాయని ఆమ్నెస్టీ ఇంటర్నేషనల్ ఇండియా పరిశోధన తేల్చింది. ''2019 లోక్‌సభ ఎన్నికల్లోనైతే వారిపై వ్యక్తిగత విమర్శలు అనూహ్య స్థాయిలో పెరిగిపోయాయి. 95 మంది మహిళా నేతలకు వచ్చిన 1.14 లక్షల ట్వీట్లను పరిశీలిస్తే 14 శాతం దాకా లింగవివక్షతో కూడిన అభ్యంతరకర విమర్శలే. అంటే ఒక్కొక్కరికీ రోజుకు సగటున ఇలాంటి 113 ట్వీట్లొచ్చాయి!'' అని పేర్కొంది. బీజేపీ తరఫున యూపీలో రాంపూర్ నుంచి పోటీ చేసిన జయప్రదపై సమాజ్‌వాదీ పార్టీ నేత ఆజం ఖాన్ 'ఖాకీలో దుస్తులు' వ్యాఖ్యలు, ప్రియాంకా గాంధీ 'పప్పూ కీ పప్పీ' అంటూ బీజేపీ నేతల ఎద్దేవా, సినీ నటి హేమమాలిని ఓట్ల కోసం డ్యాన్సులు చేస్తారంటూ ప్రత్యర్థుల విమర్శలు... ఇలా 2019 ఎన్నికల్లో వివాదాలకు దారితీసిన ఉదంతాలెన్నో! ఇలా మహిళా నేతల వ్యక్తిత్వ హననానికి పూనుకునే ధోరణి మన దేశ రాజకీయాల్లో నేటికీ పెద్ద సవాలుగానే ఉందని విశ్లేషకులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఒకరకంగా మన సమాజపు పురుషాహంకార వైఖరికి ఇది అద్దం పడుతోందని వారంటున్నారు. నిజానికి పోలింగ్ బూత్‌లకు వచ్చేందుకు పురుషుల నిరాసక్తత నేపథ్యంలో భారత్‌లో కొన్నేళ్లుగా ఏ ఎన్నికల్లోనైనా మహిళల ఓట్లు కీలకంగా మారాయి. ఈ నేపథ్యంలో నాయకురాళ్లను కించపరిస్తే మహిళల ఓట్లకు గండి పడవచ్చని తెలిసి కూడా ఇటువంటి వ్యాఖ్యలు చేస్తుండటం ఆందోళనకర పరిణామమేనంటున్నారు.

– సాక్షి, నేషనల్ డెస్క్

కేజ్రీవాల్ నిజాలన్నీ వెల్లడిస్తారు!



- 'లిక్కర్' డబ్బు ఎక్కడుందో నేడు కోర్టులో చెప్పబోతున్నారు
- రుజువులు కూడా సమర్పిస్తారు
- కేజ్రీవాల్ భార్య సునీత వెల్లడి

సాక్షి, న్యూఢిల్లీ: మద్యం కుంభకోణం కేసులో నిజాలను ఢిల్లీ ముఖ్యమంత్రి అరవింద్ కేజ్రీవాల్ గురువారం కోర్టులో బయటపెట్టబోతున్నట్లు ఆయన భార్య సునీత కేజ్రీవాల్ చెప్పారు. రాజకీయ కక్ష సాధింపులో భాగంగానే ఈడీ ఆయన్ను అరెస్టు చేసిందంటూ ఆమె బుధవారం వీడియో సందేశం విడుదల చేశారు. ''మంగళవారం కలిసినప్పుడు నా భర్త నాతో పలు విషయాలు పంచుకున్నారు. ఆయన ఆరోగ్యం సరిగా లేదు. డయాబెటిస్‌తో బాధపడుతున్నారు. కస్టడీలోనూ ప్రజల గురించే ఆలోచిస్తున్నారు. ఢిల్లీలో తాగునీటి సమస్యను నివారించాలని లేఖ ద్వారా పంపిన ఉత్తర్వులను కూడా కేంద్రం వివాదాస్పదంగా మారుస్తోంది. ఢిల్లీ నాశనం కావాలని కోరుకుంటోంది. ఈడీ అధికారులు ఇప్పటిదాకా 250 సార్లు సోదాలు నిర్వహించారు. మా నివాసంలో సోదాలు చేసి కేవలం రూ.73 వేలు స్వాధీనం చేసుకున్నారు. ఈ కుంభకోణంలో చేతులు మారిన సొమ్ము ఇంకా దొరకలేదని ఈడీ చెబుతోంది. మద్యం కుంభకోణంలో నిజనిజాలు, ఆ డబ్బు ఎక్కడుందో గురువారం కోర్టులో బయటపెడతానని కేజ్రీవాల్ నాతో చెప్పారు. అందుకు రుజువులు కూడా సమర్పిస్తారు'' అని వీడియో సందేశంలో సునీత స్పష్టం చేశారు.

క్షీణిస్తున్న కేజ్రీవాల్ ఆరోగ్యం

ఈడీ కస్టడీలో ఉన్న అరవింద్ కేజ్రీవాల్ ఆరోగ్యం క్షీణిస్తోందని ఆమ్ ఆద్మీ పార్టీ వర్గాలు బుధవారం ఆందోళన వ్యక్తం చేశాయి. మధుమేహ బాధితుడైన కేజ్రీవాల్ రక్తంలో చక్కెరస్థాయిల్లో హెచ్చు తగ్గులు నమోదవుతున్నాయని వెల్లడించాయి. కేజ్రీవాల్ బ్లడ్‌షుగర్ లెవెల్ ఒక దశలో 46 ఎంజీకి పడిపోయిందని డాక్టర్లు చెప్పారని, ఇది చాలా ప్రమాదరమని తెలియజేశాయి.

హైకోర్టులో కేజ్రీవాల్‌కు దక్కని ఊరట

కేజ్రీవాల్‌కు ఢిల్లీ హైకోర్టులో నిరాశే ఎదురైంది. ఆయన అరెస్టులో జోక్యం చేసుకోవడానికి నిరాకరించింది. తనను ఈడీ కస్టడీ నుంచి తక్షణమే విడుదల చేయాలంటూ కేజ్రీవాల్ దాఖలు చేసిన పిటిషన్‌పై కోర్టు బుధవారం విచారణ చేపట్టింది. ఈ పిటిషన్‌పై ఏప్రిల్ 2వ తేదీలోగా స్పందించాలని న్యాయమూర్తి జస్టిస్ స్వర్ణకాంత శర్మ ఈడీకి సూచించారు. తదపరి విచారణను ఏప్రిల్ 3వ తేదీకి వాయిదా వేశారు.

ఎలక్షన్ బీట్

ఒక్క ఓటు కోసం 39 కిలోమీటర్ల ట్రెక్కింగ్..

ఈటానగర్: ప్రజాస్వామ్యం మామూలు వ్యక్తిని సైతం మెహమాన్‌ను చేస్తుంది. అందుకు ఉదాహరణ ఈ 44 ఏళ్ల సొకేలా తయాంగ్. అరుణాచల్ ప్రదేశ్‌లోని అంజ్వా జిల్లాలోని మారుమూలన ఉన్న మలోగాం ఆమె గ్రామం. హయులియాంగ్ అసెంబ్లీతోపాటు, అరుణాచల్ ప్రదేశ్ ఈస్ట్ లోక్‌సభ నియోజకవర్గం పరిధిలోకి ఆ గ్రామం వస్తుంది. అక్కడ ఎన్నికలు మొదటి ఫేజ్‌లో జరగనున్నాయి. ఇంతకీ ఆమె మెహమాన్ ఎందుకయ్యారంటే.. ఆ ఊరులో ఓటరు ఆమె ఒక్కరే. ఆమె కోసం పోలింగ్ సిబ్బంది అంతా.. ఎన్నికలు జరిగే ఏప్రిల్ 19వ తేదీ కంటే ఒకరోజు ముందు.. అంటే ఏప్రిల్ 18న 39 కిలోమీటర్ల ఎత్తు కొండలు ఎక్కాల్సి ఉంటుంది. చైనా సరిహద్దుకు దగ్గరలో ఉన్న ఆ గ్రామంలో తయాంగ్ కోసం తాత్కాలికంగా ఓ పోలింగ్ బూత్ కూడా ఏర్పాటు చేయనున్నారు. మలోగామ్‌లో ఇంకొన్ని కుటుంబాలు కూడా ఉన్నాయి. కానీ వారిలో ఎవరూ ఓటు కోసం నమోదు చేసుకోలేదు. దీంతో వారికి ఓటర్ల జాబితాలో చోటు దక్కలేదు. ఒక్కరికోసం బూత్ ఎందుకని.. సమీపంలోని ఏదైనా పోలింగ్ బూత్‌లో ఓటు వేయాల్సిందిగా అధికారులు ఆమెను కోరారు. కానీ అందుకు తయాంగ్ అంగీకరించలేదు. దీంతో ఆమె ఓటు కోసం అధికారులు, భద్రతా సిబ్బంది, పోర్టర్లతో సహా పోలింగ్ బృందం హయులియాంగ్ నుంచి అనూహ్య వాతావరణం మధ్య ప్రమాదకరమైన భూభాగం గుండా కష్టతరమైన ప్రయాణం చేయనుంది. హయులియాంగ్ నుంచి మలోగామ్‌కి కాలి నడకన వెళ్లడానికి ఒక రోజంతా పడుతుంది. పోలింగ్ రోజు ఉదయం ఏడు గంటల నుంచి సాయంత్రం ఐదు గంటల వరకు బూత్ తెరచి ఉంటుంది. ''నేను మా గ్రామంలో చాలా అరుదుగా ఉంటాను. ఏదైనా పని ఉన్నప్పుడు లేదా ఎన్నికల సమయంలో మాలోగాం వస్తుంటా. మిగతా సమయంలో మాకు వ్యవసాయ భూములు ఉన్న లోహిత్ జిల్లాలోని వక్రోలో ఉంటాను. ఏప్రిల్ 18 సాయంత్రంలోగా ఇంటికి చేరుకుని ఓటు వేస్తా'' అని చెబుతున్నారు.

88 స్థానాలకు నేడు నోటిఫికేషన్

సాక్షి, న్యూఢిల్లీ: సార్వత్రిక పోరులో రెండో విడత ఎన్నికల ప్రక్రియకు రంగం సిద్ధమైంది. రెండో విడతలో భాగంగా దేశవ్యాప్తంగా 12 రాష్ట్రాలు, కేంద్రపాలిత ప్రాంతాల్లోని 88 లోక్‌సభ స్థానాలతో పాటు ఔటర్ మణిపూర్‌లోని ఒక స్థానానికి ఏప్రిల్ 26న పోలింగ్ జరుగనుంది. ఇందుకు కేంద్ర ఎన్నికల సంఘం గురువారం నోటిఫికేషన్ జారీ చేయనుంది. వెంటనే నామినేషన్ల ప్రక్రియ ప్రారంభమవుతుంది. ఏప్రిల్ 4 వరకు నామినేషన్లు దాఖలు చేయవచ్చు. జమ్మూకశ్మీర్ మినహా 11 రాష్ట్రాలు, కేంద్రపాలిత ప్రాంతాలకు సంబంధించిన నామినేషన్ల పరిశీలన ఏప్రిల్ 5న జరుగనుంది. జమ్మూ కశ్మీర్‌లో మాత్రం నామినేషన్ల పరిశీలన ఏప్రిల్ 6న జరుగుతుంది. రెండో విడతలో అస్సాం, బిహార్, ఛత్తీస్‌గఢ్, జమ్మూకశ్మీర్, కర్ణాటక, కేరళ, మహారాష్ట్ర, మధ్యప్రదేశ్, రాజస్తాన్, త్రిపుర, ఉత్తరప్రదేశ్, పశ్చిమ బెంగాల్, మణిపూర్‌లో ఎన్నికలు జరుగనున్నాయి. వీటితో పాటు మహారాష్ట్రలోని అకోలా పశ్చిమ అసెంబ్లీ నియోజకవర్గం, రాజస్తాన్‌లోని భాగిడోరా అసెంబ్లీ స్థానానికి ఉప ఎన్నికలు జరుగుతాయి.

ఘోష్, సుప్రియాలకు ఈసీ షోకాజ్

న్యూఢిల్లీ/కోల్‌కతా: పశ్చిమబెంగాల్ ముఖ్యమంత్రి మమతా బెనర్జీ, బీజేపీ నాయకురాలు కంగనా రనౌత్‌పై అసభ్య వ్యాఖ్యలు చేసినందుకు బీజేపీ నేత దిలీప్ ఘోష్, కాంగ్రెస్ నాయకురాలు సుప్రియా శ్రీనేత్‌లకు కేంద్ర ఎన్నికల సంఘం షోకాజ్ నోటీసులు పంపింది. ''ప్రాథమిక సాక్ష్యాధారాలను బట్టి చూస్తే మీ వ్యాఖ్యలు చాలా అగౌరవప్రదంగా, కించపరిచేలా ఉన్నాయి. మీరు ఎన్నికల ప్రవర్తనా నిబంధనావళిని ఉల్లంఘించేలా ప్రవర్తించారు. మార్చి 29వ తేదీ సాయంత్రంకల్లా ఈ విషయంలో సంజాయిషీ ఇవ్వండి'' అని ఆదేశించింది. ''ప్రచారంలో ప్రత్యర్థి నేతల వ్యక్తిగత జీవితాలపై వ్యాఖ్యలు చేయకూడదు. వ్యక్తిగత దూషణ కోడ్ ఉల్లంఘనే. మహిళల గౌరవ మర్యాదలను కించపరిచే వ్యాఖ్యలు, పోస్టులు మానుకోవాలి'' అని ఈసీ పేర్కొంది.

ఘోష్ క్షమాపణలు: మమతాపై వ్యాఖ్యలకు దిలీప్ ఘోష్ క్షమాపణలు చెప్పారు. బీజేపీ అధిష్టానం వివరణ కోరిన కొద్ది గంటలకే, 'నా మాటల్లో తప్పు ఉందని బీజేపీ, ఇతరులు భావిస్తే క్షమించండి' అని ఆయన మీడియాకు చెప్పారు.

బీజేపీలో చేరిన ఆప్ ఎంపీ, ఎమ్మెల్యే

న్యూఢిల్లీ: పంజాబ్‌లో ఆమ్ ఆద్మీ పార్టీ(ఆప్)కి గట్టి ఎదురుదెబ్బ తగిలింది. రాష్ట్రంలో ఆ పార్టీకి చెందిన ఏకైక ఎంపీ, జలంధర్ నియోజకవర్గానికి ప్రాతినిధ్యం వహిస్తున్న సుశీల్‌కుమార్ రింకూ, పశ్చిమ జలంధర్ నియోజకవర్గ ఎమ్మెల్యే శీతల్ అంగురాల్ బుధవారం బీజేపీలో చేరారు. కేంద్ర మంత్రి హర్దీప్ సింగ్ పూరి, పార్టీ జాతీయ కార్యదర్శి వినోద్ తావ్డే సమక్షంలో కాషాయ కండువా కప్పుకున్నారు. రింకూ గత ఏడాది జలంధర్ లోక్‌సభ ఉప ఎన్నికకు ముందే కాంగ్రెస్ పార్టీని వీడి ఆప్‌లో చేరారు. పంజాబ్‌లోని 13 స్థానాల్లోనూ పాగా వేయాలని బీజేపీ చూస్తోంది.

'స్టార్' జాబితా నుంచి వసుంధర ఔట్

సాక్షి, న్యూఢిల్లీ: బీజేపీ జాతీయ ఉపాధ్యక్షురాలు, రాజస్తాన్ మాజీ ముఖ్యమంత్రి వసుంధర రాజే సింధియాకు పార్టీ అధిష్టానం షాక్ ఇచ్చింది. సార్వత్రిక ఎన్నికల్లో భాగంగా మధ్యప్రదేశ్‌లో బీజేపీ తరఫున ప్రచారం నిర్వహించే స్టార్ క్యాంపెయినర్ల జాబితాలో వసుంధరా రాజేకు చోటు దక్కలేదు. ప్రధాని నరేంద్ర మోదీ, కేంద్రమంత్రులు అమిత్ షా, రాజ్‌నాథ్ సహా మొత్తం 40 మంది స్టార్ క్యాంపెయినర్లు ప్రచారం నిర్వహించనున్నారు. గత ఎన్నికల్లో ఈ జాబితాలో ఉన్న వసుంధర రాజేను ఈసారి పార్టీ పెద్దలు పక్కన పెట్టారు. ఈసారి స్టార్ క్యాంపెయినర్‌గా రాజస్తాన్ నుంచి ముఖ్యమంత్రి భజన్‌లాల్ శర్మకు మాత్రమే అవకాశం కల్పించారు. రాజస్తాన్‌లో ఇటీవల అసెంబ్లీ ఎన్నికల్లో బీజేపీ అధికారంలోకి వచ్చింది. వసుంధరకు బదులు భజన్‌లాల్ శర్మను పార్టీ అధిష్టానం ముఖ్యమంత్రిని చేసింది. ఇప్పుడు మధ్యప్రదేశ్ స్టార్ క్యాంపెయినర్ల జాబితా నుంచి ఆమె పేరును తొలగించడం విశేషం.

డబ్బుల్లేకే పోటీకి దూరం: నిర్మల

న్యూఢిల్లీ: లోక్‌సభ ఎన్నికల్లో పోటీ చేసేందుకు 'అవసరమైన నిధులు' తన వద్ద లేవని కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ అన్నారు. అందుకే పోటీకి దూరంగా ఉన్నట్టు చెప్పారు. ''బీజేపీ అధిష్టానం నాకు టికెట్ ఆఫర్ చేసింది. ఆంధ్రప్రదేశ్, తమిళనాడుల్లో ఏ రాష్ట్రాన్నైనా ఎంచుకోవచ్చని పార్టీ అధ్యక్షుడు జేపీ నడ్డా చెప్పారు. దానిపై వారం పది రోజులు ఆలోచించా. పోటీకి బోలెడంత డబ్బు కావాలి. పైగా కుల, మత సమీకరణాల వంటి గెలుపు ప్రాతిపదికలెన్నో ఉంటాయి. ఇవన్నీ నా వల్ల కాదనిపించింది. అందుకే పోటీ చేయలేనని పార్టీకి చెప్పా'' అని బుధవారం టైమ్స్ నౌ సదస్సులో చెప్పుకొచ్చారామె. తన వాదనతో ఏకీభవించినందుకు పార్టీకి ధన్యవాదాలన్నారు. ఆమె కర్ణాటక నుంచి రాజ్యసభ సభ్యురాలిగా ఉన్నారు.

సింధియాపై యాదవేంద్ర సింగ్ పోటీ

14 మంది అభ్యర్థులతో కాంగ్రెస్ ఎనిమిదో జాబితా

న్యూఢిల్లీ: మధ్యప్రదేశ్‌లోని గుణ లోక్‌సభ స్థానంలో బీజేపీ నేత, కేంద్ర మంత్రి జ్యోతిరాదిత్య సింధియాపై కాంగ్రెస్ అభ్యర్థిగా రావు యాదవేంద్ర సింగ్ పోటీకి దిగనున్నారు. ఈ మేరకు 14 మంది అభ్యర్థులతో బుధవారం కాంగ్రెస్ ఎనిమిదో జాబితా విడుదలచేసింది. మధ్యప్రదేశ్‌లో విదిశ స్థానం నుంచి రాష్ట్ర మాజీ ముఖ్యమంత్రి శివ్‌రాజ్‌సింగ్ చౌహాన్‌పై ప్రతాప్ భాను శర్మ బరిలో దిగనున్నారు. వీటితో పాటు ఉత్తరప్రదేశ్, తెలంగాణలో చెరో నాలుగు స్థానాలకు అభ్యర్థులను కాంగ్రెస్ ప్రకటించింది. మధ్యప్రదేశ్, జార్ఖండ్‌లో చెరో మూడు స్థానాలకు కూడా అభ్యర్థుల పేర్లను వెల్లడించింది.

అమెరికా జోక్యంపై అభ్యంతరం

న్యూఢిల్లీ: ఢిల్లీ ముఖ్యమంత్రి కేజ్రీవాల్ అరెస్ట్‌పై అమెరికా వ్యాఖ్యలను భారత్ తీవ్రంగా తప్పుబట్టింది. ఇది దేశ అంతర్గత, సార్వభౌమత్వానికి సంబంధించిన విషయమని స్పష్టంచేసింది. బుధవారం ఢిల్లీలో అమెరికా దౌత్యవేత్తను పిలిపించి తన అసంతృప్తిని తెలియజేసింది. భారత్‌లో అమెరికా మహిళా దౌత్యవేత్త, యాక్టింగ్ చీఫ్ ఆఫ్ మిషన్ గ్లోరియా బెర్బీనాకు సమన్లు జారీచేసింది. దీంతో బుధవారం ఆమె ఢిల్లీలోని సౌత్‌బ్లాక్‌లో విదేశాంగ శాఖ కార్యాలయానికి వచ్చారు. విదేశాంగ శాఖ అధికారులతో దాదాపు 30 నిమిషాలు సమావేశమయ్యారు. 'స్వేచ్ఛగా, పారదర్శకంగా, వేగవంతంగా, చట్టపరంగా న్యాయం పొందే అర్హత సీఎం కేజ్రీవాల్‌కు ఉంది' అని మంగళవారం అమెరికా ఉన్నతాధికారి చేసిన వ్యాఖ్యలను ప్రస్తావించారు. భారత న్యాయప్రక్రియపై అమెరికా వ్యాఖ్యలను తప్పుబడుతూ భేటీ తర్వాత భారత విదేశాంగ శాఖ ఒక ప్రకటన విడుదల చేసింది. ''దౌత్య సంబంధాలకు సంబంధించి దేశాలు తోటి దేశాల సార్వభౌమత్వం, అంతర్గత వ్యవహారాలకు గౌరవం ఇవ్వాలి. తోటి ప్రజాస్వామ్య దేశాల పట్ల ఇదే బాధ్యతతో మెలగాలి. బాధ్యత విస్మరిస్తే బాగుండదు. భారత్‌లో న్యాయవ్యవస్థ స్వతంత్రమైంది. సత్వర న్యాయమే దాని అంతిమ లక్ష్యం. దానిపై ఇతరుల అభిప్రాయాలు అవాంఛనీయం'' అని ఆ ప్రకటనలో భారత్ తన అసంతృప్తిని తెలిపింది. కేజ్రీవాల్ అరెస్ట్‌పై వ్యాఖ్యలు చేసిన జర్మనీ దౌత్యవేత్త, డెప్యూటీ చీఫ్ మిషన్‌కు ఇటీవల భారత్ సమన్లు జారీచేసిన నేపథ్యంలో మళ్లీ అలాంటి ఘటనే జరగడం గమనార్హం.

కేరళ సీఎం కుమార్తెపై ఈడీ కేసు

కొచ్చి: కేరళ ముఖ్యమంత్రి పినరయి విజయన్ కుమార్తె వీణా విజయన్‌పై ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ మనీ లాండరింగ్ చట్టం కింద కేసు నమోదుచేసింది. వీణ, మరికొందరికి చెందిన ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ కంపెనీ ఎక్సాలాజిక్ సొల్యూషన్స్‌పైనా ఈడీ కేసు వేసింది. కొచ్చి కేంద్రంగా పనిచేసే కొచ్చిన్ మినరల్స్, రూటైల్ అనే సంస్థ అక్రమంగా ఎక్సాలిజిక్ సొల్యూషన్స్‌కు రూ.1.72 కోట్ల చెల్లింపులు జరిపిందని ఆరోపణ. 2018–2019కాలంలో ఈ చెల్లింపులు జరిగాయి. కొచ్చిన్ మినరల్స్‌తో ఎక్సాలాజిక్ గతంలో ఒక ఒప్పందం కుదుర్చుకుంది. అందులోభాగంగా ఎక్సాలాజిక్‌కు కన్సల్టెన్సీ, సాఫ్ట్‌వేర్ సపోర్ట్ సేవలను అందించాలి. కానీ కొచ్చిన్ మినరల్స్‌కు ఎలాంటి సేవలు అందించకున్నా ఆ సంస్థ నుంచి ఎక్సాలాజిక్‌కు నగదు చెల్లింపులు జరగడంలో అక్రమాలు చోటుచేసుకున్నాయని ఆదాయ పన్ను శాఖ దర్యాప్తు తర్వాత ఆరోపణలు వెల్లువెత్తాయి. దీంతో కేంద్ర కార్పొరేట్ వ్యవహారాల మంత్రిత్వ శాఖలోని దర్యాప్తు విభాగమైన సీరియస్ ఫ్రాడ్ ఇన్వెస్టిగేషన్ ఆఫీస్(ఎస్ఎఫ్ఐఓ) ఈడీకి ఫిర్యాదుచేసింది. దీంతో మనీలాండరింగ్ చట్టం కింద ఈడీ కేసులు నమోదుచేసింది.

మొయిత్రాకు ఈడీ సమన్లు

న్యూఢిల్లీ: విదేశీ మారక ద్రవ్య నిర్వహణ చట్టం(ఫెమా) ఉల్లంఘన కేసులో విచారణ కోసం తమ ఆఫీస్‌కు రావాలంటూ తృణమూల్ కాంగ్రెస్ నాయకురాలు మహువా మొయిత్రా, దుబాయ్ వ్యాపారి దర్శన్ హీరానందానీలకు ఈడీ సమన్లు జారీచేసింది. ఢిల్లీలోని తమ కార్యాలయానికి గురువారం రావాలని సమన్లలో పేర్కొంది. 49 ఏళ్ల మొయిత్రాకు గతంలో ఇదే కేసులో రెండుసార్లు సమన్లు జారీచేసి రమ్మని పిలిచినా ఆమె గైర్హాజరయ్యారు. ఇతరత్రా అధికారిక పనులు ఉన్నాయని, అయినా తనకు సమన్లు పంపడం చట్టవ్యతిరేకమని మొయిత్రా గతంలో వ్యాఖ్యానించారు. ముంబైలోని దర్శన్‌కు చెందిన రియల్టీ గ్రూప్‌కు వ్యతిరేకంగా నమోదైన ఫెమా కేసులో హాజరుకావాలని ఆయనకు ఈడీ విడిగా సమన్లు పంపింది. ప్రస్తుత కేసుకు సంబంధించి మొయిత్రాతో పరిచయం ఉన్న ఒక లాయర్‌ను ఈడీ బుధవారం ఆఫీస్‌కు పిలిపించి విచారించినట్లు విశ్వసనీయ వర్గాలు వెల్లడించాయి. 'నగదుకు పార్లమెంట్‌లో ప్రశ్నలు' ఉదంతంలో అనైతిక ప్రవర్తనకు పాల్పడ్డారంటూ పార్లమెంట్ ఆమెను బహిష్కరించడం తెల్సిందే.

ఎలాన్ మస్క్ ఔదార్యం

- కెనడాలో భారత సంతతి వైద్యురాలికి సాయం
- ఆమె చెల్లించాల్సిన 3 లక్షల డాలర్ల జరిమానా చెల్లించేందుకు సంసిద్ధత


కుల్విందర్ కౌర్ గిల్


ఎలాన్ మస్క్

టొరంటో: కెనడాలో న్యాయపరమైన చిక్కుల్లో ఇరుకున్న భారత సంతతి వైద్యురాలికి సహాయం అందించేందుకు ఎక్స్(ట్విట్టర్) వ్యవస్థాపకుడు, టెస్లా, స్పేస్ ఎక్స్ సంస్థల సీఈఓ, ప్రపంచ కుబేరుడు ఎలాన్ మస్క్ ముందుకొచ్చారు. ఆమె చెల్లించాల్సిన 3 లక్షల డాలర్లు(రూ.2.50 కోట్లు) జరిమానా చెల్లించేందుకు సంసిద్ధత వ్యక్తం చేశారు. భారత సంతతి వైద్యురాలు కుల్విందర్ కౌర్ గిల్ కెనడాలోని గ్రేటర్ టోరంటోలో గత పదేళ్లుగా చిన్నపిల్లల వైద్యురాలిగా పని చేస్తున్నారు. పిడియాట్రిక్స్, అలర్జీ, ఇమ్యూనాలజీలో పోస్టుగ్రాడ్యుయేట్ ట్రైనింగ్ పూర్తి చేశారు. స్పెషలిస్టు డాక్టర్‌గా గుర్తింపు పొందారు. పేద ప్రజలకు, వలసదారులకు తన సేవలు అందిస్తుంటారు. 2020లో కెనడాలో కోవిడ్–19 మహమ్మారి ఉధృతంగా వ్యాప్తి చెందుతుండడంతో ప్రభుత్వం లాక్‌డౌన్ విధించింది. ఈ లాక్‌డౌన్‌ను కుల్విందర్ కౌర్ గిల్ వ్యతిరేకించారు. ప్రజలంతా తప్పనిసరిగా కరోనా వ్యాక్సిన్ తీసుకోవాలన్న నిబంధనను కూడా తప్పుపట్టారు. లాక్‌డౌన్, వ్యాక్సినేషన్‌పై ప్రభుత్వ విధానాలను విమర్శిస్తూ ట్విట్టర్(ఇప్పుడు ఎక్స్) ధైర్యంగా పోస్టులు పెట్టారు. దీనిపై కెనడా మీడియా అభ్యంతరం వ్యక్తం చేసింది. చివరకు ఆమెపై కాలేజ్ ఆఫ్ ఫిజిషియన్స్, సర్జన్స్ ఆఫ్ అంటారియో విచారణ ప్రారంభించింది. క్రమశిక్షణా చర్యలకు సిఫార్సు చేసింది. దీనిపై కుల్విందర్ కౌర్ గిల్ న్యాయ పోరాటానికి దిగారు. కానీ, దురదృష్టం వెక్కిరించింది. 1.2 మిలియన్ డాలర్ల జరిమానా చెల్లించాలని 2022 అక్టోబర్‌లో కోర్టు ఆమెను ఆదేశించింది. పలు విన్నపాల తర్వాత జరిమానాను 3 లక్షల డాలర్లుగా ఖరారు చేస్తూ గత నెలలో తీర్పు వెలువరించింది. జరిమానా చెల్లించడానికి గడువు కూడా ఎక్కువగా లేదు. తన వద్ద అంత సొమ్ము లేక పోవడంతో కుల్విందర్ కౌర్ ప్రజల నుంచి విరాళాలు సేకరించడం మొదలుపెట్టింది. దాదాపు సగం నిధులు సేకరించింది. జరిమానా చెల్లించడానికి మరో నాలుగు రోజులు మాత్రమే గడువు ఉంది. ఇంతలో ఈ విషయంలో తెలిసిన ఎలాన్ మస్క్ వెంటనే స్పందించారు. మొత్తం 3 లక్షల డాలర్ల జరిమానా తానే చెల్లిస్తానని ప్రకటించారు. ఆయనకు కుల్విందర్ కౌర్ గిల్ 'ఎక్స్'లో కృతజ్ఞతలు తెలియజేశారు.

ఛత్తీస్‌గఢ్‌లో ఎన్‌కౌంటర్

- డిప్యూటీ కమాండర్ సహా ఆరుగురు మావోల మృతి
- పట్టుబడిన ఒక మావోయిస్టు

చర్ల: ఛత్తీస్‌గఢ్‌లో బుధవారం హోరాహోరీగా జరిగిన ఎన్‌కౌంటర్‌లో మావోయిస్టులకు భారీ ఎదురుదెబ్బ తగిలింది. బీజీపూర్ జిల్లా పరిధిలో జరిగిన పోలీసుల ఎదురుకాల్పుల్లో పీపుల్స్ లిబరేషన్ గెరిల్లా ఆర్మీ(పీఎల్‌జీఏ) ప్లాటూన్–10 డిప్యూటీ కమాండర్‌తో సహా ఆరుగురు మావోయిస్టులు మృతి చెందారు. బస్తర్ రేంజ్ ఐజీ పి. సుందర్‌రాజ్ తెలిపిన వివరాల ప్రకారం..బీజాపూర్ జిల్లా బాసగూడ పోలీస్‌స్టేషన్ పరిధి పూసుబాక మార్గంలో సోమవారం హోలీ వేడుకలు జరుపుకున్న కొందరు యువకులు తాలిపేరు నదిలో స్నానానికి వెళ్లారు. వారిలో ముగ్గురిని మావోయిస్టులు చంపేశారని ఆరోపణలొచ్చాయి. దీంతో మంగళవారం ఉదయం నుంచే పూసుబాక, చీపురుబట్టి గ్రామాల సమీప అటవీ ప్రాంతంలో కోబ్రా 210, 205, సీఆర్‌పీఎఫ్ 229 బెటాలియన్లకు చెందిన పోలీసు బలగాలతో పాటు డీఆర్‌జీ బలగాలు కూంబింగ్ చేపట్టాయి.

హోరాహోరీగా కాల్పులు

కూంబింగ్ నిర్వహిస్తున్న పోలీసు బలగాలకు బుధవారం తెల్లవారుజామున తాలిపేరు నదీ తీరాన మావోయిస్టులు తారసపడ్డారు. దీంతో 4 గంటల పాటు ఎదురుకాల్పులు కొనసాగాయి. వాటిలో ఆరుగురు మావోయిస్టులు మృతి చెందారు. దాదాపు 40 మంది మావోయిస్టుల్లో పలువురు గాయాలతో తప్పించుకున్నారనే సమాచారంతో ముమ్మరంగా కూంబింగ్ చేస్తున్నారు. పట్టుబడ్డ మావోయిస్టును విచారిస్తున్నారు. మృతి చెందిన మావోయిస్టులను ప్లాటూన్–10 డిప్యూటీ కమాండర్ పూనెం నగేష్, ఆయన భార్య వెట్టి సోని, ఆయ్‌తు పూనెం, సుక్కా ఓయం, సుప్పో మోకా, కొవసి గంగిగా గుర్తించారు. వారిపై రూ.14 లక్షల రివార్డుంది. ఘటనాస్థలి వద్ద మందుగుండు, ఆయుధాలు స్వాధీనం చేసుకున్నారు. హోలీ రోజు ఇన్‌ఫార్మర్ల నెపంతో ముగ్గురిని హతమార్చి ఈ వైపుగా పోలీసులను రప్పించి మెరుపుదాడి చేయాలని మావోలు పథక రచన చేసి ఉంటారని పోలీసులు అనుమానిస్తున్నారు.

ఎన్ఐఏ నూతన డీజీగా సదానంద్ వసంత్

న్యూఢిల్లీ: మహారాష్ట్ర ఉగ్రవ్యతిరేక బృందానికి సారథ్యం వహిస్తున్న సీనియర్ ఐపీఎస్ అధికారి సదానంద్ వసంత్ దాతెను జాతీయ దర్యాప్తు సంస్థ(ఎన్ఐఏ) నూతన డైరెక్టర్ జనరల్‌గా కేంద్ర ప్రభుత్వం నియమించింది. ఈయన నియామకాన్ని ఆమోదిస్తూ నియామకాల కేబినెట్ కమిటీ నిర్ణయం తీసుకున్నాక కేంద్ర సిబ్బంది శాఖ బుధవారం ఉత్తర్వులు జారీచేసింది. 1990 బ్యాచ్ మహారాష్ట్ర కేడర్ ఐపీఎస్ అధికారి అయిన వసంత్ 2026 డిసెంబర్ 31దాకా ఈ పదవిలో కొనసాగుతారు. రాజస్థాన్ కేడర్ ఐపీఎస్ అధికారి రాజీవ్ కుమార్ శర్మను బ్యూరో ఆఫ్ పోలీస్ రీసెర్చ్ డైరెక్టర్ జనరల్‌గా నియమించారు. జాతీయ విపత్తు స్పందనా దళం(ఎన్డీఆర్ఎఫ్) నూతన సారథిగా 1991 బ్యాచ్ యూపీ కేడర్ ఐపీఎస్ అధికారి పీయూశ్ ఆనంద్‌ను నియమించారు. స్పెషల్ ప్రొటెక్షన్ గ్రూప్(ఎస్పీజీ) అదనపు డైరెక్టర్ జనరల్‌గా 1995 బ్యాచ్ కేరళ కేడర్ ఐపీఎస్ అధికారి ఎస్.సురేశ్‌ను నియమించారు.

భారత సిబ్బంది భేష్: బైడెన్

వాషింగ్టన్: బాల్టిమోర్‌లో కంటైనర్ నౌక 'డాలీ' ఢీకొట్టడంతో ఫ్రాన్సిస్ స్కాట్ కీ బ్రిడ్జి కూలిపోయిన ఘటనపై అమెరికా అధ్యక్షుడు జో బైడెన్ స్పందించారు. ఈ నౌకలో ఉన్న 22 మంది భారతీయ సిబ్బందిపై ప్రశంసల వర్షం కురిపించారు. వారు అప్రమత్తంగా వ్యవహరించడం వల్లే పెనుప్రమాదం తప్పిందని పేర్కొన్నారు. బైడెన్ బుధవారం శ్వేతసౌధంలో మాట్లాడారు. నౌకపై అందులోని సిబ్బంది నియంత్రణ కోల్పోయారని చెప్పారు. వంతెనను నౌక ఢీకొట్టడానికంటే ముందే జరగబోయే ప్రమాదాన్ని గ్రహించి, స్థానిక రవాణా అధికారులకు సమాచారం చేరవేశారని తెలిపారు. దాంతో అధికారులు వేగంగా స్పందించి, వంతెనపై వాహనాల రాకపోకలను నిలిపివేశారని వెల్లడించారు. ఫలితంగా చాలామంది ప్రయాణికులు ప్రాణాపాయం నుంచి తప్పించుకున్నారని, ఇదంతా భారతీయ సిబ్బంది అప్రమత్తత వల్లే సాధ్యపడిందని బైడెన్ కొనియాడారు.

రెక్కలు ముక్కలైన విమానాలు

కోల్‌కతా: కోల్‌కతా ఎయిర్‌పోర్టులో బుధవారం పెనుప్రమాదం తప్పింది. ప్రయాణానికి సిద్ధంగా ఉన్న రెండు విమానాలు రన్‌వే సమీపంలోని ట్యాక్సీవేపై అత్యంత సమీపంలోకి రావడంతో వాటి రెక్కలు పరస్పరం ఢీకొన్నాయి. చెన్నై వెళ్లాల్సిన ఎయిరిండియా విమానం రెక్కలో కొంత భాగం ధ్వంసమైంది. దర్భంగా వెళ్లాల్సిన ఇండిగో విమానం రెక్క చివరి భాగం విరిగింది. ఎయిరిండియా విమానంలో 169 మంది, ఇండిగో విమానంలో 154 మంది ఉన్నారు. అదృష్టవశాత్తూ ప్రాణాపాయం తప్పిందని ఎయిర్‌పోర్టు అధికారులు చెప్పారు. ఈ ఘటనపై ఉన్నతస్థాయి దర్యాప్తుకు డీజీసీఏ ఆదేశించింది.


సాక్షి
విజయవాడ సిటీ
ఎన్టీఆర్ జిల్లా

గురువారం । 28 । మార్చి । 2024



పెనుగంచిప్రోలులో జన జాతర

పెనుగంచిప్రోలు: శ్రీతిరుపతమ్మ అమ్మవారి చిన తిరునాళ్లు కొనసాగుతున్నాయి. మూడో రోజైన బుధవారం అమ్మ దర్శనానికి భక్తులు పోటెత్తారు. ఆలయ ప్రాంగణం జన జాతరను తలపించింది.



సాగర్ నీటిమట్టం

విజయపురిసౌత్: నాగార్జున సాగర్ జలాశయ నీటిమట్టం బుధవారం 513.60 అడుగుల వద్ద ఉంది. ఎస్ఎల్‌బీసీకి 450 క్యూసెక్కులు విడుదలవుతోంది.

మంచి జరిగితేనే ఓటేయండి



నందిగామ టౌన్: పట్టణంలో బుధవారం ఎమ్మెల్యే, వైఎస్సార్ సీపీ అభ్యర్థి డాక్టర్ మొండితోక జగన్ మోహనరావు ఎన్నికల ప్రచారం నిర్వహించారు. మంచి జరిగితేనే ఓటు వేయాలని కోరారు.

రంజాన్ వేళలు

	ఇఫ్తార్ (గురు)	సహరీ (శుక్ర)
విజయవాడ	6.25	4.47
జగ్గయ్యపేట	6.27	4.53
మచిలీపట్నం	6.24	4.45
గుడివాడ	6.25	4.47

న్యూస్‌రీల్

9న పలు ఆర్జిత సేవలు రద్దు

ఇంద్రకీలాద్రి(విజయవాడపశ్చిమ): ఉగాది పర్వ దినాన్ని పురస్కరించుకుని ఏప్రిల్ 9వ తేదీన ఇంద్రకీలాద్రిపై దుర్గమ్మకు స్నపనాభిషేకం నిర్వహించనున్న నేపథ్యంలో పలు ఆర్జిత సేవలను రద్దుచేశామని ఆలయ వైదిక కమిటీ బుధవారం తెలిపింది. ఆ రోజు తెల్లవారుజామున అమ్మవారి ఆలయం చుట్టూ జరిగే ప్రదక్షిణలను నిలిపివేయనున్నారు. సుప్రభాత సేవ, వస్త్రాలంకరణ సేవ, ఖడ్గమాలార్చన, నవగ్రహ శాంతి హోమం, పల్లకీ సేవలను నిలుపుదల చేస్తారు. ఉదయం 7.30 గంటలకు ప్రారంభమయ్యే లక్ష కుంకుమార్చన, చండీ హోమం సేవలు అర్ధగంట ఆలస్యంగా జరుగుతాయి.

కొండాలమ్మ ఆదాయం రూ.30.53 లక్షలు




గుడ్లవల్లేరు: మండలంలోని వేమవరంలో వేంచేసిన శ్రీ కొండాలమ్మ అమ్మవారి ఆలయంలోని హుండీ కానుకల లెక్కింపు బుధవారం జరిగిందని ఆలయ కార్యనిర్వహణాధి కారి కానూరి సురేష్‌బాబు తెలిపారు. దేవదాయ శాఖ కార్యనిర్వాహణాధికారి సీహెచ్ సుబ్రహ్మణ్యం, పాలక మండలి సభ్యులు, గుడ్లవల్లేరు పోలీస్ అధికారులు, భక్తుల సమక్షంలో ఈ లెక్కింపు జరిగిందని పేర్కొన్నారు. 64 రోజులకు రూ.30,53,464 ఆదాయం సమకూరిందని ఈఓ తెలిపారు.

అప్రమత్తంగా ఉండండి



విజయవాడస్పోర్ట్స్: ఎన్నికల నేపథ్యంలో జిల్లా సరిహద్దుల్లోని చెక్ పోస్ట్‌ల సిబ్బంది నిత్యం అప్రమత్తంగా ఉండాలని ఎన్టీఆర్ జిల్లా పోలీస్ కమిషనర్ టి.కె.రాణా ఆదేశించారు. గుణదల ఇన్నర్ రింగ్‌రోడ్డు, రామచంద్రపాలెం చెక్ పోస్ట్‌లతో పాటు పాతపాడు, పాములకాలువ ప్రాంతాలను మునిసిపల్ కమిషనర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్‌తో కలిసి బుధవారం పరిశీలించారు. సీపీ రాణా మాట్లాడుతూ.. ఎన్నికల్లో అవాంఛనీయ ఘటనలు చోటు చేసుకోకుండా పటిష్ట నిఘా, బందోబస్తు ఏర్పాటు చేస్తున్నామని తెలిపారు. జిల్లాలోకి అక్రమ మార్గంలో ప్రవేశించే నగదు, మద్యం, సారా, గంజాయి, ఇతర మాదకద్రవ్యాలను గుర్తించి అడ్డుకట్ట వేయాలని పేర్కొన్నారు. విధుల్లో నిర్లక్ష్యం వహిస్తే శాఖా పరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. అనంతరం సింగ్‌నగర్ పోలీస్ స్టేషన్ పరిధిలోని సమస్యాత్మక ప్రాంతాలను పరిశీలించారు. వాంబేకాలనీలో పారా మిలటరీ బలగాలకు ఏర్పాటు చేసిన వసతిని సందర్శించారు.

నైపుణ్యతే ఉపాధికి గీటురాయి



కోనేరుసెంటర్(మచిలీపట్నం): సాంకేతిక రంగంలో ఉపాధి అవకాశాలు ఎక్కువ ఉన్నాయని, విద్యార్హతతో పాటు నైపుణ్యం కలిగిన వారిని వరిస్తాయని జేఎన్‌టీయూకే మాజీ ఉపకులపతి, జాతీయ సాంకేతిక శిక్షణ, పరిశోధక సంస్థ చైర్మన్ ఆచార్య వి.ఎస్.ఎస్.కుమార్ పేర్కొన్నారు. కృష్ణా విశ్వవిద్యాలయం ఇంజినీరింగ్ కళాశాలలో బుధవారం జరిగిన అతిథి ఉపన్యాసం కార్యక్రమంలో ఆయన పాల్గొని ప్రసంగించారు. సాంకేతిక రంగంలో రోజురోజుకూ మార్పులు చోటు చేసుకుంటున్న తరుణంలో అవకాశాలను అందిపుచ్చుకోవాలంటే నైపుణ్యత అవసరమని సూచించారు. కృష్ణా విశ్వ విద్యాలయం ఉపకులపతి ఆచార్య జి.జ్ఞానమణి మాట్లాడుతూ.. భారతదేశానికి చెందిన ఎంతో మంది విద్యార్థులు విదేశాలలో మంచి అవకాశాలు పొందుతున్నారని పేర్కొన్నారు, ఆ దిశగా విద్యార్థులు ముందుకు సాగాలని సూచించారు. ఈ కార్యక్రమంలో రిజిస్ట్రార్ ఆచార్య కె.శోభన్‌బాబు, ప్రవాసాంధ్రుడు అంకయ్య చౌదరి, ఆర్ట్స్ అండ్ సైన్స్ కాలేజీ ప్రధాన ఆచార్యుడు ఆచార్య సుందర కృష్ణ, ఇంజినీరింగ్ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ విజయ కుమారి తదితరులు పాల్గొన్నారు.

సొసైటీలకు ధన ఔషధి

- పీఏసీఎస్‌లను బలోపేతం చేసేందుకు చర్యలు
- సొసైటీల ఆధ్వర్యంలో జనరిక్ మందుల షాపుల ఏర్పాటు
- రైతులకు అన్ని రకాల సేవలు అందించడమే లక్ష్యంగా చర్యలు



వత్సవాయి సహకార సంఘంలో ఏర్పాటు చేసిన జన ఔషధి దుకాణం

పెనుగంచిప్రోలు: ఆదాయం పెంచు కుని, రైతులకు మెరుగైన సేవలు అందించడమే లక్ష్యంగా ప్రాథమిక వ్యవసాయ సహకార పరపతి సంఘాలు (పీఏసీఎస్) చర్యలు చేపట్టాయి. అదనపు ఆదాయం కోసం పలు రకాల వ్యాపారాలు నిర్వహించేందుకు ముందుకొస్తున్నాయి. పెట్రోలు బంకులు, కల్యాణ మండపాలు, కామన్ సర్వీస్ సెంటర్లను ఏర్పాటు చేస్తున్నాయి. ఇప్పటికే ఎన్టీఆర్ జిల్లాలో పెనుగంచిప్రోలు మండలంలో పెనుగంచిప్రోలు, ముండ్లపాడు, గంపలగూడెం మండలంలో తునికిపాడులో పెట్రోల్ బంక్‌ల ఏర్పాటు ద్వారా సొసైటీలు అదనపు ఆదాయం పొందుతున్నాయి. గన్నవరం సొసైటీ కల్యాణ మండపం నిర్వహిస్తోంది. కామన్ సర్వీస్ సెంటర్(సీఎస్‌సీ) ద్వారా కరెంట్ బిల్లులు వసూలుచేయడం, విమాన, రైలు టికెట్లను బుక్ చేయటంతో పాటు అనేక సేవలు అందిస్తూ ఆదాయం ఆర్జిస్తున్నాయి. తాజాగా భారత ప్రభుత్వం రసాయనాలు, ఎరువుల మంత్రిత్వ శాఖ ఫార్మాస్యూటికల్స్ విభాగం ఆధ్వర్యంలో నిర్వహించే ప్రధానమంత్రి భారతీయ జనఔషధి కేంద్రాలను పీఏసీఎస్‌ల ఆధ్వర్యంలో ఏర్పాటు చేస్తున్నారు. ఈ కేంద్రాలకు ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి నేతృత్వంలోని రాష్ట్ర ప్రభుత్వం తోడ్పాటు అందిస్తోంది. ఈ ప్రభుత్వ హయాంలో వ్యవసాయంతో పాటు సహకార రంగంలో కూడా పెనుమార్పులు వచ్చాయి. గతంలో కేవలం రైతులకు రుణాలు ఇవ్వటం, ఇతర రైతు సేవలు అందించే సొసైటీలు నేడు కార్పొరేట్ రంగం మాదిరిగా విస్తృత సేవలు అందిస్తున్నాయి.

ఉమ్మడి జిల్లాలో....

ఉమ్మడి కృష్ణా జిల్లాలో మొత్తం 425 ప్రాథమిక వ్యవసాయ సహకార పరపతి సంఘాలు ఉన్నాయి. ఎన్టీఆర్ జిల్లాలో పెనుగంచిప్రోలు, వత్సవాయి, జగ్గయ్యపేట, జుజ్జూరు, పూటుకూరు, పరిటాల, విజయవాడలో జనరిక్ మందులను విక్రయించే జన ఔషధి కేంద్రాలను ఏర్పాటు చేశారు. కృష్ణా జిల్లాలో వడ్లమన్నాడు, విన్నకోట, చల్లపల్లి, ఉల్లిపాలెంలో కూడా జన ఔషధి కేంద్రాలు ఏర్పాటయ్యాయి. మరిన్ని జనరిక్ మందుల షాపులను ఏర్పాటు చేసేందుకు సన్నాహాలు జరుగుతున్నాయి. ఈ కేంద్రాల్లో వినియోగదారులకు కేవలం ఎమ్మార్పీ ధరలకు అన్ని రకాల జనరిక్ మందులు దొరుకుతున్నాయి. ఎమ్మార్పీ ధర కూడా చాలా తక్కువగా ఉంటోంది.

మందుల కొనుగోలుపై కమీషన్

సహకార సంఘాల్లో జన ఔషధి కేంద్రం ఏర్పాటుకు రూ.3 లక్షల నుంచి రూ.4 లక్షలకు పైగా ఖర్చవుతోంది. ఈ ఖర్చుకు సంబంధించి రూ.లక్ష పైన ఎంత కొనుగోలు చేసినా 15 శాతం ఇన్సెంటివ్‌ల రూపంలో సొసైటీకి ఆదాయం వస్తుంది. ఇలా రూ.5 లక్షలు వచ్చే వరకు ఇస్తారు. లాభాలతోపాటు సేవా దృక్పథంతో వీటిని ఏర్పాటు చేస్తున్నారు. జన ఔషధి కేంద్రాల ఏర్పాటుకు రాష్ట్ర ప్రభుత్వం సహకార సంఘాల గుర్తింపుతో పాటు అవసరమైన లైసెన్స్‌లను వెంటనే సమకూరుస్తోంది. అవసరమైన అన్ని రకాల సదుపాయాలు అందిస్తోంది. కేంద్ర ప్రభుత్వం ఎంపిక చేసిన ఏజెన్సీల ద్వారా జనరిక్ మందులు కొనుగోలుపై పీఏసీఎస్‌లకు కమీషన్ అందనుంది.



జనరిక్ షాపులోని మందులు

రైతులకు అన్ని రకాల సేవలు లభ్యం



సహకార సంఘాల ద్వారా రైతులకు అన్ని రకాల సేవలు ఒకేచోట లభ్యమవుతున్నాయి. మా సంఘంలో జనరిక్ మందుల దుకాణం ఏర్పాటు చేయటంతో పాటు గ్రామాల్లో ప్రచారం కూడా చేయిస్తున్నాం. రోజుకు రూ.3 వేల నుంచి రూ.4 వేల ఆదాయం వస్తోంది. మందులు అందించేందుకు ఫార్మాసిస్టును కూడా ఏర్పాటు చేసుకున్నాం. వ్యాపారం కన్నా సేవ అందించాలనేదే లక్ష్యం. సంఘంలో కామన్ సర్వీస్ సెంటర్ ద్వారా కూడా సేవలు అందిస్తున్నాం.

– హరికృష్ణ, సీఈఓ, వత్సవాయి పీఏసీఎస్

ఆదాయం పెంపుపై దృష్టి



వ్యాపార అభివృద్ధికి అవకాశం ఉన్న సంఘాల ద్వారా పెట్రోల్ బంక్‌లు ఏర్పాటు చేస్తున్నాం. పీఏసీఎస్‌ల ద్వారా ఎరువులు, విత్తనాల విక్రయాలతో పాటు పెట్రోల్ బంక్‌ల ఏర్పాటు, గన్నవరంలో కల్యాణ మండపం నిర్వహిస్తున్నాం. జన ఔషధి కేంద్రాలు కూడా ఏర్పాటు చేస్తున్నాం. వీటి ద్వారా సంఘాలకు కమీషన్ రూపంలో ఆదాయం వస్తోంది. సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పాలనలో వ్యవసాయంతో పాటు సహకార రంగం శరవేగంగా వృద్ధి చెందుతోంది.

– తాతినేని పద్మావతి, కేడీసీసీబీ చైర్‌పర్సన్

దుర్గమ్మ హుండీ ఆదాయం రూ. 3.78 కోట్లు



ఇంద్రకీలాద్రి(విజయవాడపశ్చిమ): ఇంద్రకీలాద్రిపై కొలువైన దుర్గమ్మకు భక్తులు హుండీల ద్వారా రూ.3.78 కోట్లను కానుకలు, మొక్కుబడుల రూపంలో సమర్పించారు. అమ్మవారికి సమర్పించిన కానుకలను బుధవారం మహామండపం ఆరో అంతస్తులో లెక్కించారు. 25 రోజులకు ఆలయ ప్రాంగణం, అన్నదాన భవనంలోని హుండీల ద్వారా రూ.3,78,72,537 ఆదాయం సమకూరింది. బంగారం 900 గ్రాములు, 7.820 కిలోల వెండి వచ్చిందని ఆలయ ఈఓ కె.ఎస్.రామరావు తెలిపారు. ఈ-హుండీల ద్వారా భక్తులు ఆన్‌లైన్ ద్వారా దేవస్థానానికి రూ.1,22,800 సమర్పించారు.

హుండీల ద్వారా విదేశీ డాలర్లు

హుండీల్లో వివిధ దేశాల డాలర్లు లభించాయి. యూఎస్‌ఏకి చెందిన 3,633 డాలర్లు, 100 ఓమన్ రియాల్స్, 135 యూరోలు, 138 సింగపూర్ డాలర్లు, 104 ఖత్తర్ రియాల్స్‌తో పాటు ఇతర దేశాలకు చెందిన డాలర్లు భారీగా వచ్చాయని ఆలయ అధికారులు తెలిపారు. కానుకల లెక్కింపును దేవదాయ శాఖకు చెందిన అధికారులతో పాటు ఎస్‌పీఎఫ్ సిబ్బంది, పోలీసు సిబ్బంది పర్యవేక్షించారు. దేవస్థానానికి చెందిన సిబ్బందితో పాటు సేవా సిబ్బంది కానుకల లెక్కింపులో పాల్గొన్నారు.

నేడు జస్టిస్ ఎన్వీ రమణ పర్యటన

హనుమాన్‌జంక్షన్ రూరల్: బాపులపాడు మండలం వీరవల్లిలో సుప్రీంకోర్టు విశ్రాంత ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ ఎన్.వి.రమణ గురువారం పర్యటించనున్నారు. గ్రామంలో కృష్ణామిల్క్ యూనియన్ 'ప్రాజెక్టు కామధేను' పేరిట అత్యాధునిక సాంకేతికతతో నిర్మించిన ఆటోమేటెడ్ మిల్క్ ప్రొడక్ట్స్ ప్లాంట్‌ను జస్టిస్ ఎన్.వి.రమణ సందర్శించనున్నారు. ఈ సందర్భంగా పాడిరైతుల తరపున యూనియన్ పాలకవర్గ సభ్యులు ఆయనను సత్కరించనున్నట్లు చైర్మన్ చలసాని ఆంజనేయులు ఓ ప్రకటనలో తెలిపారు.

ప్రశాంతంగా ముగిసిన పది పరీక్షలు

- ఈ నెల 18న ప్రారంభమైన పరీక్షలు
- బుధవారం సోషల్ పరీక్షతో ముగింపు
- 95.71 శాతం హాజరు నమోదు



విజయవాడ పటమటలో పదోతరగతి పరీక్ష రాసి వస్తున్న విద్యార్థులు

వన్‌టౌన్(విజయవాడపశ్చిమ): ఎన్టీఆర్ జిల్లాలో పదో తరగతి పరీక్షలు బుధవారంతో ప్రశాంతంగా ముగిశాయి. ఈ నెల 18వ తేదీన ప్రారంభమైన పరీక్షలు బుధవారం జరిగిన సోషల్ పరీక్షతో పూర్తయ్యాయి. అప్షనల్ సబ్జెక్ట్‌లు తీసుకున్న విద్యార్థులు గురువారం సంస్కృతం పరీక్ష రాయనున్నారు. అత్యధికంగా పరీక్షలు రాసే విద్యార్థులకు ముగిసినట్లేనని అధికారులు ప్రకటించారు. రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాలతో జిల్లాలో అధికారులు పరీక్షలను విజయవంతంగా నిర్వహించారు. జిల్లాలో ఎక్కడా ఎటువంటి అవాంఛనీయ ఘటనలు చోటు చేసుకోకుండా చర్యలు తీసుకున్నారు. ఏడు ఫ్లయింగ్ స్క్వాడ్లు జిల్లా వ్యాపితంగా పర్యటిస్తూ పరీక్ష కేంద్రాలను తనిఖీలు చేశాయి. రోజూ 30 నుంచి 40 పరీక్ష కేంద్రాలను అధికారులు తనిఖీ చేసి, పరీక్షల నిర్వహణను పర్యవేక్షించారు. పరీక్షలు ప్రశాంతంగా ముగియటంతో అధికారులు ఊపిరి పీల్చుకున్నారు.

చివరి రోజు 1,257 మంది గైర్హాజరు

ఆఖరి రోజైన బుధవారం జరిగిన పరీక్షకు 1,257 మంది విద్యార్థులు గైర్హాజరయ్యారు. 178 పరీక్ష కేంద్రాల్లో 29,310 మంది పరీక్ష రాయాల్సి ఉండగా 28,053 మంది హాజరయ్యారు. జిల్లా పాఠశాల విద్యాశాఖ అధికారి యు.వి.సుబ్బారావుతో పాటు పలు బృందాలు తనిఖీలు నిర్వహించాయి.

28, 30 తేదీల్లో మరో రెండు పరీక్షలు

పదో తరగతి పరీక్షలకు సంబంధించి సాధారణ పరీక్షలు పూర్తయ్యాయి. సంస్కృతం ఆప్షనల్ సబ్జెక్ట్‌ను ఎంచుకున్న విద్యార్థులకు 28న, ఒకేషనల్ విద్యార్థులకు 30వ తేదీన పరీక్షలు జరగనున్నాయి. 28వ తేదీన 139 పరీక్ష కేంద్రాల్లో 6,543 మంది విద్యార్థులు పరీక్షకు హాజరుకానున్నట్లు అధికారులు తెలిపారు.

సీ-విజిల్ ఫిర్యాదులకు సత్వర పరిష్కారం

ఎన్టీఆర్ జిల్లా ఎన్నికల అధికారి ఢిల్లీరావు

గాంధీనగర్(విజయవాడసెంట్రల్): ఎన్టీఆర్ జిల్లాలో ఎన్నికల ప్రవర్తనా నియమావళి (ఎంసీసీ)ని సమర్థంగా అమలుచేస్తున్నామని, సీ - విజిల్ ద్వారా వచ్చే ఫిర్యాదులను క్షుణ్ణంగా పరిశీలించి సత్వర పరిష్కారానికి కృషి చేస్తున్నామని జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ ఎస్.ఢిల్లీరావు తెలిపారు. రాష్ట్ర సచివాలయం నుంచి రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి ముకేష్ కుమార్ మీనా బుధవారం అన్ని జిల్లాల కలెక్టర్లు, జిల్లాల ఎన్నికల అధికారులతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. కలెక్టర్ క్యాంపు కార్యాలయం నుంచి జిల్లా కలెక్టర్ ఢిల్లీరావు, జాయింట్ కలెక్టర్ డాక్టర్ పి.సంపత్ కుమార్, విజయవాడ నగర పాలక సంస్థ కమిషనర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్, కేఆర్‌సీ స్పెషల్ డెప్యూటీ కలెక్టర్ కిరణ్మయి తదితరులతో కలిసి ఈ కాన్ఫరెన్స్‌లో పాల్గొన్నారు. వివిధ ఫారాల పరిష్కారం, ఎన్నికల ప్రవర్తనా నియమావళి అమలు, ఎన్నికల ప్రచారం తదితరాలకు సంబంధించి వివిధ అనుమతులు జారీ, ఫిర్యాదుల పరిష్కారం తదితర అంశాలపై సీఈఓ సమీక్షించారు. ఈ సందర్భంగా కలెక్టర్ ఢిల్లీరావు జిల్లాలో ఎంసీసీ అమలు సరళితో పాటు వివిధ అంశాలను వివరించారు. సీ-విజిల్ ద్వారా 188 ఫిర్యాదులు వచ్చాయని, వీటిని మార్గదర్శకాలకు అనుగుణంగా నాణ్యతతో పరిష్కరిస్తున్నామని తెలిపారు.

ఎన్నికలకు సంబంధించి అనుమతుల కోసం ఎన్‌కోర్‌లో 198 విజ్ఞప్తులు వచ్చాయన్నారు. వీటిలో పార్లమెంటరీ నియోజకవర్గానికి సంబంధించి 23, అసెంబ్లీ నియో జకవర్గాలకు సంబంధించి 175 ఉన్నాయని వివరించారు. వీటిపై ప్రత్యేకంగా దృష్టిసారిస్తున్నట్లు వివరించారు. ఎలక్షన్ సీజర్ మేనేజ్‌మెంట్ వ్యవస్థ (ఈఎస్ఎంఎస్)ను ఎన్‌ఫోర్స్‌మెంట్ విభాగాల అధికారుల సమన్వయంతో పకడ్బందీగా అమలుచేస్తున్నారని తెలిపారు. ఈ సమావేశంలో ఎన్నికల సెల్ సూపరింటెండెంట్ ఎం.దుర్గాప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

శోభాయమానం.. ప్రభోత్సవం



ఉత్సవమూర్తులను ప్రభోత్సవానికి తీసుకువస్తున్న ఆలయాధికారులు



ఆలయం చుట్టూ తిరుగుతున్న అమ్మవారి ప్రభ

పెనుగంచిప్రోలు: తిరుపతమ్మవారి తిరునాళ్లలో మూడోరోజు బుధవారం రాత్రి 90 అడుగుల దివ్య ప్రభోత్సవం శోభాయమానంగా సాగింది. దక్షిణ భారతదేశంలో అత్యంత ఎత్తయిన ప్రభగా గుర్తింపు పొందిన ఈ దివ్య ప్రభోత్సవం 1928లో నుంచి జరుగుతున్నట్లు చారిత్రక ఆధారాలు ఉన్నాయి. ముందుగా అమ్మవారికి రజకులు, శాలివాహనులు కుంభం పోసి ప్రత్యేక పూజలు జరిపిన అనంతరం ఆలయ ఈఓ కె.రమేష్‌నాయుడు ఆధ్వర్యంలో రంగురంగుల విద్యుత్ దీపాలంకరణతో అలంకరించిన ఇనుప ప్రభపై ఉత్సవ విగ్రహాలను ఉంచి దేవస్థానం వారు గ్రామానికి చెందిన రైతుల ఎడ్లను కట్టి రథాన్ని గుడి చుట్టూ ప్రదక్షిణ చేయించారు. ప్రభ ముందు డప్పు వాయిద్యాలు, కొమ్ము వాయిద్యాలు, నృత్యాలు భక్తులను విశేషంగా ఆకర్షించాయి. నందిగామ ఏసీపీ రవికిరణ్ ఆధ్వర్యంలో జగ్గయ్యపేట సీఐ జానకిరామ్ పర్యవేక్షణలో ఎస్ఐ పి.రాంబాబు బందోబస్తు నిర్వహించారు. ఆలయ ఈఈ వైకుంఠరావు, ఏఈవో తిరుమలేశ్వరరావు, ఏఈ రాజు పాల్గొన్నారు.

నేడు అమ్మవారి పుట్టింటి పసుపు-కుంకుమ..

చిన్న తిరునాళ్లలో ప్రధాన ఘట్టమైన అమ్మవారి పుట్టింటి పసుపు-కుంకుమ బండ్లు అనిగండ్లపాడు గ్రామం నుంచి పెనుగంచిప్రోలు ఆలయానికి చేరుకునే కార్యక్రమం గురువారం సాయంత్రం 4.12 గంటలకు ప్రారంభమవుతుందని ఈవో తెలిపారు.

ఎస్పీ ఆకస్మిక తనిఖీలు



వాహన తనిఖీని పర్యవేక్షిస్తున్న ఎస్పీ

హనుమాన్‌జంక్షన్‌రూరల్:హనుమాన్‌జంక్షన్ పోలీస్ స్టేషన్‌ను కృష్ణా జిల్లా ఎస్పీ అద్నాన్ నయీమ్ అస్మీ బుధవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో ట్రైనీ డీఎస్పీ డాక్టర్ వేదశ్రీ, సీఐ అల్లు నవీన్ నరసింహామూర్తికి ఎస్పీ పలు సూచనలు చేశారు. అనంతరం కృష్ణా-ఏలూరు జిల్లాల సరిహద్దులో బొమ్ములూరు వద్ద 16వ నంబర్ జాతీయ రహదారిపై ఏర్పాటు చేసిన చెక్‌పోస్టును తనిఖీ చేశారు. ఎస్ఐ ఏడీఎల్ జనార్దన్, సిబ్బంది పాల్గొన్నారు.

భగ్గుమంటున్న బీజేపీ

- విజయవాడ పశ్చిమ అభ్యర్థిగా సుజనాచౌదరి
- పవన్‌కల్యాణ్‌ను కలిసిన జనసేన నేత పోతిన మహేష్
- కూటమిని ఓడిస్తామంటున్న నగరాల సామాజికవర్గం

వన్‌టౌన్(విజయవాడపశ్చిమ): పశ్చిమ నియోజకవర్గ బీజేపీ అభ్యర్థిగా కేంద్ర మాజీ మంత్రి వై.సుజనాచౌదరిని ఆ పార్టీ అధికారికంగా ప్రకటించింది. టీడీపీ, బీజేపీ, జనసేన కూటమి అభ్యర్థిగా ఆయన్ను ప్రకటించడంతో స్థానిక బీజేపీ నాయకులు భగ్గుమన్నారు. బ్యాంకులను మోసగించిన పారిశ్రామికవేత్తగా విమర్శలు ఎదుర్కొంటున్న సుజనాచౌదరిని పశ్చిమ నియోజకవర్గ అభ్యర్థిగా నియమించడంపై సొంత పార్టీ నుంచే తీవ్ర వ్యతిరేకత వచ్చింది. రెండు రోజుల నుంచి సుజనాచౌదరి పేరు ప్రచారంలోకి వచ్చినా బుధవారం సాయంత్రం ఆ పార్టీ పెద్దల నుంచి అధికారిక ప్రకటన వెలువడింది.

ఆశావహులకు మొండి చేయి

బీజేపీ నుంచి పలువురు స్థానిక నేతలు ఈ సీటు తమకు కేటాయించాలని దరఖాస్తు చేశారు. వారిలో పార్టీ జిల్లా అధ్యక్షుడు అడ్డూరి శ్రీరాము, ఎస్ఆర్ఐ గొలగాని రవికృష్ణ, పార్టీ సీనియర్ నేత బొబ్బూరి శ్రీరామ్ తదితరులు ఉన్నారు. రాష్ట్ర కమిటీ అడ్డూరి శ్రీరామ్ పేరు ఎంపిక చేసినట్లుగా తొలుత ప్రచారం జరిగింది. అడ్డూరి శ్రీరామ్ సైతం నగరాల సామాజికవర్గానికి చెందిన నాయకుడు . అయితే స్థానికేతర పారిశ్రామికవేత్తను తీసుకొచ్చి పోటీలో నిలపడంపై బీజేపీ, జనసేన పార్టీల నుంచే కాకుండా నగరాల సామాజిక వర్గం నుంచి కూడా తీవ్ర వ్యతిరేకత వ్యక్తమవుతోంది. కూటమిలోని రెండు పార్టీలూ తమను మోసం చేశాయని, వారికి తగిన బుద్ధి చెబుతామని ఆ సామాజికవర్గానికి చెందిన నాయకులు ఇప్పటికే పత్రికా ప్రకటనలు చేశారు. సుజనాచౌదరి పేరును వ్యతిరేకిస్తూ ఆయన తరఫున పనిచేయబోమని ఆ పార్టీ నాయకులు పార్టీ పెద్దలకు చెబుతున్నారు. పశ్చిమ టీడీపీకి చెందిన పలువురు నేతలతో సుజనాచౌదరికి ఆర్థిక లావాదేవీలు ఉండటంతో వారు పెద్దగా స్పందించడం లేదు. ఆర్థికంగా తమకు మేలు జరిగే అవకాశం ఉందని వారు సంబరపడుతున్నారని టీడీపీకి చెందిన ఒక నాయకుడు వ్యాఖ్యానించారు.

పోతిన మహేష్‌కు నిరాశ

జనసేన పార్టీ రాష్ట్ర అధికార ప్రతినిధి పోతిన మహేష్ ఈ సీటు నుంచి పోటీ చేయాలని భావించారు. గడిచిన ఐదేళ్లుగా ఆయన కష్టపడుతున్నారు. ఈ సీటు బీజేపీకి కేటాయించారని తెలిసి పది రోజులుగా ఆయన నిరసన గళాన్ని బలంగా వినిపిస్తున్నారు. పోతిన మహేష్ నగరాల సామాజికవర్గానికి చెందిన నాయకుడు. మహేష్ బుధవారం పార్టీ అధినేత పవన్‌కల్యాణ్‌ను కలిసినా ఆయన నుంచి ఎటువంటి స్పందన లేకుండాపోయింది.

క్లుప్తంగా

లింక్ పంపారు.. రూ. 16.82లక్షలు కాజేశారు

పెనమలూరు: సైబర్ నేరగాళ్ల మాయలో పడి వ్యక్తి రూ. 16.82 లక్షల సొమ్ము పోగొట్టుకున్న ఘటనపై పోలీసులు బుధవారం కేసు నమోదు చేశారు. పెనమలూరు సీఐ టీవీవీ రామారావు తెలిపిన వివరాల ప్రకారం పోరంకి గ్రామానికి చెందిన వంగూరు మణికుమార్ చైన్నైలో సాఫ్ట్‌వేర్ ఉద్యోగం చేస్తున్నాడు. ప్రస్తుతం వర్క్ ఫ్రం హోం చేస్తున్నాడు. అతనికి గత 10 సంవత్సరాలుగా షేర్ మార్కెట్ వ్యాపారం చేసే అలవాటు ఉంది. అతనికి ఫిబ్రవరి 23వ తేదీన వాట్సాప్‌లో ఇంటర్నల్ వీఐపీ ఇన్‌వెస్టిమెంట్ ఎక్స్‌చేంజ్ అనే లింక్ వచ్చింది. ఆ లింక్ ఓపెన్ చేయగా ఆల్ వీసీ యాప్ ద్వారా షేర్‌లకు పెట్టుబడి పెట్టడం మొదలు పెట్టాడు. పలు దఫాలుగా అతను రూ. 16.82 లక్షలు పెట్టుబడి పెట్టాడు. అతను పెట్టిన పెట్టుబడికి రూ. 30 లక్షలు లాభం వచ్చినట్లు యాప్‌లో చూపారు. 5 శాతం సర్వీస్ ట్యాక్స్ అంటే రూ. 1.50 లక్షలు చెల్లిస్తేనే రూ. 30 లక్షలు ఇస్తామని యాప్‌లో తెలిపారు. దీంతో తాను మోసపోయానని బాధితుడు తెలుసుకొని వెంటనే సైబర్ క్రైమ్ పోర్టల్‌లో ఫిర్యాదు చేశాడు. తనను మోసగించి సొమ్ము కాజేసిన వారిపై చర్యలు తీసుకోవాలని పెనమలూరు పోలీసులకు ఫిర్యాదు చేయటంతో కేసు నమోదు చేశారు.

మహిళ హత్య కేసులో నిందితుడు అరెస్టు



ఇబ్రహీంపట్నం: దాములూరు శివారులో ఈనెల 19న జరిగిన మహిళ హత్యకేసును పోలీసులు ఛేదించారు. నిందితుడు ప్రవీణ్‌కుమార్ జైన్‌ను అరెస్ట్ చేసినట్లు సీఐ ఎం.సత్యనారాయణ బుధవారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. ఆయన కథనం మేరకు.. మృతురాలు మరేమల్ల శోభారాణి (52) 15ఏళ్ల క్రితం హైదరాబాద్‌లోని నిందితుడు ప్రవీణ్‌కుమార్ జైన్ ఇంట్లో పని మనిషిగా చేరింది. ఇరువురి మధ్య పరిచయం పెరిగింది. ఉద్యోగం నిమిత్తం ఇబ్రహీంపట్నం, విజయవాడ పరిసర ప్రాంతాలకు వచ్చి సహజీవనం చేశారు. ఏడాది నుంచి ఇరువురి మధ్య విభేదాలు పొడచూపడంతో శోభారాణి భవానీపురంలో అద్దింట్లో ఒంటరిగా ఉంటోంది. ఐదు నెలల క్రితం మరలా ఇరువురు ఒక్కటయ్యారు. ఆమె వద్ద ఉన్న బంగారం విషయంలో మరోసారి గొడవలు పెరిగాయి. ఈ క్రమంలో ప్రవీణ్ కుమార్ శోభారాణితో మాట్లాడుకుందామని నమ్మబలికి కారులో దాములూరు తీసుకెళ్లి జాకీ రాడ్‌తో కొట్టి ఆమెను హత్య చేశా డు. అనుమానం రాకుండా కారులో జీపీఎస్ సిస్టం పీకేశాడని సీఐ పేర్కొన్నారు. హత్యకు ఉపయోగించిన జాకీరాడ్, కారు స్వాధీనం చేసుకున్నామన్నారు. కేసును ఛేదించిన సిబ్బందిని సీపీ టి.కె. రాణా, ఏసీపీ మురళీకృష్ణారెడ్డి అభినందించినట్లు సీఐ పేర్కొన్నారు.

హైకోర్టులో ఏసీల నిర్వహణకు టెండర్ నోటిఫికేషన్

సాక్షి,అమరావతి: హైకోర్టులో ఏర్పాటు చేసిన డైకిన్, మిత్సుబిషి క్యాసెట్, స్ప్లిట్ ఏసీల వార్షిక నిర్వహణ కాంట్రాక్ట్ (ఏఎంసీ) విషయంలో స్థానిక డీలర్లు, ఏజెన్సీల నుంచి కొటేషన్లను ఆహ్వానిస్తూ హైకోర్టు రిజిస్ట్రీ టెండర్ నోటిఫికేషన్ జారీ చేసింది. ఆసక్తిగల వారు ఏప్రిల్ 4 సాయంత్రం 5గంటలలోపు సీల్డ్ కవర్‌లో తమ కొటేషన్లను సమర్పించాలని హైకోర్టు రిజిస్ట్రార్ ఓ ప్రకటనలో కోరారు. మరిన్ని వివరాలకు హైకోర్టు వెబ్‌సైట్‌ను సందర్శించాలని కోరారు.

మీ ఓటు ఉందా లేదా?

- సులువుగా తెలుసుకునే అవకాశం కల్పించిన ఎన్నికల కమిషన్
- ఉపకరిస్తున్న ఓటరు హెల్ప్ లైన్ యాప్
- ఓటుకు ఫోన్ నంబర్ అనుసంధానం

గుడివాడరూరల్: సార్వత్రిక ఎన్నికల వేడి రాజుకుంటోంది. ఎన్నికల్లో ప్రతి పౌరుడూ తన ఓటు హక్కును వినియోగించుకునేందుకు సమాయత్తమవుతున్నాడు. ఇలాంటి తరుణంలో ఓటరు జాబితాలో తన పేరు ఉందో? లేదో? అనే ఆత్రుత అందరిలోనూ నెలకొంది. ఈ అంశాన్ని పరిగణనలోకి తీసుకున్న భారత ఎన్నికల కమిషన్.. జాబితాలో ఓటు వివరాలు తెలుసుకునే సదవకాశాన్ని కల్పించింది. జాబితాలో ఓటు లేదని తెలిస్తే వెంటనే ఫారం–6 ద్వారా దరఖాస్తు చేసుకునే వెసులుబాటు కల్పించింది. కొత్తగా ఓటరు నమోదుకు ఎన్నికల నామినేషన్ ప్రక్రియ ముగిసే ఏప్రిల్ 25వ తేదీ వరకూ అవకాశం ఇచ్చింది. ప్రస్తుత ఎన్నికల్లో ఓటు హక్కును వినియోగించుకునేలా అనుబంధ జాబితాలో చేరుస్తారు.

అందుబాటులో ఓటరు హెల్ప్‌లైన్

➡ ఓటరు జాబితాలను పోలింగ్ కేంద్రాల పరిధిలోని బూత్ లెవల్ అధికారి(బీఎల్ఓ), తహసీల్దార్ కార్యాలయంలో ఇప్పటికే అధికారులు అందుబాటులో ఉంచారు. ఆయా అధికారిక కార్యాలయాలకు వెళ్లి జాబితాను పరిశీలించి ఓటు హక్కు ఉందో.. లేదో నిర్ధారించుకోవచ్చు. అలా కాకపోతే ఆన్‌లైన్‌లో చూసుకునే అవకాశాన్ని కూడా భారత ఎన్నికల కమిషన్ కల్పించింది.



ఓటరు హెల్ప్‌లైన్ యాప్ లోగో

ఇందుకోసం ప్రత్యేకంగా ఓటరు హెల్ప్ లైన్‌ను అందుబాటులోకి తీసుకొచ్చింది.

➡ స్మార్ట్‌ఫోన్లలో 'ఓటరు హెల్ప్‌లైన్ యాప్'ను ఇన్‌స్టాల్ చేసుకోవడం ద్వారా ఓటరు వివరాలు తెలుసుకోవచ్చు. ఈ యాప్‌ను గూగుల్ ప్లేస్టోర్ నుంచి డౌన్‌లోడ్ చేసుకోవాలి. యాప్ ఓపెన్ చేయగానే ఆప్షన్లు వస్తాయి. 'సెర్చ్ యువర్ నేమ్ ఇన్ ఎలక్ట్రోరల్ రోల్' అని కనిపిస్తుంది. దానిపై క్లిక్ చేసి.. 'సెర్చ్ బై' కింద వచ్చిన ఆప్షన్లలో 'సెర్చ్ బై ఎపిక్ నంబర్' ద్వారా ఓటు వివరాలు తెలుసుకోవచ్చు.

➡ కంప్యూటర్ ద్వారా ఓటరు వివరాలు తెలుసుకునే వారు http://electrolsearch.eci.gov.in/ వెబ్‌సైట్‌ను ఓపెన్ చేయాలి. అందులో సెర్చ్ బై ఎపిక్ నంబర్ అనే ఆప్షన్‌పై క్లిక్ చేసి, ఓటరు ఐడీ నంబర్, స్టేట్ అనే చోట ఆంధ్ర ప్రదేశ్ అని సెలెక్ట్ చేసుకోవాలి. క్యాప్చా కోడ్ ఎంటర్ చేసి సెర్చ్ ఆప్షన్‌ను క్లిక్ చేయగానే ఓటు వివరాలు కనిపిస్తాయి.

➡ ఓటు వివరాలు తెలుసుకునేందుకు 1950 టోల్ ఫ్రీ నంబర్‌ను సైతం ఎన్నికల కమిషన్ అందుబాటులో ఉంచింది. ఈ నంబర్‌కు ఫోన్ చేసి ఓటర్ ఐడీ నంబర్ చెబితే.. అక్కడి సిబ్బంది ఆన్‌లైన్‌లో పరిశీలించి ఓటు ఉందా లేదా అనే విషయం చెబుతారు.

➡ ఓటు లేదని తెలిస్తే వెంటనే ఓటరుగా నమోదుకు ఫారం–6 ద్వారా దరఖాస్తు చేసుకోవాల్సి ఉంటుంది. బీఎల్ఓ, తహసీల్దార్ కార్యాలయంలో మాన్యువల్‌గా దరఖాస్తు చేసుకోవచ్చు. ఆన్‌లైన్‌లోనూ ఓటరుగా నమోదు చేసుకునే వెసులుబాటు ఉంది.

ఫోన్ నంబర్‌తో అనుసంధానం ఇలా..

ఓటును మీ మొబైల్ ఫోన్ నంబర్‌కు అనుసంధానం చేసుకోవడం ద్వారా చాలా ప్రయోజనాలు ఉంటాయి. ఎవరైనా మీ ఓటును సవరించాలనో, తొలగించాలనో చూస్తే వెంటను అనుసంధానం చేసుకున్న నంబర్‌కు సంక్షిప్త సమాచారం అందుతుంది. ఈ సౌలభ్యం పొందేందుకు వెబ్‌లింక్‌ను ఎన్నికల కమిషన్ విడుదల చేసింది. http://eoaperms.ap.gov.in/AP&MobileNoRegistration/MobileNoRegistaration.aspx లింక్‌ను తెరిచి, ఇందులో ఓటరు ఐడీ నంబర్ ఎంటర్ వేయాలి. దాని కిందనే ఫోన్ నంబర్ ఎంటర్ చేసి రిజిస్టర్ ఆప్షన్‌ను క్లిక్ చేయాలి. వెంటనే ఫోన్ నంబర్‌కు ఓటీపీ వస్తుంది. దానిని ఎంటర్ చేసిన తర్వాత ఓటర్ ఐడీకి ఫోన్ నంబర్ అనుసంధానమవుతుంది.

సస్యరక్షణతో నల్లతామరకు చెక్

మామిడి రైతులకు శాస్త్రవేత్తల సలహాలు



రెడ్డిగూడెంలో రైతులకు సలహాలు సూచనలు ఇస్తున్న శాస్త్రవేత్తలు

రెడ్డిగూడెం: మండలంలోని రంగాపురం, రాఘవాపురం, నరుకుళ్లపాడు గ్రామాలలో నూజివీడు మామిడి పరిశోధనా కేంద్రం శాస్త్రవేత్త జి. శాలిరాజు, మండల ఉద్యాన అధికారి నరేంద్రకుమార్ మామిడి తోటలను బుధవారం పరిశీలించారు. ఈ సందర్భంగా శాస్త్రవేత్తలు మామిడి రైతులకు సలహాలు, సూచనలు అందజేశారు. వారు మాట్లాడుతూ ప్రస్తుత వాతావరణ పరిస్థితులలో మామిడిలో తామరపురుగు, నల్లతామర పురుగు ఉధృతి ఎక్కువగా ఉందన్నారు. దీన్ని సకాలంలో గుర్తించి సమగ్ర సస్యరక్షణ చర్యలు తీసుకున్నట్లయితే నాణ్యమైన అధిక దిగుబడులు సాధించవచ్చని తెలిపారు. రాత్రి, పగలు మధ్య ఉష్ణోగ్రత వ్యత్యాసం ఎక్కువగా ఉండటం, విచక్షణా రహితంగా మందులు వాడకం వల్ల ఈ పురుగు ఉధృతి ఎక్కువగా ఉంటుందని తెలిపారు. ఈ తామర పురుగు మామిడి పూత, కాయల నుంచి రసాన్ని పీల్చి నష్టాన్ని కలుగజేస్తాయన్నారు. దీని నివారణకు ఒక్కొక్క చెట్టుకి 4 కేజీల వేప పిండిని వేయాలన్నారు. నీలి రంగు జిగురు అట్టలను ఎకరానికి 40–50 ఏర్పాటు చేయాలన్నారు. పూత ప్రారంభ దశలో వేపనూనె 10వేల పీపీఎం ఒక లీటరు నీటిని 1ఎంఎల్ లేదా 1500 పీపీఎం ఒక లీటర్ నీటికి 2 ఎంఎల్ కలిపి పిచికారీ చేయాలన్నారు. అదే విధంగా గానుగ నూనె ఒక లీటర్ నీటికి 2ఎంఎల్ లేదా గానుగ సబ్బు 7.5 గ్రాములు కలిపి పిచికారీ చేయాలని చెప్పారు. రసాయన పద్ధతిలో ఫిప్రోనిల్ 2ఎంఎల్ లేదా అసిఫేట్ 1.5 ఎంజీ లేదా ఇమిడాక్లోప్రిడ్ 0.3 ఎంఎల్ లేదా థయోమిథాక్సం 0.3గ్రా లేదా డైమిథోయేట్ 2ఎంఎల్ లేదా స్పినోసాడ్ 0.3ఎంఎల్ ఒక లీటర నీటికి కలిపి పిచికారీ చేయాలని తెలిపారు.

అల్లర్లకు పాల్పడకుండా కఠిన చర్యలు

డీసీపీ అధిరాజ్ సింగ్ రాణా



కృష్ణలంకలో సిబ్బంది నుంచి వివరాలు తెలుసుకుంటున్న డీసీపీ అధిరాజ్ సింగ్ రాణా

విజయవాడస్పోర్ట్స్: రానున్న ఎన్నికల్లో అల్లర్లకు పాల్పడే వ్యక్తులపై కఠిన చర్యలు తీసుకుంటామని డెప్యూటీ పోలీస్ కమిషనర్(డీసీపీ) అధిరాజ్ సింగ్ రాణా హెచ్చరించారు. కృష్ణలంకలోని సమస్యాత్మక పోలింగ్ కేంద్రాల ప్రాంతాలను డీసీపీ బుధవారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రశాంతమైన వాతావరణంలో ఎన్నికలు నిర్వహించేందుకు చర్యలు తీసుకుంటున్నామన్నారు. పోలింగ్ కేంద్రాలకు అవసరమైన మౌలిక సదుపాయాలు కల్పిస్తున్నామన్నారు. శాంతి భద్రతలు పరిరక్షణ చర్యలలో భాగంగా పరిసర ప్రాంతాలలో సంఘ వ్యతిరేక శక్తులు, అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడే వ్యక్తులు, సామాన్య ప్రజానీకాన్ని ఇబ్బందులకు గురిచేసే వారిని గుర్తిస్తున్నామన్నారు. గత ఎన్నికల్లో గొడవలు, అల్లర్లు జరిగిన పోలింగ్ కేంద్రాలను సమస్యాత్మక పోలింగ్ కేంద్రాలుగా గుర్తించామని, ఈ కేంద్రాల వద్ద ఎలాంటి సంఘటనలు చోటు చేసుకోకుండా పటిష్ట చర్యలు తీసుకుంటున్నామన్నారు. దీనికి ప్రజలందరూ పోలీసు వారికి సహకరించాలని కోరారు. ప్రతి ఒక్కరూ ప్రశాంత వాతావరణంలో విలువైన ఓటు హక్కును వినియోగించుకోవాలన్నారు. ఎన్నికల్లో అలజడులు సృష్టించి, ప్రోత్సహించిన వ్యక్తులపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఈ పర్యటనలో సౌత్ ఏసీపీ జి.రత్నరాజు, కృష్ణలంక సీఐ ఎ.మురళీకృష్ణ పాల్గొన్నారు.

డెకాయ్ ఆపరేషన్లను విస్తృతంగా చేపట్టాలి



పోస్టర్ ఆవిష్కరిస్తున్న కలెక్టర్ ఢిల్లీరావు

ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్ ఢిల్లీరావు

గాంధీనగర్(విజయవాడసెంట్రల్): జిల్లాలో గర్భస్థ పిండ లింగ నిర్ధారణ నిషేధ చట్టాన్ని పటిష్టంగా అమలు చేసేందుకు జిల్లాస్థాయి నుంచి క్షేత్రస్థాయి వరకు అధికారులు సమన్వయంతో పనిచేయాలని, డెకాయ్ ఆపరేషన్లను విస్తృతంగా నిర్వహించాలని ఎన్టీఆర్ కలెక్టర్ ఎస్.ఢిల్లీరావు అధికారులను ఆదేశించారు. కలెక్టర్ క్యాంపు కార్యాలయంలో లింగ నిర్ధారణ నిషేధ చట్టం–1994 అమలుపై జిల్లా స్థాయి మల్టీ మెంబర్ అప్రాప్రియేట్ అథారిటీ కమిటీ సమావేశం కలెక్టర్ ఢిల్లీరావు అధ్యక్షతన బుధవారం జరిగింది. జిల్లాలో చట్టం అమలు తీరుపై సమావేశంలో చర్చించారు. స్కానింగ్ కేంద్రాల రిజిస్ట్రేషన్, రెన్యువల్, డెకాయ్ ఆపరేషన్లు, ఆకస్మిక తనిఖీలు తదితరాలకు సంబంధించిన వివరాలను అధికారులు కలెక్టర్‌కు వివరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ ఢిల్లీరావు మాట్లాడుతూ డెకాయ్ ఆపరేషన్లను విస్తృతం చేయాలని సూచించారు. డివిజన్ స్థాయి ప్రోగ్రామ్ అధికారులు, క్షేత్రస్థాయి అధికారులు, సిబ్బందితో సమన్వయం చేసుకుంటూ గర్భస్థ పిండ లింగ నిర్ధారణ నిషేధ చట్టం పరిధిలోని లక్ష్యాల సాధనకు చర్యలు తీసుకోవాలన్నారు. తనిఖీలను ముమ్మరం చేయాలని.. ఎక్కడా చట్ట ఉల్లంఘనలు జరగకుండా చూడాలన్నారు.

దరఖాస్తుల పరిశీలన..

సమావేశంలో చట్టపరమైన నిబంధనలను పాటిస్తూ కొత్తగా స్కానింగ్ సెంటర్ల ఏర్పాటుకు సంబంధించి 5 దరఖాస్తులు, రెన్యువల్‌కు సంబంధించి 8 దరఖాస్తులకు, రిజిస్టర్డ్ సర్టిఫికెట్ల సవరణలకు సంబంధించి 15 దరఖాస్తులు, రిజిస్ట్రేషన్ క్యాన్సిలేషన్‌కు సంబంధించి 2 దరఖాస్తులు రాగా వాటిని కమిటీ సభ్యులు క్షుణ్ణంగా పరిశీలించి ఆమోదం తెలిపారు. అనంతరం ఆయుష్మాన్ భారత్ డిజిటల్ హెల్త్ మిషన్ లో భాగంగా అన్ని ప్రభుత్వ, ప్రైవేటు ఆస్పత్రుల డిజిటలైజేషన్ లో భాగంగా జరిగే కార్యక్రమం వాల్ పోస్టర్ కరపత్రాలను ఆవిష్కరించారు. డీఎంహెచ్‌వో డాక్టర్ ఎం.సుహాసిని తదితరులు పాల్గొన్నారు.

హైవేపై కారు- కంటైనర్ ఢీ

చల్లపల్లి: జాతీయ రహదారి–216పై చల్లపల్లి వద్ద బుధవారం రాత్రి కారు–కంటైనర్ ఢీకొన్నాయి. మోపిదేవి మండలం కప్తానుపాలెం నుంచి వేములపల్లి శ్రీహరి తన భార్యతో కలిసి చల్లపల్లి మీదుగా రామానగరం కారులో వెళుతుండగా, మచిలీపట్నం వైపు నుంచి వచ్చిన కంటైనర్ ఢీకొట్టింది. ప్రమాదంలో శ్రీహరి కాలు విరిగిపోగా, ఆయన భార్య స్వల్ప గాయాలతో బయటపడ్డారు. కంటైనర్ పల్టీలు కొట్టుకుంటూ ముందుకు దూసుకుపోయింది. ప్రమాదంలో కారు నుజ్జునుజ్జవగా, స్థానికులు క్షతగాత్రులను ఆస్పత్రికి తరలించారు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

మతిస్థిమితం లేని వ్యక్తి అనుమానాస్పద మృతి

కూచిపూడి(మొవ్వ): కొండవరం శివారు పొలాల్లో ఓ వ్యక్తి మృతదేహం కుళ్లి పోయిన స్థితిలో బుధవారం గుర్తించినట్లు కూచిపూడి ఎస్ఐ టి. శ్రీనివాస్ తెలిపారు. ఎస్ఐ తెలిపిన వివరాల మేరకు.. కూచిపూడి శివారు పక్షులబీడుకి చెందిన కూతాడి నాంచారయ్య(70) మతిస్థిమితం లేని వ్యక్తని, ఈ నెల 23వ తేదీన ఇంటి నుంచి బయటకు వెళ్లి తిరిగి రాలేదు. అయితే యద్దనపూడి–కొండవరం మధ్య గల పొలాల్లో ఓ మృతదేహం ఉందని తెలియడంతో నాంచారయ్య కూమార్తె వెళ్లి చూసింది. ఆ మృతదేహం తన తండ్రిగా గుర్తించి పోలీసులకు సమాచారం తెలిపింది. ఈ సంఘటనపై మృతుని కుమార్తె కందుల నాంచారమ్మ ఇచ్చిన ఫిర్యాదు మేరకు ఎస్ఐ అనుమానాస్పద కేసుగా నమోదు చేసి దర్యాప్తు చేపట్టామని, పోస్టుమార్టం నిమిత్తం మచిలీపట్నం ప్రభుత్వాస్పత్రికి తరలించినట్లు వెల్లడించారు.

వడ్డీతో సహా చికిత్స ఖర్చులను చెల్లించండి

చిలకలపూడి(మచిలీపట్నం): ఖాతాదారుడికి వడ్డీతో సహా ట్రీట్‌మెంట్ ఖర్చులను చెల్లించాలని వినియోగదారుల కమిషన్ అధ్యక్షుడు చింతలపూడి కిశోర్‌కుమార్, సభ్యులు నందిపాటి పద్మారెడ్డి, శ్రీలక్ష్మీ రాయల బుధవారం తీర్పు చెప్పారు. గుడ్లవల్లేరు గ్రామానికి చెందిన పొట్లూరు బాపయ్యచౌదరి భార్య శ్రీదేవి పేర్లతో స్టార్ హెల్త్ అండ్ ఎలైడ్ ఇన్సురెన్స్ కంపెనీలో కరోనా కవచ్ పాలసీ తీసుకున్నారు. వీరిద్దరికీ కరోనా పాజిటివ్ వచ్చి ఆస్పత్రిలో చికిత్స పొందగా చెరో రూ. 2 లక్షలు ఆస్పత్రికి చెల్లించారు. చికిత్సకు సంబంధించిన క్లయిమ్‌ను ఇన్సురెన్స్ కంపెనీ వారికి దరఖాస్తు చేసుకోగా వారు నిరాకరించారు. దీంతో వీరు ఇరువురు వినియోగదారుల కమిషన్‌ను ఆశ్రయించారు. పూర్వాపరాలను విచారించిన అనంతరం కమిషన్ సభ్యులు బాపయ్యచౌదరి, శ్రీదేవిలకు కలిపి రూ. 4 లక్షలు ట్రీట్‌మెంట్ ఖర్చులతో పాటు, క్యాష్ బెనిఫిట్‌గా రూ. 45 వేలు, క్లయిమ్ తిరస్కరించిన నాటి నుంచి 9 శాతం వడ్డీతో చెల్లించాలన్నారు. దీంతో పాటుగా మానసిక వేదన కలిగించినందుకు రూ. 50 వేలు, ఖర్చుల నిమిత్తం రూ. 10 వేలు 30 రోజుల్లోగా చెల్లించాలని ఆదేశించారు.

అపార్ట్‌మెంట్‌పై నుంచి పడి వాచ్‌మెన్ మృతి

అజిత్‌సింగ్‌నగర్(విజయవాడసెంట్రల్): నిర్మాణంలో ఉన్న ఓ అపార్ట్‌మెంట్ పై నుంచి పడి వాచ్‌మెన్ మృతిచెందిన సంఘటన అజిత్‌సింగ్‌నగర్ పోలీస్‌స్టేషన్ పరిధిలో బుధవారం చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం సింగ్‌నగర్ నందమూరినగర్‌లో నిర్మాణంలో ఉన్న అపార్ట్‌మెంట్ వాచ్‌మెన్‌గా పి.నైనవరానికి చెందిన నగరికంటి శ్యామ్యూల్(41) పనిచేస్తున్నాడు. రోజూలానే బుధవారం కూడా నాలుగో అంతస్తులో గోడలు తడిపేందుకు వెళ్లి అక్కడి నుంచి ప్రమాదవశాత్తూ ఒకటో అంతస్తులోకి పడిపోయాడు. పెద్ద శబ్దం రావడంతో చుట్టుపక్కల వారు వెళ్లి చూడగా శ్యామ్యూల్ తలపగిలి రక్తపుమడుగులో మృతి చెంది ఉన్నాడు. సమాచారం అందుకున్న పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ప్రభుత్వ హాస్పిటల్‌కు తరలించారు. మృతుడికి భార్య, ఇద్దరు కుమారులు ఉన్నారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ప్రశాంత ఎన్నికలకు సహకరించండి

చిలకలపూడి(మచిలీపట్నం): ఎన్నికలు స్వేచ్ఛగా, నిష్పక్షపాతంగా, పారదర్శకంగా నిర్వహించేందుకు సహకరించాలని కృష్ణా జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ పి. రాజాబాబు వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధులకు సూచించారు. జిల్లా ఎన్నికల అధికారి, జిల్లా కలెక్టర్ బుధవారం కలెక్టరేట్లో వారి చాంబర్‌లో వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధులు, రిటర్నింగ్ అధికారులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఎన్నికలకు సంబంధించి 16 అంశాల్లో నోడల్ అధికారులను నియమించామన్నారు. ఎన్నికలలో ప్రచార వాహనాలు, ర్యాలీలు, మైక్ తదితర 26 రకాల అనుమతులు ఇవ్వడానికి సింగిల్ విండో డెస్క్ రిటర్నింగ్ అధికారుల కార్యాలయాలలో ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ఎన్నికల ప్రవర్తనా నియమావళి పట్ల వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధులు అవగాహన కలిగి ఉండాలన్నారు. సి–విజిల్ ద్వారా వచ్చిన 148 ఫిర్యాదుల్లో, రాత్రి 10 గంటల నుంచి ఉదయం 6 గంటల నిషేధ సమయం(ఆడ్ అవర్స్)లో లౌడ్ స్పీకర్లు వినియోగిస్తున్నట్లు 61 ఫిర్యాదులు, అనుమతి లేని పోస్టర్లు, బ్యానర్లు గురించి 66 ఫిర్యాదులు అందాయని అన్నారు.

తాత్కాలిక అనుమతులు తీసుకోండి..

జేసీ గీతాంజలి శర్మ మాట్లాడుతూ సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో వివిధ అసెంబ్లీ నియోజకవర్గాల్లో తాత్కాలిక ప్రాతిపదికన ఏర్పాటు చేసుకునే పార్టీ కార్యాలయాలకు అనుమతులు పొందాలన్నారు. ఎంసీసీ నోడల్ అధికారి హాజీ బేగ్ ఎన్నికల ప్రవర్తన నియమావళి, మీడియా నోడల్ అధికారి ఎం. వెంకటేశ్వర ప్రసాద్ ఎంసీఎంసీ ద్వారా రాజకీయ ప్రచార ప్రకటనలకు అనుమతులు గురించి అవగాహన కల్పించారు. తొలుత డీఆర్వో కె. చంద్రశేఖరరావు ఎన్నికల షెడ్యూల్ వివరించారు.

ఔత్సాహిక పారిశ్రామికవేత్తలను ప్రోత్సహించండి

చిలకలపూడి(మచిలీపట్నం): కృష్ణా జిల్లాలో సూక్ష్మ, చిన్న, మధ్య తరగతి పరిశ్రమల ఏర్పాటుకు ఔత్సాహిక పారిశ్రామికవేత్తలను ప్రోత్సహించాలని కలెక్టర్ పి రాజాబాబు అన్నారు. కలెక్టరేట్‌లోని సమావేశపు హాలులో బ్యాంకర్లతో జిల్లా స్థాయి కమిటీ సమావేశాన్ని బుధవారం నిర్వహించారు. కలెక్టర్ మాట్లాడుతూ ఎంఎస్ఎంఈలకు రుణాలు మంజూరు నిరుద్యోగ యువతకు ఉపాధి అవకాశాలు కల్పించేందుకు బ్యాంకర్లు సహకరించాలన్నారు. వార్షిక రుణప్రణాళిక అమలులో భాగంగా 2023–24 ఆర్థిక సంవత్సరంలో 2023 డిసెంబర్ 31వ తేదీ నాటికి వ్యవసాయ రంగంలో ఖరీఫ్‌లో రూ. 5,017 కోట్ల రుణాలు మంజూరు లక్ష్యానికి రూ. 5,378 కోట్ల రుణాలు మంజూరు చేశామన్నారు. రబీలో రూ. 4087 కోట్ల రుణాల మంజూరు లక్ష్యానికి రూ. 6653 కోట్లు రుణాలు మంజూరు చేసి లక్ష్యాన్ని అధిగమించినట్లు తెలిపారు. మైక్రో, స్మాల్, మీడియం ఎంటర్‌ప్రైజెస్ (ఎంఎస్ఎంఈ)లో రూ. 3,532 కోట్ల రుణం మంజూరు లక్ష్యానికి రూ. 3,536 కోట్లు రుణాలు మంజూరు చేసి నూరుశాతానికి పైగా లక్ష్యాన్ని సాధించామన్నారు.

క్లుప్తంగా

అన్ని వర్గాలకు సంక్షేమ పథకాల లబ్ధి



గుణదల (విజయవాడ తూర్పు): సార్వత్రిక ఎన్నికలు సమీపిస్తున్న ప్రస్తుత తరుణంలో ప్రజలంతా వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీని గెలిపించేందుకు సిద్ధంగా ఉన్నారని అసోసియేషన్ ఆఫ్ ఇంటిగ్రేటెడ్ క్రిస్టియన్ కౌన్సిల్ జాతీయ అధ్యక్షుడు గేరా హానోక్ అన్నారు. సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి తలపెట్టిన బస్సు యాత్రకు సంఘీభావం ప్రకటించారు. ఈ మేరకు వైఎస్సార్ సీపీ తూర్పు కార్యాలయంలో బుధవారం విలేకరుల సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజా సంక్షేమం కోసం జగనన్న అహర్నిశలు కృషి చేస్తున్నారని తెలిపారు. ఆయన కృషి ఫలితంగానే రాష్ట్రంలో అన్ని వర్గాల ప్రజలు లబ్ధి పొందారని పేర్కొన్నారు. కుల మతాలకు అతీతంగా అందరికీ సంక్షేమ ఫలాలు అందించడంలో ఆయన నిబద్ధతగా పనిచేశారని చెప్పారు. క్రైస్తవ నాయకులు సైతం సీఎం జగన్ కు తోడుగా బస్సు యాత్రలో పాల్గొనేలా ప్రోత్సహిస్తామని వివరించారు. అనంతరం పోస్టర్‌ను ఆవిష్కరించారు. నాయకులు ప్రభుదాస్, డానియేల్ బోస్, జీవరత్నం, జాన్‌వెస్లీ తదితరులు పాల్గొన్నారు.

చెక్‌పోస్టులు పరిశీలన



భవానీపురం(విజయవాడపశ్చిమ):పోలీస్ కమిషనర్ టీకె రాణా, నగరపాలక సంస్థ కమిషనర్, సెంట్రల్ రిటర్నింగ్ ఆఫీసర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ బుధవారం విజయవాడ పరిధిలో ఉన్న చెక్‌పోస్టులను పరిశీలించారు. సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలోఎన్నికల ప్రవర్తన నియమావళి ఉల్లంఘించకుండా వివిధ ప్రదేశాల్లో ఏర్పాటు చేసిన చెక్‌పోస్టులు, వాటిల్లో కావాల్సిన వసతులను తనిఖీ చేశారు. ఫ్లెయింగ్ స్క్వాడ్ బృందాన్ని కలిసి ప్రజలు మోడల్ కోడ్ ఆఫ్ కండక్ట్ ఉల్లంఘించకుండా కఠిన చర్యలు తీసుకోవాలని అధికారులకు ఆదేశాలు జారీ చేశారు. అజిత్‌సింగ్‌నగర్ వాంబేకాలనీలోగల సీఆర్పీఎఫ్ బృందానికి ఏర్పాటు చేసిన వసతులను పరిశీలించారు. స్టాటిక్ సర్వైలెన్స్ బృందాలు ఉండే సరిహద్దుల్లో చెక్‌పోస్టుల ఏర్పాట్లను పరిశీలించి పలు సూచనలు చేశారు. ఇందులో భాగంగా రామవరప్పాడు రింగ్, ముస్తాబాదు, పవర్‌గ్రిడ్, పాముల కాలువ ప్రదేశాల్లోని చెక్‌పోస్టులను పరిశీలించారు. అనంతరం సింగ్‌నగర్ ఆంధ్రప్రభకాలనీలోని పోలింగ్ బూత్‌లను పరిశీలించి ఎన్నికల సమయంలో ప్రజలకు ఎటువంటి ఇబ్బందులు, సమస్యలు తలెత్తకుండా చూసుకోవాలని అధికారులకు ఆదేశాలు ఇచ్చారు.

ఉత్సవాల ఏర్పాట్లు పరిశీలన



పెనుగంచిప్రోలు: శ్రీతిరుపతమ్మ చిన్న తిరునాళ్లను పురస్కరించుకుని గురువారం నిర్వహించే అమ్మవారి పుట్టింటి పసుపు–కుంకుమ కార్యక్రమాన్ని అందరూ విజయవంతం చేయాలని నందిగామ ఏసీపీ డా.రవికిరణ్ కోరారు. పసుపుకుంకుమ బండ్ల రాకపోకలకు సంబంధించి ఆలయ పరిసరాల్లో చేసిన ఏర్పాట్లను బుధవారం ఆయన పరిశీలించారు. ఆలయ అధికారులకు పలుసూచనలు చేశారు. మునేరులో భక్తులతో మాట్లాడి ఉత్సవాల ఏర్పాట్లు అడిగి తెలుసుకున్నారు. ఎన్నికల కోడ్ అమలులో ఉన్నందున నిబంధనలు అతిక్రమిస్తే కఠిన చర్యలు ఉంటాయని హెచ్చరించారు. డీజే సౌండ్స్‌కు అనుమతి లేదని స్పష్టం చేశారు. ఆలయ ఈఈ వైకుంఠరావు, ఏఈ రాజు, ఎస్ఐ పి.రాంబాబు పాల్గొన్నారు.

ఊయల బహూకరణ

పెనుగంచిప్రోలు: గ్రామంలో వేంచేసియున్న శ్రీతిరుపతమ్మవారి ఆలయానికి బుధవారం ఆలయ డోలు విద్వాంసుడు గుంటుపల్లి సత్యనారాయణ సుమారు రూ.20వేల విలువ కలిగిన టేకు ఊయలను ఈవో కె.రమేష్‌నాయుడు చేతుల మీదుగా అందజేశారు.

కొండంత అభివృద్ధి

- రెండో డివిజన్‌లో రూ.7 కోట్లుతో అభివృద్ధి పనులు
- మెట్లు మార్గాలు, విద్యుద్దీపాలు ఏర్పాటు
- మంచినీటి పైప్‌లైన్ ఏర్పాటు
- సీసీ రోడ్లు , యూజీడీ పనుల నిర్వహణ

లబ్బీపేట(విజయవాడతూర్పు):గత ప్రభుత్వం కొండ ప్రాంతాల ప్రజల సమస్యలను నిర్లక్ష్యం చేసింది. మంచినీటి సమస్య, శిథిలమైన మెట్లుతో ఇబ్బంది పడుతున్నామని ఎమ్మెల్యే గద్దే రామ్మోహన్ దృష్టికి ఎన్నిసార్లు తీసుకెళ్లినా పరిష్కారానికి నోచుకోలేదు. అది చేస్తాం..ఇది చేస్తామని మాయ మాటలు చెప్పే వారే కానీ ఏ ఒక్కపని చేసే వారు కాదు. అయితే 2019లో వైఎస్సార్ సీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత కొండ ప్రాంతాల సమస్యలపై ప్రత్యేకంగా దృష్టి సారించింది. అంతే కాకుండా దేవినేని అవినాష్ సైతం కొండ చివరి ప్రాంతాల వరకూ పర్యటించి వారి సమస్యలు తెలుసుకున్నారు. వాటిని ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి ప్రత్యేక నిధులు కేటాయించి అభివృద్ధి పనులు చేపట్టారు.

రూ.5.50 కోట్లతో మంచినీటి పైప్‌లైన్

కొండ ప్రాంతాల్లో దశాబ్దాలుగా ఉన్న మంచినీటి సమస్యను పరిష్కరించేందుకు రూ.5.50 కోట్లు వ్యయంతో కొత్త పైపులైన్ ఏర్పాటు చేశారు. గతంలో ఉన్న పైప్‌లైన్ శిథిలం కావడంతో దాని స్థానంలో కొత్త పైప్‌లైన్ ఏర్పాటు చేశారు. ఈ పనులు 2,5,6,7 డివిజన్ పరిధిలోని మొగల్రాజపురం క్రీస్తురాజుపురం, బెత్లెహేంనగర్, లూర్దునగర్, మాచవరం, మారుతీనగర్, బ్రహ్మానందరెడ్డినగర్, నిమ్మతోట తదితర ప్రాంతాల్లో కొత్త పైప్‌లైన్ పనులు చేపట్టారు. దీంతో ఆయా ప్రాంతాల్లో మంచినీటి సమస్య పరిష్కారమైంది. ప్రస్తుతం కొండ చివరి ప్రాంతం వరకూ నీటి కొరత లేకుండా ప్రజలు జీవనం సాగిస్తున్నారు.



మొగల్రాజపురంలో నిర్మించిన రిటైనింగ్‌వాల్

మెట్లు పునర్నిర్మాణం....

కొండ ప్రాంతాల్లో గతంలో ఎప్పుడో మెట్లు నిర్మాణం చేపట్టారు. అవి శిథిలావస్థకు చేరడంతో మహిళలు, వృద్ధులు కొండపైకి వెళ్లాలంటేనే తీవ్ర ఇబ్బందులు పడేవారు. ప్రస్తుతం అన్ని ప్రాంతాల్లోని మెట్లు మార్గాలను పునర్నిర్మించి ప్రజల కష్టాలను తీర్చారు. అంతేకాదు మాచవరం కొండపైన ఉన్న కార్మికనగర్ వాసులు సైతం మార్గం లేక అవస్థలు పడేవారు. మెట్లు కోసం వాళ్లు గత ప్రభుత్వం హయాంలో ఉద్యమం కూడా చేశారు. అయినా పరిష్కారం కాలేదు. ప్రస్తుతం కార్మికనగర్‌కు మెట్లు మార్గాలతో పాటు, మంచినీటి సౌకర్యం కల్పించారు.



కొండ ప్రాంతాల్లో నిర్మించిన మెట్ల మార్గం

విద్యుత్ లైన్‌లు ఏర్పాటు....

ఒకప్పుడు మారతీనగర్ కార్మికనగర్, శ్రీలంక కాలనీ తదితర ప్రాంతాల్లో నివశించే వారికి విద్యుత్ సౌకర్యం కూడా ఉండేది కాదు. ఆ ప్రాంతంలో అంతా ఎస్టీలు నివశిస్తుంటారు. ఈ విషయాన్ని దేవినేని అవినాష్ ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి పరిష్కరించారు. ప్రస్తుతం విద్యుత్ లైన్‌లు ఏర్పాటు చేయడంతో పాటు, వీధి దీపాలు కూడా వచ్చాయి. ఇలా కొండ ప్రాంతాల్లోనే అనేక కాలనీల్లో విద్యుత్ లైన్‌లు ఏర్పాటు చేయడంతో పాటు, వీధి దీపాలను కూడా ఏర్పాటు చేశారు. భూగర్భ డ్రైనేజీకి కూడా ఏర్పాటు చేయడంతో ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారు. మా సమస్యలు పరిష్కారం అయ్యాయని సంతోషం వ్యక్తం చేస్తున్నారు.

రూ.6 కోట్లుతో అభివృద్ధి చేశాం



మా డివిజన్‌లోని కుమ్మరిబజార్, బెత్లెహేంనగర్, కార్మికనగర్, దేవినేనినగర్ తదితర ప్రాంతాల్లో అభివృద్ధి పనులు చేపట్టాం. ఇప్పటి వరకూ రూ.6 కోట్లు వెచ్చించి రోడ్లు, మెట్లు మార్గాలు వేశాం. దేవినేని నగర్, శ్రీలంక కాలనీ, కార్మికనగర్ తదితర ప్రాంతాల్లో కొత్తగా విద్యుత్ లైన్‌లు వేశాం. దశాబ్దాలుగా నెలకొన్న సమస్యలు పరిష్కరించాం.

–అంబడిపూడి నిర్మలకుమారి, కార్పొరేటర్, 2వ డివిజన్

ప్రజల సమస్యలు పరిష్కరించాం



మా డివిజన్‌లోని కొండ ప్రాంతాలను గత పాలకులు నిర్లక్ష్యం చేశారు. తాము వచ్చిన వెంటనే సమస్యలపై దృష్టి పెట్టాం. కొండ ప్రాంతాల్లో శిథిలమైన మెట్లు మార్గాలను నిర్మించారు. మంచినీటి సమస్యను పరిష్కరించాం. కొత్తగా పైప్‌లైన్ ఏర్పాటు చేశాం. రిటైనింగ్ వాల్స్ నిర్మించాం. అంతేకాదు కొండ దిగువల సీసీ రోడ్లు వేశాం. ప్రజలు ఏ సమస్య చెప్పినా వెంటనే పరిష్కరించాం.

–మెరకనపల్లి మాధురి, కార్పొరేటర్, 7వ డివిజన్

నేడు విద్యుత్ ఉండని ప్రాంతాలు

ఆటోనగర్(విజయవాడతూర్పు):స్క్యూబ్రిడ్జి సెక్షన్, 11 కేవీ ఫీడర్ పరిధిలో గురువారం ఉదయం 8 నుంచి 12 గంటల వరకు పలు ప్రాంతాల్లో విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగుతుందని కార్యనిర్వాహక ఇంజినీరు బీవీ సుధాకర్ తెలిపారు. పకీర్‌గూడెం, ప్రగతినగర్, శ్రీరాంనగర్, చంద్రమౌళిపురం, ఎంజీరోడ్డు బెంజిసర్కిల్ తో పాటు మైత్రేయ వీధుల్లో కరెంట్ నిలిపివేస్తున్నట్లు చెప్పారు. వినియోగదారులు సిబ్బందికి సహకరించాలని కోరారు.

- మొగల్రాజపురం(విజయవాడ తూర్పు): రింగ్‌రోడ్డు విద్యుత్ సబ్‌స్టేషన్ జయప్రకాష్ నగర్ ఫీడర్ పరిధిలో విద్యుత్ లైన్ల మరమ్మతుల కారణంగా గురువారం ఉదయం 8 నుంచి 10.30 గంటల వరకు విద్యుత్ సరఫరాను నిలిపివేస్తున్నామని ఏపీసీపీడీసీఎల్ గుణదల డివిజన్ ఎగ్జిక్యూటివ్ ఇంజినీరు పి.హరిబాబు ఒక ప్రకటనలో తెలిపారు. వరలక్ష్మి నగర్, ఎల్ఐసీ కాలనీ, ప్రశాంతి నగర్, జయప్రకాష్ నగర్, ఫిల్మ్ కాలనీల్లో విద్యుత్ సరఫరా ఉండదని ఈ విషయాన్ని ఆయా ప్రాంతాల్లోని విద్యుత్ వినియోగదారులు గమనించి తమకు సహకరించాలని ఆయన కోరారు.
- లబ్బీపేట(విజయవాడతూర్పు): మొగల్రాజపురం సెక్షన్ ఎంజీ ఇండోర్ సబ్‌స్టేషన్ పరిధిలోని పలు ప్రాంతాల్లో విద్యుత్ లైన్ల మరమ్మతుల నేపథ్యంలో గురువారం ఉదయం 7 నుంచి 10 గంటల వరకూ విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు ఏపీసీపీడీసీఎల్ కార్యనిర్వాహక ఇంజినీర్ బీవీ సుధాకర్ ఒక ప్రకటనలో తెలిపారు. అందులో భాగంగా జమ్మిచెట్టు ఫీడర్ పరిధిలో మధుగార్డెన్ ఏరియా, ఏఎస్ రామారావు రోడ్డు, శాంతినగర్, జమ్మిచెట్టు సెంటర్, ఉడ్‌పేట, బాడవపేట, వాటర్‌ట్యాంక్ రోడ్డు ప్రాంతాల్లో ఆ సమయంలో విద్యుత్ సరఫరా నిలిపివేస్తామన్నారు.

తూర్పు ప్రజలకు సదుపాయాలు కల్పన

వైఎస్సార్ సీపీ తూర్పు ఎమ్మెల్యే అభ్యర్థి దేవినేని అవినాష్

ఆటోనగర్(విజయవాడతూర్పు): వైఎస్సార్ సీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత తూర్పు నియోజకవర్గంలో ప్రజలకు మౌలిక సదుపాయాలు కల్పించామని ఎమ్మెల్యే అభ్యర్థి దేవినేని అవినాష్ తెలిపారు. 15వ డివిజన్ రామలింగేశ్వరనగర్ కృష్ణవేణి రోడ్డులో బుధవారం నిర్వహించిన ప్రచారంలో అవినాష్ పాల్గొన్నారు. ప్రతి గడపకు వెళ్లి వైఎస్సార్ సీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత జరిగిన అభివృద్ధి, సంక్షేమాన్ని వివరించారు. డెప్యూటీ మేయర్ బెల్లం దుర్గ, మాజీ డెప్యూటీ మేయర్ ఆళ్ల చెల్లారావులతో పాటు డివిజన్ అధ్యక్షులు వెంకటరెడ్డితో కలిసి అవినాష్ పర్యటించారు. ఈ సందర్భంగా దేవినేని అవినాష్ మాట్లాడుతూ గత కొన్ని సంవత్సరాల నుంచి పెండింగ్‌లో ఉన్న కృష్ణానది పరివాహక ప్రాంతంలో నివశించే ఇళ్ల పట్టాల సమస్యను సీఎం వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి పరిష్కరించారని తెలిపారు. దీంతో ఈ ప్రాంత ప్రజలు చాలా సంతోషంగా ఉన్నారని చెప్పారు. కాలువ కట్టలపై ఇళ్లు తీసివేస్తారని టీడీపీ నేతలు చేస్తున్న అసత్య ప్రచారాన్ని పేదలే తిప్పికొడుతారన్నారు. ఎన్నికల్లో ఆపార్టీకి తగిన బుద్ధి చెబుతారని పేర్కొన్నారు. ఈ ప్రాంతంలో కాపు కల్యాణ మండపం నిర్మాణంపై కట్టుబడి ఉన్నామన్నారు.



సంక్షేమ పథకాల లబ్ధి గురించి వివరిస్తున్న అవినాష్

టీడీపీ హయాంలో చేసింది శూన్యం...

టీడీపీ హయాంలో ఏం అభివృద్ధి చేశారో చెప్పుకోలేని దిక్కు మాలిన స్థితిలో ఆ పార్టీ నేతలు ఉన్నారని ధ్వజమెత్తారు. ఈ నియోజకవర్గ ఎమ్మెల్యే ఎవరో కూడా కొందరికి తెలియని దుస్థితి నెలకొని ఉందని ఎద్దేవా చేశారు. జనసేన అధినేత పవన్‌ను సైతం చంద్రబాబు మోసం చేశారని తెలిపారు. జనసేన పార్టీపై చంద్రబాబు ఆధిపత్యాన్ని సహించలేక వైఎస్సార్ సీపీకి వచ్చాను అని బత్తిన రాము చెప్పారని అవినాష్ అన్నారు. అంతే కాకుండా నియోజకవర్గ సీనియర్ నాయకులు యలమంచిలి రవి, బత్తిన రాముతో కలిసి కుటుంబ సభ్యుల్లా తూర్పులో పర్యటిస్తామని వెల్లడించారు. తూర్పు నియోజకవర్గ సీటును గెలిపించి జగనన్నకు బహుమతిగా ఇస్తామని వివరించారు. కార్యక్రమంలో బసవంత్, రామరాజు, సమీ, రెహమాన్, కలాం, భుజంగరావు, రెహమాన్, రమణ, కనకదుర్గ, మల్లిక, జరినా పాల్గొన్నారు.

ముస్లింల అభ్యున్నతికి సంక్షేమ పథకాలు

కృష్ణలంక(విజయవాడతూర్పు):ముస్లిం అభ్యున్నతికి రాష్ట్రంలోని వైఎస్సార్ సీపీ ప్రభుత్వం అనేక సంక్షేమ పథకాలు అమలు చేస్తుందని వైఎస్సార్ సీపీ తూర్పు నియోజకవర్గ ఇన్‌చార్జి దేవినేని అవినాష్ అన్నారు. బుధవారం కృష్ణలంక హైస్కూల్ రోడ్డులోని మస్జిద్‌లో 20, 21 డివిజన్ల ముస్లింలు ఏర్పాటు చేసిన ఇఫ్తార్ విందులో ఆయన పాల్గొన్నారు. ప్రత్యేక ప్రార్థనలు చేశారు. ఈ సందర్భంగా అవినాష్ మాట్లాడుతూ ముస్లిం అభ్యున్నతికి సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అన్ని విధాలా అండగా నిలుస్తున్నారన్నారు. రాష్ట్ర చరిత్రలో మైనారిటీలకు ఉపముఖ్యమంత్రి పదవి ఇచ్చిన ఘనత ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డికే దక్కిందన్నారు. రాష్ట్ర ప్రజల కోసం, ప్రత్యేకంగా ముస్లిం మైనారిటీల అభివృద్ధికి నిరంతరం పనిచేస్తున్న ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డికి అల్లాహ్ ఆశీస్సులు మెండుగా ఉండాలని ప్రార్థించినట్లు తెలిపారు. ముస్లింలందరికీ రంజాన్ శుభాకాంక్షలు తెలిపారు. ప్రతి ఒక్కరూ సుఖ సంతోషాలతో పండుగ జరుపుకోవాలని ఆకాంక్షించారు.



ఇఫ్తార్ విందులో పాల్గొన్న దేవినేని అవినాష్

● రిక్షాపై దర్జాగా...



ఈ శునక రాజసం చూడండి.. సరుగుడు బాదులు రవాణా చేసే రిక్షా వాలా వాహనంపై దర్జాగా కూర్చుని పోజులిస్తున్న ఈ శునకాన్ని పటమట రైతు బజార్ వద్ద సాక్షి కెమెరా క్లిక్‌మనిపించింది.

అభివృద్ధి, సంక్షేమమే లక్ష్యం



10వ డివిజన్‌లో పర్యటిస్తున్న దేవినేని క్రాంతి

లబ్బీపేట(విజయవాడతూర్పు): నియోజకవర్గాన్ని మోడల్‌గా తీర్చిదిద్దడంతో పాటు, అర్హులందరికీ సంక్షేమ పథకాలు అందించడమే లక్ష్యమని వైఎస్సార్ సీపీ తూర్పు అభ్యర్థి దేవినేని అవినాష్ సోదరి దేవినేని క్రాంతి అన్నారు. మీ ప్రాంతాన్ని ఎవరు అభివృద్ధి చేసారో ఒకసారి ఆలోచించుకోవాలని ఆమె సూచించారు. నియోజకవర్గంలో చేపట్టిన గడప గడపకు మీ అవినాష్ అన్న హామీ కార్యక్రమం బుధవారం దేవినేని క్రాంతి 10వ డివిజన్‌లో చేపట్టగా, అవినాష్ సతీమణి దేవినేని సుధీర 4, 8 డివిజన్‌లలో నిర్వహించారు. ఈ సందర్భంగా నాలుగున్నరేళ్లుగా ఆ ప్రాంతం చేసిన అభివృద్ధి, అర్హులకు అందించిన సంక్షేమ పథకాల గురించి వివరించారు. ప్రతి గడపకు వెళ్లి మంచి చేసిన వారికి మద్దతు ఇవ్వండని తెలియచేస్తున్నారు. మీరు పిలిస్తే పలికే వ్యక్తి, సమస్య చెబితే చిత్తశుద్ధితో పరిష్కరించిన అవినాష్‌కు అండగా నిలవాలని కోరారు. నియోజకవర్గంలో అర్హులైన వారందరికీ సంక్షేమ పథకాలు అందించినట్లు చెబుతున్నారు. ప్రతి ఒక్కరికీ మంచి జరగాలంటే రాష్ట్రంలో వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి మళ్లీ అధికారంలోకి రావాలని, తూర్పులో అవినాష్‌ను ఎమ్మెల్యేగా గెలిపించాలని విన్నవించారు. కాగా దేవినేని క్రాంతి, దేవినేని సుధీరల పర్యటనలకు ప్రజల నుంచి ముఖ్యంగా మహిళల నుంచి అనూహ్య స్పందన లభించింది. వారు ఇంటింటికీ చేసిన అభివృద్ధిని వివరిస్తున్న తీరు ఆకట్టుకుంటుంది. ఈ కార్యక్రమంలో 4వ డివిజన్ ఇన్‌చార్జి గల్లా పద్మావతి, పార్టీ అధ్యక్షుడు గల్లా రవి, 10 డివిజన్ ఇన్‌చార్జి కరుటూరి హరీష్ తదితరులు పాల్గొన్నారు.

చాముండి గోల్డ్, డైమండ్ షోరూమ్ ప్రారంభం



లబ్బీపేట(విజయవాడతూర్పు): వస్త్ర వ్యాపార రంగంలో అగ్రగామిగా నిలిచిన చిల్లపల్లి నాగేశ్వరరావు అండ్ సన్స్ ఆధ్వర్యంలో పిన్నమనేని పాలిక్లినిక్ రోడ్డులో ఏర్పాటు చేసిన చాముండి గోల్డ్, డైమండ్ షోరూమ్‌ను బుధవారం లాంఛనంగా ప్రారంభించారు. నాణ్యమైన బంగారు, వజ్రాభరణాలను అందిస్తూ వినియోగదారుల ఆదరణ, నమ్మకం పొందుతున్న తాము, ప్రజలకు మరింత అందుబాటులో ఉండాలని నూతన షోరూమ్ ఏర్పాటు చేసినట్లు షోరూమ్ అధినేత చిల్లపల్లి శ్రీకర్ తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వివాహాది, ఇతర శుభకార్యాలకు వినియోగదారులు కోరుకునే సరికొత్త మోడల్స్‌లో సంప్రదాయాలు ప్రతిబింబించేలా బంగారు, వజ్రాభరణాలు అందిస్తున్నట్లు తెలిపారు. డైమండ్‌లో విక్టోరియన్, పోల్కి డైమండ్స్ కలెక్షన్స్, యాంటిక్ జ్యూయలరీ, టెంపుల్ జ్యూయలరీ, అమృతసర్ కలెక్షన్స్ ఉన్నాయన్నారు.

30న రన్ ఫర్ జీసస్

లబ్బీపేట(విజయవాడతూర్పు): క్రైస్తవుల పవిత్రమైన గుడ్‌ఫ్రైడే, ఈస్టర్ పర్వదినాలను పురస్కరించుకుని ఈ నెల 30న రన్ ఫర్ జీసస్ కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు ఆ కార్యక్రమం ఏపీ స్టేట్ కో ఆర్డినేటర్ రెవరెండ్ బెల్లంకొండ శివాజీరాజు ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 5.30 గంటలకు రాష్ట్ర వ్యాప్తంగా 370 కేంద్రాల్లో జరిగే కార్యక్రమంలో బిషప్‌లు, ప్రీస్టులు, పాస్టర్స్ పాల్గొంటారన్నారు.

వివాహిత అదృశ్యంపై కేసు

సత్యనారాయణపురం(విజయవాడసెంట్రల్):వివాహిత అదృశ్యంపై భర్త ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు. వజ్జా రమేష్ కుటుంబ సభ్యులతో కలసి పూర్ణానందంపేట, జోసఫ్‌స్ట్రీట్‌లో నివాసముంటున్నారు. భార్యాభర్తలు వేర్వేరు ప్రైవేటు సంస్థలో ఉద్యోగాలు చేస్తున్నారు. ఈ క్రమంలో భార్య తనతో పాటు పనిచేసే తోటి ఉద్యోగికి ఆమె పేరు మీద లోన్‌లు ఇప్పించింది. ఈ విషయం తెలియడంతో భర్త ఎందుకు ఇప్పించావంటు అడిగాడు. దీంతో ఆమె భర్తకు తెలియకుండా ఇంట్లోని బంగారు ఆబరణాలను తోటి ఉద్యోగికి ఇచ్చి లోన్లు క్లియర్ చేయించింది. ఈ విషయం కూడా తెలియడంతో బంగారం ఎందుకు ఇచ్చావంటు భర్త మందలించాడు. ఆనంతరం మంగళవారం ఉదయం 9 గంటలకు భర్త ఆఫీస్‌కు వెళ్లిపోయాడు. మధ్యాహ్నం 12.45 గంటల సమయంలో భార్య ఫోన్ చేసి తాను ఇంటి నుంచి వెళ్లిపోతున్నానని చెప్పి స్విచ్చాఫ్ చేసింది. వెంటనే అతను ఇంటికి వెళ్లి చూడగా భార్య కనిపించలేదు. దీంతో చుట్టుపక్కల, బంధువుల వద్ద వెతికినా ఆచూకీ లభ్యం కాలేదు. దీంతో తన భార్య కనిపించడం లేదంటు ఎస్ఎన్ పురం పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు.

● హమ్మయ్య... ఓ పనై పోయింది!



విజయవాడ పటమటలోని కోనేరు బసవయ్య చౌదరి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో పదవ తరగతి పరీక్షలు పూర్తవటంతో పరీక్ష కేంద్రం నుంచి వస్తున్న విద్యార్థులు.

– సాక్షి ఫొటోగ్రాఫర్, విజయవాడ

అమ్మవారి దర్శనానికి పోటెత్తిన భక్తులు

పెనుగంచిప్రోలు: శ్రీతిరుపతమ్మ అమ్మవారి చినతిరునాళ్ల మూడోరోజు బుధవారం భక్తులు పోటెత్తారు. తెల్లవారు జాము నుంచే భక్తులు మునేరులో స్నానాలు చేసి పాలు, పొంగళ్లతో అమ్మవారిని దర్శించుకొని బోనాలు సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు. దూరప్రాంతాల నుంచి వచ్చిన భక్తులు మునేరులో పెద్ద ఎత్తున గుడారాలు ఏర్పాటు చేసుకున్నారు. భక్తులు రాత్రి సమయంలో ఆలయ ప్రాంగణంలో బుర్రకథలు, సాంస్కృతిక కార్యక్రమాలు చూస్తూ కాలక్షేపం చేశారు. ఎగ్జిబిషన్ వద్ద భక్తులు కోలాహలం కనిపించింది. భక్తులకు ఇబ్బంది లేకుండా గ్రామంలో పంచాయతీ ఆధ్వర్యంలో పారిశుద్ధ్య చర్యలు నిర్వహిస్తున్నారు.



వైభవంగా ఏకాదశ రుద్రాభిషేక, శ్రీ చక్రనవార్చన



విజయవాడ కల్చరల్: భారతీ తీర్థ మహాస్వామి 74వ జన్మదినం సందర్భంగా దుర్గాపురంలోని శివరామకృష్ణ క్షేత్రంలో నిర్వహిస్తున్న వైదిక కార్యక్రమాలు అత్యంత వైభవంగా జరుగుతున్నాయి. బుధవారం ఉదయం 8 గంటలకు మహాన్యాస పూర్వక ఏకాదశ రుద్రాభిషేకం, మహాన్యాసం, శ్రీ చక్రనవార్చన, సాయంత్రం ఆది దంపతులకు త్రిశతి, మహామంగళ హారతి, వేదాశీర్వచనం నిర్వహించారు. వేదపండితులు చతుర్వేద పారాయణం పఠించారు. క్షేత్ర ధర్మాధికారి శిష్టా హనుమత్ ప్రసాద్ శృంగేరీ పీఠ ఉత్తరాధికారి విదుశేఖర భారతి మహాస్వామి ఆదేశంతో 73 రోజులపాటు 15 మంది రుత్వికులచే కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఏప్రిల్ 18 వ తేదీ పూర్ణాహుతితో కార్యక్రమాలు పూర్తవుతాయని తెలిపారు.



విజయోస్తు

బస్సు యాత్రలో పాల్గొనేందుకు బుధవారం ఉదయం తాడేపల్లిలోని తన నివాసం నుంచి సతీమణి వైఎస్ భారతితో కలిసి వస్తున్న సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి స్వాగతం పలుకుతున్న మంత్రి జోగి రమేశ్, వైఎస్సార్‌సీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సజ్జల రామకృష్ణారెడ్డి తదితరులు.

- సాక్షి, అమరావతి





ఇడుపులపాయలోని వైఎస్సార్ ఘాట్ వద్ద సీఎం జగన్. చిత్రంలో వైఎస్ విజయమ్మ తదితరులు



తల్లి వైఎస్ విజయమ్మను ఆత్మీయ ఆలింగనం చేసుకుంటున్న సీఎం జగన్



వేంపల్లి వద్ద భారీగా హాజరైన జనసందోహానికి నమస్కరిస్తున్న సీఎం వైఎస్ జగన్



కుమారునిపల్లి వద్ద బస్సులో వెళుతున్న సీఎం జగన్‌కు మోకరిల్లి నమస్కరిస్తున్న అభిమాని

జైత్రయాత్ర ఆరంభం

ఇడుపులపాయ నుంచి బస్సుయాత్రతో ఎన్నికల ప్రచార భేరి మోగించిన సీఎం జగన్

వైఎస్సార్ ఘాట్ వద్ద తల్లి విజయమ్మతో కలిసి నివాళులు అర్పించి ఆశీస్సులు తీసుకున్న సీఎం

సర్వమత ప్రార్థనల అనంతరం బస్సు యాత్రకు శ్రీకారం

భారీగా కదలివచ్చిన నేతలు, కార్యకర్తలు, అభిమానుల హర్షధ్వానాల మధ్య ఆరంభమైన యాత్ర

ప్రొద్దుటూరు వరకూ రహదారిపై కి.మీ. కొద్దీ బారులు తీరిన జనం

అడుగడుగునా అపూర్వ ఆదరణతో ఆలస్యంగా సాగిన బస్సు యాత్ర

వేంపల్లి, వీరపునాయునిపల్లి, ఎర్రగుంట్ల రోడ్ షోలలో నీరాజనం పలికిన జనం

వైఎస్సార్ జిల్లా చరిత్రలో అతి పెద్ద ప్రజాసభగా నిలిచిన ప్రొద్దుటూరు సభ



వైఎస్సార్ జిల్లా ప్రొద్దుటూరులో అశేష జనవాహినికి అభివాదం చేస్తున్న సీఎం జగన్

మేమంతా సిద్ధం బస్సు యాత్ర నుంచి సాక్షి, ప్రత్యేక ప్రతినిధి: మండుటెండనూ లెక్క చేయకుండా కి.మీ. కొద్దీ రోడ్డుకు ఇరువైపులా బారులు తీరిన జనం.. నిప్పులు చిమ్ముతున్న సూరీడుతో పోటీపడుతూ చంటిబిడ్డలను చంకనేసుకుని బస్సు వెనుక పరుగులు తీసిన ఆడబిడ్డలు.. రోడ్డుకు ఇరువైపులా గ్రామాల్లో టెంట్‌లు వేసి వంటలు వండుకుని, సామూహికంగా భోజనాలు చేసి గంటల తరబడి నిరీక్షించిన ప్రజానీకం..! వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు, సీఎం వైఎస్ జగన్ ఇడుపులపాయ నుంచి ప్రారంభించిన 'మేమంతా సిద్ధం' బస్సు యాత్రలో తొలి రోజు కనిపించిన దృశ్యాలు ఇవి. సీఎం జగన్ నాయకత్వంపై ప్రజల్లో బలంగా నాటుకుపోయిన నమ్మకానికి ఈ దృశ్యాలు ప్రతీకగా నిలిచాయి. వైఎస్సార్ జిల్లాలోని ఇడుపులపాయ నుంచి వైఎస్సార్‌సీపీ ఎన్నికల ప్రచార భేరిని సీఎం జగన్ బుధవారం మోగించారు. తాడేపల్లి నివాసం నుంచి ఉదయం 11.50 గంటలకు బయలుదేరిన సీఎం జగన్ ఇడుపులపాయలోని వైఎస్సార్ ఘాట్ వద్దకు మధ్యాహ్నం ఒంటి గంటకు చేరుకున్నారు. తన మాతృమూర్తి వైఎస్ విజయమ్మతో కలిసి వైఎస్సార్‌కు నివాళులు అర్పించారు. అనంతరం తల్లి విజయమ్మ ఆశీస్సులు తీసుకున్నారు. సర్వమత ప్రార్థనలు నిర్వహించి భారీ ఎత్తున తరలివచ్చిన వైఎస్సార్‌సీపీ నేతలు, కార్యకర్తలు, అభిమానుల నినాదాల నడుమ బస్సు యాత్రను సీఎం జగన్ ప్రారంభించారు. ఇడుపులపాయ నుంచి కుమారునిపల్లి వద్దకు బస్సు యాత్ర చేరుకునే సరికి రోడ్డుకు ఇరువైపులా భారీ ఎత్తున జనం బారులు తీరారు. భారీ క్రేన్‌తో గజమాల వేసి సీఎం జగన్‌కు ఆత్మీయ స్వాగతం పలికారు.



ఓ అభిమానితో సెల్ఫీ తీసుకుంటున్న సీఎం జగన్

జనసంద్రమైన వేంపల్లి..

ప్రజలు భారీ ఎత్తున తరలిరావడంతో వేంపల్లి జనసంద్రంగా మారింది. వేంపల్లి అడ్డ రోడ్డు నుంచి హనుమాన్ సర్కిల్ వరకూ సీఎం జగన్ రోడ్ షో నిర్వహించారు. సీఎం జగన్‌ను చూడగానే అవ్వాతాతల నుంచి చిన్న పిల్లల వరకూ హర్షధ్వానాలతో ఘనస్వాగతం పలికారు. హనుమాన్ సర్కిల్ వరకూ కి.మీ. కొద్దీ ఇసుకేస్తే రాలనంత స్థాయిలో రోడ్డుపై కిక్కిరిసిన జనం సీఎం జగన్ బస్సు యాత్రకు నీరాజనాలు పలికారు. మండటెండను కూడా లెక్క చేయకుండా చంటిబిడ్డలను ఎత్తుకుని బస్సు వెంట నడుస్తూ సీఎం జగన్‌ను చూసేందుకు పోటీపడ్డారు. బస్సు యాత్ర సాగుతున్న రహదారికి ఇరువైపులా మారుమూల గ్రామాల ప్రజలు భారీ ఎత్తున రోడ్డుపైకి తరలివచ్చి టెంట్లు వేసుకుని, వంటలు వండుకుని, సామూహికంగా భోజనాలు చేస్తూ సీఎం జగన్ రాక కోసం గంటల కొద్దీ నిరీక్షించారు. బస్సు యాత్ర తమ వద్దకు చేరుకోగానే సీఎం జగన్‌పై బంతిపూల వర్షం కురిపిస్తూ అడుగడుగునా నీరాజనాలు పలకడంతో యాత్ర ఆలస్యంగా ముందుకు సాగింది.

అమ్మ భావోద్వేగం...

పులివెందుల: ఇడుపులపాయ నుంచి బస్సు యాత్ర ప్రారంభం సందర్భంగా వైఎస్సార్ ఘాట్ వద్ద ప్రార్థన నిర్వహించిన వైఎస్ విజయమ్మ భావోద్వేగానికి గురయ్యారు. 'నా బిడ్డను నీకే అప్పజెబుతున్నా దేవుడా..! నా బిడ్డ కష్టాల్లో ఉన్నప్పుడు తోడుగా ఉన్నావు..! ప్రతి బాధలోనూ తోడుగా ఉన్నావు..! నా బిడ్డ తలపెట్టిన కార్యక్రమాలను జయప్రదం చేయాలి..! నా బిడ్డను మళ్లీ సీఎంగా చేయాలని కోరుకుంటున్నా..!' అంటూ ప్రార్థన చేసిన అనంతరం సీఎం జగన్‌ను ఆప్యాయంగా ముద్దాడగా.. ఆయన భావోద్వేగంతో తన తల్లిని ఆలింగనం చేసుకున్నారు. వైఎస్సార్ ఘాట్ వద్ద నివాళులర్పించిన వారిలో డిప్యూటీ సీఎం అంజాద్ బాషా, మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి, రాజ్యసభ సభ్యులు గొల్ల బాబురావు, మేడా రఘునాథరెడ్డి, ఎంపీలు వైఎస్ అవినాష్‌రెడ్డి, మిథున్‌రెడ్డి, చింతా అనూరాధ, ఎమ్మెల్యేలు రవీంద్రనాథరెడ్డి, కొరుముట్ల శ్రీనివాసులు, శ్రీకాంత్‌రెడ్డి, సుధాకర్‌బాబు, చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డి, ఎమ్మెల్సీలు రమేష్‌యాదవ్, రామచంద్రారెడ్డి, ప్రభాకర్, తలశిల రఘురాం, జిల్లా అధ్యక్షులు సురేష్ బాబు, జడ్పీ చైర్మన్ అమర్నాథరెడ్డి, చల్లా మధుసూదన్‌రెడ్డి, దుగ్గాయపల్లె మల్లికార్జునరెడ్డి, శాసనమండలి మాజీ డిప్యూటీ చైర్మన్ సతీష్‌రెడ్డి, వైఎస్ కొండారెడ్డి, సీఎం కార్యాలయ కోఆర్డినేటర్ జనార్దన్‌రెడ్డి, ఎన్ఆర్ఐ రత్నాకర్ తదితరులున్నారు.

జిల్లా చరిత్రలో అతి పెద్ద ప్రజాసభ..

ప్రొద్దుటూరులో బహిరంగ సభ షెడ్యూలు ప్రకారం సాయంత్రం 4.30 గంటలకు ప్రారంభం కావాలి. కానీ.. రహదారి పొడవునా జనం బారులు తీరి స్వాగతం పలకడంతో బైపాస్ రోడ్డు సమీపంలోని సభా ప్రాంగణానికి సాయంత్రం 6.30 గంటలకు సీఎం చేరుకున్నారు. అప్పటికే 30 ఎకరాల్లో ఏర్పాటు చేసిన సభా ప్రాంగణం జనంతో కిక్కిరిసిపోయింది. సీఎం జగన్ వేదికపైకి చేరుకుని ర్యాంప్ వాక్ చేస్తూ అభివాదం చేస్తున్నంతసేపు ప్రాంగణం ప్రజల హర్షధ్వానాలతో మారుమోగిపోయింది. గత 58 నెలలుగా సంక్షేమాభివృద్ధి పథకాలు, సుపరిపాలనతో చేసిన మంచిని వివరిస్తూ.. టీడీపీ- జనసేన-బీజేపీ కూటమి సర్కార్ 2014–19 మధ్య చేసిన మోసాలను ఎండగడుతూ సీఎం జగన్ చేసిన ప్రసంగానికి విశేష స్పందన లభించింది. ప్రొద్దుటూరులో సీఎం జగన్ నిర్వహించిన సభ వైఎస్సార్ కడప జిల్లా చరిత్రలో అతి పెద్ద ప్రజాసభగా నిలిచింది.

ప్రచండ భానుడితో పోటీపడుతూ..

నిప్పులు గక్కుతున్న సూరీడుతో పోటీపడుతూ సీఎం జగన్ కోసం రహదారిపై భారీ ఎత్తున జనం గంటల కొద్దీ నిలబడ్డారు. కమలాపురం నియోజకవర్గంలో వీరపునాయునిపల్లె, గంగిరెడ్డిపల్లి, సంగాలపల్లిలో బస్సు యాత్రకు నీరాజనాలు పలికారు. మండల కేంద్రమైన వీరపునాయునిపల్లిలో సీఎం జగన్ నిర్వహించిన రోడ్ షోకు విశేష స్పందన లభించింది. జమ్మలమడుగు నియోజకవర్గం ఎర్రగుంట్లలోని మెయిన్ రోడ్డు జనసంద్రంగా మారింది. ఎర్రగుంట్లలో సీఎం జగన్ నిర్వహించిన రోడ్ షో సూపర్ హిట్ అయ్యింది.



వైఎస్సార్ జిల్లాలోని వీరఘంటపల్లి క్రాస్ వద్ద గజమాలతో సీఎం జగన్‌కు స్వాగతం

నేడు నంద్యాలలో సీఎం జగన్ సభ

ఆళ్లగడ్డ నుంచి రెండో రోజు మేమంతా సిద్ధం యాత్ర ప్రారంభం

సాక్షి, అమరావతి: మేమంతా సిద్ధం బస్సు యాత్ర రెండో రోజైన గురువారం నంద్యాల జిల్లా ఆళ్లగడ్డలో సీఎం జగన్‌మోహన్‌రెడ్డి నైట్ హాల్ట్ ప్రాంతం నుంచి ప్రారంభంకానుంది. యాత్ర గురువారం షెడ్యూల్‌ను పార్టీ ప్రధాన కార్యదర్శి తలశిల రఘురాం వెల్లడించారు. ఆ వివరాల ప్రకారం.. ఉదయం 9 గంటలకు ఆళ్లగడ్డ నుంచి బయలుదేరి నల్లగట్ల, బత్తలూరు, ఎర్రగుంట్ల చేరుకొని గ్రామస్థులతో ముఖాముఖి కార్యక్రమంలో సీఎం జగన్ పాల్గొంటారు. అనంతరం గోవిందపల్లి మీదుగా ప్రయాణించి చాబోలు శివారులో భోజన విరామం తీసుకుంటారు. తర్వాత నూనేపల్లి మీదుగా నంద్యాల చేరుకుని గవర్నమెంట్ ఆర్ట్స్ కాలేజీ గ్రౌండ్‌లో ఏర్పాటు చేసిన బహిరంగ సభలో ప్రజలను ఉద్దేశించి ప్రసంగిస్తారు. అనంతరం పాణ్యం, సుగాలిమిట్ట, హుస్సేనాపురం, ఓర్వకల్, నన్నూర్, పెద్దటేకూరు, చిన్నకొట్టాల, కె.మార్కాపురం క్రాస్, నాగలాపురంలో ప్రజలతో మమేకమవుతూ పెంచికలపాడులో ఏర్పాటు చేసిన రాత్రి బస శిబిరానికి చేరుకుంటారు.

రాత్రి పూట జన నీరాజనం..

ప్రొద్దుటూరు సభ రాత్రి 8 గంటలకు ముగిసింది. అనంతరం బస్సు యాత్ర మైదుకూరు నియోజకవర్గం దువ్వూరుకు చేరుకునే సమయంలో దారిలో రాత్రి పూట కూడా జనం భారీ ఎత్తున రహదారిపై గంటల తరబడి నిరీక్షించారు. సీఎం జగన్‌పై బంతి పూలవర్షం కురిపించి అభిమానాన్ని చాటుకున్నారు. వైఎస్సార్ కడప జిల్లాలో బస్సు యాత్ర ముగిసి బుధవారం రాత్రి 9.20 గంటలకు నంద్యాల జిల్లా చాగలమర్రిలో ప్రవేశించింది. చాగలమర్రిలో జనం సీఎం జగన్‌కు నీరాజనాలు పలికారు. దారి పొడవునా ఘనస్వాగతాల నడుమ ఆళ్లగడ్డ క్రాస్‌లో బస చేసేందుకు ఏర్పాటు చేసిన శిబిరానికి రాత్రి 10 గంటలకు చేరుకున్నారు. బస్సు యాత్ర తొలి రోజు గ్రాండ్ సక్సెస్ కావడంతో వైఎస్సార్‌సీపీ శ్రేణుల్లో నయా జోష్ నెలకొంది.



వీరపునాయనిపల్లి వద్ద ప్రజలకు అభివాదం చేస్తున్న ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి



వేంపల్లి వద్ద అశేష జనవాహినికి అభివాదం చేస్తున్న సీఎం వైఎస్ జగన్



వేంపల్లి వద్ద సీఎం జగన్‌పై పూలవర్షం కురిపిస్తూ స్వాగతం పలుకుతున్న ప్రజలు







వైఎస్సార్ జిల్లా ప్రొద్దుటూరు సభలో మన ఎన్నికల గుర్తు ఫ్యాన్ అని వివరిస్తూ ప్రసంగిస్తున్న ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి

ప్రతి ఇంటికి సంక్షేమం, అభివృద్ధిని కాంక్షిస్తూ పేదవాడి భవిష్యత్తును కాపాడేందుకు మీరు సిద్ధమా... అయితే మీ సెల్‌ఫోన్‌లో టార్చ్‌లైట్ వెలిగించాలని సీఎం జగన్ అనగానే... తమ సెల్‌ఫోన్లు బయటికి తీసి టార్చ్‌లైట్ బటన్ ఆన్‌చేసి 'మేమంతా సిద్ధమే' అని నినదిస్తున్న ప్రజలు

మోసాలు, నేరాలే వారి చరిత్ర

ప్రొద్దుటూరు బహిరంగ సభలో సీఎం జగన్

విప్లవాత్మక మార్పులకు మారుపేరుగా ఎక్కడా లంచాలు, వివక్షకు తావు లేకుండా ప్రజల అజెండానే జెండాగా వైఎస్సార్‌సీపీ ముందుకెళుతోంది. ఈ జెండా మరో జెండాతో జత కట్టలేదు. రాష్ట్రంలో ఎక్కడ చూసినా మాకు మద్దతుగా సిద్ధం అని ఈ జెండా తలెత్తుకుంది. ప్రజల అజెండాగా రెపరెపలాడుతోంది.

పేద ప్రజల అభివృద్ధి కోసం 130 సార్లు బటన్ నొక్కాను. మీరు మే 13వ తేదిన ఫ్యాన్ గుర్తుపై రెండుమార్లు బటన్ నొక్కడంతోపాటు మరో వంద మందికి మన ప్రభుత్వం చేసిన మంచిని వివరించి ఓటు వేసేలా చైతన్యం తీసుకురావాలి. 48 రోజుల్లో జరగనున్న ఎన్నికల్లో అబద్ధాలు చెప్పేవాళ్లు, మోసం చేసేవాళ్లు మనకు ప్రత్యర్థులు. పేదల వ్యతిరేకులని ఓడించేందుకు మీరంతా సిద్ధమా... (సిద్ధం అని జనం నినాదాలు) అబద్ధాలు, మోసాలు, కుట్రల కూటమిపై గెలుపే లక్ష్యంగా అడుగులు వేస్తున్నాం. ప్రజలకు మంచి చేయని చంద్రబాబు బృందాన్ని నమ్మితే నట్టేట ముంచడం ఖాయం.

ప్రభుత్వ ప్రయోజనాలు అందుకున్న ప్రతి కుటుంబం స్టార్ క్యాంపెయినర్‌గా బయటికి రావాలి. వారంతా మరో వంద మందికి చెప్పి మీ బిడ్డకు తోడుగా నిలవాలి. 2024 ఎన్నికల్లో 'మన కోసం మనం' ప్రతి ఒక్కరూ రెండుసార్లు ఫ్యాన్ గుర్తుపై నొక్కాలి. అలా నొక్కితేనే చంద్రముఖి బెడద ఉండదు. పొరపాటు జరిగితే చంద్రముఖి లక లక లక... అంటూ సైకిల్‌పై వచ్చి టీ గ్లాస్ పట్టుకుని మీ ఇంట్లో రక్తం తాగుతుంది. చంద్రబాబుకు ఓటు వేయడమంటే మన పథకాలను మనమే రద్దు చేసుకోవడం. ఆయన్ను నమ్మడం అంటే మోసం, అబద్ధం, వెన్నుపోటును నమ్మడమే.

– సీఎం వైఎస్ జగన్

సాక్షి ప్రతినిధి, కడప

మోసాలు చేయడం, అబద్ధాలు చెప్పడం, వెన్నుపోటు పొడవడం, కుట్రలు చేయడంలో చంద్రబాబుకు 45 సంవత్సరాల అనుభవం ఉందని.. చేయాల్సిన నేరాలన్నీ చేసేసి నెపం వైఎస్సార్‌సీపీపైకి తోయడంలో ఆయనకు ఎవరూ సాటిలేరని ముఖ్యమంత్రి, వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి నిప్పులు చెరిగారు. తన చిన్నాన్న వివేకానందరెడ్డిని ఎవరు చంపారో, ఎందుకు చంపించారో.. వారితో ఇప్పుడెవరు చెట్టాపట్టాలేసుకుని తిరుగుతున్నారో అందరికీ తెలుసని ఆగ్రహం వ్యక్తంచేశారు. విశాఖలో పట్టుబడిన డ్రగ్స్ బీజేపీ రాష్ట్ర అధ్యక్షురాలు పురందేశ్వరి, చంద్రబాబు బంధువులవని తేలినా, ఎల్లో మీడియా సహకారంతో ఆ నెపాన్ని మనపై నెట్టేందుకు క్షణాల్లో రెడీ అయ్యారని మండిపడ్డారు. మేనిఫెస్టోను చెత్తబుట్టలో వేయడంలో, గోబెల్స్ ప్రచారంలో, కుటుంబాలను చీల్చడంలోనూ చంద్రబాబు అనుభవాన్ని చూస్తున్నామని ధ్వజమెత్తారు. బుధవారం ఇడుపులపాయలో 'మేమంతా సిద్ధం' పేరుతో బస్సు యాత్రకు శ్రీకారం చుట్టిన సీఎం వైఎస్ జగన్.. ప్రొద్దుటూరులో నిర్వహించిన బహిరంగ సభలో అశేష ప్రజానీకాన్ని ఉద్దేశించి ప్రసంగించారు. 'వివేకానందరెడ్డిని అత్యంత దారుణంగా చంపానని హేయంగా చెప్పుకుని తిరుగుతున్నా ఆ హంతకుడికి మద్దతు ఇస్తూ నేరుగా నెత్తిన పెట్టుకుంటున్నారు చంద్రబాబు, ఎల్లో మీడియా. ఈ హంతకుడికి రాజకీయ కాంక్షతో ఒకరిద్దరు నా వాళ్లు కూడా మద్దతిస్తున్నారు. ఎమ్మెల్సీ ఎన్నికల్లో చిన్నాన్నను ఓడించిన వారితో చెట్టా పట్టాలేసుకుని తిరుగుతున్నారు. వివేకం చిన్నాన్న బతికున్నంత వరకు చంద్రబాబును శత్రువుగా భావించారు. ఆయన చనిపోయిన తర్వాత శవ రాజకీయాలతో కుట్రలు చేస్తున్నారు. ఎన్టీఆర్ బతికున్నప్పుడు వెన్నుపోటు పొడిచి, చనిపోయిన తర్వాత శవాన్ని లాక్కొని ఊరూరా విగ్రహాలు పెడుతూ దండలు వేస్తున్నారు. నైతిక విలువలు ఎంత దయనీయంగా ఉన్నాయో ప్రజలు ఆలోచించాలి. నన్ను దెబ్బ తీసేందుకే కుట్రలు చేస్తున్నారు. ఇది కలియుగం కాక మరేమిటి? ఎవరెన్ని కుట్రలు పన్నినా నేను మాత్రం ప్రజల పక్షమే. ఆ దేవుడు, ప్రజల్నే నమ్ముకున్నా. ధర్మం, న్యాయాన్ని నమ్ముకున్నా. ప్రజలకు మంచి చేసిన చరిత్ర మనది. వారిలా వంచించిన చరిత్ర మనకు లేదు. మేనిఫెస్టోలో పది శాతం వాగ్దానాలు కూడా చంద్రబాబు నెరవేర్చలేదు. ఎన్నికల మేనిఫెస్టోను బైబిల్, ఖురాన్, భగవద్గీతలుగా భావించి, త్రికరణ శుద్ధిగా 99 శాతం వాగ్దానాలను అమలు చేసి నిలబెట్టుకున్న చరిత్ర మన ప్రభుత్వానిది. ఈ తేడాను ప్రజలందరూ గమనించాలి' అని చెప్పారు. ఈ సభలో సీఎం జగన్ ఇంకా ఏమన్నారంటే...

వారు చంద్రబాబు వదినమ్మ బంధువులు

- బ్రెజిల్ నుంచి చంద్రబాబు వదిన గారి చుట్టం డ్రై ఈస్ట్ పేరుతో డ్రగ్స్‌ను దిగుమతి చేసుకుంటూ విశాఖపట్నంలో సీబీఐ దాడుల్లో అడ్డంగా దొరికిపోయారు. ఈ ఘటనలో బీజేపీ రాష్ట్ర అధ్యక్షురాలు పురందేశ్వరి, చంద్రబాబు బంధువులు దొరికితే చివరికి ఎల్లో మీడియా సహకారంతో ఆ నెపాన్ని మనపైన నెట్టేందుకు శక్తివంచన లేకుండా కష్టపడుతున్నారు. చంద్రబాబు వదినమ్మ, ఆమె కొడుకు, వియ్యంకుడు తదితరులు డైరెక్టర్లుగా వ్యవహరించిన కంపెనీకి సంబంధించిన ఈ వ్యవహారంలో బుకాయిస్తూ మనపై బురదజల్లుతున్నారు.
- 45 సంవత్సరాలుగా క్షుద్ర రాజకీయాలు చేస్తున్న చంద్రబాబు బంధువులు అడ్డంగా దొరికితే.. వైఎస్సార్‌సీపీ వాళ్లని నీచ రాజకీయాలు చేస్తున్న వాళ్లకు ఈనాడు, ఆంధ్రజ్యోతి, టీవీ–5 ఎల్లో మీడియా వంత పాడుతోంది. ఈనాడు పత్రికను చదువుతుంటే ఛీ ఇదొక పేపరా అనిపిస్తోంది. కేంద్రం నుంచి ఒక పార్టీని పరోక్షంగా, మరొక పార్టీని ప్రత్యక్షంగా తెచ్చుకుని అందరూ కలిసి ఒక్క జగన్‌తో యుద్ధం చేస్తున్నారు. బీజేపీ, కాంగ్రెస్, జనసేన, టీడీపీ, ఈనాడు, ఆంధ్రజ్యోతి, టీవీ5, నా ఇద్దరు చెల్లెళ్లు కలిసి నాపై యుద్ధానికి సిద్ధమయ్యారు.

మంచి చేసి చూపించాడు మీ బిడ్డ

- రాష్ట్రంలో గతంలో ఎన్నడూ జరగని విధంగా సంక్షేమం, అభివృద్ధిని 58 నెలల కాలంలో మీ బిడ్డ చేసి చూపించాడు. ఇడుపులపాయ నుంచి ఇచ్ఛాపురం వరకు ఏ గ్రామంలో నాలుగు అడుగులు వేసినా సచివాలయ వ్యవస్థ కనిపిస్తోంది. అందులో మన పిల్లలు పది మంది ఉద్యోగం చేస్తుండడం కనిపిస్తోంది. 1వ తేదీ ఇంటి వద్దకు చిక్కటి చిరునవ్వుతో అవ్వాతాతలు, వితంతువులు, దివ్యాంగులకు వారి మనవళ్ల విచ్చేసి సెలవు దినమైనప్పటికీ పింఛన్ అందజేస్తుండటమూ కనిపిస్తోంది.
- రూ.3 వేలు పింఛన్ ఇస్తున్న రాష్ట్రం దేశంలోనే ఎక్కడా లేదు. సంవత్సరానికి రూ.24 వేల కోట్లు పింఛన్లకు ఖర్చు చేస్తున్నాం. మన తర్వాతి స్థానంలో తెలంగాణ రూ.12వేల కోట్లు ఖర్చు చేస్తోంది. మిగతా రాష్ట్రాలు రూ.8వేల కోట్లు, రూ.6వేల కోట్లు, 4 వేలకోట్లు ఖర్చు చేస్తున్నాయి. లంచాలు, వివక్షకు ప్రతిరూపాలైన జన్మభూమి కమిటీలు లేనటువంటి వలంటీర్ వ్యవస్థను ఏర్పాటు చేశాం. ఓటు వేయని వారికి కూడా పథకాలు అందిస్తున్నది మీ బిడ్డ పాలనలోనే సాధ్యమైంది.
- మీ బిడ్డ డీబీటీ ద్వారా బటన్ నొక్కడంతో అక్కాచెల్లెమ్మల ఖాతాల్లో నేరుగా డబ్బు జమ అవుతోంది. రూ.2.70 లక్షల కోట్లు ఖాతాల్లో నేరుగా జమ అయింది. ప్రభుత్వ పాఠశాలల్లో ఇంగ్లిష్ మీడియం, సీబీఎస్ఈ, ఐబీ వంటి అంతర్జాతీయ స్థాయి బోధన, ట్యాబ్‌లు, ఐఎఫ్‌బీ, డిజిటల్ బోధన వంటివి ఒక్కసారి పాఠశాలలో కూర్చొని చూస్తే గుర్తుకు వచ్చేది వైఎస్ జగన్, వైఎస్సార్‌సీపీ ప్రభుత్వమే. రైతన్నకు తోడుగా నిలిచింది, రైతన్నకు సాయంగా రైతు భరోసా సొమ్మును అందించడం, రైతన్నకు తోడుగా అసైన్డ్ భూములు, 22ఏ భూములపై శాశ్వత భూహక్కులు అందించడంలో అడుగులు వేగంగా పడ్డాయి.
- ప్రొద్దుటూరు గడ్డపై లక్షల సంఖ్యలో ఉన్న సింహాలగర్జన చరిత్రలోనిలిచిపోతుంది. ఇంతటి గొప్ప సభ గతంలో ఇక్కడ ఎప్పుడూ లేదు. జనసంద్రం కన్పిస్తోంది. దుష్ట చతుష్టయాన్ని నిలువరించడమే లక్ష్యంగా ఎన్నికల సమరంలో పోరాడేందుకు గాండీవంతో అర్జునుడిగా నేను సిద్ధం.. శ్రీకృష్ణులుగా మీరు పాంచజన్యం పూరించేందుకు సిద్ధమా? (ముక్తకంఠంతో మేమంతా సిద్ధమేనని జనం బదులిచ్చారు).

సామాజిక న్యాయానికి పెద్దపీట

- నిరుపేదలకు తోడుగా సామాజిక న్యాయాన్ని చేతల్లో అమలు చేసి చూపిస్తున్న ప్రభుత్వం మనదే. నా ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ, పేదలందరికీ కులం, మతం, రాజకీయం చూడకుండా సామాజిక న్యాయం అమలు చేసి చూపెట్టాం. ముఖ్యమంత్రిగా పని చేసిన వ్యక్తి ఎస్సీలను తూలనాడితే వారు ఎలా బతుకుతారు? మైనార్టీల నాలుగు శాతం రిజర్వేషన్లపై చెలగాటమాడితే వారంతా ఎక్కడికి వెళ్లాలి?
- స్వాతంత్ర్యం వచ్చినప్పటి నుంచి రాష్ట్రంలో నాలుగు లక్షల ఉద్యోగాలు భర్తీ కాగా, మన ప్రభుత్వం వచ్చిన వెంటనే 2.31 లక్షల ప్రభుత్వ ఉద్యోగాలను భర్తీ చేశాం. ఈ ఉద్యోగాల్లో 80 శాతం నా.. నా.. నా.. ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ పిల్లలే ఉద్యోగాలు పొందడం సామాజిక న్యాయం కాదా? రాష్ట్రంలో 31 లక్షల ఇళ్లను అక్కాచెల్లెమ్మల పేరుమీద ఇచ్చాం. ఇందులో 22 లక్షల ఇళ్లు నిర్మాణంలో ఉన్నాయి. ఒక్క ప్రొద్దుటూరులోనే 24 వేల ఇళ్ల పట్టాలు ఇచ్చింది మీ బిడ్డ వైఎస్ జగనే. ప్రతి అక్క, చెల్లెమ్మకు రూ.5–20 లక్షల వరకు ఆస్తిని ఇంటి రూపంలో ఇస్తోంది వైఎస్సార్‌సీపీ ప్రభుత్వమే.
- అక్కచెల్లెమ్మలకు 50 శాతం రిజర్వేషన్లు అమలయ్యేలా చట్టం చేసి సామాజిక న్యాయం అమలు చేశాం. అమ్మ ఒడి, విద్యాదీవెన, వసతి దీవెన, ఆసరా, చేయూత, కాపు నేస్తం, ఈబీసీ నేస్తం తదితర పథకాలన్నీ మహిళా సాధికారతను తీసుకు వచ్చాయి. అక్కాచెల్లెమ్మలు ధైర్యంగా బయటికి వస్తే దిశ యాప్ ఉంది. రక్షణ కోసం గ్రామాల్లో మహిళా పోలీసులను ఏర్పాటు చేశాం.
- గ్రామాల్లో నాలుగు అడుగులు వేయగానే విలేజ్ క్లినిక్ కనిపిస్తుంది. ఫ్యామిలీ డాక్టర్, ఆరోగ్య సురక్ష కార్యక్రమాలతో అందరికీ ఉచితంగా పరీక్షలు, మందుల పంపిణీ సాధ్యమైంది. 104, 108 కొత్త అంబులెన్స్‌లు కుయ్... కుయ్ మంటూ సేవలు అందిస్తున్నాయి. దివంగత మహానేత డాక్టర్ వైఎస్సార్ పేద ప్రజల కోసం ఆరోగ్యశ్రీ, ఉచిత కరెంటు పథకాలు తీసుకురాగా, ఆయన తనయుడిగా మీ బిడ్డ ఆరోగ్యశ్రీని మరింత ఉన్నతీకరించి రూ. 25 లక్షల వరకు ఉచిత వైద్యం అందేలా చేశారు. రాష్ట్రంలో కొత్తగా 17 మెడికల్ కళాశాలల ఏర్పాటు, సూపర్ స్పెషాలిటీ ఆస్పత్రులు నిర్మిస్తున్నాం. 10 షిప్పింగ్ హార్బర్లు నిర్మాణంలో ఉన్నాయి. ఎయిర్‌పోర్టుల విస్తరణపై దృష్టి సారించాం. పారిశ్రామిక కారిడార్‌లో భాగంగా పక్కనే ఉన్న బద్వేలులో సెంచరీ ప్లై బోర్డ్ పరిశ్రమను ప్రారంభించాం. రాష్ట్రంలో పెద్ద పెద్ద పారిశ్రామిక సంస్థలు పెట్టుబడులు పెట్టేందుకు క్యూ కడుతున్నాయి. కోవిడ్ ఉన్నా ఎక్కడా తగ్గకుండా, సాకులు చెప్పకుండా మీ అవసరం రాష్ట్ర అవసరంగా భావించి 58 నెలల కాలంలో 130 సార్లు బటన్ నొక్కాను.

- ఒకే ఒక్కడి మీదకు ఒంటరిగా వచ్చే ధైర్యం ఎవరికీ లేకపోవడానికి కారణం దేవుడి దయ, కోట్లాది మంది ప్రజల గుండెల్లో చోటు ఉండడమే. 75 సంవత్సరాల చంద్రబాబు అధికారం దక్కిన వెంటనే మేనిఫెస్టోను చెత్తబుట్టలో వేస్తారు. మళ్లీ ఎన్నికల సమయానికి కొత్త మేనిఫెస్టో, కొత్త వాగ్దానాలతో రొటీన్‌గా వంచన చేస్తారు. ఎన్నికల్లో తిట్టిన పార్టీలతోనే ఏమాత్రం సిగ్గు లేకుండా జత కడతారు. ఢిల్లీ దాక వెళ్లి కాళ్లయినా పట్టుకుంటారు. విశ్వసనీయత, విలువలు లేని వీళ్ల రాజకీయాలు ఎవరికి స్ఫూర్తినిస్తాయి?


గత ఎన్నికల్లో టీడీపీ మేనిఫెస్టోను చూపిస్తున్న సీఎం వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి

విలువలకు అండగా నిలవాలి

- 2014లో మోదీ, దత్తపుత్రుడితో కలిసి చంద్రబాబు ఎన్నికలకు వెళ్లారు. ఎన్నికల సమయంలో వారు రూపొందించిన అబద్ధాల పాంప్లెట్ ప్రతి ఇంటికి పంపారు. టీవీలు, పేపర్లలో యాడ్స్ వేశారు. రైతులకు రుణమాఫీ, పొదుపు సంఘాలకు రుణమాఫీ, ఆడబిడ్డ పుట్టిన వెంటనే మహాలక్ష్మి పథకం కింద రూ.25 వేలు, ఇంటికో ఉద్యోగం, ఉద్యోగం వచ్చే వరకు నిరుద్యోగ భృతి, రూ.10 వేల కోట్ల బీసీ సబ్ ప్లాన్, సింగపూర్‌ను మించిన రాజధాని, ప్రతి జిల్లాకు హైటెక్ నగరం, మూడు సెంట్ల భూమి వంటి హామీలు ఇచ్చారు. వీటిలో ఒక్కటైనా అమలయ్యాయా? ప్రత్యేక హోదా ఇచ్చారా? (లేదు.. లేదని ప్రజల నినాదాలు)
- మళ్లీ ఇదే బ్యాచ్ ఎన్నికల్లో ఇప్పుడు ప్రజల ముందుకు వస్తోంది. వీరు కొత్త మేనిఫెస్టోలో కిలో బంగారం, బెంజ్ కారు, సూపర్ సిక్స్, సెవెన్ అంటూ మరోసారి మోసం చేసేందుకు రెడీ అయ్యారు. దేశ చరిత్రలో ఇలాంటి రాజకీయాలు ఎక్కడా లేవు. విశ్వసనీయత, విలువలకు ప్రతీకగా నిలుస్తున్న మీ బిడ్డ నోటిలో నుంచి ఒక్కమాట వస్తే దానిని అమలు చేసిన తర్వాతే ఓటు అడుగుతున్నాం. విలువల రాజకీయానికి, పొత్తుల రాజకీయానికి మధ్య జరుగుతున్న పోరులో విలువలకు అండగా నిలవాలి.
- ఫ్యాన్ ఇంట్లో ఉండాలి.. సైకిల్ ఇంటి బయట ఉండాలి.. తాగిన టీ గ్లాస్ సింక్‌లో ఉండాలి. జరుగుతున్న ఎన్నికలు పేదల భవిష్యత్తు నిర్ణయించే ఎన్నికలు. పొరపాటు జరిగితే పేదల బతుకులు అంధకారమవుతాయి. ప్రతి ఇంటికి సంక్షేమం, అభివృద్ధిని కాంక్షిస్తూ పేదవాడి భవిష్యత్తును కాపాడేందుకు మీరు సిద్ధమా? (సిద్ధమే అని సెల్‌లో టార్చ్ ఆన్ చేసి చేతులు పైకెత్తారు.)
- 175 ఎమ్మెల్యే స్థానాలు, 25 ఎంపీ స్థానాలు సాధించడమే మనందరి లక్ష్యం. పేదవాడికి మంచి చేయడంలో ఎక్కడా తగ్గలేదు. ఒక ఎమ్మెల్యే, ఒక ఎంపీ స్థానం కూడా తగ్గడానికి వీలు లేదు.

మన మంచిని ప్రతి ఇంటా చెప్పాలి

- మన ప్రభుత్వం పరిపాలనలో కొత్త ఒరవడిని తీసుకొచ్చిందని, మనం చేసిన మంచిని ప్రతి ఇంటికీ వెళ్లి చెప్పండి. అమ్మ ఒడి, చేయూత, సున్నా వడ్డీ పథకం, కాపునేస్తం, ఈబీసీ నేస్తం, రైతు భరోసా, వాహనమిత్ర మొదలు నేతన్న నేస్తం వరకు మనం అందించే పథకాల ద్వారా లబ్ధి పొందిన విషయాలను ఇంటింటికీ తీసుకువెళ్లండి.
- ఈ పథకాలన్నీ అమలు కావాలన్నా, అవ్వాతాతలకు పెన్షన్లు సకాలంలో రావాలన్నా, మెరుగైన రేషన్ ఇంటికి రావాలన్నా, నాణ్యమైన విద్య, విదేశీ విద్య, వంద శాతం ఫీజు రీయింబర్స్‌మెంట్, పేదవాడికి మెరుగైన వైద్యం, ఆర్బీకేలు, రైతు భరోసా, తొమ్మిది గంటల ఉచిత విద్యుత్, ఇన్‌పుట్ సబ్సిడీ తదితర పథకాలన్నీ కొనసాగాలంటే 'జగన్ రావాలి...వైఎస్సార్ సీపీ ప్రభుత్వం రావాలి' అని తెలియజేయాలి.


ప్రొద్దుటూరులో సభ అనంతరం నంద్యాల జిల్లాకు వెళ్తున్న సీఎం జగన్ కోసం మార్గమధ్యంలో మైదుకూరు నియోజకవర్గంలో రోడ్డుకు ఇరువైపులా వేచి ఉన్న జనం

ఆత్మీయంగా అభ్యర్థుల పరిచయం

'కడప పార్లమెంటు అభ్యర్థిగా పోటీ చేస్తున్న నా తమ్ముడు వైఎస్ అవినాష్ రెడ్డి, ప్రొద్దుటూరు నుంచి పోటీ చేస్తున్న సోదరుడు ప్రసాద్‌రెడ్డి, కమలాపురం నుంచి మామ పి.రవీంద్రనాథ్‌రెడ్డి, బద్వేలు నుంచి పోటీ చేస్తున్న సోదరి డాక్టర్ సుధమ్మ, జమ్మలమడుగు నుంచి పోటీ చేస్తున్న సోదరుడు సుధీర్‌రెడ్డి, కడప నుంచి పోటీ చేస్తున్న నవాబ్ సాబ్ అంజద్‌బాష, మైదుకూరు నుంచి పోటీ చేస్తున్న పితృ సమానులైన ఎస్.రఘురామిరెడ్డి, పులివెందుల నుంచి పోటీ చేస్తున్న నాపై మీ అందరి చల్లని ఆశీస్సులు ఉంచాలి' అని సీఎం జగన్ కోరారు. అనంతరం వేదికపై ఉన్న నాయకులను పేరుపేరునా పలకరిస్తూ యోగ క్షేమాలు అడిగి తెలుసుకున్నారు.


సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి నాగలి బహూకరిస్తున్న నాయకులు

అందరి ఆత్మగౌరవాన్ని నిలబెట్టేలా పాలన



ప్రజల ఆత్మగౌరవాన్ని నిలిపేలా జగనన్న పరిపాలన కొనసాగుతోంది. ఈ ఐదేళ్లలో ఆయన ఆలోచనలతో విప్లవాత్మక మార్పులు సాకారమయ్యాయి. సచివాలయాలు, ఆర్బీకేలు, విలేజ్ హెల్త్ క్లినిక్స్ మన కళ్లెదుటే కనిపిస్తున్నాయి. పరిపాలనను గ్రామ స్థాయికి, ప్రభుత్వ సేవలను ఇంటివద్దకే చేర్చారు. ఇవాళ ప్రతి ఒక్కరూ ఆత్మగౌరవంతో జీవిస్తున్నారు. పెన్షన్లు, ఇళ్ల కోసం ఏ ఒక్కరి దగ్గరికీ వెళ్లి చేయి చాచాల్సిన పనిలేదు. రెండేళ్లు కోవిడ్‌తో ఆర్థిక ఇబ్బందులు ఎదురైనా ప్రతి వాగ్దానాన్ని జగనన్న నిలబెట్టుకున్నారు. ప్రొద్దుటూరులో పేదలకు ఇళ్ల స్థలాలు ఇవ్వడానికి ప్రభుత్వ స్థలం అందుబాటులో లేకపోవడంతో జగనన్న ప్రభుత్వం రూ.200 కోట్లను వెచ్చించి స్థలం కొనుగోలు చేసి 25 వేల మందికి ఇళ్ల పట్టాలిచ్చింది. ఇవాళ గండికోటలో 27 టీఎంసీల నీటిని నిల్వ చేసుకోగలుగుతున్నాం. జగనన్న ప్రభుత్వం రాకముందు కనీసం ఐదు టీఎంసీలు కూడా అక్కడ నిల్వ చేయలేని దుస్థితి. దాదాపు రూ.900 కోట్లు ఖర్చు చేసి ఇవాళ అక్కడ 27 టీఎంసీల నీటిని స్టోరేజీ చేసుకుంటున్నాం. సీబీఆర్‌లో 10 టీఎంసీల నీటిని నిల్వ చేశాం. సాగునీటి ప్రాజెక్టులను పూర్తి స్థాయిలో నింపుతున్నాం. ప్రభుత్వాన్ని వేలెత్తి చూపే పరిస్థితి లేకపోవడంతో విపక్షాలు వ్యక్తిత్వ హననానికి పాల్పడుతున్నాయి. చంద్రబాబుకు బలం, ధైర్యం లేవు కాబట్టే జనసేన, బీజేపీని తోడు తెచ్చుకున్నారు. ప్రత్యక్షంగా, పరోక్షంగా కాంగ్రెస్‌తో కూడా పొత్తు పెట్టుకున్నారు. ఎంతమంది పొత్తులు పెట్టుకున్నా సరే జగనన్నకు తిరుగులేదు.

– వైఎస్ అవినాష్‌రెడ్డి, కడప ఎంపీ

మళ్లీ మీరే సీఎం..



ప్రొద్దుటూరు నియోజకవర్గంలో సీఎం జగన్ తొలి సభను నిర్వహించినందుకు ధన్యవాదాలు తెలియజేస్తున్నా. నియోజకవర్గంలో వివిధ సంక్షేమ పథకాల ద్వారా రూ.1,700 కోట్లను అక్కచెల్లెమ్మలకు సీఎం జగన్ అందించారు. దాదాపు రూ.1,300 కోట్లతో అభివృద్ధి కార్యక్రమాలను చేపట్టగా, 24 వేల ఇళ్ల పట్టాలు ఇచ్చి పేదల సొంతింటి కలను నెరవేర్చారు. దేవుడి దయ, ప్రజల ఆశీస్సులతో వైఎస్ జగన్ మరోమారు ముఖ్యమంత్రిగా ప్రమాణస్వీకారం చేయడం ఖాయం. ఉమ్మడి కడప జిల్లాలో అన్ని స్థానాలను గెలుచుకుంటాం.

– రాచమల్లు శివప్రసాదరెడ్డి, ప్రొద్దుటూరు ఎమ్మెల్యే


సభాస్థలి వద్ద చోటు లేకపోవడంతో బయటే భారీగా వేచి ఉండి సీఎం జగన్ ప్రసంగాన్ని వింటున్న ప్రజలు

క్లుప్తంగా...

నారా భువనేశ్వరిపై చర్యలు తీసుకోండి

- చంద్రబాబు, లోకేశ్, అచ్చెన్నలపై కూడా చర్యలు తీసుకోవాలి
- కేంద్ర ఎన్నికల సంఘానికి వైఎస్సార్‌సీపీ ఫిర్యాదు

సాక్షి, అమరావతి: తెలుగుదేశం పార్టీ అధినేత చంద్రబాబు సతీమణి భువనేశ్వరి ఎన్నికల సంఘం నిబంధనలకు విరుద్ధంగా డబ్బులు పంపిణీ చేయడంపై వైఎస్సార్ సీపీ రాష్ట్ర జనరల్ సెక్రటరీ, ఎమ్మెల్సీ లేళ్ల అప్పిరెడ్డి కేంద్ర ఎన్నికల సంఘం, రాష్ట్ర ఎన్నికల ప్రధాన అధికారికి ఫిర్యాదు చేశారు. ఐపీసీ సెక్షన్లతో పాటు రిప్రజెంటేషన్ ఆఫ్ పీపుల్స్ యాక్ట్‌కింద భువనేశ్వరితో పాటు చంద్రబాబు, లోకేశ్, అచ్చెన్నాయుడుపై చర్యలు తీసుకోవాలని కోరారు. 'నిజం గెలవాలి' పేరుతో భువనేశ్వరి కార్యక్రమం చేపట్టారన్నారు. చంద్రబాబు స్కిల్ స్కామ్‌లో అరెస్టయి జైలుకెళ్లారన్న వార్త విని మరణించిన వారి కుటుంబాలకు ఆర్థిక సాయం చేస్తామంటున్నారని, నిజానికి చంద్రబాబు అరెస్టు వార్తతో చనిపోయారన్న దానికి ఎటువంటి ఆధారం లేదన్నారు. ఇప్పుడు ఎన్నికలను దృష్టిలో పెట్టుకుని ఓటర్లను ఆకర్షించడంతో పాటు సానుభూతి కోసం ఎన్నికల కోడ్‌ను ఉల్లంఘిస్తూ ఏలూరు జిల్లాలోనూ ప్రలోభాలకు గురి చేస్తున్నారని ఫిర్యాదులో పేర్కొన్నారు. మరోవైపు టీవీ5 దురుద్దేశ పూరితంగా తమ పార్టీ నాయకుడు, సీఎం వైఎస్ జగన్ లక్ష్యంగా అసత్య వార్తలు ప్రసారం చేస్తూ మీడియా నియమావళిని ఉల్లంఘించినట్టు పేర్కొన్నారు. పెయిడ్ ప్రమోషన్లతో తమ పార్టీ గౌరవానికి భంగం కలిగిస్తుండటంపై చర్యలు తీసుకోవాలని కోరారు. అదే విధంగా టీడీపీ అండతో 'సీమ రాజ మీడియా' తమపై సోషల్ మీడియాలో విష ప్రచారం చేస్తోందని, ఆ సంస్థ ప్రొడ్యూసర్, యాంకర్, ఇతర వ్యక్తులపై క్రిమినల్ చర్యలకు సిఫారసు చేయాలని విన్నవించారు.

గీతాంజలి చావు కేక భువనేశ్వరికి వినపడలేదా?

ఉప ముఖ్యమంత్రి కొట్టు సత్యనారాయణ



పెంటపాడు: టీడీపీ సోషల్‌మీడియా గూండాల అకృత్యాల కారణంగా అర్ధంతరంగా తనువు చాలించిన గీతాంజలి చావుకేక నారా భువనేశ్వరికి వినపడలేదా? అని ఉప ముఖ్యమంత్రి కొట్టు సత్యనారాయణ ఆగ్రహం వ్యక్తం చేశారు. పశ్చిమగోదావరి జిల్లా పెంటపాడు మండలం విప్పర్రు గ్రామంలో బుధవారం నారా భువనేశ్వరి పర్యటించిన నేపథ్యంలో ఆయన స్పందించారు. మండలంలోని ముదునూరులో ఆయన మాట్లాడుతూ.. అవినీతి కేసులో ముద్దాయి అయిన చంద్రబాబును జైల్లో పెట్టడాన్ని జీర్ణించుకోలేక ఎందరో మృతి చెందారంటూ చేస్తున్న నకిలీ ఓదార్పు యాత్ర వట్టి బూటకమన్నారు. తన ఇద్దరు చిన్నారులను అనాథలను చేసి ఈ లోకాన్ని విడిచి వెళ్లిన గీతాంజలి, భువనేశ్వరికి కనిపించలేదా అని కొట్టు ప్రశ్నించారు. ఎన్టీఆర్‌ను వెన్నుపోటు పొడిచిన చంద్రబాబును ఎన్నడూ భువనేశ్వరి నిలదీయలేదన్నారు. ప్రజల మీద అంత ప్రేమ, కనీసం ఇంగిత జ్ఞానం ఉంటే టీడీపీ సోషల్ మీడియా వల్ల అసువులు బాసిన గీతాంజలి కుటుంబాన్ని ఆమె ఎందుకు పరామర్శించలేదని మండిపడ్డారు. ఇలా చేస్తే లోకేశ్ జైలుకి వెళతాడని ఎవరూ గీతాంజలి గురించి మాట్లాడటం లేదన్నారు. ఏఎంసీ చైర్మన్ ముప్పిడి సంపత్‌కుమార్, నాయకులు కైగాల శ్రీనివాస్, గుండుమోగుల సాంబయ్య, సర్పంచ్ చాంబర్ అధ్యక్షుడు పెన్నాడ సూరిబాబు, ఏఎంసీ వైస్ చైర్మన్ చోడగిరి చినబాబు తదితరులు పాల్గొన్నారు.

ఆక్వారంగం కేరాఫ్ ఏపీ

ఏపీ చాంబర్ ఆఫ్ కామర్స్ ప్రెసిడెంట్ డాక్టర్ వీఎల్ ఇందిరాదత్



ఇందిరాదత్‌కి మెమొంటో ఇస్తున్న చాంబర్ ప్రతినిధులు

సాక్షి, అమరావతి: ఆంధ్రప్రదేశ్‌లో ఆక్వా రంగానికి ఉజ్వల భవిష్యత్ ఉందని ఏపీ ఛాంబర్ ఆఫ్ కామర్స్ ప్రెసిడెంట్ డాక్టర్ వీఎల్ ఇందిరాదత్ పేర్కొన్నారు. ఏపీ చాంబర్ ఆఫ్ కామర్స్ ఆధ్వర్యంలో ఆక్వా పరిశ్రమలో వ్యవస్థాపకత–సాధికారత అనే అంశంపై బుధవారం విజయవాడలో నిర్వహించిన సెమినార్‌లో ఇందిరాదత్ మాట్లాడుతూ.. కృష్ణా–గోదావరి ప్రాంతం ఆక్వా పరిశ్రమ అభివృద్ధి చెందడానికి అనువైన ప్రదేశమన్నారు. బంజరు భూములను సంపద భూములుగా మార్చే అవకాశం ఒక్క ఆక్వా పరిశ్రమకే ఉందన్నారు. ఎంపెడా డిప్యూటీ డైరెక్టర్ డాక్టర్ టీజీ మనోజ్ కుమార్ మాట్లాడుతూ.. దేశీయ వినియోగం కోసం చేపలు, రొయ్యలు, ఇతర సముద్ర ఉత్పత్తులను తప్పనిసరిగా ప్రోత్సహించాలన్నారు. పారిశ్రామికవేత్తలకు ఎగుమతి సామర్థ్యాన్ని, మార్కెట్లను పెంపొందించడానికి వివిధ పథకాల ద్వారా మద్దతు ఇవ్వడానికి ఎంఐఎఫ్, ఎన్‌ఎఫ్‌డీబీ, నేషనల్ ఫిషరీస్ డెవలప్‌మెంట్ వంటి సంస్థలు సిద్ధంగా ఉన్నాయన్నారు. సెంట్రల్ ఇన్‌స్టిట్యూట్ ఫర్ ఫ్రెష్ వాటర్ ఆక్వాకల్చర్ సీనియర్ సైంటిస్ట్ డాక్టర్ రమేష్ రాథోడ్ మాట్లాడుతూ.. సంప్రదాయ మిశ్రమ ఫీడ్‌లకు బదులుగా గుళికలను ఉపయోగించడం ద్వారా ఫీడ్‌లో ఉత్పత్తి ఖర్చులు బాగా తగ్గుతాయన్నారు. స్టేట్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఫిషరీస్ ట్రైనింగ్ రిటైర్డ్ డిప్యూటీ డైరెక్టర్ డాక్టర్ రామ్మోహనరావు, మత్స్యశాఖ రిటైర్డ్ అదనపు డైరెక్టర్ డాక్టర్ కోటేశ్వరరావు, ఫిషరీస్ ట్రైనింగ్ ప్రిన్సిపల్ సైంటిస్ట్ డాక్టర్ మధుసూదన్‌రావు పాల్గొని ప్రసంగించారు.

అది ప్యాంట్రీ కార్..

'బే'కార్' రాతలేల రామోజీ..

బస్సు యాత్ర కోసం వంట సామాన్లను తీసుకెళ్లిన ప్యాంట్రీ వాహనం







ఆళ్లగడ్డలో సీఎం వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి బస చేయనున్న ప్రాంతంలో ఉన్న ప్యాంట్రీ వాహనం

సాక్షి,అమరావతి/సాక్షి, నంద్యాల: 2024 మే 13న జరిగే ఎన్నికల్లో టీడీపీ ఓటమి ఖాయమని, జూన్ 4న జరిగే ఓట్ల లెక్కింపులో వైఎస్సార్ సీపీ విజయ ఢంకా మోగించనున్నదన్న స్పష్టమైన సంకేతాలు ఈనాడు రామోజీరావుకు అందాయి. బయట సర్వేలే కాదు.. స్వయంగా ఈనాడు, ఈటీవీ కంట్రిబ్యూటర్లు నిర్వహించిన సర్వేలోనూ ఎంత తక్కువ అనుకున్నా వైఎస్సార్ సీపీ 150 సీట్లపై మాటే కైవసం చేసుకుంటుందని తేలడంతో ఈనాడు రామోజీరావుకు నిద్రపట్టడం లేదు. చంద్రబాబు కన్నా ముందే ఆయన భయంతో వణికిపోతున్నారు. ఉచ్చనీచాలు మరిచి కథనాలు రాస్తున్నారు. పైత్యం ఎక్కువై ఏమీ లేకున్నా.. అక్కడేదో ఉన్నట్లు, ఏమీ జరగకపోయినా ఏదో జరిగిపోయిందన్నట్టుగా ప్రజలను మభ్యపెట్టేందుకు సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిపై దుష్ప్రచారమే లక్ష్యంగా ఊహాగానాలతో అసత్యాలు అల్లుకుని యథేచ్ఛగా వార్తలు రాస్తున్నారు. ఇలాంటి పైత్యపు రాతలతో రామోజీ కడుపు మంట తీరుతుందే మోగానీ, అవాస్తవాలను వాస్తవం అంటూ ప్రజల్ని మోసం చేయలేరు. సీఎం క్యాంపు కార్యాలయానికి ఈ కంటెయినర్ ఎందుకొచ్చింది? ఏం తెచ్చింది? అంటూ బుధవారం ఈనాడు కట్టుకథను అల్లింది.

ప్యాంట్రీ కార్.. కంటెయినర్‌లా కనిపించిందా?

సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి మేమంతా సిద్ధం పేరుతో బస్సుయాత్రను బుధవారం ఇడుపులపాయ నుంచి ప్రారంభించారు. ఈ యాత్రలో భాగంగా దాదాపు మూడు వారాల (21రోజులు)పాటు ప్రజలోనే ఉండనున్నారు. దీంతో ముఖ్యమంత్రి కోసం ఆహారాన్ని వండేందుకు ఏపీ 16 జడ్ 0363 నంబర్ గల ప్యాంట్రీ వాహనాన్ని ఏర్పాటు చేశారు. ఈ వాహనం మంగళవారం తాడేపల్లిలోని సీఎం క్యాంపు కార్యాలయానికి వంటసామాన్లు తీసుకొచ్చింది. వాహనంలో వాటర్ బాటిళ్లు, వంటకు అవసరమైన కూరగాయలు, వంట సామగ్రి మాత్రమే ఉన్నాయి. ఈ వాహనం మంగళవారం తాడేపల్లి నుంచి బుధవారం ఉదయానికి వైఎస్సార్ జిల్లా వేంపల్లె మండలానికి చేరుకుంది. అక్కడే డీజిల్ కొట్టించుకుని సీఎం వైఎస్ జగన్ బస చేయనున్న ఆళ్లగడ్డకు మధ్యాహ్నానికి చేరుకుంది. చిన్నసైజులో ఉన్న ఈ ప్యాంట్రీ వాహనం ఈనాడుకు, రామోజీరావుకు ఓ పెద్ద కంటెయినర్‌గా కనిపించింది. అంతే ఈ కంటెయినర్ ముఖ్యమంత్రి కార్యాలయానికి ఎందుకు వచ్చింది, ఏమి తెచ్చింది.. అంటూ నిస్సిగ్గుగా ఉన్మాదపు రాతలను ఆ పత్రిక అచ్చేసింది. క్యాంపు కార్యాలయం మీడియా పాయింట్ నుంచి ఈటీవీ ప్రతినిధి ప్యాంట్రీ వాహనం విజువల్స్, ఫొటోలు తీసినట్టు సీసీటీవీ ఫుటేజీ ద్వారా క్యాంపు కార్యాలయ భద్రతా సిబ్బంది గుర్తించారు. వాస్తవానికి ఈ ప్రాంతంలో అనుమతి లేకుండా ఫొటోలు.. వీడియోలు తీయడం నిషిద్ధం. ఇది తెలిసినా ఈనాడు పత్రిక నిబంధనలు మీరి ఫొటోలు, వీడియోలు తీయడమే కాకుండా అడ్డగోలు రాతలు రాసింది. దీనిపై ఉన్నతాధికారులు సీరియస్ అయ్యారు. ఈనాడు, ఈటీవీపై చట్టపరమైన చర్యలకు సిద్ధమయ్యారు. కనీసం క్రాస్ చెక్ చేసుకోకుండా, అధికారులెవరినీ వివరణ అడగకుండా బురద జల్లేలా రాసిన రాతలపై సర్వత్రా విమర్శలు వెల్లువెత్తున్నాయి.

సోషల్ మీడియాలో విపరీతంగా ట్రోల్స్

ఒక వార్త రాసేముందు ఒకటికి రెండుసార్లు క్రాస్ చెక్ చేసుకోవడం జర్నలిస్టు విధుల్లో ఓ భాగం. కానీ, ఈనాడు అత్యుత్సాహానికి పోయి ఊహలతో అబద్ధాలు ప్రచురించింది. దీంతో ప్యాంట్రీ వాహనంలో ఏముందో సోషల్ మీడియాలో వైఎస్సార్ సీపీ ఫొటోలతో సహా బహిర్గతం చేసింది. దీంతో ఈనాడు పరువు పోయింది. ఇవేం రాతలంటూ ఆ పత్రికను ట్రోలర్స్ ఓ ఆట ఆడుకుంటున్నారు.

బెడిసికొట్టిన లోకేశ్ అతి

టీడీపీ నేత నారా లోకేశ్‌కు తరచూ అభాసుపాలవ్వడం రివాజుగా మారింది. బుధవారమూ రొటీన్‌గా తన అజ్ఞానాన్ని బయటపెట్టుకున్నారు. ''నిబంధనలు అతిక్రమించి సీఎం జగన్ ఇంట్లోకి వెళ్లిన కంటెయినర్‌ను ఎందుకు తనిఖీ చేయలేదు' అంటూ ఎక్స్‌లో ట్వీట్ చేశారు. దీనికి ఈనాడు క్లిప్పింగ్‌ను జత చేశారు. అయితే వెంటనే స్పందించిన సోషల్ మీడియా లోకేశ్‌ను రీట్వీట్‌లతో ఓ ఆట ఆడుకుంది. వాహనంలో ఉన్న వస్తువులతోపాటు వాహన వివరాలన్నీ సోషల్ మీడియాలో పోస్ట్ చేయడంతో అతి చేద్దామనుకున్న ఆయన వ్యూహం బెడిసికొట్టింది.



అదే చంద్రబాబు నాయుడి ప్రత్యేకత. ఎంత పెద్ద అబద్ధమైనా సరే... సిగ్గు పడకుండా... పూర్తి ఆత్మవిశ్వాసంతో గొంతు పెంచి మరీ చెప్పేస్తాడు. జనం నమ్మరనే బెరుకు గానీ.. నవ్విపోతారనే సిగ్గెగ్గులు గానీ ఏమాత్రం ఉండవు. ఎలక్షన్ సీజన్ కావటంతో ఇప్పుడు అలాంటి 'చెణుకులు' చాలానే పేలుస్తున్నారు నారా వారు. అవి మీకోసం...

ఒకేసారి లక్షన్నర టీచర్ పోస్టులా?

కుప్పంలో ఎన్నికల ప్రచారం సందర్భంగా ఈ సారి గెలిస్తే మెగా డీఎస్సీ ప్రకటిస్తానని చెప్పిన చంద్రబాబు నాయుడు... తాను అధికారంలో ఉండగా ఒకేసారి లక్షన్నర టీచర్ పోస్టులతో డీఎస్సీ ఇచ్చానని గట్టిగా చెప్పారు. కుప్పంలో మైనారిటీల సమావేశంలో ఆయన ఈ సుభాషితాన్ని వల్లెవేశారు. దీన్ని రాయటానికి 'ఈనాడు' రామోజీరావుకు కూడా కాస్త సిగ్గేసినట్లుంది. అందుకే బాబు చెప్పినట్లు కాకుండా కాస్త మార్చి... ''ఒకప్పుడు చరిత్రలో లేని విధంగా 1.50 లక్షల టీచర్ పోస్టులు ఇచ్చిన ఘనత తమకుందని'' బాబు చెప్పినట్లుగా రాసి పారేశారు.

మరి వాస్తవమేంటో తెలుసా?

ప్రస్తుతం రాష్ట్రంలో ఉన్న మొత్తం టీచర్లు 1.86 లక్షలు. మరి లక్షన్నర పోస్టులు తానే ఇచ్చినట్లు చెప్పుకున్నారంటే ఎంత బరితెగించారనుకోవాలి? ఆయన అధికారంలో ఉన్న 2014–2019 సంవత్సరాల మధ్య 7729 పోస్టులకు ఒకే ఒక్కసారి డీఎస్సీ నోటిఫికేషన్ ఇచ్చారు. కానీ అందులో సగం కూడా భర్తీ చేయలేదు. మరి లక్షన్నర టీచర్ ఉద్యోగాలు ఇచ్చింది ఎప్పుడు? ఉమ్మడి రాష్ట్రంలోనూ లక్షల సంఖ్యలో డీఎస్సీ పోస్టులు భర్తీ చేసిన చరిత్ర ఎప్పుడూ లేదు. కానీ చంద్రబాబు నిస్సిగ్గుగా ఇంతటి అబద్ధాన్ని చెప్పడంపై నిరుద్యోగులు మండిపడుతున్నారు. అధికారంలోకి వస్తే తొలి సంతకం మెగా డీఎస్సీ ఫైలుపై చేస్తానని, 60 రోజుల్లో పోస్టుల్ని భర్తీ చేస్తానని చెప్పారు. మరి 2014 నుంచి 2019 వరకు అధికారంలో ఉన్నప్పుడు ఈ పోస్టుల్ని ఎందుకు భర్తీ చేయలేదనే దానికి సమాధానం లేదు.

మరోసారి చంద్రబాబుకు మాదిగల తాకట్టు

మందకృష్ణపై ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షులు బ్రహ్మయ్య మాదిగ ధ్వజం



మాట్లాడుతున్న బ్రహ్మయ్య మాదిగ

నెహ్రూనగర్: మాదిగలను మరోసారి చంద్రబాబు(కూటమికి)కు తాకట్టు పెట్టేందుకు మందకృష్ణమాదిగ కంకణం కట్టుకున్నాడని, ఈ కుటిల స్వార్థ రాజకీయాలను తిప్పికొట్టేందుకు చైతన్యవంతులైన మాదిగలంతా సిద్ధంగా ఉన్నారని ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షులు ఉసురుపాటి బ్రహ్మయ్యమాదిగ హెచ్చరించారు. ఎన్డీయే కూటమికి మందకృష్ణ మద్దతు ప్రకటించడాన్ని తీవ్రంగా ఖండిస్తూ అరండల్‌పేటలో బుధవారం విలేకరులతో మాట్లాడుతూ.. ఎస్సీ వర్గీకరణ అంశానికి పార్లమెంట్‌లో చట్టబద్ధత కల్పించకుండా సుప్రీంకోర్టులోకి తోసేసి కుట్ర చేసినది బీజేపీ కాదా అని ప్రశ్నించారు. తాము అధికారంలోకి వస్తే వంద రోజుల్లో వర్గీకరణ చేస్తామని 2014లో తిరుపతి వెంకన్న సాక్షిగా టీడీపీతో కలసి బీజేపీ ఎన్నికల మేనిఫెస్టో విడుదల చేసి.. దాన్ని చెత్త బుట్టలో వేసిన విషయాన్ని మరిచిపోయారా అని నిలదీశారు. వర్గీకరణ అంశాన్ని పదేళ్ల పాటు నాన్చి, సుప్రీంకోర్టులోకి తోసేసిన బీజేపీకి రుణపడాలా..ఓటు వేయాలా అని ప్రశ్నించారు. చంద్రబాబు మోసగాడు.. నమ్మకద్రోహి.. మోసానికి బ్రాండ్ అంబాసిడర్, వెన్నుపోటు దారుడు అని మాట్లాడిన మంద కృష్ణ .. మళ్లీ కాపురం చేయాలని చూడడం సిగ్గుచేటన్నారు. మందకృష్ణ మాదిగ కుటిల రాజకీయాలను ఏపీ మాదిగలు తరిమికొట్టేందుకు సిద్ధంగా ఉన్నారని హెచ్చరించారు. ఏపీలో మందకృష్ణ మాదిగ ఏ కార్యక్రమం చేపట్టిన మాదిగలంతా తిప్పికొట్టాలని పిలుపునిచ్చారు. సంఘం నాయకులు పానుగంటి షాలేమ్‌రాజు, ఏటుకూరి విజయ్, ఇతర నాయకులు పాల్గొన్నారు.

టీడీపీ, జనసేన వేధింపులు తాళలేకపోతున్నాం

- రాజమండ్రిలో 15 మంది వలంటీర్లు రాజీనామా
- ఇటీవల వేధింపులు ఎక్కువ అయ్యాయని ఆవేదన




రాజీనామా లేఖలతో వలంటీర్లు

రాజమహేంద్రవరం సిటీ: రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన సచివాలయ వ్యవస్థలో ఐదేళ్లుగా పనిచేస్తున్న తమను టీడీపీ, జనసేన నాయకులు వేధిస్తుండడంతో రాజీనామా చేస్తున్నట్లు రాజమహేంద్రవరం నగరానికి చెందిన 15 మంది వలంటీర్లు చెప్పారు. బుధవారం నగరపాలక సంస్థ కమిషనర్, సచివాలయ అడ్మిన్ సెక్రటరీలకు వారి రాజీనామాలను అందజేశారు. వివరాల్లోకి వెళితే రాజమహేంద్రవరం 1వ డివిజన్ 2వ సచివాలయానికి చెందిన ఒకరు, 48వ డివిజన్ 89వ సచివాలయానికి డివిజన్‌కు చెందిన ఐదుగురు, 90వ సచివాలయానికి చెందిన తొమ్మిది మంది వలంటీర్లు రాజీనామాలను అడ్మిన్ సెక్రటరీలకు అందజేశారు. ఈ సందర్భంగా వలంటీర్లు మాట్లాడుతూ.. తాము ప్రజలకు నిస్వార్థంగా సేవచేస్తూ, ప్రభుత్వం ప్రవేశపెట్టిన ప్రతీ పథకాన్ని ప్రజలకు చేరువ అయ్యేటట్టు చూస్తున్నామన్నారు. అయితే క్షేత్ర స్థాయిలో విధినిర్వహణ సమయంలో టీడీపీ, జనసేన నాయకులు తమను వేధింపులకు గురి చేస్తున్నారని అన్నారు. మిత్రులు, బంధువులతో మాట్లాడినా అనుమానంగా చూస్తున్నారని, ఇది భరించలేకపోతున్నామని చెప్పారు. ఈ పరిస్థితుల్లో వలంటీర్లుగా కొనసాగలేమని చెప్పారు. ఈ విషయమై నగర పాలక సంస్థ అదనపు కమిషనర్ సత్యవేణి స్పందిస్తూ.. 15 మంది వలంటీర్ల రాజీనామాలు అందాయన్నారు. వాటిపై కమిషనర్‌కు నివేదిక సమర్పిస్తున్నట్లు తెలిపారు.

ఇళ్లల్లోని వైఎస్సార్, సీఎం జగన్ ఫొటోల తొలగింపు

- చిత్తూరు జిల్లా రొంపిచెర్లలో వీఆర్వోలు, వీఆర్ఏల దౌర్జన్యం
- అధికారులకు ఫిర్యాదు చేసిన ఎంపీపీ



వీఆర్వోలపై డీటీకి ఫిర్యాదు చేస్తున్న ఎంపీపీ చిచ్చిలి పురుషోత్తంరెడ్డి

రొంపిచెర్ల(చిత్తూరు జిల్లా): దివంగత సీఎం వైఎస్ రాజశేఖరరెడ్డి, సీఎం జగన్‌పై అభిమానంతో ప్రజలు తమ ఇళ్లల్లో, తలుపుల మీద ఏర్పాటు చేసుకున్న ఫొటోలను కొందరు వీఆర్వోలు, వీఆర్ఏలు దౌర్జన్యంగా తొలగించారు. చిత్తూరు జిల్లా రొంపిచెర్ల మండలంలో జరిగిన ఈ ఉదంతంపై స్థానిక ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. వైఎస్ రాజశేఖరరెడ్డి, వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వాల వల్ల లబ్ధి పొందిన రొంపిచెర్ల మండలంలోని చిచ్చిలివారిపల్లె, పెద్దమల్లెల గ్రామ పంచాయతీల ప్రజలు తమ ఇళ్లల్లో, తలుపుల మీద వారి ఫోటోలను ఏర్పాటు చేసుకున్నారు. మంగళ, బుధవారాల్లో వీఆర్వోలు, వీఆర్ఏలు వాటిని తొలగించారు. ఈ విషయం తెలుసుకున్న ఎంపీపీ చిచ్చిలి పురుషోత్తంరెడ్డి వెంటనే రొంపిచెర్ల ఎంపీడీవో రెడ్డెప్పచ్చారి, డిప్యూటీ తహసీల్దార్ లోకేశ్‌ను కలసి ఫిర్యాదు చేశారు. సిబ్బంది తమ తీరు మార్చుకోకపోతే ఎన్నికల కమిషన్‌కు ఫిర్యాదు చేస్తామని హెచ్చరించారు. దీనిపై డిప్యూటీ తహసీల్దార్ లోకేశ్ మాట్లాడుతూ.. ప్రజల ఇళ్లల్లో ఉన్న ఫొటోలు, స్టిక్కర్లను ప్రభుత్వ ఉద్యోగులు తొలగించడం తప్పేనన్నారు. మరోసారి ఇలా జరగకుండా చూస్తామన్నారు. ఫిర్యాదు చేసిన వారిలో వైఎస్సార్‌సీపీ నాయకులు సూర్యనారాయణరెడ్డి, బాలాజీ, సుధాకర్‌రెడ్డి, అమరనాథ్‌రెడ్డి, నాగరాజ, రాజారెడ్డి, సుబ్రమణ్యం తదితరులున్నారు.

ప్రభుత్వంపై కోపం తెచ్చుకోండి

- యువత రోడ్ల మీదకు రండి
- పలమనేరు, పుత్తూరు సభల్లో చంద్రబాబు ప్రసంగం
- అనుభవం ఉన్నా కూడా బీజేపీ, జనసేనతో జతకట్టాను
- బాబు మాట్లాడుతుండగానే వెళ్లిపోయిన జనం



చంద్రబాబు ప్రసంగిస్తుండగా వెళ్లిపోతున్న జనం

సాక్షి, చిత్తూరు/పుత్తూరు/పలమనేరు(చిత్తూరు జిల్లా)/మదనపల్లె/బి.కొత్తకోట: ప్రభుత్వంపై కోపం తెచ్చుకోండి. రోడ్డుపైకి రండి అంటూ యువతను రెచ్చగొట్టేలా టీడీపీ అధినేత చంద్రబాబు ప్రసంగించారు. బుధవారం పలమనేరు, పుత్తూరు, మదనపల్లెలలో ప్రజాగళం పేరుతో ఏర్పాటు చేసిన రోడ్ షోలలో ఆయన ప్రసంగించారు. పలమనేరు సభలో చంద్రబాబు మాట్లాడుతూ.. అధికారం తనకు ముఖ్యం కాదన్నారు. రాష్ట్రాన్ని కాపాడేందుకే వచ్చానన్నారు. కూటమిలో చేరింది తన స్వార్థం కోసం కాదన్నారు. దేశంలో బీజేపీ అధికారంలో ఉంటేనే మైనారిటీలకు రక్షణ అన్నారు. తాము అధికారంలోకి వచ్చిన వందరోజుల్లోనే మెగా డీఎస్సీని పెడతామన్నారు. ఎన్‌డీఏ అధికారంలోకి వస్తే భవిష్యత్తులో కరెంట్ చార్జీలు పెంచబోరని, అందుకు తాను గ్యారెంటీ అన్నారు. క్వాలిటీ మద్యం తెచ్చి మద్యంప్రియులకు మేలు చేస్తామన్నారు.

ప్రజలు గొర్రెలు కాదు.. మరోసారి మోసపోకండి

పుత్తూరు సభలో చంద్రబాబు మాట్లాడుతూ.. ప్రజలు గొర్రెలు కాదని, ఒకసారి మోసపోయారు మరోసారి మోసపోవద్దని అన్నారు. పన్నులు లేని పాలన అందిస్తానన్నారు. రాష్ట్రాన్ని కాపాడడానికే తనకు అనుభవం ఉన్నప్పటికీ బీజేపీ, జనసేనతో జతకట్టానన్నారు. చెల్లెలు షర్మిలను కూడా సీఎం మోసం చేశారన్నారు. ఓపికుంటే నలుగురైదుగురిని కనండి.. సంక్షేమం పెరుగుతూనే ఉంటుందన్నారు. తన మాటంటే మాటేనని హామీ ఇచ్చారు. 2014లో మనం అధికారంలోకి వచ్చుంటే తెలంగాణ కంటే మిన్నగా రాష్ట్రాన్ని అభివృద్ధి చేసేవాడినంటూ మాట తూలారు. 2014లో అధికారంలోకి వచ్చింది తామే అన్న విషయం మర్చిపోయారు.

కేంద్రం సహకరించకుంటే రాష్ట్రం నష్టపోతుంది

మదనపల్లె సభలో చంద్రబాబు మాట్లాడుతూ.. వచ్చే ఎన్నికల్లో గెలిచి తాను ముఖ్యమంత్రి అయినా, కేంద్రం సహకారం లేకపోతే, పింఛన్లు ఇవ్వలేకపోతే, అభివృద్ధి ఏమీ చేయలేకపోతే రాష్ట్రం నష్టపోతుందని చంద్రబాబు అన్నారు. ముస్లింలకు టీడీపీ ఏం చేసిందో, వైఎస్సార్ సీపీ ఏంచేసిందో.. చర్చకు సిద్ధమా అంటూ సవాల్ విసిరారు. మూడు పార్టీల పొత్తుతో ఎవ్వరికీ అన్యాయం జరగదని, మైనారిటీల హక్కులు కాపాడే బాధ్యత తనదేనని చెప్పారు. ఉద్యోగులు మెరిట్ ప్రకారం పనిచేసే విధానాన్ని తెస్తానన్నారు. మాల, మాదిగలు ఇరువురికీ న్యాయం దిశగా వర్గీకరణ తీసుకువచ్చి జిల్లాల వారీగా అమలు చేస్తామన్నారు.

తేలిపోయిన చంద్రబాబు ఎన్నికల సభలు

పలమనేరు, పుత్తూరు, మదనపల్లెలో నిర్వహించిన సభలు జనంలేక తేలిపోయాయి. ఇరుకు రోడ్లలో సభలు పెట్టినా వెలవెలబోయాయి. పైగా చంద్రబాబు ప్రసంగం కూడా జనాన్ని ఏమాత్రం ఆకట్టుకోలేకపోయింది. ప్రతిసారి పేపర్లో రాసుకొచ్చిన పాయింట్లు చూసి చదవటం కనిపించింది. చంద్రబాబు ప్రసంగిస్తుండగానే ఉన్న అరకొర జనం వెళ్లిపోయారు. దీంతో చంద్రబాబు బిత్తర చూపులు చూశారు. జన సమీకరణలో విఫలమయ్యారని టీడీపీ అభ్యర్థులపై చంద్రబాబు అసహనం వ్యక్తం చేసినట్టు తెలిసింది.

బాబును అడ్డుకున్న తంబళ్లపల్లె టీడీపీ శ్రేణులు

మదనపల్లె పర్యటనకు వచ్చిన చంద్రబాబును తంబళ్లపల్లె నియోజకవర్గ టీడీపీ నేతలు అడ్డుకున్నారు. మాజీ ఎమ్మెల్యే శంకర్‌కు టికెట్ ఇవ్వాలంటూ నినాదాలు చేశారు. అంతకుముందు తన కార్యాలయంలో పార్టీ నాయకులతో సమావేశమైన శంకర్ తనకు జరిగిన అన్యాయం గురించి చెప్పుకొంటూ కన్నీళ్లు పెట్టుకున్నారు. తర్వాత పార్టీ శ్రేణులు రోడ్డుపైకి చేరుకుని శంకర్‌కు అనుకూలంగా నినాదాలు చేశారు. హెలీప్యాడ్ నుంచి చంద్రబాబు వస్తుండగా కాన్వాయ్‌ను అడ్డుకున్నారు. చంద్రబాబుకు వినతిపత్రం అందించారు. తాము జయచంద్రారెడ్డి కోసం పనిచేసే ప్రసక్తేలేదని తేల్చి చెప్పారు. దీనిపై చంద్రబాబు ఎలాంటి సమాధానం చెప్పకుండా ముందుకు వెళ్లిపోవడంతో పార్టీ నేతలు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

మిత్రపక్షాలకు నో చాన్స్

ఎన్నికల నగారా మోగిన తర్వాత చంద్రబాబు చిత్తూరు జిల్లాలో ఎన్నికల ప్రచార సభలు నిర్వహించారు. మూడు రోజులుగా కుప్పం, పలమనేరు, పుత్తూరు సభల్లో ప్రసంగించారు. కానీ, చంద్రబాబు సభల్లో మిత్ర పక్షాలకు ఎక్కడా స్థానం దక్కలేదు. సభల్లో మాట్లాడే అవకాశం ఇటు బీజేపీ, అటు జనసేన నేతలకు ఇవ్వలేదు. ప్రసంగాల్లో కూడా ఎక్కడా కూటమి ప్రస్తావన పెద్దగా చెప్పడం లేదు. వన్ మ్యాన్ షో కనిపించింది. దీనిపై బీజేపీ, జనసేన నేతలు మండిపడుతున్నారు. మాట వరుసకు కూడా తమను పిలవడం లేదని కారాలు మిరియాలు నూరుతున్నారు. మదనపల్లె సభలో రాజంపేట బీజేపీ లోక్‌సభ అభ్యర్థి నల్లారి కిరణ్‌కుమార్‌రెడ్డికి ఓటు వేయాలని చంద్రబాబు తన ప్రసంగంలో ఎక్కడా ప్రస్తావించలేదు. ప్రధాని మోదీ ఫొటో లేకుండానే టీడీపీ నేతలు బ్యానర్లు వేశారు.

వలస నేతలే దిక్కు

సాక్షి, అమరావతి: ఎన్నికల్లో పోటీ చేసేందుకు టీడీపీకి అభ్యర్థులు కరువవడంతో ఆ పార్టీ అధ్యక్షుడు చంద్రబాబుకు వలస నేతలే దిక్కయ్యారు. ఎవరూ దొరకని పరిస్థితుల్లో వారికే సీట్లు కట్టబెడుతున్నారు. ఎంపీ స్థానాల్లో చాలావరకు బయట నుంచి వచ్చిన వారిపైనే ఆధారపడ్డారు. 8 అసెంబ్లీ స్థానాలనూ వలస నేతలకే కేటాయించారు. ఇప్పటివరకు ప్రకటించిన 13 ఎంపీ స్థానాల్లో నాలుగింటిని వలస నేతలకే ఇచ్చారు. నరసరావుపేట ఎంపీ సీటును ఇటీవలే వైఎస్సార్‌సీపీ నుంచి ఫిరాయించిన లావు శ్రీకృష్ణదేవరాయులకు కేటాయించారు. నెల్లూరు ఎంపీ స్థానాన్ని మరో ఫిరాయింపు నేత వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డికి ఇచ్చారు. నంద్యాల ఎంపీ సీటుకు అభ్యర్థి లేకపోవడంతో రాయలసీమకు చెందిన బైరెడ్డి రాజశేఖర్‌రెడ్డి కుమార్తె, బీజేపీ నేత బైరెడ్డి శబరిని పార్టీలో చేర్చుకుని సీటు ఇచ్చారు.



శ్రీకృష్ణదేవరాయులు



వేమిరెడ్డి



బైరెడ్డి శబరి

అసెంబ్లీ స్థానాల్లోనూ వలస నేతలే

పలు అసెంబ్లీ స్థానాలను చంద్రబాబు వలస నేతలకు కట్టబెట్టారు. వైఎస్సార్‌సీపీ నుంచి టీడీపీలోకి ఫిరాయించిన కొలుసు పార్థసారథి, వసంత కృష్ణప్రసాద్, కోనేటి ఆదిమూలం, వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి సతీమణి ప్రశాంతి, ఆనం రామనారాయణరెడ్డి, కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి, యార్లగడ్డ వెంకట్రావు, కన్నా లక్ష్మీనారాయణలకు సీట్లు కట్టబెట్టారు. పెనమలూరు ఎమ్మెల్యేగా ఉన్న పార్థసారథి టీడీపీ కండువా కప్పుకోకముందే సీటు ప్రకటించారు.

అభ్యర్థులే దొరకని దుస్థితి

మూడు నెలల క్రితం వరకు టీడీపీకి అనేక చోట్ల అభ్యర్థులే దొరకని పరిస్థితి ఏర్పడింది. 50కిపైగా నియోజకవర్గాల్లో ఆ పార్టీకి ఇన్‌ఛార్జిలు లేరు. గతంలో పోటీ చేసిన నేతలు మొఖం చాటేయడంతో పార్టీ పరిస్థితి దయనీయంగా మారింది. ఈ నేపథ్యంలో దిక్కులేక ఫిరాయింపు నేతలను చేర్చుకుని సీట్లు ఇచ్చారు. ఇంకా ప్రకటించాల్సి ఉన్న ఆరు ఎమ్మెల్యే, నాలుగు ఎంపీ స్థానాల్లోనూ అభ్యర్థుల కొరత ఉన్నట్లు కనిపిస్తోంది. ప్రకాశం జిల్లా దర్శి స్థానానికి పోటీ చేసే అభ్యర్థి కోసం ఇంకా అన్వేషణ కొనసాగిస్తూనే ఉన్నారు.

బాపట్లకు తెలంగాణ దిగుమతి నేత

బాపట్ల ఎంపీ సీటును ఏకంగా రాష్ట్రంతో సంబంధం లేని తెలంగాణ బీజేపీ నేత తెన్నేటి కృష్ణప్రసాద్‌కు ఇవ్వడం ద్వారా పార్టీ శ్రేణులను చంద్రబాబు నివ్వెరపరిచారు. తద్వారా ఎంపీ అభ్యర్థుల కోసం చంద్రబాబు బయట పార్టీలపై ఎంత ఆధారపడ్డారో అర్థం చేసుకోవచ్చు. కనీసం పార్టీలో చేరకుండానే కృష్ణప్రసాద్‌కి సీటు కేటాయించారు. సీటు ప్రకటించి వారం రోజులైనా ఇంతవరకు ఆయన టీడీపీలో చేరకపోవడం విశేషం. ఇంకా అభ్యర్థులను ప్రకటించాల్సిన నాలుగు ఎంపీ సీట్లలోనూ వలస నాయకులనే నిలబెట్టేందుకే ప్రయత్నిస్తున్నారు. వైఎస్సార్‌సీపీ టికెట్ నిరాకరించిన మరో ఎంపీ మాగుంట శ్రీనివాసులరెడ్డిని ఇప్పటికే టీడీపీలో చేర్చుకున్న చంద్రబాబు ఆయనకు ఒంగోలు స్థానాన్ని దాదాపు ఖరారు చేశారు. మొదట ఆయన కుమారుడు రాఘవరెడ్డికి సీటు ఇవ్వాలనుకున్నా ఢిల్లీ మద్యం కుంభకోణంలో అరెస్టయి బెయిల్‌పై ఉన్నందున శ్రీనివాసులరెడ్డికి సీటు ఇవ్వాలని నిర్ణయించారు.

వైఎస్సార్‌సీపీలోకి భారీగా చేరికలు



మంత్రి రజిని సమక్షంలో వైఎస్సార్‌సీపీలో చేరిన టీడీపీ శ్రేణులు

పెదవేగి/భీమవరం/తణుకు టౌన్/దెందులూరు/పట్నంబజారు: వైఎస్సార్‌సీపీలో బుధవారం పెద్ద ఎత్తున బీజేపీ, టీడీపీ నేతలు, కార్యకర్తలు చేరారు. ఏలూరు జిల్లా పెదవేగిలో బీజేపీ మండల అధ్యక్షుడు పొన్నూరు శంకర్‌గౌడ్, ఆయన అనుచరులు, పలువురు టీడీపీ కార్యకర్తలు దెందులూరు ఎమ్మెల్యే కొఠారు అబ్బయ్యచౌదరి, వైఎస్సార్‌సీపీ ఏలూరు ఎంపీ అభ్యర్థి కారుమూరి సునీల్‌కుమార్ సమక్షంలో వైఎస్సార్‌సీపీలో చేరారు. పార్టీలో చేరిన వారిలో గద్దె యాకోబు, గారపాటి అశోక్, తాత నర్సింహరావు, రాజులపాటి సత్యనారాయణ, రాజులపాటి రమేష్, పామర్తి వెంకటేశ్వరరావు, వసంత నర్సింహరావు, స్వామి దాసు తదితరులు ఉన్నారు. అలాగే, దెందులూరు మండలం సీతంపేటకి చెందిన 10 కుటుంబాలు ఎమ్మెల్యే కొఠారు అబ్బయ్యచౌదరి సమక్షంలో వైఎస్సార్‌సీపీలో చేరాయి. పార్టీలో చేరిన వారిలో మాజీ సర్పంచ్ కంచె రాము, వల్లివేలు త్రిమూర్తులు రాజు, శంకర మహేష్, తిరుమలశెట్టి మురళి, కోటిపల్లి సతీష్, బొల్లి రాజేష్, వరప్రసాద్, పాలపర్తి రామదాసు తదితరులున్నారు. భీమవరం 36వ వార్డుకు చెందిన జనసేన, టీడీపీ నేతలు, కార్యకర్తలు ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే గ్రంధి శ్రీనివాస్ సమక్షంలో వైఎస్సార్‌సీపీలో చేరారు. పార్టీలో చేరిన వారిలో సయ్యద్ బాషా, కెల్లా శ్రీనివాస్, బైనపాల కృష్ణ, యర్ర శ్రీను, కుంచనపల్లి రామలింగరాజు తదితరులున్నారు. పశ్చిమ గోదావరి జిల్లా తణుకు మండలంలో మంత్రి కారుమూరి నాగేశ్వరరావు సమక్షంలో తేతలి గ్రామంలోని పలువురు వైఎస్సార్‌సీపీలో చేరారు. గుంటూరు పశ్చిమ నియోజకవర్గంలోని కేవీపీ కాలనీ సమీపంలో ఉన్న కొత్త కాలనీ, చుట్టుగుంట ప్రాంతాల నుంచి భారీగా టీడీపీ నాయకులు, కార్యకర్తలు మంత్రి విడదల రజిని సమక్షంలో వైఎస్సార్ సీపీలో చేరారు. పార్టీలో చేరిన వారిలో శేషు, కొండలు, ఆనంద్, రాంచంద్రయ్య, సత్యన్నారాయణ, అంజి తదితరులున్నారు.



'ప్రతి మనిషిలోనూ ఓ డాక్టర్ ఉంటారు. ప్రతి ఒక్కరిలో వైద్యం గురించి ప్రాథమిక అవగాహన ఉంటుంది' అనే మౌలిక సూత్రాన్ని పట్టుకున్నారు డాక్టర్ సరళ. వైద్యరంగాన్ని అత్యంత సరళంగా వివరించి చెబుతున్నారు. ఆసక్తి ఉన్న వాళ్లను, ముఖ్యంగా గృహిణులను హెల్త్ అడ్వయిజర్‌లుగా తీర్చిదిద్దుతున్నారు. ఆహ్వానం పలికిన కాలనీలకు వెళ్లి హెల్త్ అవేర్‌నెస్ క్యాంపులు నిర్వహిస్తున్నారు. "ఇంటింటా ఓ డాక్టర్' ఉండాలి. ఆ డాక్టర్ మహిళ అయితే ఇంట్లో అందరి ఆరోగ్యాన్ని కాపాడుతుంది. తన బంధువులు స్నేహితులకు నిస్వార్థమైన వైద్యసేవలందిస్తుంది. గ్రామాల్లో వైద్య సహాయం అందని పరిస్థితులు ఇప్పటికీ ఉన్నాయి. నేను తయారు చేస్తున్న హెల్త్ అడ్వయిజర్ వ్యవస్థ ద్వారా ఆ లోటును భర్తీ చేయాలనేది నా ఆకాంక్ష" అన్నారు డాక్టర్ సరళ. ఆమె సాక్షితో మాట్లాడుతూ "నేను డాక్టర్ కావాలనే ఆలోచన నాది కాదు, మా అమ్మ కోరిక. నిఫ్ట్‌లో కోర్సు చేసి ఫ్యాషన్ డిజైనర్ కావాలనే నా ఆకాంక్ష నెరవేరలేదు. కానీ వైద్యరంగాన్ని సమాజానికి అవసరమైనట్లు రీ డిజైన్ చేస్తున్నా"నని చెప్పారు.

● సరళ వైద్యం

ఇంటింటా డాక్టర్

''మాది కాకినాడ. నాన్న బిజినెస్ చేస్తారు. అమ్మ గవర్నమెంట్ ఉద్యోగంలో హెడ్ ఆఫ్ ది ఫార్మసీ డిపార్ట్‌మెంట్‌గా రిటైరయ్యారు. ఆడవాళ్లను చదువులో ప్రోత్సహించడం మా ఇంట్లోనే ఉంది. అమ్మకి పదవ తరగతి పూర్తయిన వెంటనే పెళ్లి చేశారు. మా నాన్నే అమ్మను చదివించారు. ఇక ముగ్గురు పిల్లల్లో నేను పెద్దదాన్ని కావడంతో అమ్మ కల నెరవేర్చే బాధ్యత నాదయింది. సాధారణంగా మెడిసిన్‌లో ఎంబీబీఎస్‌లో సీట్ రాని వాళ్లు హోమియో, ఆయుర్వేదం వంటి ఆల్టర్నేటివ్ మెడిసిన్ వైపు వెళ్తారనే అభిప్రాయం సమాజంలో స్థిరంగా ఉంది. కానీ హోమియో మీద ఇష్టంతో బీహెచ్ఎమ్ఎస్‌లో చేరాను. ఖాళీ సమయాల్లో కూడా మా ప్రొఫెసర్‌లకు సహాయం చేస్తూ సబ్జెక్టులోతుగా తెలుసుకున్నాను. పెళ్లి అయి వైజాగ్ వెళ్లిన తర్వాత సీనియర్ దగ్గర ఏడాది పని చేయడం నన్ను పరిపూర్ణం చేసింది. ఈ రంగంలో సాధించే అనుభవం అంతా పేషెంట్‌తో ఎక్కువసేపు మాట్లాడి, వ్యాధి లక్షణాలను, వారి జీవనశైలిని, మానసిక స్థితి గురించి వివరంగా అడిగి తెలుసుకోవడంతోపాటు ఎక్కువమందికి వైద్యం అందించడమే. అప్పుడే సొంతంగా ప్రాక్టీస్ పెట్టగలిగిన ధైర్యం వస్తుంది. హైదరాబాద్‌లో సొంతంగా క్లినిక్ తెరవడం... నన్ను సమాజం కోసం పని చేయాలనే ఆలోచనకు బీజం వేసింది.

పేషెంట్‌ల వల్లనే తెలిసింది!

నేనిప్పుడు ఇండియన్ ఆయిల్ కార్పొరేషన్‌లో ప్యానల్ డాక్టర్‌గా సేవలందిస్తున్నాను. నెలకు కనీసం పదికి తక్కువ కాకుండా హెల్త్ అవేర్‌నెస్ ప్రోగ్రామ్స్ చేస్తున్నాను. హెల్త్ కేర్ అవేర్‌నెస్ ప్రోగ్రామ్‌ల అవసరం ఉందని గుర్తించడానికి కారణం నా దగ్గరకు వచ్చే పేషెంట్‌లే. డయాబెటిస్, హైపర్ టెన్షన్, స్ట్రోక్, క్యాన్సర్ వంటి దీర్ఘకాలిక వ్యాధుల చికిత్స కోసం నా దగ్గరకు వచ్చే చాలామందిలో అప్పటికే వ్యాధి తీవ్రత పెరిగిపోయి చికిత్సకు స్పందించని స్థితికి చేరి ఉండేది. అల్లోపతిలో వైద్యం చేయించుకుని ఆరోగ్యం మెరుగైన వాళ్లు సంతోషంగా జీవితాన్ని కొనసాగిస్తుంటారు. అక్కడ సాంత్వన లభించని వాళ్లు ఓ ప్రయత్నం అన్నట్లుగా హోమియో వంటి వైద్య ప్రక్రియల వైపు వస్తుంటారు. ఆల్టర్‌నేటివ్ మెడిసిన్ పట్ల అవగాహన లేకపోవడమే ఇందుకు కారణం.



● కాలేజ్‌లో హెల్త్ కేర్ అవేర్‌నెస్ ప్రోగ్రామ్ (ఫైల్ ఫొటో)

మూడు నెలల్లో పూర్తి స్థాయిలో చికిత్స చేయగలిగిన మందులు ఉండి కూడా చివరి దశ వరకు ఈ చికిత్సకు అందుబాటులోకి రాకపోవడం వల్ల ప్రాణాలు కోల్పోతున్న వాళ్లు ఎందరో. అలాంటి గ్యాప్‌కు 2015 నుంచి నేను బ్రిడ్జినవుతున్నాను. గతంలో కాలనీలకు వెళ్లి సమావేశాలు ఏర్పాటు చేయాల్సి వచ్చేది. సమావేశం ఉందనే సమాచారం కాలనీలో అందరికీ చేర్చడం కూడా ప్రయాసతో కూడి ఉండేది. ఇప్పుడు ఒక గేటెడ్ కమ్యూనిటీలో వందకు పైగా కుటుంబాలు నివసిస్తున్నాయి. ఆ కమ్యూనిటీ వాట్సాప్ గ్రూప్‌లో ఒక్క మెసేజ్ పెడితే సమాచారం అందరికీ చేరుతుంది. ఆసక్తి ఉన్నవాళ్లు హాజరవుతున్నారు. స్కూళ్లకు, కాలేజీలకు వెళ్లి మెన్‌స్ట్రువల్ హెల్త్, పీసీఓడీ వంటి సమస్యల మీద అవగాహన కల్పిస్తున్నాను. దీనికి తోడుగా హెల్త్ అడ్వైజర్ అనే కాన్సెప్ట్‌కు కూడా శ్రీకారం చుట్టాను.

వారం రోజుల శిక్షణ

అనారోగ్యాల పట్ల జాగ్రత్తగా ఉండాలి, కానీ ప్రతి చిన్న ఆరోగ్య సమస్యకీ బెంబేలు పడిపోయి హాస్పిటళ్లకు పరుగులు తీయాల్సిన పని ఉండదు. సాధారణ జలుబు, దగ్గు వంటి వాటికి ఇంట్లోనే వైద్యం చేసుకోవచ్చు. మూడు రోజులు దాటినా తగ్గకపోతే డాక్టర్ దగ్గరకు వెళ్లమని చెబుతాం. మొదటి మూడు రోజుల వైద్యం అందించగలిగేటట్లు హెల్త్ అడ్వైజర్‌లను తయారు చేస్తున్నాను. రోజుకో గంటసేపు వారం రోజులపాటు ఉంటుంది ఈ కోర్సు. మందులు కూడా హెల్త్ అడ్వైజర్‌లు పేషెంట్ లక్షణాలను బట్టి సులువుగా ఇవ్వగలిగేటట్లు తయారు చేశాను. మనకు స్వాతంత్ర్యం వచ్చి 76 ఏళ్లయినప్పటికీ దేశంలో ఇంకా డాక్టర్– పేషెంట్‌ల నిష్పత్తి సమతుల్యతలో పెద్ద అగాధమే ఉంది. వెయ్యి మంది పేషెంట్‌లకు ఒక డాక్టర్ అందుబాటులో ఉండాలనే సదుద్దేశం నెరవేరడం లేదు. పట్టణాల్లో అవసరానికి మించినంత మంది వైద్యులున్నారు, గ్రామాల్లో వైద్యం కరువవుతోంది. గృహిణులకు హెల్త్ అడ్వైజర్‌లుగా శిక్షణ ఇవ్వడం వల్ల ఆ లోటు కొంత భర్తీ అవుతోంది. వైద్యం అంటే... సామాన్యులకు అర్థం కాని చదువు కాదు, అత్యంత సులువుగా అర్థం చేసుకోగలిగిన శాస్త్రం అని నిరూపించడం, ప్రతి ఒక్కరికీ నాణ్యమైన వైద్యం అందించడమే నా లక్ష్యం. కోర్సులో భాగంగా నేర్చుకున్న వైద్యాన్ని నా వంతుగా కొంత విస్తరించి 76 అనారోగ్యాలకు మందులు కనుక్కున్నాను. వాటికి ఆయుష్ నుంచి నిర్ధారిత గుర్తింపు కూడా వచ్చింది'' అని వైద్య రంగాన్ని సరళతరం చేయడంలో తన వంతు భాగస్వామ్యాన్ని వివరించారు డాక్టర్ సరళ.

– వాకా మంజులారెడ్డి, సాక్షి ఫీచర్స్ ప్రతినిధి
ఫొటోలు: అనిల్ కుమార్ మోర్ల

భిన్న జీవనం

జెలజ కుటుంబం ఇంట్లో కంటే రోడ్డు మీదే ఎక్కువగా ఉంటుంది. జెలజ ట్రక్ డ్రైవర్. భర్తకు ట్రాన్స్‌పోర్ట్ వ్యాపారం ఉంది. తొలత గృహిణిగా ఉన్న జెలజ మెల్లగా డ్రైవింగ్ నేర్చుకుంది. లోడు దించేందుకు కుటుంబంతో బయలుదేరి కొత్త ప్రాంతాల వీడియో చేస్తుంది. ఆమె కేరళ నుంచి కశ్మీర్ వరకూ ట్రక్ తోలింది. కూతురు తల్లితోపాటు డ్రైవింగ్ నేర్చుకుంది. 'పుతట్టు ట్రావెల్ వ్లోగ్' పేరుతో ఈ కుటుంబ యానం లక్షల మంది ఫాలోయెర్స్‌ను సంపాదించింది.



● భర్త, కుమార్తెతో జెలజ

12 చక్రాల బండి సాగిపోతోంది

ఉదాహరణకు జెలజ జీవితం ఇలా ఉంటుంది. ఆమె కేరళలోని కొట్టాయం నుంచి ప్లైవుడ్ లోడ్ తీసుకుని పూణెలో డెలివరీ చేస్తుంది. కాని ఖాళీ ట్రక్కు వెనక్కు తెస్తే నష్టం. 'ఉల్లిపాయల లోడు కశ్మీర్‌లో దింపుతారా' అని పూణెలో అడుగుతారు. 'దింపుతాను' అని బయలుదేరుతుంది. కశ్మీర్ చేరుకుంటుంది. అక్కడ లోడ్ దొరకదు ఒక్కోసారి. ఢిల్లీ, హర్యాణ దాకా వచ్చే లోడ్ దొరుకుతుంది. ఏదో ఒక సరుకు కేరళకు దింపే బుకింగ్ వస్తుంది. ఆ లోడు తీసుకుని కేరళ చేరుకుంటుంది.

'కేరళలో ప్రతి సంవత్సరం జారీ అవుతున్న డ్రైవింగ్ లైసెన్స్‌లలో 40 శాతం స్త్రీలవి. టూ వీలర్లు కార్లు సరే... బస్సులు కూడా కేరళలో నడుపుతున్నారు స్త్రీలు. కాని ట్రక్కు నడిపే స్త్రీలు చాలా అరుదు. అందుకే జెలజను చూసి అందరూ గౌరవిస్తారు' అంటాడు రతీష్. అతడు జెలజ భర్త. ఆమె లాంగ్ డ్రైవ్‌కి బయలుదేరితే చాలాసార్లు తోడు ఉంటాడు. ఒక్కోసారి పెద్ద కూతురు, భార్య డ్రైవ్ చేస్తుంటే వారికి తోడు వస్తాడు. అతను స్వయంగా డ్రైవరు. కాని తన కుటుంబ స్త్రీలు హైవేలను జయిస్తూ ఉంటే సంతోషపడతాడు.

గృహిణి నుంచి డ్రైవర్‌గా

రతీష్ 2003 వరకూ ఒక సాధారణ ట్రక్ డ్రైవర్. ఆ సంవత్సరం ఆరు లక్షలు లోన్ తీసుకుని ఒక భారత్ బెంజ్ ట్రక్ కొన్నాడు. కలిసొచ్చింది. తన సోదరుడితో కలిసి ఇప్పుడు 27 నేషనల్ పర్మిట్ ట్రక్కులతో ట్రాన్స్‌పోర్ట్ బిజినెస్ చేస్తున్నాడు. తరచూ లాంగ్ డ్రైవ్‌కి వెళ్లే రతీష్‌ని జెలజ 'నేనూ నీతో రానా కొత్త ప్రాంతాలు చూడాలని ఉంది' అనడిగింది. 'రావచ్చు. కాని నువ్వు ట్రక్కు నడపడం నేర్చుకుంటే' అన్నాడు రతీష్. అప్పటికి జెలజ కేవలం గృహిణి. టూ వీలర్ నడపడం కూడా రాదు. ఆమె మొదట టూ వీలర్.. ఆ తర్వాత కారు నడిపి ట్రక్ డ్రైవింగ్ నేర్చుకుంది. భర్తను తోడు తీసుకుని స్వయంగా ట్రక్ నడుపుతూ లోడ్ డెలివరీ చేయడం ప్రారంభించింది.



● లాంగ్ ట్రిప్‌లో అత్తగారితో...

వీడియోలు చేస్తూ

'మాది ఉమ్మడి కుటుంబం. నా మరిది, తోటికోడలు, అత్తగారు.. అందరం కలిసి ఉంటాం. అందుకే నా ఇద్దరు పిల్లలను వదిలి ట్రక్ తీసుకుని బయలుదేరుతాను' అంటుంది జెలజ. ఆమె పెద్ద కూతురు కూడా ట్రక్ డ్రైవింగ్ నేర్చుకుంది. లోడ్‌లు దింపే పనిలో భాగంగా పర్యటనలు కూడా ఈ కుటుంబం ట్రక్కు ద్వారా ముగిస్తారు. 'మేఘాలయా, కోల్‌కటా, పోర్‌బందర్... ఇలా ఎన్నో కొత్త ప్రాంతాలు చూశాను' అంటుంది జెలజ. ఎక్కడకు వెళ్లినా అక్కడి విశేషాలు వీడియోలు చేస్తూ అక్కడి సంస్కృతి, అలవాట్లు తెలియచేస్తూ ఉంటుంది. రోడ్డు పక్కన ట్రక్కు ఆపి వంట చేసుకుని తోటి డ్రైవర్‌లతో కలిసి తినడం ఆ వీడియోలు కనపడుతుంది. ఒకసారి అత్తగారిని తీసుకుని ఆమె ట్రక్కులోనే లాంగ్ జర్నీ చేసింది. కేరళ నుంచి కశ్మీర్ వరకూ ట్రక్ నడిపి వార్తల్లోకి ఎక్కింది జెలజ.

'వాష్‌రూమ్‌లు ఒక్కటే ఇబ్బంది. పెట్రోల్ బంకుల్లో ఉన్నవాటిని ఉపయోగిస్తాను. మధ్య ప్రదేశ్, రాజస్థాన్, మహారాష్ట్రల్లో పోలీసులు పీక్కు తింటారు మామూళ్ల కోసం. మిగిలిన రాష్ట్రాలు పర్లేదు. ఇక దొంగల భయం ఉంటుంది. కాని హైవేల మీద తిరగ్గా తిరగ్గా ఆ భయం పోయింది' అంటుంది జెలజ.

దృశ్యం



● దీప్తి అస్థాన

చిత్తంతో చిత్రప్రయాణం

ఉరుకులు పరుగుల జీవితంలో ఉద్యోగికి ఆఫీస్‌కు అవతలి ప్రపంచంపై దృష్టి మళ్లదు. పనే ప్రపంచం అవుతుంది. దీప్తి ఆస్థాన మాత్రం ఆఫీస్ క్యూబికల్‌కు ఆవలి ప్రపంచాన్ని చూడాలనుకుంది. కెమెరా తన నేస్తం అయింది. దేశమంతా తిరుగుతూ స్త్రీల జీవితంలోని ఎన్నో కోణాలను కెమెరా కంటితో ఆవిష్కరిస్తోంది...

సాఫ్ట్‌వేర్ ఇంజినీర్ ఉద్యోగం నుంచి సెల్ఫ్ లెర్నింగ్ ఫోటోగ్రాఫర్‌గా ప్రయాణం దీప్తి అస్థాన జీవన దృక్పథాన్ని పూర్తిగా మార్చివేసింది. ఆఫీసు క్యూబికల్ అవతల తనకు తెలియని ప్రపంచం గురించి తెలుసుకోవాలనుకుంది. ఎక్కడికి ప్రయాణం చేసినా కెమెరా తనతోపాటు వచ్చేది. సంభాషించేది. కెమెరా ద్వారా ప్రయాణాలలో లోతైన అర్థాన్ని, సామాజిక ప్రయోజనాన్ని కనుగొంది దీప్తి.

మనసులోని భావాలను వ్యక్తీకరించడానికి, తాను కలుసుకున్న వ్యక్తుల జీవిత కథలను ప్రపంచంతో పంచుకోవడానికి ఫొటోగ్రఫీ దీప్తికి బలమైన మాధ్యమంలా ఉపయోగపడింది.

సాధారణంగా దూర ప్రయాణాలు అనగానే ప్రముఖ, ప్రసిద్ధ స్థలాలు మాత్రమే గుర్తుకు వస్తాయి. కానీ దీప్తి మాత్రం అనామక, అంతగా ఎవరూ పట్టించుకోని ప్రాంతాలకు వెళ్లేది. ఆ ప్రాంతాల గురించి ఎవరూ పనిగట్టుకొని ఫొటోలు తీసి ఉండరు. నాలుగు ముక్కలు రాసి ఉండరు. ఆ పని దీప్తి చేసింది.

ఆ తరువాత...'ఉమెన్ ఇండియా' ప్రాజెక్ట్‌తో తన ప్రయాణాన్ని మరింత విస్తృతం చేసుకుంది. ఇది ఒకటి రెండు నెలల పరిమిత కాల ప్రయాణం కాదు. సంవత్సరాలుగా సాగిన ప్రయాణం. పట్టణాల్లోని మార్పుల సంగతి ఎలా ఉన్నా, పల్లెప్రజలు మాత్రం గతంలోనే ఉన్నారని గ్రహించింది దీప్తి.

బాల్య వివాహాల నుంచి ఆడపిల్లలు చదువుకు దూరం కావడం వరకు కెమెరా కంటితో ఎన్నో సమస్యలను లోకం దృష్టికి తీసుకువచ్చి మహిళలు తమ గళం విప్పడానికి ఒక వేదికను నిర్మించింది. సోషల్ మీడియా దృష్టిలో పడని మహిళల సమస్యలను అదే మీడియా ద్వారా నలుగురి దృష్టికి తీసుకు వచ్చింది.

సమస్యల గురించి మాత్రమే కాకుండా వివిధ ప్రాంతాలలోని సాంస్కృతిక వైభవాన్ని కళ్లకు కట్టింది.

'నా ప్రాజెక్ట్‌లో అన్ని కథలు మనుగడ కోసం చేసే పోరాటానికి సంబంధించినవి మాత్రమే కాదు. జీవితాన్ని, సంస్కృతిని సెలబ్రేట్ చేసుకునేవి కూడా' అంటుంది దీప్తి.

స్ఫూర్తిదాయకమైన కథలు మార్పు తీసుకురాగలవా?' అని అడిగితే 'అందుకు నేనే ఉదాహరణ. ఆ మార్పు ముందు నాలోనే వచ్చింది' అంటుంది దీప్తి.

తాను షూట్ చేయడానికి ఎంచుకునే ప్రదేశాలతో ఎమోషనల్‌గా కనెక్ట్ అవుతుంది. గుజరాత్‌లోని మిథాపూర్‌లో పన్నెండేళ్ల భారతితో మాట్లాడింది దీప్తి. ఆ అమ్మాయి ఎప్పుడూ బడి ముఖం చూడలేదు. కొంత కాలం ఇంటిపట్టునే ఉన్న భారతి ఇప్పుడు తల్లిదండ్రులతో పాటు కూలిపనికి వెళుతుంది. ఈ చిన్నారి పెద్ద పెద్ద తట్టలను మోస్తున్న దృశ్యం చూసి దీప్తికి కళ్లలో నీళ్లు తిరిగాయి.

'భారతి అందమైన, చురుకైన అమ్మాయి. ఆమె భవిష్యత్ కూలిపనులకు పరిమితం కావాల్సిందేనా? అనే బాధ కలిగింది. కెమెరా గురించి భారతి ఆసక్తిగా తెలుసుకుంది. కొత్త విషయాలు తెలుసుకోవాలనే ఉత్సాహం ఉన్న ఇలాంటి పిల్లలకు కొత్త దారి చూపితే పురోగమించగలరు' అంటుంది దీప్తి.

భారతి లాంటి ఎంతోమంది పిల్లల కథలను లోకం దృష్టికి తీసుకువచ్చింది. పట్టణ ప్రాంతాలలో పెరిగిన దీప్తి దేశ విదేశాల్లో ఎన్నో మెట్రోపాలిటన్ నగరాలలో పనిచేసింది. 'సమాజ నిర్మాణంలో మహిళలు ముఖ్యమైన పాత్ర పోషిస్తున్నప్పటికీ వారికి సమాన అవకాశాలు లేవు' అనే ఎరుక ఆమెను ఎప్పటికప్పుడు కొత్త ప్రాంతాలకు తీసుకు వెళుతుంది. కొత్త జీవితాలను ఆవిష్కరించేలా చేస్తున్న దీప్తి ప్రస్తుతం గోవాలో ఉంటోంది.

వారి జీవితంలో భాగం అవుతాను

కెమెరా ఉన్నా సరే, ఎదుటి వ్యక్తి జీవితపు లోతు అప్పటికప్పుడు ఆవిష్కారం కాదు. వారితో సరిగ్గా కనెక్ట్ కాగలగాలి. మనం వారిని అర్థం చేసుకున్నట్లే వారూ మనల్ని అర్థం చేసుకోవాలి. తమ గురించి తెలుసుకోవడంలో, కెమెరా ఉపయోగించడంలో ఎలాంటి వాణిజ్య ప్రయోజనం లేదనే భావన వారికి కలగాలి. ఇదేమంత సులభం కాదు. అలా అని జటిలం కాదు. మన ఓపిక, ఆసక్తిపై ఆధారపడి ఉంటుంది.

ఫోటోలు తీసుకున్నప్పుడు వారి జీవితంలో భాగం అవుతాను. వారు నాలో భాగం అవుతారు. కలిసి భోజనం చేస్తాం. సరదా కబుర్లు చెప్పుకొని నవ్వుకుంటాం. ఇప్పటి వరకు ఈ దేశంలో ఏ మూలకు వెళ్లినా తమలో భాగంగా చూసుకున్నారు. ఆత్మీయత పంచారు. ఇది నా అదృష్టం.

- దీప్తి అస్థాన



● మారుమూల ప్రాంతాల వ్యక్తుల జీవన దృశ్యం

● సమస్యలకే కాదు... జీవన సౌందర్యానికి 'ఉమెన్ ఇండియా ప్రాజెక్ట్' అద్దం పడుతుంది



లక్ష్యంతో కూడిన ప్రయాణం

భావాలను వ్యక్తీకరించడానికి పుస్తకం రాయడం, ఉపన్యాసం చేయడం లాగే ఫొటోగ్రఫీ కూడా ఒక సాధనం. నేను తీసిన చిత్రాలు నా భావాలకు అద్దం పట్టేలా ఉంటాయి. ఒక మహిళగా ఇతర మహిళలు, పిల్లలతో మాట్లాడడం నాకు సులువు అయింది. సోలోగా ట్రావెల్ చేయడంలో లైఫ్ స్కిల్స్ క్రమక్రమంగా నేర్చుకునే అవకాశం దొరుకుతుంది. ప్రయాణానికి ఒక లక్ష్యం తోడైతే అది అద్భుతంగా ఉంటుంది.

- దీప్తి అస్థాన

విశ్రాంతి



నిద్ర మంచం వదలడం లేదా?!

మనలో చాలా మంది పొద్దున్నే నిద్ర లేవడానికి ఫోన్‌లో రెండు మూడు అలారాలను సెట్ చేస్తారు. కానీ, వాటిని కట్ చేసి మళ్లీ పడుకుంటారు. ప్రతిరోజూ ఇలాగే జరుగుతుంటుంది. ఆ తర్వాత తమని తాము తిట్టుకుంటూ ఉంటారు. శరీరానికి తగినంత విశ్రాంతి లభించక ఇలా అవుతోందా? లేక నిజంగానే బద్ధకంగా ఉంటుందా? బద్ధకానికి, విశ్రాంతికి విభజనరేఖ ఏమిటి? ఉత్సాహకరమైన ఉదయాన్ని ప్రారంభించడానికి నిద్ర మంచం మీద నుండి లేవడం అనే కష్టం నుంచి బయటపడటానికి సులువైన టెక్నిక్స్ కొన్నిటిని తెలుసుకుందాం...

రాత్రి పడుకునే ముందు అలారం సెట్ చేసి పెట్టుకుంటారు. ఉదయాన్నే ఆ అలారం మోగగానే మెలకువ వచ్చినా, లేవకుండా అలారం ఆఫ్ చేసి మళ్లీ పడుకుంటారు. నిద్ర రాకపోయినా అలాగే పడక నుంచి బయటకు రాకుండా ఉంటారు. దీంతో నిద్ర పోకపోయినా అలాగే పడుకోవడం వల్ల సమయం వృథా అవుతుందని నమ్ముతారు. అయితే విశ్రాంతి కోసం కొంత సమయాన్ని బద్ధకంగా గడిపినా ఫర్వాలేదు. కానీ, విశ్రాంతి కోసం పనిని పక్కన పెట్టడం వల్ల ఇబ్బందుల్లో పడవచ్చు.

స్క్రీన్.. కలిగించే ఒత్తిడి

చాలా మంది బెడ్ మీద ఉన్నప్పుడు ఫోన్‌లో మాట్లాడటం, మెయిల్స్ లేదా సోషల్ మీడియా వార్తలు చూడటం చేస్తుంటారు. దీనివల్ల కొంత సమయం బాగానే గడిచిపోతుందని అనిపించవచ్చు. విశ్రాంతి పొందుతున్నాం అనే భావన కూడా కలగవచ్చు. కానీ ఎక్కువసేపు పడుకుని స్క్రీన్‌ని, అందులోని సమాచారాన్ని చూడటం వల్ల బ్రెయిన్ ఒక విధమైన అసౌకర్యానికి, ఒత్తిడికి లోనవుతుంది. ఉదయం లేస్తూనే ఫోన్ తీసుకొని వచ్చిన నోటిఫికేషన్లు, మెసేజీలు చూసే అలవాటును వదులుకోవాలి.

మీతో మీరు...

రోజువారీ దినచర్యను ఎలా ప్రారంభించాలో తెలుసుకోవడం మనందరికీ చాలా ముఖ్యం. మంచం మీద నుంచి లేచి, బయటకు వచ్చిన వెంటనే ఒత్తిడిని పెంచే పనులను ప్రారంభించవద్దు. ఉదయం నిద్రలేచిన వెంటనే మీకోసం మీరు కొంత సమయం కేటాయించుకోవాలి. ఈ సమయంలో ప్రశాంతతను కలిగించే సంగీతాన్ని వింటూ సులభంగా చేయదగిన పనులను ఎంచుకోవాలి. ఈ విధానం వల్ల ఆ రోజు మొత్తంలో చేయదగిన పనులను చక్కగా ప్లాన్ చేసుకోవచ్చు.

అరగంట లోపు ఓకే!

ఉదయం నిద్రలేచిన తర్వాత కాసేపు అలాగే పడుకోవడం దినచర్యలో భాగమైతే ప్రతిరోజూ చేయవచ్చు. నిద్రలేచిన తర్వాత ఎంతసేపు మంచం మీద పడుకోవాలో నిర్ణీత నియమాలు లేవు. అయితే, 15 నుంచి 30 నిమిషాల తర్వాత బెడ్‌ను వదిలేయడం మంచిది.

శరీరం మాట వినాలి

విశ్రాంతి నిద్రకు ప్రత్యామ్నాయం కాదు. కానీ, కొంత విశ్రాంతి తీసుకున్న తర్వాత మంచిగా అనిపిస్తే అది నిద్రతో సమానంగా లేకపోయినా కచ్చితమైన ప్రయోజనాలను పొందవచ్చు. విశ్రాంతి అవసరమైతే శరీరం మాట వినిపించుకోవాలి. విశ్రాంతి తీసుకోవాలి అనిపించినప్పుడు దానిని పాటించడం వల్ల ఒత్తిడి తగ్గుతుంది. మానసిక ఆరోగ్యమూ మెరుగుపడుతుంది. చర్మం యవ్వనంగా కనిపిస్తుంది. రోగనిరోధక శక్తి పెరుగుతుంది. జ్ఞాపకశక్తి బాగుంటుంది. కొంతమంది వారాంతాల్లో రోజంతా మంచం పైనే బద్ధకంగా దొర్లుతూ ఉంటారు. ఇలా చేయడం వల్ల ఏ పనీ చేయలేకపోయాం అనే అపరాధ భావనకు లోనవుతారు. దీనివల్ల కొన్ని ముఖ్యమైన పనులు పూర్తికాక కొత్త చిక్కులు ఎదురయ్యే ప్రమాదం ఉంది. అందువల్ల నిద్రపోవాలి అని అనిపించినప్పుడు నిద్ర పోవడమే మంచిది.

మంచి నిద్ర కోసం...


● రోజూ ఒకే సమయానికి నిద్రపోయేలా, తిరిగి ఉదయం నిద్రలేచేలా స్థిరమైన షెడ్యూల్‌ని పాటించాలి. వారాంతాల్లో కూడా ఇదే నియమాన్ని పాటించాలి ● నిద్రపోయే ముందు వేడినీటి స్నానం, ధ్యానం, పుస్తకం చదవడం, సంగీతం వినడం ప్రయోజనకరం ● నిద్రపోయే ముందు మొబైల్‌ను దూరంగా ఉంచాలి. సోషల్ మీడియాను చూడటం పూర్తిగా మానుకోవాలి ● త్వరగా జీర్ణం కాని ఆహారం, కెఫిన్, ఆల్కహాల్ వంటివి తీసుకోకూడదు.

సునామీ బ్యాటింగ్... విధ్వంస ప్రదర్శన... వీర విజృంభణ... అద్భుతం... అసాధారణం... అనమానం... ఎలాంటి విశేషణాలు ఉపయోగించుకుంటారో మీ ఇష్టం ... ఎన్నాళ్లుగానో ఇలాంటి ఇన్నింగ్స్ ఎదురు చూస్తున్న సన్‌రైజర్స్ ఆట సగటు అభిమానికి ఫుల్ జోష్‌ను పంచింది... సంపూర్ణ ఆనందాన్ని అందించింది... బౌండరీల వర్షంతో ఉప్పల్ స్టేడియంలో పరుగుల వరద పారింది... 19 ఫోర్లు, 18 సిక్సర్లు... ముంబై బౌలింగ్‌పై హైదరాబాద్ ఊచకోత మామూలుగా సాగలేదు... ముగ్గురు బ్యాటర్లు ఒకరితో మరొకరు పోటీ పడి పరుగులు సాధించడంతో ఐపీఎల్ చరిత్రలో అత్యధిక టీమ్ స్కోరు నమోదైంది. ముందుగా హెడ్ 18 బంతుల్లో హాఫ్ సెంచరీ చేస్తే... కొద్ది క్షణాల్లోనే 16 బంతుల్లో అర్ధ సెంచరీ చేసి అభిషేక్ శర్మ తానూ తక్కువ కాదని చూపించాడు. నన్ను ఎలా మరచిపోతారన్నట్లుగా ఆ తర్వాత క్లాసెన్ తనదైన శైలిలో చెలరేగిపోయాడు... భారీ ఛేదనలో ముంబై కొంత వరకు ప్రయత్నించినా లక్ష్యం మరీ పెద్దదైపోయింది... చివరకు సొంతగడ్డపై సన్‌రైజర్స్ విజయగర్జన చేసింది. ఓవరాల్‌గా టి20ల్లోనే అత్యధిక పరుగులు, అత్యధిక సిక్స్‌లు నమోదైన మ్యాచ్‌గా సన్‌రైజర్స్, ముంబై ఇండియన్స్ మ్యాచ్ చరిత్ర పుటల్లోకి ఎక్కింది.

సన్‌రైజర్స్ 'రన్'రంగం

ఐపీఎల్ చరిత్రలోనే అత్యధిక స్కోరు (277) సాధించిన సన్‌రైజర్స్ హైదరాబాద్


ముంబై ఇండియన్స్‌పై 31 పరుగులతో ఘన విజయం ● చెలరేగిన క్లాసెన్, అభిషేక్ శర్మ, హెడ్


అభిషేక్ శర్మ

సాక్షి, హైదరాబాద్: సొంతగడ్డపై సన్‌రైజర్స్ హైదరాబాద్ సత్తా చాటింది. ఉప్పల్ స్టేడియంలో ఐపీఎల్ 17వ సీజన్ తొలి మ్యాచ్‌లో కమిన్స్ బృందం ఘన విజయాన్ని అందుకుంది. బుధవారం జరిగిన పోరులో రైజర్స్ 31 పరుగుల తేడాతో ముంబై ఇండియన్స్‌ను ఓడించింది. టాస్ ఓడి ముందుగా బ్యాటింగ్‌కు దిగిన సన్‌రైజర్స్ 20 ఓవర్లలో 3 వికెట్ల నష్టానికి 277 పరుగులు చేసింది. హెన్రిచ్ క్లాసెన్ (34 బంతుల్లో 80 నాటౌట్; 4 ఫోర్లు, 7 సిక్స్‌లు)... 'ప్లేయర్ ఆఫ్ ద మ్యాచ్' అభిషేక్ శర్మ (23 బంతుల్లో 63; 3 ఫోర్లు, 7 సిక్స్‌లు)... ట్రవిస్ హెడ్ (24 బంతుల్లో 62; 9 ఫోర్లు, 3 సిక్స్‌లు) విధ్వంసకర బ్యాటింగ్‌తో చెలరేగారు. అనంతరం ముంబై 20 ఓవర్లలో 5 వికెట్లకు 246 పరుగులు సాధించింది. 'లోకల్ బాయ్' తిలక్ వర్మ (34 బంతుల్లో 64; 2 ఫోర్లు, 6 సిక్స్‌లు), టిమ్ డేవిడ్ (22 బంతుల్లో 42 నాటౌట్; 2 ఫోర్లు, 3 సిక్స్‌లు) రాణించారు.

వీర విధ్వంసం...

7, 11, 22, 5, 13, 23, 21, 15, 11, 20 (తొలి 10 ఓవర్లలో 148)... 13, 12, 7, 11, 11, 12, 18, 11, 13, 21 (తర్వాతి 10 ఓవర్లలో 129)... సన్‌రైజర్స్ ఇన్నింగ్స్ సాగిన తీరిది. ఓపెనర్ మయాంక్ అగర్వాల్ (11) విఫలం కాగా... మిగిలిన నలుగురు బ్యాటర్లు ముంబై బౌలర్లపై విరుచుకు పడ్డారు. అండర్-19 వరల్డ్ కప్‌లో 'ప్లేయర్ ఆఫ్ ద టోర్నీ'గా నిలిచి తొలి ఐపీఎల్ మ్యాచ్ ఆడుతున్న 18 ఏళ్ల క్వెనా మఫాకా వీరిలో ముందుగా బలయ్యాడు. అతని తొలి ఓవర్లో వరుసగా 6, 6, 4, 4 బాదిన హెడ్... హార్దిక్ ఓవర్లో వరుసగా 3 ఫోర్లు కొట్టాడు. కొయెట్జీ ఓవర్లోనూ వరుసగా 4, 4, 6 బాదిన హెడ్ 18 బంతుల్లో అర్ధసెంచరీ పూర్తి చేసుకున్నాడు. చావ్లా వేసిన తర్వాతి ఓవర్లో అభిషేక్ 3 భారీ సిక్సర్లతో స్వాగతం పలికాడు. హెడ్ వెనుదిరిగిన తర్వాత అభిషేక్ మరింత చెలరేగిపోయాడు. మఫాకా ఓవర్లో వరుసగా 4, 6, 6, 4 కొట్టిన అతను 16 బంతులకే హాఫ్ సెంచరీ మార్క్‌ను చేరుకున్నాడు. 11వ ఓవర్ చివరి బంతికి అభిషేక్ అవుట్ కాగా... తర్వాతి 9 ఓవర్ల బాధ్యతను క్లాసెన్ తీసుకున్నాడు. మిత్రుడు మార్క్‌రమ్ (28 బంతుల్లో 42 నాటౌట్; 2 ఫోర్లు, 1 సిక్స్) సహకారంతో అతను సిక్సర్లతోనే పరుగులు రాబడుతూ దూసుకుపోయాడు. మఫాకా ఓవర్లో 2 ఫోర్లు, సిక్స్ కొట్టిన అతను 23 బంతుల్లో హాఫ్ సెంచరీ సాధించాడు. 14.4 ఓవర్లలోనే జట్టు స్కోరు 200 పరుగులు దాటింది. తన తొలి 3 ఓవర్లలో 23 పరుగులు ఇచ్చి ఒకింత మెరుగైన ప్రదర్శన ఇచ్చిన బుమ్రా కూడా తన చివరి ఓవర్లో క్లాసెన్ జోరుకు 13 పరుగులు ఇచ్చుకున్నాడు. ములానీ వేసిన ఆఖరి ఓవర్లోనూ వరుసగా 4, 6, 6 బాదిన క్లాసెన్ ఐపీఎల్ చరిత్రలో అత్యధిక స్కోరును తన జట్టును అందించాడు. సన్‌రైజర్స్ హెడ్ స్థానంలో ఇంపాక్ట్ ప్లేయర్‌గా ఉమ్రాన్ మలిక్‌ను బరిలోకి దించింది.


హెడ్


తిలక్ వర్మ పోరాటం...

ఓవర్‌కు 13.9 పరుగులు... భారీ లక్ష్య ఛేదనలో ఈ రన్‌రేట్‌తో పరుగులు చేయాల్సిన స్థితిలో ముంబై బ్యాటింగ్‌కు దిగింది. ఓపెనింగ్, ఆ తర్వాత మూడో వికెట్ భాగస్వామ్యాలు దూకుడుగానే సాగినా... ఇది సరిపోలేదు. రోహిత్ శర్మ (12 బంతుల్లో 26; 1 ఫోర్, 3 సిక్స్‌లు), ఇషాన్ కిషన్ (13 బంతుల్లో 34; 2 ఫోర్లు, 4 సిక్స్‌లు) ధాటిగా ఆరంభించి తొలి వికెట్‌కు 20 బంతుల్లోనే 56 పరుగులు జోడించారు. ఉనాద్కట్ ఓవర్లో 2 సిక్స్‌లు, ఫోర్ కొట్టిన కిషన్... భువీ వేసిన తర్వాతి ఓవర్లో 3 సిక్స్‌లు, ఫోర్ బాదాడు. అయితే వీరిద్దరిని 10 పరుగుల వ్యవధిలో అవుట్ చేసి రైజర్స్ పైచేయి సాధించింది. ఆ తర్వాత తిలక్, నమన్ ధీర్ (14 బంతుల్లో 30; 2 ఫోర్లు, 2 సిక్స్‌లు) మరింత దూకుడు ప్రదర్శించారు. వీరిద్దరు 37 బంతుల్లోనే 84 పరుగులు జత చేశారు. నమన్ వెనుదిరిగాక, షహబాజ్ ఓవర్లో 3 భారీ సిక్సర్లు కొట్టిన తిలక్ 24 బంతుల్లో అర్ధసెంచరీ సాధించాడు. చివర్లో డేవిడ్, హార్దిక్ పాండ్యా (24) పోరాటం ఫలితమివ్వలేదు.

స్కోరు వివరాలు

సన్‌రైజర్స్ హైదరాబాద్ ఇన్నింగ్స్: మయాంక్ (సి) డేవిడ్ (బి) పాండ్యా 11; హెడ్ (సి) నమన్ (బి) కొయెట్జీ 62; అభిషేక్ శర్మ (సి) నమన్ (బి) చావ్లా 63; మార్క్‌రమ్ (నాటౌట్) 42; క్లాసెన్ (నాటౌట్) 80; ఎక్స్‌ట్రాలు 19; **మొత్తం (20 ఓవర్లలో 3 వికెట్లకు) 277.**
వికెట్ల పతనం: 1-45, 2-113, 3-161. **బౌలింగ్:** మఫాకా 4-0-66-0, పాండ్యా 4-0-46-1, బుమ్రా 4-0-36-0, కొయెట్జీ 4-0-57-1, చావ్లా 2-0-34-1, షమ్స్ ములానీ 2-0-33-0.

ముంబై ఇండియన్స్ ఇన్నింగ్స్: రోహిత్ (సి) అభిషేక్ (బి) కమిన్స్ 26; ఇషాన్ కిషన్ (సి) మార్క్‌రమ్ (బి) షహబాజ్ 34; నమన్ ధీర్ (సి) కమిన్స్ (బి) ఉనాద్కట్ 30; తిలక్ వర్మ (సి) మయాంక్ (బి) కమిన్స్ 64; పాండ్యా (సి) క్లాసెన్ (బి) ఉనాద్కట్ 24; టిమ్ డేవిడ్ (నాటౌట్) 42; షెఫర్డ్ (నాటౌట్) 15; ఎక్స్‌ట్రాలు 11; **మొత్తం (20 ఓవర్లలో 5 వికెట్లకు) 246.**
వికెట్ల పతనం: 1-56, 2-66, 3-150, 4-182, 5-224.
బౌలింగ్: భువనేశ్వర్ 4-0-53-0, ఉనాద్కట్ 4-0-47-2, షహబాజ్ 3-0-39-1, కమిన్స్ 4-0-35-2, ఉమ్రాన్ 1-0-15-0, మర్కండే 4-0-52-0.


క్లాసెన్

ఐపీఎల్‌లో టాప్-5 అత్యధిక స్కోర్లు

జట్టు	స్కోరు	ప్రత్యర్థి	వేదిక	ఎప్పుడు
హైదరాబాద్	277/3	ముంబై	హైదరాబాద్	27-3-2024
బెంగళూరు	263/5	పుణే	బెంగళూరు	23-4-2013
లక్నో	257/5	పంజాబ్	మొహాలి	28-4-2023
బెంగళూరు	248/3	లయన్స్	బెంగళూరు	14-5-2016
చెన్నై	246/5	రాజస్తాన్	చెన్నై	3-4-2010

ఓవరాల్ టి20ల్లో టాప్-5 అత్యధిక స్కోర్లు

జట్టు	స్కోరు	ప్రత్యర్థి	వేదిక	ఎప్పుడు
నేపాల్	314/3	మంగోలియా	హాంగ్జౌ	27-9-2023
అఫ్గానిస్తాన్	278/3	ఐర్లాండ్	డెహ్రాడూన్	23-2-2019
చెక్ రిపబ్లిక్	278/4	టర్కీ	ఇల్ఫోవ్‌కౌంటీ	30-8-2019
సన్‌రైజర్స్	277/3	ముంబై	హైదరాబాద్	27-3-2024
పంజాబ్	275/6	ఆంధ్ర	రాంచీ	17-10-2023

523 ఓవరాల్ టి20 క్రికెట్‌లో అత్యధిక పరుగులు నమోదైన మ్యాచ్‌గా హైదరాబాద్, ముంబై ఇండియన్స్ మ్యాచ్ నిలిచింది. గత ఏడాది మార్చి 26న సెంచూరియన్ పార్క్‌లో దక్షిణాఫ్రికా (18.5 ఓవర్లలో 259/4), వెస్టిండీస్ (20 ఓవర్లలో 258/5) జట్ల మధ్య జరిగిన మ్యాచ్‌లో ఏకంగా 517 పరుగులు నమోదయ్యాయి. ఇక ఐపీఎల్ మ్యాచ్‌ల విషయానికొస్తే 2010లో చెన్నై సూపర్ కింగ్స్ (246/5), రాజస్తాన్ రాయల్స్ (223/5) మ్యాచ్‌లో మొత్తం 469 పరుగులు వచ్చాయి.

38 హైదరాబాద్, ముంబై ఇండియన్స్ మ్యాచ్‌లో నమోదైన సిక్స్‌లు. ఒక టి20 మ్యాచ్‌లో ఇవే అత్యధికం. 2018లో అఫ్గానిస్తాన్ ప్రీమియర్ లీగ్‌లో భాగంగా లెజెండ్స్, కాబుల్ జ్వానన్ మ్యాచ్‌లో మొత్తం 37 సిక్స్‌లు వచ్చాయి.

148 ముంబైతో మ్యాచ్‌లో హైదరాబాద్ తొలి 10 ఓవర్లలో చేసిన పరుగులు. ఒక ఐపీఎల్ మ్యాచ్‌లో ఇవే అత్యధికం.

ఐపీఎల్‌లో నేడు

రాజస్తాన్ × ఢిల్లీ
వేదిక: జైపూర్
రాత్రి 7: 30 గంటల నుంచి స్టార్ స్పోర్ట్స్, జియో సినిమా యాప్‌లో ప్రత్యక్ష ప్రసారం

సినిమా

కొత్త పాయింట్‌తో...


● గోపీచంద్

గోపీచంద్ హీరోగా శ్రీను వైట్ల దర్శకత్వంలో ఓ సినిమా షురూ అయిన విషయం తెలిసిందే. పీపుల్ మీడియా ఫ్యాక్టరీ టీజీ విశ్వప్రసాద్‌తో కలిసి చిత్రాలయం స్టూడియోస్‌పై డిస్ట్రిబ్యూటర్, ఎగ్జిబిటర్ వేణు దోనేపూడి ఈ చిత్రాన్ని నిర్మిస్తున్నారు. ఈ చిత్రం కొత్త షెడ్యూల్ బుధవారం ప్రారంభమైంది. ఈ సందర్భంగా వేణు దోనేపూడి మాట్లాడుతూ – ''ఈ షెడ్యూల్‌లో ప్రధాన తారాగణం పాల్గొనగా కీలక సన్నివేశాల చిత్రీకరణను ప్లాన్ చేశాం. దాంతో టాకీ పార్ట్ మొత్తం పూర్తవుతుంది. శ్రీను వైట్ల మార్క్ ఎంటర్‌టైన్‌మెంట్‌తో ఒక కొత్త పాయింట్‌తో ఈ చిత్రం రూపొందుతోంది. ఈ చిత్రంలో గోపీచంద్ ఒక కొత్త అవతారంలో కనిపిస్తారు. శ్రీను వైట్ల తీసిన బ్లాక్‌బస్టర్స్ చిత్రాలకు రచయితగా చేసిన గోపీ మోహన్ ఈ చిత్రానికి స్క్రీన్‌ప్లే అందిస్తున్నారు'' అన్నారు. హీరోయిన్, ఇతర నటీనటుల వివరాలను త్వరలో ప్రకటిస్తామని యూనిట్ పేర్కొంది. ఈ చిత్రానికి సంగీతం: చేతన్ భరద్వాజ్, కెమెరా: కేవీ గుహన్.


● ప్రభాస్

పారడైసు పావడేసుకొచ్చెనండి...


● కియారా అద్వానీ, రామ్‌చరణ్

'జరగండి జరగండి... జాబిలమ్మ జాకెట్టేసుకొచ్చెనండి... జరగండి జరగండి... పారడైసు పావడేసుకొచ్చెనండి...' అంటూ పాట అందుకున్నారు రామ్‌చరణ్. ఈ జాబిలమ్మ ఎవరూ అంటే కియారా అద్వానీ. రామ్‌చరణ్, కియారా అద్వానీ జంటగా శంకర్ దర్శకత్వంలో రూపొందుతోన్న 'గేమ్ ఛేంజర్' చిత్రంలోని పాట ఇది. రామ్‌చరణ్ పుట్టినరోజు ప్రత్యేకంగా బుధవారం 'జరగండి..' లిరికల్ సాంగ్‌ను 150కు పైగా థియేటర్లలో విడుదల చేశారు. ఎస్ఎస్ తమన్ స్వరపరచిన ఈ పాటకు అనంత శ్రీరామ్ సాహిత్యం అందించగా దలేర్ మెహందీ, సునిధీ చౌహాన్ పాడారు. అనిత సమర్పణలో జీ స్టూడియోస్ అసోసియేషన్‌తో 'దిల్' రాజు, శిరీష్ నిర్మిస్తున్న ఈ చిత్రంలో శ్రీకాంత్, ఎస్.జె. సూర్య, సునీల్ తదితరులు కీలక పాత్రల్లో నటిస్తున్నారు. తిరుణ్ణావుకరుసు సినిమాటోగ్రఫీ అందిస్తున్నారు. తెలుగు, తమిళ, హిందీ భాషల్లో ఈ చిత్రం విడుదల కానుంది.

లండన్‌లో కొత్త ఇల్లు?

లండన్‌లో ప్రభాస్ ఓ ఇంటిని కొనుగోలు చేశారా? అంటే అవుననే అంటున్నాయి ఫిల్మ్‌నగర్ వర్గాలు. వెకేషన్ లేదా సినిమా షూటింగ్‌ల కోసం లండన్ వెళ్లినప్పుడు అక్కడ నివాసం ఉండేలా ప్రభాస్ ఓ ఇంటిని అద్దెకు తీసుకున్నారట. ఇప్పుడు అదే ఇంటిని ప్రభాస్ సొంతం చేసుకున్నారని ఫిల్మ్‌నగర్ భోగట్టా. లండన్‌లోని ప్రభాస్ ఇల్లు లావిష్‌గా ఉంటుందని, తన అభిరుచికి తగ్గట్లుగా గ్రాండ్‌గా ఇంటీరియర్ డిజైన్ చేయించుకున్నారని ఫిల్మ్‌నగర్ టాక్.

ఇక సినిమాల విషయానికి వస్తే... ప్రస్తుతం 'కల్కి 2898 ఏడీ', 'రాజాసాబ్' చిత్రీకరణలతో ప్రభాస్ బిజీగా ఉన్నారు. అలాగే వేసవి తర్వాత 'సలార్' మలి భాగం 'సలార్: శౌర్యంగా పర్వం' చిత్రీకరణలో పాల్గొననున్నారు ప్రభాస్. ఇంకా మంచు విష్ణు టైటిల్ రోల్ చేస్తున్న 'కన్నప్ప' చిత్రంలో ప్రభాస్ ఓ గెస్ట్ రోల్ చేస్తారని తెలిసిందే. ఈ పాత్ర చిత్రీకరణ ఎప్పుడన్నది తెలియాల్సి ఉంది.


● రాశీ ఖన్నా

హారర్... హ్యూమర్

కోలీవుడ్ హారర్ ఫ్రాంచైజీ 'అరణ్మణై' నాలుగో భాగం 'అరణ్మణై 4' విడుదలకు సిద్ధమైంది. నటుడు, దర్శక–నిర్మాత సుందర్. సి నటించి, స్వీయ దర్శకత్వం వహించిన ఈ చిత్రంలో తమన్నా, రాశీ ఖన్నా, సంతోష్ ప్రతాప్ లీడ్ రోల్స్‌లో నటించారు. ఖుష్బూ నిర్మించిన ఈ చిత్రం ఏప్రిల్‌లో విడుదల కానుంది. ''చిల్... థ్రిల్... హారర్... హ్యూమర్... 'ఇలా అన్ని అంశాల మేళవింపుతో మా చిత్రం ప్రేక్షకులను అలరిస్తుంది'' అని చిత్ర యూనిట్ పేర్కొంది. ఈ చిత్రాన్ని తెలుగులోనూ విడుదల చేయాలనుకుంటున్నారు. అలాగే ఏప్రిల్ 11న రిలీజ్ డేట్ ఉండొచ్చని సమాచారం. నిజానికి ఈ సినిమాను ఈ ఏడాది సంక్రాంతి సమయంలోనే విడుదల చేయాలనుకున్నారు. కానీ కొన్ని కారణాల వల్ల వాయిదా వేశారు. ఇప్పుడు వేసవి రిలీజ్‌కు రెడీ అవుతున్నారు మేకర్స్.

బ్యాడ్ బాయ్స్ రెడీ



● మార్టిన్, విల్ స్మిత్

హాలీవుడ్ బ్యాడ్ బాయ్స్ మళ్లీ వస్తున్నారు. హాలీవుడ్ హిట్ ఫ్రాంచైజీలో ఒకటైన 'బ్యాడ్ బాయ్స్' నుంచి రానున్న తాజా చిత్రం 'బ్యాడ్ బాయ్స్: రైడ్ ఆర్ డై'. 'బ్యాడ్ బాయ్స్' ఫ్రాంచైజీలో వస్తోన్న నాలుగో చిత్రం ఇది. విల్ స్మిత్, మార్టిన్ లారెన్స్ లీడ్ రోల్స్ చేస్తున్నారు. మూడో భాగానికి దర్శకత్వం వహించిన అదిల్–శ్రీశ్రీబిలాల్ దర్శకత్వ ద్వయమే 'బ్యాడ్ బాయ్స్ 4'ను డైరెక్ట్ చేశారు. తాజాగా ఈ చిత్రం ట్రైలర్‌ను విడుదల చేసి, సినిమాను జూన్ 7న విడుదల చేయనున్నట్లుగా మేకర్స్ అధికారికంగా ప్రకటించారు. సిటీలో జరుగుతున్న డ్రగ్ మాఫియా ఆగడాలను ఇద్దరు డిటెక్టివ్‌లు ఏ విధంగా అడ్డుకున్నారు? అనే ఇతివృత్తంతో ఈ సినిమా కథనం ఉంటుందని హాలీవుడ్ సమాచారం.

సీక్రెట్ పెళ్లి

వనపర్తి జిల్లా రంగనాయకస్వామి సన్నిధిలో ఒక్కటైన సిద్ధార్థ్, అదితీరావు

తెలుగు ప్రేక్షకులకు సుపరిచితమైన హీరో సిద్ధార్థ్, హీరోయిన్ అదితీరావు బుధవారం వనపర్తి జిల్లా శ్రీరంగాపూర్‌లోని రంగనాయకస్వామి ఆలయంలో హిందు సంప్రదాయం ప్రకారం ఒక్కటయ్యారు. కుటుంబ సభ్యులు, మిత్రులు కేవలం 30–40 మంది సమక్షంలో పెళ్లి చేసుకున్నారు. మంగళవారం రాత్రి నుంచే రంగనాయకస్వామి ఆలయాన్ని పూర్తిగా వారి ఆధీనంలోకి తీసుకుని ఇతరులు ఎవరూ (ఆలయ పూజారులు, పనిచేసే వారిని సైతం) లోపలికి అనుమతించకుండా ఏర్పాట్లు చేసి ఉదయం 8.30 నుంచి 10.30 గంటల వరకు పెళ్లి తంతు ముగించినట్లు సమాచారం. ఓ కార్‌వ్యాన్‌తో పాటు హైదరాబాద్ పాసింగ్ హై ఎండ్ కార్లు బుధవారం శ్రీరంగాపూర్‌లో సందడి చేయడంతో మొదట షూటింగ్ పెళ్లి అని ప్రచారం జరిగింది. కానీ, కొద్దిసేపటికి వనపర్తి సంస్థానాధీశుల వారసులు సైతం పెళ్లికి రావడంతో నిజమైన పెళ్లిగా బయటి వారికి తెలిసింది.


● అదితీరావు హైదరీ, సిద్ధార్థ్

రాజారామేశ్వర్‌రావు మనుమరాలు అదితీరావు

వనపర్తి సంస్థానాధీశుల చివరి రాజైన రాజారామేశ్వర్‌రావు పెద్ద కూతురు విద్యారావు ఏకైక కూతురు అదితీరావు హీరోయిన్‌గా పలు సినిమాల్లో నటించారు. సిద్ధార్థ్, అదితీరావు కలిసి 'మహా సముద్రం' చిత్రంలో నటించారు. అప్పటి నుంచి సన్నిహితంగా ఉన్నారు. పెద్దల అంగీకారంతో అదితీ తాతలు కట్టించిన పురాతన ఆలయంలో పెళ్లి చేసుకోవడం విశేషం. పెళ్లికి సంస్థానాధీశుల వారసులు రాజా కృష్ణదేవరావు, ఆయన కుటుంబ సభ్యులు, అదితీరావు తల్లి, ఇతర కుటుంబ సభ్యులు, బంధువులు, మిత్రులు హాజరైనట్లు తెలిసింది. శ్రీరగాపురం లో పెళ్లి తర్వాత వనపర్తిలోని రాజావారి తోటలో పెళ్లి భోజనాలు ఏర్పాట్లు చేశారు. కాగా.. స్థానికులు, మీడియా ట్రస్టు నిర్వాహకులు, పని వాళ్లను సైతం అనుమతించకపోవడం, అక్కడికి వెళ్లిన వారి సెల్ ఫోన్లను సెక్యూరిటీ ముందుగానే డిపాజిట్ చేసుకోవడంతో పెళ్లికి సంబంధించిన ఫొటోలు బయటకు రాలేదు.

– సాక్షి ప్రతినిధి, వనపర్తి.

ఎవరితో పయనం...


● 'లవ్ మాక్‌టైల్ 2' పోస్టర్

కన్నడ సూపర్ హిట్ 'లవ్ మాక్‌టైల్ 2' అదే టైటిల్‌తో తెలుగులో విడుదల కానుంది డార్లింగ్ కృష్ణ హీరోగా నటించి, దర్శకత్వం వహించి, నిర్మించిన ఈ చిత్రాన్ని తెలుగులో ఎంవీఆర్ కృష్ణ విడుదల చేస్తున్నారు. ఈ చిత్రం నుంచి 'ఎవరితో పయనం...' అంటూ సాగే పాటను విడుదల చేశారు. నకుల్ అభయాన్కర్ స్వరపరచిన ఈ పాటకు గురుచరణ్ సాహిత్యం అందించగా యోగి సురేష్ పాడారు. ఈ సందర్భంగా ఎంవీఆర్ కృష్ణ మాట్లాడుతూ – ''డార్లింగ్ కృష్ణ తనే నిర్మాతగా, దర్శకుడుగా వ్యవహరిస్తూ హీరోగా నటించిన 'లవ్ మాక్‌టైల్, లవ్ మాక్‌టైల్ 2' బ్లాక్ బస్టర్ హిట్ సినిమాలుగా నిలిచాయి. 'లవ్ మాక్‌టైల్ 2'ని తెలుగులో ఈ వేసవిలోనే విడుదల చేస్తాం'' అన్నారు. మిలినా నాగరాజ్, అమృతా అయ్యంగార్, రచల్ డేవిడ్ తదితరులు కీలక పాత్రల్లో నటించారు.

సాక్షి బిజినెస్
గురువారం
28-3-2024

స్టాక్ మార్కెట్లు

దేశీ సూచీలు

సెన్సెక్స్ ▲	నిఫ్టీ ▲
526	119
72,996	22,124

విదేశీ సూచీలు (తొలి రెండు రాత్రి 11.30 గంటలకు)

నాస్‌డాక్	16,330	▲	14
డోజోన్స్	39,541	▲	254
ఎఫ్‌టీఎస్‌ఈ 100	7,932	▲	1
డాక్స్	18,477	▲	93
షాంఘై	2,993	▼	38
నికాయ్	40,763	▲	365

•అమెరికా •బ్రిటన్ •జర్మనీ •చైనా •జపాన్

బులియన్ (రూ.లలో)

ముంబై

బంగారం (99.9 స్వచ్ఛత)		
66,834	▲	118
బంగారం (99.5 స్వచ్ఛత)		
66,566	▲	117
వెండి (కేజీ)		
73,997	▼	282

ఫారెక్స్ రేట్లు (రూ.లలో)

			కొనుగోలు	అమ్మకం
$	యూఎస్ డాలర్	ఎస్‌బీఐ	82.95	83.97
£	బ్రిటన్ పౌండ్	ఎస్‌బీఐ	104.23	106.78
€	యూరో	ఎస్‌బీఐ	89.30	91.68
¥	జపాన్ ఎన్ (100)	ఎస్‌బీఐ	55.64	55.75
AU$	ఆస్ట్రేలియా డాలర్	ఎస్‌బీఐ	53.64	55.56
S$	సింగపూర్ డాలర్	థామస్‌కుక్	59.64	64.35
SAR	సౌదీ రియాల్	థామస్‌కుక్	21.30	22.88
UAE D	యూఏఈ దిర్హామ్	థామస్‌కుక్	21.78	23.57
¥	చైనా యువాన్	థామస్‌కుక్	10.42	12.49

హైస్పీడులో గేమింగ్ మార్కెట్..

ఐదేళ్లలో రెట్టింపు • 2028 నాటికి 6 బిలియన్ డాలర్లకు చేరిక • 24 కోట్లకు చేరనున్న పెయిడ్ యూజర్ల సంఖ్య • విన్‌జో నివేదిక

న్యూఢిల్లీ: భారతీయ గేమింగ్ పరిశ్రమ వార్షికాదాయం ఐదేళ్లలో దాదాపు రెట్టింపు కానుంది. 2028 నాటికి 6 బిలియన్ డాలర్లకు చేరనుంది. 2023లో ఇది 3.1 బిలియన్ డాలర్లుగా ఉంది. ఇంటరాక్టివ్ ఎంటర్‌టైన్‌మెంట్ అండ్ ఇన్నోవేషన్ కౌన్సిల్, ఆన్‌లైన్ గేమింగ్ సంస్థ విన్‌జో సంయుక్తంగా రూపొందించిన నివేదికలో ఈ విషయాలు వెల్లడయ్యాయి. 'ఇండియా గేమింగ్ రిపోర్ట్ 2024' ప్రకారం 2028 నాటికి పెయిడ్ యూజర్ల సంఖ్య 24 కోట్లకు చేరనుంది. 2023లో ఇది 14.4 కోట్లుగా ఉంది. 'భారతీయ గేమింగ్ రంగంలో 1,400 గేమింగ్ కంపెనీలు ఉన్నాయి. వీటిలో 500 గేమింగ్ స్టూడియోలు ఉన్నాయి. 2028 నాటికి గేమింగ్‌కి సంబంధించి వార్షికాదాయం 6 బిలియన్ డాలర్లకు చేరగలదని అంచనాలు ఉన్నాయి' అని నివేదిక తెలిపింది. రిపోర్టు ప్రకారం ప్రొఫెషనల్ ప్లేయర్ల సంఖ్య 2023లో 500గా ఉండగా వచ్చే అయిదేళ్లలో 2.5 రెట్లు పెరగనుంది. ఈ-స్పోర్ట్స్‌కి ప్రభుత్వ గుర్తింపు లభించడంతో పాటు ఈ-స్పోర్ట్స్ టాలెంట్‌ను ప్రోత్సహించేందుకు కొన్ని రాష్ట్రాలు తగు చర్యలు తీసుకుంటున్నాయి.



నాలుగేళ్లలో భారీగా డౌన్‌లోడ్స్..

'2019 నుంచి 2023 మధ్య కేవలం నాలుగేళ్ల వ్యవధిలో భారత్‌లో గేమ్ డౌన్‌లోడ్లు 565 కోట్ల నుంచి 950 కోట్లకు చేరాయి. దీంతో అంతర్జాతీయంగా గేమ్ డౌన్‌లోడ్స్‌లో భారత వాటా గతేడాది ఏకంగా 16 శాతానికి చేరింది. 450 కోట్లు (7.6 శాతం మార్కెట్ వాటా), 440 కోట్లు (7.4 శాతం మార్కెట్ వాటా) డౌన్‌లోడ్స్‌తో బ్రెజిల్, అమెరికా తర్వాత స్థానాల్లో ఉన్నాయి' అని రిపోర్టు తెలిపింది. దీని ప్రకారం దేశీయంగా 56.8 కోట్ల మంది గేమర్స్, 15,000 మంది పైచిలుకు గేమ్ డెవలపర్లు, ప్రోగ్రామర్లు ఉన్నారు. మూడేళ్ల క్రితం ప్రతి అయిదుగురు గేమర్లలో ఒక్క మహిళ మాత్రమే ఉండేవారు. కానీ ప్రస్తుతం గేమర్లలో 40 శాతం మంది మహిళలు ఉంటున్నారు. 'భారత గేమింగ్ మార్కెట్లో మొబైల్ గేమింగ్ వాటా 90 శాతంగా ఉంది. అదే అమెరికాలో ఇది 37 శాతంగా, చైనాలో 62 శాతంగా ఉంది. 50 శాతం మంది గేమర్లు 18–30 ఏళ్ల మధ్య వయస్సువారే' అని నివేదిక వివరించింది. ఆన్‌లైన్ గేమింగ్ పరిశ్రమలో వచ్చే 10 ఏళ్లలో మరో 2.5 లక్షల ఉద్యోగాల కల్పన జరగనుంది. ప్రస్తుతం 1 లక్ష మంది నిపుణులు ప్రత్యక్షంగా, పరోక్షంగా గేమింగ్‌తో ఉపాధి పొందుతున్నారు.

హైదరాబాద్‌లో జీవోసీఎల్ స్థలం మానిటైజేషన్

హైదరాబాద్, బిజినెస్ బ్యూరో: హైదరాబాద్‌లోని కూకట్‌పల్లిలో 264.50 ఎకరాల స్థలాన్ని మానిటైజ్ (విక్రయించడం లేదా లీజుకివ్వడం) చేసేందుకు స్క్వేర్‌స్పేస్ బిల్డర్స్‌తో ఒప్పందం కుదుర్చుకున్నట్లు జీవోసీఎల్ కార్పొరేషన్ వెల్లడించింది. దీనితో రూ. 3,402 కోట్లు లభించనున్నట్లు పేర్కొంది. ఇందుకు సంబంధించి తొలి దశలో రూ.520 కోట్లు అందనున్నట్లు వివరించింది. అగ్రిమెంటులో భాగంగా 32 ఎకరాల స్థలాన్ని హిందుజా హెల్త్‌కేర్‌తో సంయుక్తంగా అభివృద్ధి చేసే అంశం కూడా ఉన్నట్లు పేర్కొంది.

డాయిష్ ఎయిర్‌క్రాఫ్ట్‌తో సైయంట్ జట్టు



హైదరాబాద్, బిజినెస్ బ్యూరో: ఇంజనీరింగ్, టెక్నాలజీ సొల్యూషన్స్ సంస్థ సైయంట్ జర్మనీకి చెందిన డాయిష్ ఎయిర్‌క్రాఫ్ట్‌తో వ్యూహాత్మక భాగస్వామ్య ఒప్పందం కుదుర్చుకుంది. దీని కింద 40 సీటర్ డీ328ఎకో రీజనల్ టర్బోప్రాప్ విమానాలకు వెనుకవైపు భాగం (ఫ్యుసిలేజ్) తయారీ డిజైన్‌పై ఇరు సంస్థలు కలిసి పని చేయనున్నట్లు సైయంట్ వెల్లడించింది. ఇంధనాన్ని గణనీయంగా ఆదా చేసే డీ328ఎకో విమానాలు డోర్నియర్ 328 సిరీస్ ఎయిర్‌క్రాఫ్ట్‌లకు అప్‌గ్రేడెడ్ వెర్షన్.

సనోఫీ వ్యాక్సిన్లు పంపిణీ చేయనున్న రెడ్డీస్

హైదరాబాద్, బిజినెస్ బ్యూరో: సనోఫీ హెల్త్‌కేర్ ఇండియాతో ప్రత్యేక భాగస్వామ్యం కుదుర్చుకున్నట్లు డాక్టర్ రెడ్డీస్ ల్యాబొరేటరీస్ బుధవారం తెలిపింది. ఇందులో భాగంగా సనోఫీ తయారీ వ్యాక్సిన్లకు ప్రచారం కల్పించడంతో పాటు పంపిణీ బాధ్యతలను రెడ్డీస్ చేపడుతుంది. 'సనోఫీ పోర్ట్‌ఫోలియో కంపెనీకి వ్యాక్సిన్ విభాగంలో బలమైన ఉనికిని అందిస్తుంది. భారత్‌లో వ్యాక్సిన్ కంపెనీల్లో రెండవ స్థానానికి మమ్మల్ని ముందుకు తీసుకువెళుతుంది' అని రెడ్డీస్ తెలిపింది.

కోడిగుడ్లు (హోల్‌సేల్-నెక్ / 100కు రూ.లలో)

28-3-2024	
విశాఖ	415–00
చిత్తూరు	458–00
ఈస్ట్, వెస్ట్ గోదావరి	400–00
విజయవాడ	400–00
రిటైల్ ధర (డజను)	72.00
27-3-2024 ఫామ్ ధర...	
హైదరాబాద్	375–00
వరంగల్	377–00
రిటైల్ ధర	4.35

జీడీపీలో 2 శాతం ప్రత్యక్ష పెట్టుబడితో భారీ ఉపాధి

ఫిక్కీ లేడీస్ ఆర్గనైజేషన్ నివేదిక

న్యూఢిల్లీ: భారతదేశ స్థూల దేశీయోత్పత్తి (జీడీపీ)లో 2 శాతం ప్రత్యక్ష ప్రభుత్వ పెట్టుబడితో 11 మిలియన్ల ఉద్యోగాలను సృష్టించవచ్చని ఫిక్కీ లేడీస్ ఆర్గనైజేషన్ (ఎఫ్‌ఎల్‌ఓ) తాజా నివేదిక పేర్కొంది. మొత్తం ఉపాధి సృష్టిలో దాదాపు 70 శాతం మహిళలకు ప్రయోజనం కలుగుతుందని కూడా విశ్లేషించింది. భారత్ పురోగతికి తీసుకోవాల్సిన అంశాలపై ఎఫ్‌ఎల్‌ఓ ఒక రోడ్‌మ్యాప్‌ను కూడా ఆవిష్కరించింది. వీటిలో అంశాలు– లీవ్ పాలసీలు, కేర్ సర్వీస్ సబ్సిడీలు, కేర్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్‌లో పెట్టుబడి, కేర్ వర్కర్లకు నైపుణ్య శిక్షణ, నాణ్యత హామీ కీలకమైనవని నివేదిక పేర్కొంది.

బుల్ బ్యాక్ ర్యాలీ



ముంబై: ప్రోత్సాహకర స్థూల ఆర్థిక గణాంకాల నమోదుతో బ్యాంకింగ్, ఆటో, ఆయిల్‌అండ్‌గ్యాస్ షేర్లలో కొనుగోళ్లు వెల్లువెత్తాయి. ఫలితంగా బుధవారం సెన్సెక్స్ 526 పాయింట్లు పెరిగి 72,996 వద్ద స్థిరపడింది. నిఫ్టీ 119 పాయింట్లు బలపడి 22,100 స్థాయిపైన 22,124 వద్ద నిలిచింది. అధిక వెయిటేజీ హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్(1%), రిలయన్స్ ఇండస్ట్రీస్(4%), మారుతీ సుజుకీ(2%) షేర్లు రాణించి సూచీలకు దన్నుగా నిలిచాయి. అంతర్జాతీయ మార్కెట్ల నుంచి మిశ్రమ సంకేతాలు అందడంతో సూచీలు ఉదయం స్వల్ప లాభాలతో మొదలయ్యాయి.

- నష్టాలు ఒకరోజుకే పరిమితం
- సూచీలకు రిలయన్స్, హెచ్‌డీఎఫ్‌సీ షేర్ల దన్ను
- రాణించిన బ్యాంకింగ్, ఆయిల్ అండ్ గ్యాస్ షేర్లు



మారుతీ సుజుకీ రూ.12,256 జీవిత కాల గరిష్టాన్ని తాకింది. దీనితో ఇంట్రాడేలో మార్కెట్ క్యాప్ రూ.4 లక్షల కోట్లను అందుకుంది.

రోజంతా లాభాలే..

ఇన్వెస్టర్లు కొనుగోళ్లకే ఆసక్తి చూపడంతో రోజంతా లాభాల్లో కదలాడాయి. ఒక దశలో సెన్సెక్స్ 668 పాయింట్లు బలపడి 73,139 వద్ద, నిఫ్టీ 188 పాయింట్లు ఎగసి 22,193 వద్ద ఇంట్రాడే గరిష్టాన్ని అందుకున్నాయి.

మళ్లీ రూ.20 లక్షల కోట్లపైకి రిలయన్స్ మార్కెట్ క్యాప్

రిలయన్స్ ఇండస్ట్రీస్ కంపెనీ షేరు 3.60% లాభపడి రూ.2988 వద్ద స్థిరపడింది. అంతర్జాతీయ రేటింగ్ సంస్థ గోల్డ్‌మెన్ శాక్స్ రిలయన్స్ కంపెనీ షేరు టార్గెట్ ధరను పెంచడంతో పాటు క్రూడాయిల్ ధరలు దిగిరావడం ఈ షేరుకు డిమాండ్ లభించింది. ట్రేడింగ్‌లో 4% లాభపడి రూ.3000 వద్ద ఇంట్రాడే గరిష్టాన్ని అందుకుంది. ఈ క్రమంలో కంపెనీ మార్కెట్ క్యాపిటలైజేషన్ రూ.70,039 కోట్లు పెరిగి రూ.20.21 లక్షల కోట్ల వద్ద స్థిరపడింది. ఈ ఫిబ్రవరి 13న కంపెనీ రిలయన్స్ క్యాప్ రూ.20 లక్షల కోట్ల స్థాయిని అందుకుంది. దేశంలో టాప్–5 మార్కెట్ క్యాప్ కలిగిన సంస్థల్లో రిలయన్స్ అగ్రస్థానంలో నిలవగా.., టీసీఎస్, హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్, ఐసీసీఐ బ్యాంక్, భారతీ ఎయిర్‌టెల్‌లు తర్వాతి స్థానాల్లో ఉన్నాయి.

- జ్యువెలరీ రిటైల్ కంపెనీ పీఎస్ గాడ్గిల్ జ్యువెలర్స్ పబ్లిక్ ఇష్యూ బాటలో సాగుతోంది. సెబీకి ప్రాస్పెక్టస్‌ను దాఖలు చేసింది.
- బజాజ్ ఫైనాన్స్‌కు చెందిన బజాజ్ హౌసింగ్ ఫైనాన్స్ పబ్లిక్ ఇష్యూకి రానుంది. తద్వారా కంపెనీ 10 బిలియన్ డాలర్ల(రూ. 83,000 కోట్లు) సమీకరించే యోచనలో ఉన్నట్లు సమాచారం.

25 షేర్లలో నేటి నుంచి కొత్త సెటిల్‌మెంట్.. టీప్లస్‌జీరో

స్టాక్ ఎక్స్ఛేంజీ దిగ్గజాలు బీఎస్‌ఈ, ఎన్‌ఎస్‌ఈ నేటి(గురువారం) నుంచి టీప్లస్ జీరో సెటిల్‌మెంట్‌కు తెరతీస్తున్నాయి. తొలుత 25 షేర్లలో ఆప్షనల్ పద్ధతిన అమలు చేయనున్నాయి. ఈక్విటీ నగదు మార్కెట్లో ప్రస్తుతం అమలవుతున్న టీప్లస్1 సెటిల్‌మెంట్‌కు జతగా పరిశీలన పద్ధతిలో టీప్లస్0కు శ్రీకారం చుడుతున్నాయి. కొద్దిమంది బ్రోకర్ల ద్వారా మాత్రమే ఇందుకు వీలు కల్పిస్తున్నాయి. వెరసి ఈ నెల 28 నుంచి లావాదేవీ చేపట్టిన రోజునే సెటిల్‌మెంట్ పూర్తికానుంది. ఈ జాబితాలో బజాజ్ ఆటో, వేదాంతా, హిందాల్కో, ఎస్‌బీఐ, ట్రెంట్, టాటా కమ్యూనికేషన్స్, నెస్లే, సిప్లా, ఎంఆర్‌ఎఫ్, జేఎస్‌డబ్ల్యూ స్టీల్, బీపీసీఎల్, ఓఎన్‌జీసీ, ఎన్‌ఎండీసీ, అంబుజా సిమెంట్స్ తదితరాలున్నాయి. తాజా సెటిల్‌మెంట్‌తో సమయం, వ్యయాలు ఆదా అవుతాయని అంచనా. మార్కెట్ లావాదేవీల్లో ఈ వ్యవస్థ మరింత పారదర్శకత తీసుకువస్తుందని భావిస్తున్నారు.

టాటా మోటార్స్, హెచ్‌పీసీఎల్ జోడీ

న్యూఢిల్లీ: టాటా ప్యాసింజర్ ఎలక్ట్రిక్ మొబిలిటీ తాజాగా హిందుస్తాన్ పెట్రోలియం కార్పొరేషన్‌తో (హెచ్‌పీసీఎల్) భాగస్వామ్యం కుదుర్చుకుంది. ఇందులో భాగంగా హెచ్‌పీసీఎల్‌కు చెందిన 5,000 ఫ్యూయల్ స్టేషన్స్‌లో ఈ ఏడాది డిసెంబర్‌కల్లా ఎలక్ట్రిక్ వాహనాలకు అవసరమైన చార్జింగ్ కేంద్రాలను ఏర్పాటు చేస్తారు. అలాగే చెల్లింపులను సులభతరం చేసేందుకు ఇరు సంస్థలు కలిసి ఆర్‌ఎఫ్‌ఐడీ కార్డులను జారీ చేయనున్నాయి. హెచ్‌పీసీఎల్‌కు దేశ వ్యాప్తంగా 21,500ల పైచిలుకు ఫ్యూయల్ స్టేషన్స్ ఉన్నాయి. భారతీయ రోడ్లపై 1.2 లక్షలకుపైగా యూనిట్ల టాటా ఎలక్ట్రిక్ వాహనాలు పరుగెడుతున్నాయి.

జీలాబ్ ఫార్మసీలో రణదీప్ హుడా



హైదరాబాద్: ప్రముఖ నటుడు రణదీప్ హుడా జీలాబ్ ఫార్మసీతో చేతులు కలిపారు. ఇప్పటికే భారీ తగ్గింపు ధరతో ఔషధాలను అందిస్తున్న జీలాబ్ ఫార్మసీ ఈ ధరలను 90 శాతం తగ్గించేందుకు హుడా తన సహకారాన్ని అందించనున్నారని ఈ మేరకు వెలువడిన ఒక ప్రకటన పేర్కొంది. మెడిసిన్ ధరల భారీ తగ్గింపుద్వారా భారత ఫార్మా ఇండస్ట్రీలో విప్లవాత్మక మార్పు తీసుకునిరావాలన్నది తమ లక్ష్యమని సంస్థ వ్యవస్థాపకులు రోహిత్ ముఖల్ పేర్కొన్నారు.

వొడా-ఐడియా ఎంటర్‌టైన్‌మెంట్ యాప్

ముంబై: వొడాఫోన్ ఐడియా (వీఐ) వీఐ మూవీస్ అండ్ టీవీ యాప్‌ను ఆవిష్కరించింది. దీనితో 13 పైగా ఓటీటీ యాప్‌లు, 400 పైచిలుకు లైవ్‌టీవీ చానెళ్లతో పాటు షెమారూ, హంగామా మొదలైన సంస్థల కంటెంట్ లైబ్రరీలు కూడా అందుబాటులో ఉంటాయి. ప్రీపెయిడ్, పోస్ట్‌పెయి చార్జీలు దాదాపు రూ. 200.

భవిత

- గ్రూప్1, గ్రూప్2 ప్రత్యేకం- తెలంగాణ హిస్టరీ కోసం

ఈ క్యూఆర్ కోడ్ స్కాన్ చేయండి

కెరీర్ కౌన్సెలింగ్
మీ సందేహాలు, సలహాలు పంపించాల్సిన ఈ- మెయిల్ sakshieducation@gmail.com

విద్య, ఉద్యోగ సమాచారం

యూపీఎస్సీలో 147 పోస్టులు

యూనియన్ పబ్లిక్ సర్వీస్ కమిషన్ (యూపీ ఎస్సీ) దేశవ్యాప్తంగా కేంద్ర శాఖలు/విభాగాల్లో వివిధ పోస్టుల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.

» **మొత్తం పోస్టుల సంఖ్య:** 147
» **పోస్టుల వివరాలు:** సైంటిస్ట్‌బి(మెకానికల్)-01, ఆంత్రోపాలజిస్ట్(ఫిజికల్ ఆంత్రోపాలజీ)- 01, స్పెషలిస్ట్ గ్రేడ్-3, అసిస్టెంట్ ప్రొఫెసర్ (అనెస్తీషియాలజీ)-48, స్పెషలిస్ట్ గ్రేడ్-3, అసిస్టెంట్ ప్రొఫెసర్(కార్డియో వాస్కులర్, థొరాసిక్ సర్జరీ)-05, స్పెషలిస్ట్ గ్రేడ్3, అసిస్టెంట్ ప్రొఫెసర్(నియోనాటాలజీ)-19, స్పెషలిస్ట్ గ్రేడ్3, అసిస్టెంట్ ప్రొఫెసర్ (న్యూరాలజీ)-26, స్పెషలిస్ట్ గ్రేడ్3, అసిస్టెంట్ ప్రొఫెసర్ (అబ్‌స్టేట్రిక్స్-గైనకాలజీ)-20, స్పెషలిస్ట్ గ్రేడ్ 3, అసిస్టెంట్ ప్రొఫెసర్(ఫిజికల్ మెడిసిన్, రిహాబిలిటేషన్)-05, అసిస్టెంట్ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్(వాటర్ రిసోర్సెస్)-04, సైంటిస్ట్-బి (సివిల్ ఇంజనీరింగ్)-08, సైంటిస్ట్-బి (ఎలక్ట్రానిక్స్/ఇన్‌స్ట్రుమెంటేషన్)-03, అసిస్టెంట్ డైరెక్టర్(సేఫ్టీ)-07.
» **అర్హత:** సంబంధిత విభాగంలో డిగ్రీ, పీజీ ఉత్తీర్ణతతో పాటు పని అనుభవం ఉండాలి.
» **ఎంపిక విధానం:** రిక్రూట్‌మెంట్ టెస్ట్, ఇంటర్వ్యూ ఆధారంగా ఎంపికచేస్తారు.
» **దరఖాస్తు విధానం:** ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలి.
» **ఆన్‌లైన్ దరఖాస్తులకు చివరితేది:** 11.04.2024.
» **ఆన్‌లైన్ దరఖాస్తు పూర్తి వివరాల నమోదుకు చివరితేది:** 12.04.2024.
» **వెబ్‌సైట్:** upsc.gov.in.

నావల్ డాక్‌యార్డ్, ముంబైలో 301 అప్రెంటిస్‌లు

ముంబైలోని మినిస్ట్రీ ఆఫ్ డిఫెన్స్(నేవీ), నేవల్ డాక్‌యార్డ్ అప్రెంటిస్ స్కూల్‌లో వివిధ ట్రేడుల్లో అప్రెంటిస్ ఖాళీల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.

» **మొత్తం ఖాళీల సంఖ్య:** 301
» **ఖాళీల వివరాలు:** ఏడాది అప్రెంటిస్‌షిప్ ట్రైనింగ్-288, రెండేళ్ల అప్రెంటిస్‌షిప్ ట్రైనింగ్-13.
» **ట్రేడులు:** ఎలక్ట్రీషియన్, ఎలక్ట్రోప్లేటర్, ఫిట్టర్, ఫౌండ్రీ మ్యాన్, మెకానిక్(డీజిల్), ఇన్‌స్ట్రుమెంట్ మెకానిక్, మెషినిస్ట్, ఎంఎంటీఎం, పెయింటర్(జి), ప్యాటర్న్ మేకర్, పైప్ ఫిట్టర్, ఎలక్ట్రానిక్స్ మెకానిక్, మెకానిక్ రిఫ్రిజిరేషన్ అండ్ ఏసీ, షీట్ మెటల్ వర్కర్, షిప్ రైట్ (ఉడ్), టైలర్(జి), వెల్డర్(జి అండ్ ఇ), మేసన్ (బీసీ),ఐ అండ్ సీటీఎస్‌ఎం, షిప్ రైట్(స్టీల్), రిగ్గర్, ఫోర్జర్ అండ్ హీట్ ట్రీటర్.
» **అర్హత:** ఎనిమిది, పదో తరగతితో పాటు సంబంధిత ట్రేడ్‌లో ఐటీఐ ఉత్తీర్ణులై ఉండాలి. వయసు: కనిష్ఠ వయసు 14 ఏళ్లు, గరిష్ఠ వయోపరిమితి లేదు.
» **స్టైపెండ్:** నెలకు రూ.6000 నుంచి రూ.7000.
» **ఎంపిక విధానం:** రాతపరీక్ష, ఇంటర్వ్యూ/స్కిల్ టెస్ట్‌లో వచ్చిన మార్కుల ఆధారంగా ఎంపిక చేస్తారు.
» **దరఖాస్తు విధానం:** ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలి.
» **ఆన్‌లైన్ దరఖాస్తులకు చివరితేది:** 05.04.2024.
» **వెబ్‌సైట్:** https://dasapprenticembi.recttindia.in/

సౌత్ ఈస్ట్ సెంట్రల్ రైల్వేలో 733 అప్రెంటిస్‌లు

బిలాస్‌పూర్ డివిజన్‌లోని సౌత్ ఈస్ట్ సెంట్రల్ రైల్వే లో ఒప్పంద ప్రాతిప దికన అప్రెంటిస్ ఖాళీల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.

» **మొత్తం ఖాళీల సంఖ్య:** 733
» **ట్రేడులు:** కార్పెంటర్, సీవోపీఏ, డ్రాఫ్ట్స్‌మెన్(సివిల్), ఎలక్ట్రీషియన్, ఎలక్ట్రికల్(మెకానికల్), ఫిట్టర్, మెషినిస్ట్, పెయింటర్, ప్లంబర్, మెకానికల్(ఆర్‌ఏసీ), ఎస్‌ఎండబ్ల్యూ, స్టెనో(ఇంగ్లిష్), స్టెనో(హిందీ), డీజిల్ మెకానిక్, టర్నర్, వెల్డర్, వైర్‌మెన్, కెమికల్ ల్యాబొరేటరీ అసిస్టెంట్, డిజిటల్ ఫోటోగ్రఫీ.
» **అర్హత:** పదో తరగతి, పన్నెండో తరగతి కన్నా తక్కువ లేదా సమానమైన విద్యార్హత తదితర ట్రేడుల్లో ఐటీఐ ఉత్తీర్ణులై ఉండాలి.
» **వయసు:** 12.04.2024 నాటికి 15 నుంచి 24 ఏళ్ల మధ్య ఉండాలి.
» **ఎంపిక విధానం:** పదో తరగతి, ఇంటర్ మార్కుల మెరిట్ లిస్ట్ ఆధారంగా ఎంపికచేస్తారు.
» **దరఖాస్తు విధానం:** ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలి.
» **ఆన్‌లైన్ దరఖాస్తులకు చివరితేది:** 12.04.2024.
» **వెబ్‌సైట్:** secr.indianrailways.gov.in/

టెట్.. సక్సెస్ రూట్!

- టీఎస్ టెట్-2024 దరఖాస్తు ప్రక్రియ ప్రారంభం
- మే 20 నుంచి జూన్ 3 వరకు పరీక్షలు
- టీచర్ రిక్రూట్‌మెంట్ టెస్ట్‌కు టెట్ ఉత్తీర్ణత తప్పనిసరి
- నిర్దిష్ట వ్యూహాలతో విజయం సాధించే అవకాశం

తెలంగాణ విద్యాశాఖ కొద్దిరోజుల క్రితం మొత్తం 11,602 టీచర్ పోస్టుల భర్తీకి టీఆర్‌టీ నోటిఫికేషన్ విడుదల చేసింది. ఈ పోస్టులకు తాజా అభ్యర్థులకు కూడా అవకాశం కల్పించేందుకు టీఎస్ టెట్-2024 ప్రక్రియ ప్రారంభించింది. డీఎస్సీ కంటే ముందుగానే టెట్‌ను నిర్వహించి.. కొత్త వారికి సైతం టీఆర్‌టీకి దరఖాస్తు చేసుకునే విధంగా గడువు తేదీని పొడిగించింది. ఈ నేపథ్యంలో.. టీఎస్ టెట్‌తో ప్రయోజనాలు, దరఖాస్తుకు అర్హతలు, పరీక్ష విధానం, సిలబస్ అంశాలు, ప్రిపరేషన్ తదితర వివరాలు..



ఎన్‌సీటీఈ నిబంధనల ప్రకారం–టీచర్ రిక్రూట్‌మెంట్ టెస్ట్(టీఆర్‌టీ)కు హాజరు కావాలంటే.. బీఈడీ, డీఈడీలతోపాటు టీచర్ ఎలిజిబిలిటీ టెస్ట్ (టెట్)లో ఉత్తీర్ణత తప్పనిసరి. అప్పుడే టీఆర్‌టీకి దరఖాస్తుకు అవకాశం లభిస్తుంది. తాజాగా టీఆర్‌టీకి దరఖాస్తు చేసుకునేందుకు మార్గంగా టెట్‌ను నిర్వహించేందుకు తెలంగాణ రాష్ట్ర విద్యాశాఖ చర్యలు చేపట్టింది.

20 శాతం వెయిటేజీ

టీచర్ పోస్టుల భర్తీలో టెట్ స్కోర్‌కు వెయిటేజీ కూడా కల్పిస్తారు. టీచర్ రిక్రూట్‌మెంట్ టెస్ట్‌కు 80 శాతం; టెట్ స్కోర్‌కు 20 శాతం వెయిటేజీ ఉంటుంది. డీఈడీ, బీఈడీ అర్హతతో నిర్వహించనున్న టీచర్ ఎలిజిబిలిటీ టెస్ట్ (టెట్)లో రెండు పేపర్లు ఉంటాయి. అవి.. పేపర్–1, పేపర్–2.

పేపర్-1 అర్హతలు

- పేపర్–1ను ఒకటి నుంచి అయిదో తరగతి వరకు బోధించే ఎస్‌జీటీ పోస్టుల అభ్యర్థులకు నిర్వహిస్తున్నారు.
- ఇంటర్మీడియెట్/తత్సమాన కోర్సులో కనీసం 50 శాతం మార్కులతో ఉత్తీర్ణతతోపాటు రెండేళ్ల డిప్లొమా ఇన్ ఎలిమెంటరీ ఎడ్యుకేషన్/నాలుగేళ్ల బ్యాచిలర్ ఆఫ్ ఎడ్యుకేషన్/రెండేళ్ల డిప్లొమా ఇన్ ఎడ్యుకేషన్(స్పెషల్ ఎడ్యుకేషన్) ఉత్తీర్ణులవ్వాలి.

ఎస్‌ఏ..పేపర్-2

- ఆరు నుంచి ఎనిమిదో తరగతి వరకు బోధించే స్కూల్ అసిస్టెంట్ పోస్టుల అభ్యర్థులకు టెట్ పేపర్–2ను నిర్వహిస్తారు.
- బీఏ/బీఎస్సీ/బీకాంలలో కనీసం 50 శాతం మార్కులతో ఉత్తీర్ణతతోపాటు బ్యాచిలర్ ఆఫ్ ఎడ్యుకేషన్(బీఈడీ) లేదా బ్యాచిలర్ ఆఫ్ ఎడ్యుకేషన్(స్పెషల్ ఎడ్యుకేషన్) తదితర అర్హతలు ఉండాలి. ఆయా కోర్సుల చివరి సంవత్సరం విద్యార్థులు కూడా టెట్ పేపర్లకు హాజరు కావచ్చు.

150 మార్కులకు టెట్ పేపర్-1

టెట్ పేపర్–1ను అయిదు విభాగాల్లో 150 ప్రశ్నలు–150 మార్కులకు నిర్వహిస్తారు. అవి.. చైల్డ్ డెవలప్‌మెంట్ అండ్ పెడగాజి (30 ప్రశ్నలు– 30 మార్కులు), లాంగ్వేజ్–1(30 ప్రశ్నలు–30 మార్కులు), లాంగ్వేజ్-2(30 ప్రశ్నలు-30 మార్కులు); మ్యాథమెటిక్స్(30 ప్రశ్నలు–30 మార్కులు); ఎన్విరాన్‌మెంటల్ స్టడీస్(30 ప్రశ్నలు–30 మార్కు లు) ఉంటాయి. ఈ పరీక్షను ఆబ్జెక్టివ్ విధానంలో కంప్యూటర్ బేస్డ్ టెస్ట్‌గా నిర్వహిస్తారు. లాంగ్వేజ్–1 సబ్జెక్ట్ కింద తెలుగు, ఉర్దూ, హిందీ, బెంగాలీ, కన్న డ, మరాఠి, తమిళం, గుజరాతీ లాంగ్వేజ్‌లను ఎంచుకోవచ్చు. లాంగ్వేజ్-2 విభాగంలో ఇంగ్లిష్ సబ్జెక్ట్ ఉంటుంది.

పేపర్-2 స్వరూపం

టెట్ పేపర్–2 కూడా 150 ప్రశ్నలు–150 మార్కులకు నిర్వహిస్తారు. ఈ పేపర్ పూర్తిగా ఆబ్జెక్టివ్ విధానంలో కంప్యూటర్ బేస్డ్ టెస్ట్‌గా జరుగుతుంది. ఇందులో చైల్డ్ డెవలప్‌మెంట్ అండ్ పెడగాజి 30 ప్రశ్నలు–30 మార్కులకు, లాంగ్వేజ్ 1, 30 ప్రశ్నలు–30 మార్కులకు, లాంగ్వేజ్ 2 (ఇంగ్లిష్) 30 ప్రశ్నలు–30 మార్కులకు, సంబంధిత సబ్జెక్ట్ (మ్యాథ్స్ అండ్ సైన్స్/ సోషల్ స్టడీస్) 60 ప్రశ్నలు–60 మార్కులకు ఉంటాయి.

కనీస అర్హత నిబంధన

టెట్ పేపర్–1, పేపర్–2లలో అభ్యర్థులు తప్పనిసరిగా కనీస అర్హత మార్కులు పొందాలనే నిబంధన విధించారు. జనరల్ కేటగిరీ అభ్యర్థులు కనీసం అరవై శాతం మార్కులు, బీసీ కేటగిరీ అభ్యర్థులు 50 శాతం, ఎస్సీ/ఎస్టీ/దివ్యాంగుల కేటగిరీలకు చెందిన అభ్యర్థులు 40 శాతం మార్కులతో ఉత్తీర్ణత సాధించాలి.

ముఖ్య సమాచారం

- **దరఖాస్తు విధానం:** ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలి.
- **ఆన్‌లైన్ దరఖాస్తు తేదీలు:** 2024, మార్చి 27 – ఏప్రిల్ 10
- **హాల్ టికెట్ డౌన్‌లోడ్:** మే 15 నుంచి
- **టెట్ తేదీలు:** మే 20–జూన్ 3 (పేపర్ 1 ఉదయం 9 నుంచి 11:30 వరకు; పేపర్–2 మధ్యాహ్నం 2 నుంచి 4:30 వరకు)
- **ఫలితాల వెల్లడి:** 2024, జూన్ 12
- **వెబ్‌సైట్:** tstet2024.aptonline.in/tstet/

ఉత్తమ స్కోర్ సాధించేలా

పేపర్-1 ప్రిపరేషన్ ఇలా

పేపర్–1కు సంబంధించి ముఖ్యంగా.. చైల్డ్ డెవలప్‌మెంట్ అండ్ పెడగాజిలో బోధన, లెర్నింగ్‌కు సంబంధించి ఎడ్యుకేషనల్ సైకాలజీపై ప్రాథమిక స్థాయిలో ప్రశ్నలు ఉంటాయి. అభ్యర్థులు ప్రధా నంగా శిశువు సైకాలజీకి సంబంధించిన అంశాలపై ఎక్కువగా దృష్టిసారించాలి. వికాస దశలు, వికాస అంశాలైన శారీరక, మానసిక, సాంఘిక, ఉద్వేగ వికాసాలు మొదలైన అంశాలను క్షుణ్నంగా చదవాలి. శిశువు ప్రవర్తనలో మార్పునకు సంబంధించిన అభ్యాసం, అభ్యసన బదలాయింపు అంశాలను చదవాలి. సైకాలజీ అంశాలను చదివేటప్పుడు కీలక భావనలు, సాంకేతిక పదాలు, సిద్ధాంతాలు–సూత్రాలు, ప్రతిపాదించిన శాస్త్రవేత్తలు, వారి గ్రంథాలు తదితర విషయాలను విశ్లేషణాత్మకంగా చదవాలి. ఇక పెడగాజి అంటే బోధన శాస్త్రం. ఇందులో సహిత విద్య, శిశువు విద్యా ప్రణాళిక, బోధన పద్ధతులు, మూల్యాంకనం – నాయకత్వం–గైడెన్స్–కౌన్సెలింగ్ గురించి అధ్యయనం చేయాలి. ఎడ్యుకేషన్‌కు సంబంధించిన చట్టాలపై పూర్తి అవగాహన పొందాలి. పెడగాజిలోని భావనలు, సిద్ధాంతాలు, నిబంధనలను విశ్లేషిస్తూ అధ్యయనం చేయాలి.

లాంగ్వేజ్-1,2

పేపర్ 1గా అభ్యర్థులు తెలుగు, ఉర్దూ, హిందీ, కన్నడ, మరాఠి, తమిళం భాషలను ఎంచుకోవచ్చు. సదరు సబ్జెక్ట్‌ను పదో తరగతి వరకు ఫస్ట్ లాంగ్వేజ్‌గా చదివి ఉండాలి. లాంగ్వేజ్–2లో ఇంగ్లిష్ పేపర్ ఉంటుంది. ఈ రెండు పేపర్లు పూర్తిగా ఆయా భాషల్లో నైపుణ్యాలను పరీక్షించే విధంగా ఉంటాయి. భాషా విభాగాలకు సంబంధించిన సాధారణ వ్యాకరణ అంశాలు, బోధన పద్ధతులపై ప్రశ్నలు ఉంటాయి. స్కూల్ స్థాయిలో తెలుగు సబ్జెక్ట్ పుస్తకాలతోపాటు తెలుగు బోధన పద్ధతులను చదవాలి. ఇంగ్లిష్‌లో పార్ట్స్ ఆఫ్ స్పీచ్, ఆర్టికల్స్, డైరెక్ట్, ఇన్ డైరెక్ట్ స్పీచ్, డిగ్రీస్ ఆఫ్ కంపేరిజన్, వొకాబ్యులరీ.. ఇలా అన్ని అంశాలపైనా అవగాహన పెంచుకోవాలి.

మ్యాథమెటిక్స్, ఎన్విరాన్‌మెంటల్ స్టడీస్

ఒకటి నుంచి అయిదో తరగతి స్థాయి వరకు ప్రశ్నలు ఉంటాయి. ఆయా సబ్జెక్టుకు సంబంధించి మొత్తం 30 ప్రశ్నల్లో.. 24 ప్రశ్నలు కంటెంట్, 6 ప్రశ్నలు పెడగాజిపై ఉంటాయి. ఎన్విరాన్‌మెంటల్ పేపర్‌లో సైన్స్, తెలంగాణ నుంచి ప్రశ్నలు తప్ప నిసరిగా ఉంటున్నాయి. ప్రస్తుతం టెట్‌కు హాజర య్యే అభ్యర్థులు తెలంగాణ ప్రాముఖ్యం ఉన్న అంశాలను ప్రత్యేక దృష్టితో చదవడం ఉపయుక్తంగా ఉంటుంది.

పేపర్-2 ప్రిపరేషన్

- **సైన్స్:** ఈ విభాగంలో మార్కుల కోసం మూడు నుంచి ఎనిమిదో తరగతి వరకు పుస్తకాలు ఔపోసన పట్టాలి. గత టెట్‌లో ఈ విభాగంలో ప్రశ్నలు కాసింత క్లిష్టంగానే ఉన్నాయని చెప్పొచ్చు. కాబట్టి అభ్యర్థులు ఆయా అంశాల బేసిక్స్, అప్లికేషన్స్ వంటి వాటిపై ప్రత్యేక ఫోకస్ పెట్టాలి.
- **సోషల్ స్టడీస్:** ఆరు నుంచి ఎనిమిదో తరగతి వరకు పాఠ్య పుస్తకాలను క్షుణ్నంగా చదవాలి. భూగోళ శాస్త్రంలో ఒక ప్రాంతం గురించి చదువుతున్నప్పుడు ఆ ప్రాంతానికి సంబంధించిన అన్ని అంశాలను చదవాలి. వాతావరణం, భౌగోళిక పరిస్థితులు, నదులు.. వంటి వాటిపై అవగాహన పెంచుకోవాలి. అదేవిధంగా సివిక్స్, ఎకనామిక్స్ అంశాలను సమకాలీన అంశాలతో అప్‌డేట్ చేసుకుంటూ అధ్యయనం చేయాలి.
- **మ్యాథమెటిక్స్:** ఈ సబ్జెక్ట్‌లోనూ ఆరు నుంచి ఎనిమిదో తరగతి వరకు మ్యాథమెటిక్స్ పుస్తకాలను అధ్యయనం చేయాలి. ట్రిగ్నోమెట్రీ, జామెట్రీ, కో–ఆర్డినేట్ జామెట్రీ, ఆల్జీబ్రా, కాలిక్యులస్ వంటి కీలక సబ్జెక్ట్‌లను కాన్సెప్ట్‌ల ను అర్థం చేసుకుంటూ ప్రాక్టీస్ చేయాలి.

గ్రూప్-1 మెయిన్స్ అప్పీళ్లపై విచారణ 18కి వాయిదా

అప్పటి వరకు మధ్యంతర ఉత్తర్వులు పొడిగించిన ధర్మాసనం



సాక్షి, అమరావతి: గ్రూప్-1 మెయిన్స్ పరీక్షను రద్దు చేస్తూ సింగిల్ జడ్జి ఇచ్చిన తీర్పుపై ఏపీపీఎస్సీతో పాటు పలువురు అభ్యర్థులు వేర్వేరుగా దాఖలు చేసిన అప్పీళ్లపై విచారణ ఈ నెల 18కి వాయిదా పడింది. గ్రూప్-1 నోటిఫికేషన్‌కు అనుగుణంగా ఇప్పటికే ఉద్యోగాలు పొంది వివిధ హోదాల్లో పనిచేస్తున్న 167 మందిని ఉద్యోగాల నుంచి తొలగించవద్దంటూ ఇటీవల ఇచ్చిన మధ్యంతర ఉత్తర్వులను హైకోర్టు పొడిగించింది. ఈ మేరకు న్యాయమూర్తులు జస్టిస్ గుహనాథన్ నరేందర్, జస్టిస్ నూనెపల్లి హరినాథ్ ధర్మాసనం బుధవారం ఉత్తర్వులు జారీ చేసింది. గ్రూప్- 1 మెయిన్స్ మూల్యాంకనంలో అక్రమాలు చోటు చేసుకున్నాయంటూ హైకోర్టు సింగిల్ జడ్జి ఇటీవల మెయిన్స్ పరీక్షను రద్దు చేస్తూ తీర్పునిచ్చిన విషయం తెలిసిందే. ఈ తీర్పును సవాల్ చేస్తూ ఏపీపీఎస్సీ, పలువురు అభ్యర్థులు వేర్వేరుగా అప్పీళ్ల దాఖలు చేశారు. ఈ వ్యాజ్యాలపై ఇటీవల విచారణ జరిపిన ధర్మాసనం, ఇప్పటికే ఉద్యోగాలు పొందిన 167 మంది ఉద్యోగులను తొలగించవద్దంటూ మధ్యంతర ఉత్తర్వులిచ్చిన సంగతి విదితమే. బుధవారం ఈ అప్పీళ్లు మరోసారి విచారణకు రాగా, రాష్ట్ర ప్రభుత్వం తరపున ప్రభుత్వ ప్రత్యేక న్యాయవాది (ఎస్‌జీపీ) చింతల సుమన్ స్పందిస్తూ, ఈ వ్యాజ్యాల్లో అడ్వొకేట్ జనరల్ ఎస్.శ్రీరామ్ వాదనలు వినిపిస్తున్నారని, వ్యక్తిగత కారణాల వల్ల హాజరు కాలేకపోతున్నారని వివరించారు. విచారణను వాయిదా వేయాలని కోరారు. ఇందుకు ధర్మాసనం అంగీకరిస్తూ విచారణ ఈ నెల 18కి వాయిదా వేసింది. గతంలో ఇచ్చిన మధ్యంతర ఉత్తర్వులను అప్పటి వరకు పొడిగించింది.

కూటమి నేతల భేటీ



సాక్షి, అమరావతి: బీజేపీ, టీడీపీ, జనసేన కూటమి నేతలు బుధవారం బీజేపీ రాష్ట్ర అధ్యక్షురాలు దగ్గుబాటి పురందేశ్వరి నివాసంలో భేటీ అయ్యారు. బీజేపీ రాష్ట్ర ఎలక్షన్ ఇన్‌చార్జి అరుణ్ సింగ్, సహాయ ఇన్‌చార్జి సిద్ధార్థనాథ్ సింగ్, సంఘటన్ ప్రధాన కార్యదర్శి మధుకర్, టీడీపీ రాష్ట్ర అధ్యక్షుడు అచ్చెన్నాయుడు, జనసేన నాయకుడు నాదెండ్ల మనోహర్ ఈ భేటీకి హాజరయ్యారు. మూడు పార్టీలు సమన్వయంతో ఎన్నికల్లో పని చేయాల్సిన అంశాలపై చర్చించారు.

సీనియర్లకు సీటులేదు!

బీజేపీ అసెంబ్లీ జాబితాలో చోటుదక్కని సోము వీర్రాజు, మాధవ్, విష్ణువర్ధన్‌రెడ్డి, పరిపూర్ణానంద

- పొత్తులో బీజేపీ పోటీచేసే పది అసెంబ్లీ స్థానాలకు అభ్యర్థుల ఖరారు
- వలస నేతలకే సీట్లు ఇచ్చారంటున్న పార్టీ అసలైన సీనియర్లు
- తనకు నచ్చిన వారికి అనుకూలంగా పురందేశ్వరి నివేదికలు పంపారని ఆరోపణ
- చంద్రబాబుకు అనుకూలురైన వ్యక్తులకే బీజేపీ టికెట్లు దక్కాయని మండిపాటు
- ఒకరోజు ముందు పార్టీలో చేరిన టీడీపీ వ్యక్తికి బద్వేలు టికెట్
- చంద్రబాబు నమ్మినబంట్లు సుజనాచౌదరి, కామినేనికి విజయవాడ పశ్చిమ.. కైకలూరు
- సత్యకుమార్‌కు ధర్మవరం.. విష్ణుకుమార్‌రాజుకు విశాఖ నార్త్

అసెంబ్లీకి పోటీచేసే బీజేపీ అభ్యర్థులు వీరే..

పేరు	నియోజకవర్గం
ఎన్. ఈశ్వర్‌రావు	ఎచ్చెర్ల
పి.విష్ణుకుమార్‌రాజు	విశాఖపట్నం నార్త్
పంగి రాజారావు	అరకు
ఎం.శివకృష్ణంరాజు	అనపర్తి
కామినేని శ్రీనివాసరావు	కైకలూరు
వై. సుజనాచౌదరి	విజయవాడ వెస్ట్
బొజ్జా రోశన్న	బద్వేల్
సి. ఆదినారాయణరెడ్డి	జమ్మలమడుగు
పీవీ పార్థసారథి	ఆదోని
వై. సత్యకుమార్	ధర్మవరం


సోము వీర్రాజు


మాధవ్


విష్ణువర్ధన్‌రెడ్డి


పరిపూర్ణానంద

సాక్షి, అమరావతి/న్యూఢిల్లీ : పొత్తులో భాగంగా రాష్ట్రంలో పది అసెంబ్లీ స్థానాలకు పోటీచేయనున్న బీజేపీ తన అభ్యర్థుల జాబితాను ప్రకటించింది. ఈ మేరకు ఏపీ లోక్‌సభ ఎన్నికల ఇంచార్జ్, పార్టీ జాతీయ ప్రధాన కార్యదర్శి అరుణ్‌సింగ్ బుధవారం ఒక ప్రకటన విడుదల చేశారు. ఒక మాజీ ఎంపీ, ఇద్దరు మాజీమంత్రులు, ఒక జాతీయ కార్యదర్శి, మాజీ ఎమ్మెల్యేలకు ఈ జాబితాలో చోటుదక్కింది. కానీ, రెండు మూడు దశాబ్దాలకు పైగా పార్టీనే నమ్ముకున్న కొందరు ముఖ్యమైన సీనియర్లకు మాత్రం అసెంబ్లీ అభ్యర్థుల ఎంపికలోనూ తీవ్ర నిరాశే మిగిలింది. మొన్న పార్లమెంట్ అభ్యర్థుల జాబితాలోనూ టికెట్ దక్కని పార్టీ రాష్ట్ర మాజీ అధ్యక్షులు సోము వీర్రాజుతో పాటు ప్రస్తుత రాష్ట్ర కమిటీలో ఉపాధ్యక్షులుగా కొనసాగుతున్న మాజీ ఎమ్మెల్సీ మాధవ్, విష్ణువర్ధన్‌రెడ్డి, పరిపూర్ణానంద స్వామికి కూడా ఈ అసెంబ్లీ అభ్యర్థుల జాబితాలో రిక్తహస్తమే మిగిలింది. బీజేపీలో చంద్రబాబుకు అనుకూలమన్న వ్యక్తులుగా పేరున్న నాయకులకు మాత్రం సీట్లు దక్కాయని అసలైన బీజేపీ నేతలు మండిపడుతున్నారు.

నచ్చిన వారికి అనుకూలంగా పురందేశ్వరి నివేదికలు..

పార్టీ రాష్ట్ర అధ్యక్షురాలు దగ్గుబాటి పురందేశ్వరి తనకు నచ్చిన వలస నేతలకు.. నిన్న మొన్నటి వరకు పార్టీతో సంబంధంలేని వారికి టికెట్లు ఇప్పించుకున్నారని ఎప్పటి నుంచో పార్టీని నమ్ముకున్న అసలైన బీజేపీ సీనియర్ నాయకులు ఆరోపిస్తున్నారు. తాను అనుకున్న వారికి అనుకూలంగానే ఆమె జాతీయ నాయకత్వానికి నివేదికలు పంపి వారికి టికెట్లు దక్కేలా చేసుకున్నారని వారు మండిపడుతున్నారు. నిజానికి.. బీజేపీ జాబితాలో బద్వేలు అభ్యర్థిగా ప్రకటించిన రోశన్న అభ్యర్థుల ప్రకటనకు ఒకరోజు ముందే పార్టీలో చేరారని వారు చెప్పారు. అలాగే, రెండు మూడ్రోజుల క్రితం వరకు ఆయన టీడీపీ నియోజకవర్గ ప్రధాన నాయకుడిగా కొనసాగారని.. అసలు పొత్తులో బద్వేలు స్థానాన్ని బీజేపీ ఎందుకు కోరుకోవాల్సి వచ్చిందో.. టీడీపీ నేతను హడావుడిగా పార్టీలో చేర్చుకుని అతనికెందుకు సీటు ఇవ్వాల్సి వచ్చిందో రాష్ట్ర పార్టీలో చాలామందికి అంతుబట్టడం లేదు. ఇప్పుడు బీజేపీలో ఇది హాట్‌టాపిక్‌గా మారింది.

నిజానికి.. చాలా నియోజకవర్గాల్లో పోటీచేసేందుకు బీజేపీ నాయకులు రెండు మూడేళ్లుగా పార్టీ కార్యక్రమాలను నిర్వహిస్తూ కష్టపడిన వారి స్థానాలను పట్టించుకోకుండా.. చంద్రబాబు ఇస్తామన్న స్థానాల్లో తనకు అనుకూలమైన వారి పేర్లను పురందేశ్వరి జాతీయ నాయకత్వానికి నివేదికలు పంపారని వారు ఆరోపిస్తున్నారు.

పదిలో ఆరుగురు వలస నేతలే..

ఇక 2019 ఎన్నికలు వరకు తెలుగుదేశంలో ఉండి, ఆ ఎన్నికల్లో టీడీపీ ఓడిపోగానే తాత్కాలిక పునరావాసం కోసం బీజేపీలో చేరిన చంద్రబాబు సొంత మనుషులు సుజనా చౌదరి, ఆదినారాయణరెడ్డి వంటి నాయకులు పొత్తులో బీజేపీకి దక్కిన స్థానాల్లో సీట్లు ఎగరేసుకెళ్లారని ఆ నాయకులు ఆవేదన చెందుతున్నారు. కై కలూరు అసెంబ్లీ అభ్యర్థిగా ప్రకటించిన చంద్రబాబు మరో నమ్మినబంటు కామినేని శ్రీనివాస్ సైతం 2014 ఎన్నికల సమయంలో బీజేపీ–టీడీపీ పొత్తు ఖాయమని తెలిశాక కమల దళంలో చేరి ఆ ఎన్నికల్లో గెలుపొందాక ఉమ్మడి ప్రభుత్వంలో మంత్రి పదవి అనుభవించారన్నారు. అలాగే.. 2019లో టీడీపీ–బీజేపీ మధ్య పొత్తులేకపోవడంతో ఆయన తిరిగి బీజేపీ తరఫున పోటీచేసేందుకు విముఖత వ్యక్తంచేసి ఎన్నికలకు దూరంగా ఉన్నారని తాజాగా సీట్లు దక్కని బీజేపీ నాయకులు గుర్తుచేస్తున్నారు. ఇక పార్టీ ప్రకటించిన పది స్థానాల్లో అరకు, అనపర్తి, విశాఖ పశ్చిమ స్థానాల అభ్యర్థులు మినహా మిగిలిన ఏడు స్థానాల అభ్యర్థులు కేంద్రంలో బీజేపీ అధికారం ఖాయమని స్పష్టంగా తెలిసిన తర్వాత పదేళ్ల క్రితం పార్టీలో చేరిన నాయకులని చెబుతున్నారు. ధర్మవరం అభ్యర్థిగా ప్రకటించిన సత్యకుమార్ మొదట నుంచి మాజీ ఉపరాష్ట్రపతి వెంకయ్యనాయుడు వ్యక్తిగత కార్యదర్శిగా కొనసాగిన వ్యక్తి. అప్పట్లో ఆయన అసలు పార్టీ నాయకుడిగా పనిచేయలేదని, ఒకవేళ అతణ్ణి మొదటి నుంచి పార్టీలో కొనసాగిన వ్యక్తిగా పరిగణించినా మిగిలిన ఆరుగురు వలస నేతలేనని బీజేపీలో చర్చ సాగుతోంది.

ఆలయ కార్యదర్శిపై అమానుష దాడి

- ఏలూరులో టీడీపీ కార్యకర్త అరాచకం
- రాడ్డుతో తలపై కొట్టడంతో అపస్మారక స్థితిలోకి..
- వివస్త్రను చేసేందుకు కూడా యత్నం
- పాత కార్యవర్గం హయాంలో రూ.40 లక్షల ఆలయ సొమ్ము గోల్‌మాల్ జరిగినట్లు ఆరోపణలు
- ఈ విషయాన్ని ప్రశ్నించినందుకే ఆమెపై దాడి
- బాధితురాలికి వైఎస్సార్‌సీపీ ఎమ్మెల్యే ఆళ్ల నాని పరామర్శ


ఏలూరు జీజీహెచ్‌లో అచ్యుతకుమారిని పరామర్శిస్తున్న ఎమ్మెల్యే ఆళ్ళ నాని


తీవ్రగాయాలతో ఏలూరు జీజీహెచ్‌లో చికిత్స కోసం వచ్చిన అచ్యుతకుమారి


తీవ్ర గాయాలతో పాటు చీరను లాగివేయడంతో రోదిస్తున్న దృశ్యం

ఏలూరు టౌన్ : ఏలూరు కండ్రికగూడెం ప్రాంతంలో శ్రీవేంకటేశ్వరస్వామి ఆలయంలో దేవుని సొమ్మును కాజేశారని ప్రశ్నించిన ఆలయ కార్యదర్శిపై పాత ఆలయ కమిటీ సభ్యుడు, టీడీపీ కార్యకర్త రెడ్డి నాగరాజు అమానుష దాడికి తెగబడ్డాడు. నూతన ఆలయ కార్యదర్శి అచ్యుతకుమారిపై రాడ్డుతో దాడిచేసి, ఆమెను వివస్త్రను చేసేందుకు ప్రయత్నించడంతో బాధితురాలు తీవ్ర గాయాలపాలైంది. ప్రస్తుతం ఆమె ఏలూరు జీజీహెచ్ వైద్యుల పర్యవేక్షణలో చికిత్స పొందుతున్నారు. ఏలూరు ఎమ్మెల్యే, వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు ఆళ్ళ నాని బాధితురాలిని బుధవారం ఆస్పత్రిలో పరామర్శించారు. దాడి వివరాలు తెలుసుకుని వెంటనే విచారణ చేపట్టి బాధ్యులపై చర్యలు తీసుకోవాలని పోలీసు అధికారులను కోరారు. బాధితుల కథనం మేరకు.. ఏలూరు 27వ డివిజన్ కండ్రికగూడెం ప్రాంతంలో శ్రీ వేంకటేశ్వరస్వామి గుడికి ఇటీవలే కొత్త కార్యవర్గం ఏర్పాటైంది. రాజరాజేశ్వరినగర్‌కు చెందిన సావస్ అచ్యుతకుమారి ఆలయ నూతన కార్యదర్శిగా వ్యవహరిస్తున్నారు. ఆలయానికి సంబంధించి నిధులు భారీఎత్తున గోల్‌మాల్ అయ్యాయని ఆమె గుర్తించారు. సుమారు రూ.40 లక్షలు పక్కదారి పట్టినట్లు తెలుసుకుని పాత కార్యవర్గ సభ్యులను ఆమె ప్రశ్నించారు. దీంతో పాత, కొత్త కార్యవర్గాల మధ్య వివాదం మొదలైంది. ఇదిలా ఉంటే.. శ్రీవారి కళ్యాణ మహోత్సవాలను అచ్యుతకుమారి ఆధ్వర్యంలో వైభవంగా నిర్వహిస్తుండడంతో పాత కార్యవర్గ సభ్యుడు రెడ్డి నాగరాజు అతని భార్య ఇద్దరూ కలిసి ఆలయ ప్రాంగణంలో పుస్తక వ్యాపారం చేసుకునేందుకు అవకాశమివ్వాలని అచ్యుతకుమారిని కోరారు. ఆలయంలో వ్యాపారం చేయడానికి వీల్లేదని, అవసరమైతే ఉచితంగా పుస్తకాల పంపిణీకి అనుమతి ఉంటుందని ఆమె స్పష్టంచేశారు. ఈ విషయంలో వివాదం చెలరేగడంతో రెడ్డి నాగరాజు అచ్యుతకుమారిపై దాడికి తెగబడ్డాడు. రాడ్డు తీసుకుని ఆమెను తలపైన తీవ్రంగా కొట్టడంతో పాటు ఆమె చీరను లాగేసి వివస్త్రను చేసేందుకు ప్రయత్నించాడు. దీంతో.. అక్కడున్న వారు అతనిని అడ్డుకున్నారు. తీవ్ర గాయాలతో అచ్యుతకుమారి అపస్మారక స్థితిలోకి వెళ్లడంతో ఆమెను ఏలూరు జీజీహెచ్‌కు తరలించారు.

నిధుల గోల్‌మాల్‌పై నిలదీయడంతో..

రెడ్డి నాగరాజుతో పాటు ఉమామహేశ్వరరావు, ప్రసాద్‌బాబు తదితరుల ఆధ్వర్యంలో ఆలయ నిధులను పక్కదారి పట్టించారనే ఆరోపణలు ఉన్నాయని ఆస్పత్రిలో ఆమె చెప్పారు. లక్షలాది రూపాయల నిధులకు లెక్కలు లేకపోవడంతో వారిని నిలదీయగా.. రెడ్డి నాగరాజు సమయం కోసం వేచిచూసి దాడిచేశారన్నారు.

'అనపర్తి' టీడీపీ కార్యకర్తల ఆత్మహత్యాయత్నం

అనపర్తి: టీడీపీ, జనసేన, బీజేపీ పొత్తులో భాగంగా అనపర్తి అసెంబ్లీ సీటును బీజేపీకి కేటాయించారన్న వార్త స్థానిక టీడీపీ శ్రేణుల్లో కలకలం రేపింది. టీడీపీ శ్రేణులు బుధవారం రాత్రి మాజీ ఎమ్మెల్యే, టీడీపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు నల్లమిల్లి రామకృష్ణారెడ్డి స్వగ్రామమైన రామవరం చేరుకున్నారు. అనపర్తి టికెట్‌ను బీజేపీకి కేటాయించడంపై ఆవేదన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా టీడీపీకి చెందిన ఇద్దరు యువకులు ఒంటిపై పెట్రోలు పోసుకుని ఆత్మహత్యకు యత్నించగా, పార్టీ శ్రేణులు వారిపై నీరు పోసి వారించారు. ఈ సందర్భంగా రామకృష్ణారెడ్డి మాట్లాడుతూ పార్టీ నాయకులు, కార్యకర్తలు సంయమనం పాటించాలని, గురువారం తదుపరి కార్యాచరణ నిర్ణయించుకుందామని తెలిపారు.

Published and Printed by V. Murali on behalf of Jagati Publications Limited, Published at Survey no 481 phase-2, Jawahar Auto Nagar, Vijaywada, NTR District - 520 007 (AP) and Printed at Jagati Publications Limited, Survey no 481 phase-2, Jawahar Auto Nagar, Vijaywada, NTR District - 520 007 (AP)., Editor: V. Murali, (Responsible for selection of News under the PRB Act) Phone No. 0866-2547436 Fax: No. 0866-2547433. RNI Reg No. APTEL/2008/23794. Reproduction in whole or in part without written permission of the publisher is prohibited.